# గ్రంథాలయసర్వస్వము.

పూజాపుష్పము.

ఆంధ్రదేశ గ్రంథభాండాగార సంఘపక్షమున సంవత్సర
మునకు నాలుగు సంచికల చొప్పున బ్రక
టింపబడు గ్రంథము.

---

"కృష్ణవేణీ వారితసస్య పృథివియందు
గౌతమీపుణ్య కల్యాణ కంఠసీమ
తుంగభద్రా శుభ్రోపాంతరంగములను
అందికొనుము శమాలక్ష్మి యాంధ్రపూజ."

---

కార్యస్థానము : బెజవాడ.

---

ద్వితీయ సంపుటము.

ప్రథమ సంచిక.

వార్షిక మూల్యము రు ౩-౦-౦

విడి సంచిక వెల రు ౦-౧౨-౦

# చిత్రపటములు.


౧. సువర్ణవృష్టి ౧.

౨. శరదృతువు ౩.

౩. శమీపూజ ౧౦.

౪. పిల్లలు చదువుకొను గ్రంథాలయప్రదేశము ౩౩.

౫. శ్రీకృష్ణదేవరాయలు ౩౫.

౬. అర్జునునకు శివుడు ప్రత్యక్షమగుట ౬౬.

౭. కె. సి. శ్రీవేంకటగిరి మహారాజాగారు ౭౬.

# విషయసూచిక (iii)


ప్రాపు (పద్యములు) ... ౧.

పూజ (పద్యములు) ... ౨.

విజయదశమి - రాయప్రోలు సుబ్బారావుగారు ౩.

శివపూజ (పద్యములు) ... ౧౦.

అప్పకవి కవితా సిద్ధాంతములు: ...
రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు — ౧౧.

తిక్కన సోమయాజి (పద్యములు):
అబ్బూరి రామకృష్ణారావుగారు ... ౧౬.

ప్రేమతత్త్వము (పద్యములు):
బసవరాజు అప్పారావుగారు, బి.ఏ.... ౧౬.

గ్రంథవిమర్శనము ... ౨౦.

ఆంధ్రదేశము - మంగిపూడి వేంకటశర్మగారు ౨౦.

కథ - కలాపము ... ౨౧.

విశ్వజనని (పద్యములు) - ఓలేటి పార్వతీశ్వరకవిగారు ౨౨.

శ్రీనాథుని గ్రంథముల కాలనిర్ణయము:
కా. వేం. లక్ష్మణరావుగారు ౨౪.

దస్యులనగా నెవరు? క. మార్కండేయశర్మగారు ౨౬.

విరహావధి (పద్యములు) - రా. సుబ్బారావుగారు ౩౩.

గ్రంథాలయములు - శుశిక్ష
సూరి వేంకటనరసింహంగారు. బి. ఏ. ౩౩.

శ్రీకృష్ణదేవరాయలు (ప) జంధ్యాల వేంకటశివకవులు ౩౫.
ఉటో (చరిత్ర) రా. శ్రీనివాసరావుగారు ౩౫.

తిమ్మరుసు (పద్యములు) - వసంతుడు. ౪౧.

తెనాలి తాలూకా గ్రంథాలయములు: ౪౫.
1. సత్తెనపల్లి హనుమంతరావుగారు

బి.ఏ., బి.ఎల్.
ఆంధ్రభాష - వఝల చినసీతారామస్వామి శాస్త్రి గారు. ౧౫.
ఆటలు (పుగ్రంథమునుండి) నా. కృష్ణారావు గారు ౧౪.
ఆంగ్లేయవర్తకసంఘము - దామెర్ల వేంకటాద్రినా
యకుని మొదటికోట - వే. విశ్వనాథశర్మ గారు ఎం.ఏ. ౧౨.
జాతీయవిద్య - కర్రా లక్ష్మీనరసింహము గారు ౧౬.
ఆత్మప్రబోధము (పద్యము):
కలచవీడు వేంకటరమణాచార్యులు గారు ౬౪.
కిరాతార్జునీయము - శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రి గారు ౬౬.
పూజావబోధము (పద్యము)
పోచిరాజు సీతారామయ్య గారు. ౨౦.
పలుపాటలు ... ... ౨౦.
దీపావళి - యనమండ్ర శ్రీరామమూర్తి శాస్త్రి గారు ౨౧.
డిటో - కాలెచెలె వేంకట అప్పాశర్మ గారు, ఎం.ఏ. ౨౨.
కీర్తిశేషులైన శ్రీశ్రీ వేంకటగిరి మహారాజా గారు
- నేమలి సుబ్బారావు గారు ౩౨.
శరదృతువు (పద్యము) -
వేమూరి శివస్వామి శాస్త్రి గారు ౩౧.
పురాణములు - కాండపల్లి శ్రీరామచంద్రరావు గారు, బి.ఏ., బి.ఎల్. ౩౬.

RSVM01A105





ద్వితీయ సంపుటము.

# గ్రంథాలయ సర్వస్వము.

ప్రథమ సంచిక.

## పూ పు

౧

చెలియల సిగలలోఁ ♦ జెలువారు పూవ
పడతుల జడలపైఁ ♦ బవళించు పూవ
సఖుల ముచ్చటముళ్ళ ♦ సవరించు పూవ
లలనావతంసమ్ము ♦ లను గుల్కు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౨

అఱవిచ్చి సిగ్గులఁ ♦ గరఁగిన పూవ
మొగ్గవై మోజులు ♦ మొలిపించు పూవ
పూచి శోభనములఁ ♦ బొదివిన పూవ
దళముల కౌఁగిలిం ♦ తలఁ జొక్కు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

3

చిగురాకు మఱుఁగునఁ ♦ జెలువారు పూవ
కొమ్మల మాటునఁ ♦ గొనలెత్తు పూవ
ఎండకు కాఁగని ♦ యెలపూత పూవ
వెన్నెలన్ పేరని ♦ వెలుతురు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౪

కడుపులో తేనెలు ♦ కలకన్నె పూవ
తనువున గంధముల్ ♦ దయివారు పూవ
రెక్కల నందాల ♦ గ్రక్కెడు పూవ
మోమున లావణ్య ♦ ము[illegible] రాలు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౫

పసుపు కేసరముల ♦ మిసిమిరచు పూవ
నిగనిగ సొగసుల ♦ బిగివోని పూవ
పెండ్లిండ్లు పాలించు ♦ ప్రేమంపు పూవ
వీరుని కంఠాన ♦ విప్పారు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౬

కాపుకన్నియ కొప్పుఁ ♦ గైసేయు పూవ
ఉపవనాల నయాల ♦ లూగాడి పూవ
తోటకంచెల వన్నె ♦ తోఁ బూచు పూవ
అడవి డొంకల నంద ♦ మయి యొప్పు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౭

సెలయేటి పాటకు ♦ జెవియొగ్గు పూవ
తుమ్మెద సఖులతో ♦ త్రుళ్లెడు పూవ
పైరగాలికి విచ్చి ♦ వర్ధిల్లు పూవ
రంగులరాసివై ♦ రాణించు పూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౮

కళలకళ్యాణివే ♦ కమ్మని పూవ
సౌందర్యసరసివే ♦ చక్కని పూవ
భావాలబరిణవే ♦ బంగారు పూవ
చిన్నెలచిలుకవే ♦ సింగారిపూవ
పోవటే! మాతల్లి ♦ పూజకో పూవ!

౯

పెరిఁగినా! తరిగినా! ♦ ప్రియమే నె పూవ
చచ్చినా! బ్రదికినా! ♦ స్వర్గమే పూవ
ఓడినా! గెలిచినా! ♦ యొప్పే నె పూవ
తొలఁగినా! కలసినా! ♦ తోడే నె పూవ
పోదాము! ఆతల్లి ♦ పూజకే పూవ!

# పూజ

౧

చందమామ పూవెన్నెలల్ ♦ జల్లులాడ
బీళ్లు పులకరింపఁగ సెల ♦ యేళ్ళు పాడ
విశ్వమునఁ బచ్చతోరణాల్ ♦ విరిసియాడ
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి!

౨

బెదరు లేళ్ళును వెరపేది ♦ పొదలు వెడల
చిన్ని మొక్కలు సయితము ♦ చేవఁగ్రక్క
జీర్ణ మురళియు మ్రోఁగ ను♦జ్జీవరుతుల
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి!

3

పొంగిపొడిచిన నదులెల్ల ♦ క్రుంగఁజూచి
ఆకసముఁబ్రాకు వరదగూ ♦ ళ్ళణఁగఁగాంచి
త్రుళ్లి త్రోపాడు మేఘముల్ ♦ తొలఁగనరసి
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి.

౪

సస్యములకుఁ భాలిచ్చు వా♦త్సల్యవతులు
మంగళతరంగిణులు, ధీర ♦ భంగి చెప్ప
నాలకించితి భావర♦హస్యములను
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి !

౫

చెరగిపోని చక్కని లిపిక ♦ జెక్కినారు
తాల భాగ్యభారత శాస♦నాల ఋషులు
వానదెబ్బల త్రుప్పుడు ♦ వాసె, చదివి
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి!

౬

తెలుఁగు నెత్తుట వెలిఁగిన ♦ దీపకళలు
తెలుఁగుపాలఁ బేరిన మీఁగ♦డల తరకలు
తెలుఁగు తేనె తీయందన♦మ్ములఁ దలంచి
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి !

౭

భక్తుఁడొక విగ్రహము తల♦పయిననుంచ
వీరుఁడొక ఆయుధము మీఁదఁ ♦ బెట్టి గొలువ
కర్షకుండొక కాడికిఁ ♦ గట్టి మ్రొక్క
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి !

౮

కన్నె పసుపక్షతలు సల్ల ♦ గౌరి పేర,
దేవి పేర కుంకుమను శా♦క్తేయులీయ,
విప్రులు సరస్వతీపీఠ ♦ విరులొసంగ,
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి !

౯

కవులు కవితామధువుచే జ♦గమ్ముఁ దడుప,
శిల్పకులు కుంచియలఁ దేట ♦ తెలుపు దిద్ద,
గాయకులు గాత్రరక్తి రా♦గమ్ము లెత్త
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి!

౧౦

పంజరములోని చిలుకల ♦ పాటలందు,
అడవిలోని గోర్వంకల ♦ నుడులయందు
ఒక్కటే శ్రుతి చెదరక ♦ పిక్కటిల్లె
వ్రేలవే! తల్లి మెడను పూ♦జాలలంతి!



మదవతుల మోములను చంద♦మామ సొబగు
అందెరవళుల నందంపు ♦ హంసపలుకు
కెంబెదవుల బంధూక ర♦క్తిమయు విడచి
సుభగ శారదరమ యెందొ ♦ సురిగిపోవు.

శరదృతువు.

# విజయదశమి

## కాలము.

"తే. కాలచక్రంబు నిరవధికంబు దీన
సర్గములుఁ బ్రళయంబులుఁ జనుచునుండు
బ్రళయమునఁ బరమాత్మునందు ప్రకృతిబొందిఁ
యఖిలమును సృజియించు గల్పాదియందు.

అని భీష్మాచార్యుని నిర్వచనము. కాలమునకు ఆద్యంతములు లేవు. వృద్ధిక్షయములు లేవు. ప్రాతక్రొత్తలు లేవు. అనంతమయిన కాలస్వభావము కేవలభావనీయమని వ్యాస మహర్షి మతము; కాని ఈ కాలస్వభావస్వరూపముల నన్వేషించుటకు బొత్తుగా అవకాశములు లేకపోలేదు. కాలము నెవ్వరో సనాతనకవులు చక్రమునకుఁ బోల్చిరి. ఇందుగంభీరమైనధ్వనికలదు. చక్రస్వరూపమున 'ఆద్యంత' నిరూపణము దుర్లభము. చక్రస్వభావమున 'భ్రమణము' నైజవిలాసము. కాలమెప్పుడును స్థావరము కాదు. కావున చాలనీయమనుట క్రమాగత సిద్ధాంతము. ఇఁక నీ కాలచక్రమందు అవయవప్రకార మెట్లు నిరూపింపబడినదో చూతము. కాలమందు దీర్ఘమయిన అగ్రభాగమునకు యుగమని పేరు. హ్రస్వమయిన ఆదిభాగమునకు నిమేషమని పేరు. ఇట్టి నిమేషములు ౧౮ ఒక కాష్ఠ. 30 కాష్ఠ లొక కళ. 3౬౦ కళ లొక ముహూర్తము. 30 ముహూర్తము లొక దినము. 30 దినము లొక మాసము. ౨ మాసము లొక ఋతువు. 3 ఋతువు లొక అయనము. ౨ అయనము లొక వత్సరము. ఇట్టి వత్సరములు ౧౭,౨౮,౦౦౦ కృతయుగమున గడచినవి. ౧౨,౯౬,౦౦౦ త్రేతాయుగమందుతరించినవి. ౮,౬౪,౦౦౦ ద్వాపరమునదాటిపోయినవి. ౪,3౨,౦౦౦ కలియుగమును ముగింపనున్నవి. ఇందో సరికి ౫౦౧౨ మానుషాబ్దములు నడచినవి. సృష్టి ఆదినుండియును ఈ నలసంవత్సరముతో ౧౯౫,౫౮,౮౫,౦౧౨ యేండ్లు గతించినవని గణకులు సిద్ధాంతీకరించుచున్నారు. ఈ సృష్టి ఏసృష్టియో చెప్పలేము. ఇన్ని సంవత్సరములనుండియును విజయదశమీమహోత్సవ మారాధనయందున్నదో లేదో చెప్పలేము. కాని ఒక మాట నిజము. వత్సరమును మానవుడెప్పుడు కాలమానముగా నంగీకరించెనో అప్పటినుండియు ఋతువిభాగము వచ్చుచున్నదనుట కేవల మూహాసిద్ధాంతము కాదు. ఆరు ఋతువులలో

## శరదృతువు

నకొక విలక్షణత్వ మున్నదనక తప్పదు.

శ్లో. వార్షికంసంజహారేంద్రో
ధనుర్జైత్రం రఘుర్దధౌ ।
ప్రజార్థసాధనేతౌహి
పర్యాయోద్యత కార్ముకౌ. రఘువంశము.

అని మహాకవి శరదాగమమును సూచించెను- వానకొఱకై వహించిన ధనువును ఇంద్రుఁ డుపసంహరించెను. విజయప్రియుఁడై రఘుమహారాజు చాపమునులేవనెత్తెను. శరదృతు వనేక విధముల పూజార్హఋతువనుటకు సంశయము లేదు. వానలు వెనుకపడును. పృథివియంతయు క్షాళితమయిన తేజస్సుతో పచ్చబడును. ప్రవాహములయం దుదకములు ముక్తకాలుష్యములై స్నానీయము లగును. కావురుగమ్మిన దిశాచక్రములు సహజసౌందర్యములతో వెలుఁగును. పొలమంతయు మొలకపైరుతో మోహనముగా నవనవలాడును. ఆకురాలిన మోడడవులు నల్లబాఱిన యాకు జొంపములతో సాంద్రములగును. దుర్దిన పీడితములయిన తామరకొలకులు మరల సంపూర్ణశోభలతోఁ బ్రఫల్లములగును. పగలు ప్రసన్నవాతములతో సూర్యుఁడును, రాత్రులు కర్పూరాతపములతోఁ జంద్రుడును లోకముయొక్క ఉత్సవప్రసక్తినిఁ బ్రేరేపింతురు. అందువలననే కర్మానుష్ఠానయోగ్యమగు నీ ఋతువును ఆర్యులు పూజాపురస్సరముగ నామతించిరి. మొదటినుండియును శరదృతువు నందు విజయదశమి ప్రధానోత్సవదివసముగాఁ బరిగణింపఁబడినదని వాదించుట ప్రమాదము. విజయుఁడు స్వకీయవిజయోత్సవముచే అమృతముగాజేసిన యుత్తమదివసమగుటవలన విజయదశమియని పేరెక్కినది. విజయుఁడు కుంతీపుత్రుఁడు. పాండవమధ్యముఁడు. వీరు ద్వాపరాంతమందున్న మహావీరులు. అప్పటినుండియు నీదినమందు వీరారాధన జరుగుచున్నదని చెప్పిన యుక్తముగ నుండును. కాని

ఏతత్పూర్వ యుగములందు పూజయే లేదనుట తప్పు. శరదృతువు

## ఆశ్వీజ

మాసముతో నుదయించుచున్నది. అందు శుక్రవార ముఖములతిమనోహరములు. వర్ధమానములు. కర్మయోగ్యములు. పూజాప్రయుక్తమగు ఆర్యకర్మ నానాముఖముల దీపించినట్లు ఇతిహాసములు సెప్పుచున్నవి. యజ్ఞములు, యాగములు, దండయాత్రలు, సరస్వతీపూజనములు మున్నగునవి కొన్ని సనాతనకర్మలు. పూర్వయుగమునందు శరదృతువు సరస్వతీపూజారంభముతో నైక్యమగుచుండెను. సరస్వతీపూజ వైదిక యుగమందుఁగూడ బ్రచారములో నుండెను. సరస్వతి వాగధిష్ఠానయగు దేవత. స్రవంతీమతల్లియైన పుణ్యవాహిని. ఋగ్వేదమునందు సరస్వతిని బ్రబోధించు అనువాకము లనేకములున్నవి; కాని

## సరస్వతి

వేదయుగమునాటికి కేవల వాణీపాలినిగా భావింపఁబడినట్లు తోపదు. సరస్వతి యిసుకపడకలలోఁబడి ప్రవహించు చక్కని నది. పెక్కు ఋషికులము లీ నదికిరుకెలకుల నుండెడివి. వారి వరిమళ్ళు సరస్వతీతోయముతోఁ బెరిగెను. వారి వనస్పతులు సరస్వతీనీరములు త్రావి ఫలవంతములయ్యెను. వారి పూలతీగెలు సరస్వతీ జీవనాధారముచే కొనసాగి కుసుమించెను. మహర్షులీనదిలో స్నానమాడిరి. మహర్షిపుత్రికలీయేటి నీళ్లెత్తికొనిపోయిరి. మహర్షుల యావులీ కల్లోలవతి యొడ్డున మేసి ఛాయావృక్షములక్రింద నిలచి నెమరువెట్టెను. అందువలననే సరస్వతి పేరు వారికంత ఆప్తముగ స్తవనీయమయ్యెను. ఈ క్రింది సూక్తిని జదువుఁడు.

ఋక్కు. పావకానః సరస్వతీ వాజేభిర్వాజినీవతీ।

యజ్ఞం వష్టుధియావసుః॥

అర్థము. పరిశుద్ధిని, అన్నమును, ధనమును గలుగఁజేయునట్టి సరస్వతీదేవి (యజమానునకీయవలసిన) అన్నాది సువస్తువులతో వచ్చి మా యజ్ఞకర్మను నెఱవేర్చును గాక!

ఋక్కు. మహోఅర్ణః సరస్వతీ। ప్రచేతయతి కేతునా।

ధియోవిశ్వావిరాజతి॥

అర్థము. (నదీరూపమగు) సరస్వతి (ప్రవాహరూపమగు) కర్మచేత కావలసినంత యుదకమును ఇచ్చుచున్నది. సమస్తమైన (కర్మానుష్ఠానయోగ్యములయిన) బుద్ధులను ప్రకాశింపఁజేయుచున్నది.

ఈపైసూక్తములవలన సరస్వతి నదీరూపిణియగు దేవతగా భావింపఁబడిన దనుట నిశ్చయము. ఇది వైదిక యుగ విషయము. కాని ఆయుగమందే సరస్వతి అన్నదాయినిగా ధ్యానించినట్లు అచ్చటచ్చట అనువాకములు కలవు. సరస్వతి పాలుపిండును, వెన్నతీయును, అంతేకాదు ఋజువులును, రసవంతములును నగు వాక్కులను బ్రసాదించును. ఇట్టి వింకను గొన్ని విశేషణములు సరస్వతికి వాడఁబడియున్నవి. నదియైన సరస్వతిని దేవతగా గొలుచుటలోఁ జక్కని యర్థమున్నది. నదుల యుభయపార్శ్వములయందును బచ్చని పొలములు వర్ధిల్లును. చక్కని పట్టణములు కట్టఁబడును. వాణిజ్యవ్యాపారములు సాగును. అన్యోన్యస్థలాంతరములకు చనవు సరసము లభివృద్ధియగును. వేయేల నాగరకతావికాసములు నదుల నంటియె వ్యాపించి తేజరిల్లినవి. నైలునదీతీరమునందె ప్రాచీనమైన ఈజిప్తునాగరకత మొలచి మోహపెట్టెను. సింధుగంగామహావాహినులతో ఆర్యుల సనాతన సభ్యతయైక్యమైనది. తెనుగుసీమయందు ప్రాక్తనాంధ్రనాగరకత గోదావరీవీచికలపై ఉయ్యాలలూగినది. అందువలననే నదులు పూజ్యములయినవి. మఱియు ఆర్యులసంధ్యావందన సంకల్పమునందు సైతము స్మరణీయములుగా ననువదింపబడినవి. కాని ఈ భావము కాలక్రమాగతమయిన భేదార్థమున కగ్గమయినది. కావ్యక్రీడనము పుష్పించినకాలమున

'అక్ష్యేఆత్మనివాసనిత్యరసికే ఆనందమాధవ్యామే"
అనియు,

'రమ్యేరమ్యతరే రసేరసకలే రక్తాంశుకేరంజకే'

అనియు మధురముగా కాళిదాసు దేవినుపాసించెను. అధ్యయనము నిత్యబ్రాహ్మణవిధిగా నంగీకరించుసరికి

శ్లో. సరస్వతీ నమస్తుభ్యం। వరదే కామరూపిణీ
విద్యారంభంకరిష్యామి । సిద్ధిర్భవతు మేసదా.

అను సులభసూక్తిధ్యానవాచికముగా నల్లికొనియెను. ఆధునికకాలమందు మానవస్వభావమునందున్న సంగీత సాహిత్యములును, కళాకాంతులును, భావాభావములును, ఉద్దీపింపఁజేయు మధురార్ద్రశక్తుల కన్నిటికిని సరస్వతి అధిష్ఠానదేవతగా భావించి అర్చింపఁబడుచున్నది.

ఈక్రిందిపద్యము లిందులకు దార్కాణములు.

"ఉ. పాలును నీరు వేఱుపఱు
పంగలమావుల వేదవీధివా
హ్యాళియొనర్చునే యలికు
లాలక, తానితవర్ణయయ్యునే
బాలసువర్ణదేహమున
భాసిలు, నానలుమోము వేల్పుప్రో
యాలు, వలంతిపల్కుజవ
రాలునటించుత నాదునాలుకన్.

"శా. తల్లీ! నిన్ను దలంచి పుస్తకముచే
తంబూనితిన్ నీవు నా
యుల్లంబందుననిల్చి, జృంభణముగా
నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లంబల్కుము నాదువాక్కునను సం
ప్రీతిన్ జగన్మోహినీ!
ఫుల్లాబ్జాక్షీ; సరస్వతీ! భగవతీ!
పూర్ణేందు బింబాననా!

## చైత్రయాత్ర

క్షత్రియులకు దిగ్విజయాత్సవ మీంఢించు దినములివియె. వానలాగిపోయి, త్రోవలెండుటచే సేనాగమనము సుగమమగును. రఘువు దిగ్విజయయాత్ర నభివర్ణించుచు కాళిదాసు

"గీ. దాటుటకు నగ్గముగ నదుల్ ♦ దనరఁజేసి
యడుసులేనట్లు త్రోవల ♦ నలరఁజేసి
తచ్ఛరత్కాలమాతని ♦ దండయాత్ర
కరుగఁ బురికొల్పెనతఁడను ♦ కొనకమున్నె."

అని కాలయోగ్యతను నిరూపించెను. రాజులు సామాన్యముగా నీఋతువును విజయయాత్రాకాలముగాఁ బూజించిరనుట నిర్వివాదము. అప్పటినుండియే ఆయుధపూజప్రారంభమైయుండవచ్చును.

శ్రీహర్షుని సత్రయాగము శరదృతువునందు జరిగెను. బౌద్ధులత్రివేణీ పరిషత్తు కార్తిక జ్యోత్స్నలలో సమకూడెను. శ్రీకృష్ణుని రాసక్రీడనము శరత్తునందే రాణించెను. ధర్మజుఁడు రాజసూయమును ఈ శుభదినములలోనే జరిపించెను; ఇంకెందుకు మహాభారతయుద్ధమె కార్తికబహుళమునజరిగినది. కాని విజయుఁడీ శరత్ప్రారంభమునకు స్థాయిపూజను గల్పించెను. లేనిచో నిది భారతవర్షీయులకు జాతీయోత్సవకాలముగాఁ బాదుకొనియుండదు. భారతవీరులలో అర్జునకుంగలపూజ్యపదవి యనన్యమయిన దనక తప్పదు. ఒక పక్షమున భారతకథారచనకు నాయకుఁడే అర్జునుఁడని చెప్పవచ్చును. రథానురథికులు ప్రాణవిసర్జనముచేసి యశోమార్జన మొనర్చిన మహాభారత రణనాయకత్వము అర్జునునకు గట్టిపెట్టుట నిర్వివాద విషయముకాదు. కాని తత్త్వజ్ఞులీ నిర్ణయమునకు విరుద్ధులుకారు. భారతపాఠకులకు మొట్టమొదట రంగమందు మహత్తరమగు

## భీష్మతేజస్సు

పరిస్ఫుటముగాఁ గానవచ్చును; కానిభీష్ముఁడువీరుఁడుగా కంటెనాచార్యుఁడుగా నధికప్రశంసనీయుఁడయ్యెను. అదిగాక ధర్మార్థకామమోక్షముల నాల్గింటను నీకురుకులతిలకుని జీవితము యథాపూర్ణపరిణామమును బొందలేదు. భీష్ముని మహాసంగ్రామమందు నాయకుఁడనుటకంటె, ఆ వీరకుటుంబమందు రాజర్షియనుట సమంజసము. తరువాత నస్త్రధారులలో ద్రోణకృపాశ్వత్థామలు వత్తురు. వారందఱును బ్రాహ్మణులు. ఆచార్యపీఠస్థులు. పాలితులుగాని పాలకులుగారు. వీరు సుయోధన నియోగమందుండిరి కావున యుద్ధమునం దంజవేసి పోరాడిరి; అంతేకాని వీరుండినందువలన యుద్ధము దాపరింపలేదు. వీరి జీవితములు వృత్తిధర్మమునం దుత్తమపురు

షులకుగల యభిమాన కౌశలములను జూపుచున్నవి. కాని స్వధర్మానుష్టానమునందుఁగల అసిధారావ్రతమహత్త్వమును బ్రదర్శించుటలేదు. అందువలన వీరనాయకకత్వ్య మెక్కుడురను న్యాయములేదు. మిగిలిన యోధగణమందు సుయోధనకర్ణులు ప్రధాన పురుషులు. సుయోధనుని జీవితము క్లిష్ట విమర్శనకుఁ జోటిచ్చు దురంత గర్భితమైనది. సుయోధనునియందుఁ జక్రవర్తికుండవలసిన యుదారలక్షణములున్నవి. యోధునకుఁ గావలసిన బలసాహసప్రావీణ్యము లున్నవి. కాని ఉపాయ నీతియందు దక్షత తక్కువ. సాంప్రదాయ పథముల పట్ల ప్రమాణబుద్ధి స్వల్పము. ఆత్మగతియందలి విశ్వాసము కంటె నా ప్తవచనమునందు నమ్మక మెక్కువ. అందువలననే సుయోధనజీవితము మొదట శకుని దురూహోయంత్రమందును, పిమ్మట కర్ణుని నిరంకుశసాహసరటనమునకును జిక్కి, ఎటుద్రిప్పిన నటు లాడినది. ఇతనికి పట్టుదలగలంత పరిశీలన లేదు. సంకల్పబాహుళ్యమంత భావసమృద్ధి కానరాదు. ఉత్తమచక్రవర్తి కేవల యోధుఁడు కానేరఁడు. కేవల నైతికుఁడును గాఁబోఁడు. సామ్రాజ్యభోగమునందెంత ఏకాగ్రీవమయిన ఆసక్తియున్నదో, తత్సాధనాసాకల్యమునందంత నీతిప్రయోగనైపుణ్యములు కావలెను. ఈరెండును ఇందుసమ్మేళములు కాలేదు. మిగిలినవాఁడు

## కర్ణుఁడు

కర్ణుని భారతనాయకునిగాఁజేయుట ఇతిహాసరచనాధర్మమునకు విరుద్ధము కాదు. కాని భారతమువంటి "సంహిత"కు ఔచితిని తేఁజాలదు. భారతకథాసంవిధానము నొకవలకుఁ బోల్చినచో, కర్ణుడు దానికి కొలికిత్రాడగునుకాని కన్నులలో నొకకన్నుగాఁడు. కర్ణుఁడు నిశతయోగ్యుఁడు. అందున కు సందేహములేదు. అయితే అతనియోగ్యతె "రణపాలన"మందు అసిధారావ్రతలక్షణములతో విమర్శింపఁదగినది; కాని ధీరోదాత్తకావ్యనియమములతో నిరూపింపఁదగినదికాదు. అట్టి నిరూపణకు వశముకాదనియే నావిధేయాశయము. కర్ణజీవితమును ఉదాత్తభావముతోఁబరిశీలించినచో ఖండితమయిన సిద్ధాంతము తేలదు. అక్లిష్టనివృత్తి యుత్పన్నమగును. భారతపర్వముల యందనేక స్థలాంతరముల కర్ణుఁడు వివయవివాదిగాఁ బోషింపఁబడి యున్నాఁడు. అపట్లనెల్ల నొకరవాస్యము బయటపడును. కర్ణుఁడు సంశయగ్రస్తములగు భావములు కలవాఁడుకాఁడు. అతని సంకల్పమెంత దృఢమయినదో, అతని క్రియాదృష్టియును అంతనిశ్చలమైనది. అందువలననే తనకుఁ దోఁచినదెల్ల కార్యపరిణామమనియె విశ్వసించెను. అశ్లేషఖండితముగా వాదించెను. మతాంతరమును నిరసించెను. తెగఁబడి తత్కార్యసాధనమునకు దూకెను. కాని పర్యవసానమునందు అన్యథా భావవశుఁడగుచు వచ్చెను. ఈలేఁడు చెప్పినంతచేసియున్నచో, భీష్మాదిరథికవర్గమునకు అంతచేటు నిరసనభావముదయించియుండదు. ఇట్లు చర్చించుటచే, అతఁడు చెప్పినంత చేయఁజాలనివాఁడని యర్థముచేయఁగూడదు. ఇచటఁబ్రసక్తి కాయికశక్తికాదు నైతికయుక్తి. కర్ణునియందు ఎన్ని గుణములైననున్నవికాని మాత్సర్యము మాత్రము లేకపోలేదు. ఉదాత్త జ్వలితమగు నాతని గుణతేజస్సు "పగ" పాలై పొగఁబాటినది. కర్ణకథావిధానము ఎంతవఱకును బ్రచండముగ నుద్ఘాటింపదగినది కాని ప్రమధురముగ కథనముఁజేయఁజాలినదికాదు. ఏ సందర్భము నెట్లు సమన్వయించినను ఈ మహావీరుని దృష్టియందు "పగ" పొగరాజుచున్నట్లు ప్రదర్శింపకపోరాదు. ఈపగ ఎక్కడిదందురా? కుమారాస్త్రవిద్యాసందర్శన ముహూర్తమందు అంకురించినదె. కావున కర్ణుని పరాక్రమము మాత్సర్యనైమిత్తికముగఁ బ్రకాశించినదనుట సామంజస్యమునకు దూరముకాదు. ఒకానొకపగచే ఏకపక్షదీక్షితుఁడయిన యోధుని ఉభయకుల ప్రచారగర్భితమగు భారతమునకు బ్రధాననాయకుని జేయుట వలనుపడదు.

ఇఁక పాండవపక్షమునందుఁ గథానాయకత్వము వహింపఁదగిన వారు యుధిష్ఠిరార్జునులు. భీమాదులనెందుకువదలితినో కురుకులయోధవిమర్శన ధోరణిఁబట్టి సులువుగ నూహింపఁగలరు.

## ధర్మరాజు

యుధిష్ఠిరునకు 'ధర్మరాజని నామాంతరమువాడిన వ్యాసుఁడు మిగులగడుసువాఁడు. ధర్మరాజును మొట్టమొదట నేత్తగా వర్ణించినాఁడు. తరువాతఁ బ్రశాంతునిగాఁ బ్రదర్శించినాఁడు. చివరకుఁ గేవలస్వార్థనిస్పృహునిగా వన్నె వేసినాఁడు. ధర్మజుని ప్రవర్తనమందు క్లిష్టమును అసందర్భమునగు విమర్శనీయవృత్తి లేకపోలే

ము; కాని క్వాచిత్కము. అదిగాక ధర్మరాజను పేరు చాలవఱకీ చిత్రవైరుధ్యమును గప్పిపెట్టుచున్నది. వ్యాసుఁడు వ్రాసిన వ్రాతలు సదివియే, చేసినచేతలుసూచియే మహాకవి వేమన

పేరుధర్మరాజు • పెనువేపవిత్తయా
విశ్వదాభిరామ • వినురవేమ !

అని సవ్యాజముగాఁ బాడియున్నాఁడు. యుధిష్ఠిరజీవితమునందు గొన్నియంశములు వాదనీయములు. ఈయుత్తమక్షత్రియుఁడు జ్ఞానయోగియా లేక కర్మయోగియా? నీతిజ్ఞుఁడా లేక నీతినిర్వాహకుఁడా? సాధనసవృద్ధుఁడా? లేక సాధన సమృద్ధుఁడా? ఈవిషయములు తేలవలెను. ఇవియన్నియు సున్నితమయిన భేదములాత్మకమయిన భావచర్చలు; కాని ఈనిరూపణము నచియె ధర్మరాజు జీవితము పోషింపబడవలసియుది. ధర్మజుఁడు ఎంతవేత్తయో అంత సంకల్పస్థైర్యముకలవాఁడుకాఁడు. ధర్మ సందేహములను నిశితబుద్ధితో కదలించువాఁడేకాని ఆత్మవిశ్వాసముతో స్థిరీకరించువాఁడుకాఁడు. ద్యూతము నిషిద్ధధర్మమని యాతఁడె ఱుఁగును. కాని సంప్రదాయ సిద్ధమను క్షుద్రసంశయమును బాపికొనలేకపోయెను. ధర్మపత్ని ద్యూతపణముకాఁదగునని యొకఁడాదేశింపఁగా, అపుడు విధినిషేధముల నెఱుంగనట్లు ప్రవర్తించెను. ఈపోకడ ఒకానొకవిషయమును దెలుపుచున్నది. అదియేదన? ధర్మజునిగ్రహణశక్తి చక్కని విచారదృష్టిగలదైనను అనుష్ఠానఘూర్ణమునందు స్వయంసంఛన్నమగు స్వభావదౌర్బల్యములేనిదికాదు. విషయవేగముగల భారతరణమునందు ఇతఁడు తనకైతాను నడపిన సందర్భములు చాల అరిది. ఒకానొకకార్యమునకుఁ దాను కారకుఁడైనను, లోకము తాను నిమిత్తమాత్రుఁడని నిశ్చయించులాగు ప్రవర్తించుఉపాయమునందుఁ జక్కని కుశలుఁడు. అందువలన దూరదృష్టిలేని మందప్రజ్ఞుఁడని యూహింపరాదు. తానెన్ని కార్యములుచేసినను

"చం. బ్రతికిన నాల్గునాళ్లు ఋతవాదియుధిష్ఠిరుఁడన్న మేటికీ। ర్తి ... ... ... ... ...

చెడకుండనుండు తెఱఁగుఁ బాటించుట ధర్మజుని మతము. అయితే ఇందొక సూక్ష్మవిషయమున్నది. ధర్మరాజ నిర్ణయములన్నియు

" ఏకక్రియాద్వ్యర్థికరీ " అను న్యాయమునకు ప్రమాణము లగుచుండును. కృష్ణ రాయభారమును సంకల్పించినవాడు ధర్మరాజు; తదౌచితిపట్లఁ గృతనిశ్చయుఁడు ధర్మరాజు. కాని నిశిత విమర్శనకుఁ ద్రోసినపుడు శ్రీకృష్ణ రాయబారమునకుఁ బ్రధాన కారణము యుధిష్ఠిరుని ఉపాయచాతుర్యమా? లేక తత్తత్సందర్భ సిద్ధమయిన స్వయంకృతకార్యమా? అను గొప్ప సంశయమును పైకిఁ దెచ్చును. ఇఁకఁ బూర్వపక్ష సిద్ధాంతములకుఁ గావలసినంత తర్కము. వీనికేమి ! ధర్మరాజు కొండొక బలవత్తర హేతువుచే నీనాయకత్వపదవికిఁ దొలఁగి నిలచుచున్నాఁడు. భారతము ఇతిహాసము. రెండు రాజ కుటుంబముల స్వార్థస్వామ్యములకు సంబంధించిన పెనఁగులాట. ఇందెంతవఱకును విషయోద్ధతియున్నదికాని, విషయలాలిత్యమున కవకాశము లేదు. ఈ రణకథనమునకుఁ బ్రధాననాయకత్వము రాజధర్మముచే నిరూపింపఁదగినది. అంతేకాని ధర్మరాజత్వముచే సమన్వయించుకొనవలసినదికాదు. భారతమందు ధర్మరాజు స్థితి మొదటినుండియు నట్లేయున్నది. ఉదాత్తధర్మమను దృష్టితో స్వధర్మము ననేక సందర్భములఁ దగులఁబెట్టెను. ఆతని ధర్మము ఏయుత్తమ ధర్మమయినను గావచ్చును; కాని ఉత్తమమగు క్షత్రియ ధర్మము మాత్రము కాదు.

"శా. వారుబ్రాహ్మణులె యేక్రీడైన సైరింపఁగ౯.

అను కవిపలుకులలో నీ రహస్యమె బయటపడుచున్నది. క్షత్రియధర్మమునందు కార్యనిశ్చయము ప్రధానము. బ్రాహ్మణధర్మమునకు కార్యచర్చ ముఖ్యమయినది. ధర్మరాజునందీ గుణదుర్బలత్వముచాలఁగలదు. తెగఁబడి కర్ణునితో తారసిల్లినపుడయిన ధర్మజునిక్షాత్రము నైజసాహసముతోఁ బ్రజ్వలించినదికాదు. తనయసమర్థతకుఁ దానులజ్జింపక తమ్ముని దిట్టసాగెను. కర్ణవిజృంభణమునకును అర్జునోపాలంభమునకును సందర్భముఁ గల్పించిన క్షత్రియనాయకుని ధర్మదృష్టియెట్టిదో యూహింపుడు. ఈయన శాపనార్థములలో

"క. విను కర్ణున కేనోడితి
నన నేటికి నీవునోడితనిలజమాద్రీ
తనయులు మున్నే యోడిరి
మనతోఁ గూడంగఁ గంసమర్దియునోడెన్.

"క. కావున మనమిక ననికిం
బోవంబనిలేదు విపినభూమికిఁజని య
చ్చో వెలిపుడక్కి తపసుల
మై విచ్చలవిడిఁజరింత మందఱముదగన్

"క. కాదేని బిరుదు లాడక
సాదులమై వినయమొప్పఁజని కురునాథుం
డేది పనిచినను జేసి ద
యాదృష్టినతండు సూచునట్లుండఁదగున్.

"సీ. దేవతలిచ్చిన తేరునశ్వంబులుఁ,
కపికేతనంబును గలవు, దైవి
కంబుచేనున్నది గాండీవమనఁ దాటి
యంతవి, ల్లదిగాక హరిరథంబు
గడపెడు నటె, పరికర మిట్టిదైయుండ
నెట్లు కర్ణున కోడి యిట్టు వలియఁ
బాఱుతెంచితి నీవు భండనంబునఁ గర్ణుఁ
గనిపాఱుదని సుయోధనుఁడు సెప్పె

తే. నదినిజంబుగఁ గొనక చేతైలితి నాదు
చేలతనమునఁగాదె పాంచాలమాత్స్య
పాండులాదిగఁ గలిగిన బంధుమిత్త్రి
జనులు దెగటాటి రప్రయోజనముగాఁగ."

తేలినదేమన! ధర్మరాజు భారతభావమునందొక ప్రధానావయవమగునుగాని మహాసంగ్రామమునందుఁ బ్రత్యక్షకార్యవీరుఁడుకాఁడు. కార్యాధిపత్యముగూడ నొసఁగుఁడు. కార్యనాయకత్వముమాత్ర మీతనిచేతఁబడదు. ఇఁక

## అర్జునుఁడు

మిగిలియున్నాఁడు. మహాభారతమునకు అర్జునుఁడె నాయకుఁడని నామతము. వ్యాసుడీభావముతోడనే భారతసంహితయందుఁ బార్థునిఁ బోషించెను. తెనిగించిన నన్నయకుఁగూడ పార్థునికథానాయకత్వమె దృష్టియందు లక్షితమైయుండెను. ఈ ప్రచ్ఛన్నవ్యంగ్యముతేలయని కన్నడభారతకర్త విజయునే కథానాయకునిగా స్వీకరించి చిత్రించెను. అయితే విజయుఁడు భారతమునకు నాయకుఁడంటిమి. ఇది యింతమాత్రముతో నొప్పికొను నిర్వివాద సిద్ధాంతము కాబోదు. మనమీభావమును నిరూపించుటకుఁగల ఆధారములేవో వెదకుదము. అర్జునుఁడు సంపూర్ణసాఫల్యమయినజీవితముకలవాఁడు. అనగా నతఁడు ధర్మార్థకామమోక్షములను నాలుగాశ్రమములను ఫలవంతముగా నడపినవాఁడని యర్థము. ఇందుకు లక్ష్యములెత్తిచూపుదము. అర్జునుని ధర్మవ్యక్తికి గీతలెసాక్షి. అర్థసాధనకు దిగ్విజయమె యుదాహరణము. కామకళ్యాణమునకు ఉలూచీసుభద్రావిలాసమె నిదర్శనము. తురీయాశ్రమమునుగూర్చి చర్చ యప్రస్తుతము. ఆదినుండియుఁ భార్థుని ఒకానొక అగ్రవిలక్షణత్వముతోఁ గవిపోషించుచు వచ్చెననుటకు అవకాశములుకలవు. అస్త్రవిద్యాప్రదర్శనమునందు కుమారవర్గములో అర్జుని ధనుఃప్రకర్షయె లోకము నాకర్షించెను. దీక్షితుఁడై మహాతపస్సునలిపి యితఁడు సాటివీరసోదరులలోఁ బ్రత్యేకస్సుతోఁ బ్రకాశించెను. ద్రుపదపరిభవమె యీతని వియోధనాయకత్వమునకుఁ బ్రథమ బీజమువంటిది. ఇది అర్జున జీవితమునందుఁ బ్రథమభాగము. రెండవభాగమునందు ఇంతకంటె ముఖ్యవిషయములున్నవి. భారతవిషములలో పాంచాలీ పరిణయమున కొక చిత్రన్యముకలదు. పరిణయమైన తరువాత ద్రౌపదీజీవితమునకును మహాభారతకథకును భేదమే కన్పింపదు. మత్స్యయంత్రమును దుస్సాధ్యములయిన యోధపరీక్షలలో నొకదానినిగా జేర్పవచ్చును. అట్టి కఠినపరీక్షయందు విశ్వఖలవిజయమునందిన అర్జునుఁడు తప్పకభారతకథానాయకపీఠము నలంకరింపఁగలఁడను విశ్వాసము కవికల్పనకు సహజము. ఈ దశయందె అర్జునుని ద్వాదశమాసికవ్రతము పూర్ణమైనది. ధర్మోద్ధారఁకుడయిన అర్జునునకుఁ గవి చిత్రాంగదా స్నేహముఁ గల్పించెను. ఉలూచీ శయ్యాలఁబ్రసన్నునిజేసెను. కపటకాషాయాంబరములలోఁ బ్రచ్ఛన్నునిజేసెను. ఆహాఏమి? కాఠిన్యముతోఁగళామార్దవముఁజూపెను. స్ఫటికములతో మెత్తనిపూలుచెక్కెను. ఆచ్ఛాదనతో నందమును బ్రదర్శించెను. కామవిహ్వలుఁడైన అర్జునుఁడు తీర్థయాత్రాదీక్షితుఁడైన యర్జునునితో

పవిత్రుఁడగుచున్నాఁడు. శుచివ్రతుఁడైన అర్జు నుఁడు రసలాలసతచే నార్ద్రుఁడగుచున్నాఁడు. అందు వలననే కవి,

'శోభనమువీఁదను శోభనమాచు నింపుగన్'

అని విజయవిలాసమును బూర్ణముఁజేసెను.

మూడవదశ అజ్ఞాతవాసము. ఇందు గమనింపఁదగినది అస్త్రవియోగము. ఈసంవిధానము ముఖ్యముగా అర్జు నుని చిత్తసంయమనమునకు స్ఫుటసూచనగాఁ దీసికొన వచ్చును. గాండీవివంటి ధన్వికి చిత్తసంయమనము లేనిచో నిరంకుశమైన ప్రయోగోపసంహారములు లోకనిగ్రహము లై పరిణమించి యుండునుగాని లోకానుగ్రహకారక ములై శాంతించి యుండవు. భారతరణము లోకశాంతి స్థాపనకై సంకల్పింపఁబడినది. ఇది నిర్వివాదము కాక పోయినను సంప్రదాయవాదు లిచ్చిన యర్థముమాత్ర మి దియే కదా ? విజయుఁడీ మహాకథకు నాయకుఁడగుట చేతనే సంకల్పసాధనలు రెండును ఇతనియందు యథా పరిమితములై శక్తిమంతములయినవి.

తృతీయవ్యవస్థ కురుక్షేత్రరణరంగమందు ఆరంభించు చున్నది. ఇందు ఒకానొక ఉదారనాయకుని జిజ్ఞాస కాండ చక్కగా విశదీకరింపఁబడినది. అర్జునవిషాదయో గము మహాభారతకథాకంఠమునందు పసుపుత్రాడులాగు వ్రేలాడుచున్నది. అది మాంగల్యమో— ఉరిత్రాడో— నచ్చఁ జిత్రింపవలసిన భారము కవిది.

"ఉ. తాతల మామలన్ సుతులఁ

దండ్రులఁ దమ్ముల నన్నలన్ గురు

వ్రాతము శిష్టకోటి సఖి

వర్గముఁ దుచ్ఛజనానురూప దు

ర్నీతి వధించి యేఁబడయ

నెత్తుటఁదోఁగిన రాజ్యభోగముల్

ప్రీతియొనర్చునె ? యశము

పెల్లొదవంగూర్చునె పెంపొనర్చునే.

అని అర్జునుఁడు ప్రకంపవాచియై తహతహలాడెను. గాండీవము హస్తమునుండి క్రిందకు జాఱిపడెను. దాని తో శ్రీకృష్ణుఁడు పన్నిన మహాభారతసంగ్రామతంత్రమం తయు ఇసుకయిల్లు కూలినట్లు కూలెను. ఇఁక గతియేమి. కృష్ణుఁడేగతి. ఉభయపక్షవీరులును ప్రత్యక్షముగనో పరోక్షముగనో సంగ్రామసంప్రాప్తికై పనిచేసిరి. అం దు శ్రీకృష్ణుఁడు ప్రముఖుఁడు. వీరులు యుద్ధమునే కాం క్షించిరి. కాంక్షితమె నెట్టికొనివచ్చినది. అస్త్రములు లా హూరామములైనవి. శస్త్రములు సానలపై మెఱుఁగెక్కి నవి. రణజ్వరము వ్యాపించినది. రక్తదాహము తీవ్రించి నది. అక్షౌహిణులు వ్యూహముఖముల నడ్డినిలచినవి. ప విత్రమగు కురుక్షేత్రమున నింక నిముసములలో నెత్తుటే ఱు పాఱనున్నవి. అది కడు సంక్షోభాసమయము. కర్మ కాండ జరుగవలసినది జ్ఞానకాండ సందుకొనినది. అపు డేమి చేయవలెను ? ఉభయపంక్తులకును సామరస్యము ను గొలిపి, అర్జునవిషాదమును తప్పింపవలెనా ? లేక ఎ త్తినయెత్తు న్యాయసిద్ధమయిన ముగింపునకుఁ దేవలెనా? శ్రీకృష్ణుఁగు రెండవమార్గమున నడచెను. యోధవర్గమును నడిపించెను. గీతోపదేశ మొనర్చి

నిష్కామకర్మయోగము

నుద్ధరించెను. ధర్మవశుఁడైనఅర్జునుఁడు స్వజనచ్ఛేదము నాప్తవిధిగా నంగీకరించి కృతకృత్యుఁడయ్యెను; విజయుఁడ య్యెను. వీరారాధనయోగ్యమగు మహాభారతమునకుఁగ్ర మాగతమయిన ఉపసంహారముఁగల్పించెను. ఇందుఁగల యర్థస్ఫోటమేమన మహాసంగ్రామమునకుఁ బ్రధానవా యకుఁడయిన అర్జునుఁడు స్వార్థనిరతుఁడా—లేక స్వార్థని స్పృహుఁడా— యను సంశయము తేలుటయే. దేవదత్తము కురుక్షేత్రమందు మ్రోగువఱకును అర్జునుని మనస్సు వి స్ఫుటముగాఁ గానరాలేదు. పరాజితులయిన పౌరుష వంతులకుండు మాత్సర్యస్పర్థలుమాత్రమె కానవచ్చినవి. ఇపుడన్నో అవి యన్నియును మాఱినవి. అర్జునుఁడు కేవలము పగసాధించుటకై గాండీవమునుటంకరించెనా? లేక నిరంకుశ రణదాహము నాపలేక నెత్తురుకూడుఁ గాంక్షించెనా ? లేక రాజ్యలుబ్ధుఁడై తెగించెనా ? ఈ సమస్యలు—సమస్యలననేల సందేహములు—విచ్చిపో వుటకే అర్జునవిషాదయోగము వచ్చినది. ఒక మహాయో ధకుమారుని అనుకంపాకారుణ్యాది స్నిగ్ధగుణములను బైకిదెచ్చి చూపినది. అసూయాక్రోధాది క్షుద్రగుణ కాలుష్యమును క్షాళితముఁ జేసినది. తుదకు ఉదాత్తమ గు నిష్కామకర్మయోగమును స్థాపించినది. కథానాయ కుఁడగు అర్జునుఁడు స్వధర్మబద్ధుఁడై సంకల్పసన్యాస

ముతో ఆత్మకర్తవ్యభారమును మోసెనను గంభీరభావౌచితిని పోషించి ప్రతిష్ఠించినది. వ్యాసమహర్షి దృష్టియందు అర్జునుఁడు కథానాయకుఁడని నిర్దేశము లేక పోలేదు.

"తే. అధిప! యోగీశ్వరేశ్వరుం♦డయిన కృష్ణుఁ
డును, ధనుర్ధరవర్యుఁ డ♦ర్జునుఁడు నెచట
నిలచి రచ్చట విజయంబు ♦ నీతి సిరియు
భూతి నిత్యంబులగు నిది ♦ నాతలంపు.

అను వాక్యములు సంజయుని నోటనుంచెను. కృష్ణుఁడు మహాసంగ్రామమందు అస్త్రముపట్టనివాఁడగుటచే నాయకుఁడు కాలేదు. ఇఁక మిగిలినవాఁడు అర్జునుఁడు. ఇతఁడే శ్రీమన్మహాభారతమునకుఁ గథానాయకుఁడు.

ఇట్లు వీరలోకమందు విజయుని పూజ్యస్థానము సిద్ధించి స్థిరపడినది. ఇట్టి విజయుఁడు ప్రచ్ఛన్నవేషమును విసర్జించి నిక్షిప్తశస్త్రాస్త్రములను పునః ప్రయోగమునకై పూజించిన దివసమగుటచేతనే విజయదశమి యైనది. అది మనకేల పూజ్యదివసమయినదందురా? భారతయుద్ధము ఆర్యసభ్యతయొక్క ఉచ్చతర ఛాయాపటమువంటిది. అందు దేశగౌరవమును వీరభావమును నిలచియున్నవి. భారతజాతీయత సంపాదించిన విలక్షణతేజస్సు గూడ అందే ప్రతిఫలించుచున్నది. అట్టి మహాకథకు నాయకుఁడు ఆరాధనీయుఁడని జగము విశ్వసించుచున్నది. వ్యక్తి బోధించుచున్నది. సంప్రదాయము శాసించుచున్నది. అందువలననే నాఁడు మొదలు నేఁటివఱకు విజయదశమి ధారావాహికమయిన పూజాపుష్పములను గ్రుచ్చి కాలకంఠమందు వేయుచునేయున్నది.

ముగింపు

శరదృతువు కార్యానుష్ఠానయోగ్యమైన ఋతువని చెప్పితిని. అందు ఆశ్వీజము పూజతోఁ బ్రారంభమగును. విజయారాధనతో ఫలించును. తరువాత కృష్ణపక్షారంభమందు 'తద్దెపండుగ' వచ్చును. అకలంకవర్చస్సునకుఁ బాత్రములయిన కళ్యాణకన్యాజనములు ఋతులక్ష్మిని గౌరి పేరఁ గొలుతురు. మంగళ సౌభాగ్యస్థానమగు కుమారీకులము ఋతుప్రసన్నమగు ఉత్సాహవ్యగ్రభావముతో వర్ధిల్లవలెను. ఇందులకు,

"గీ. అలుఁగదంచిన సన్నబి♦య్యంబు వండి
పొట్లకాయల నేతిపో♦పుల నమర్చి
పేరఁబెట్టిన మీఁగడ ♦ పెరుగుతోడ
నపుడు తినిపించి రెల్లక♦న్యలను సతులు.

ఇటువంటి మోహనోత్సవములె తగినవి. దీపావళీ మహోత్సవముతో శరదృతువు మాతృభూమికి నివాళిపట్టుచున్నది. ఓం శాంతిః శాంతిః శాంతిః.

—రాయప్రోలు సుబ్బారావు


## "శమీపూజ"

రంగులు పూసి తెచ్చిన తు♦రంగము * లెక్కి సవారిచేసి నీ
ముంగలఁ బందెమాడఁదల♦పోయను; నీముదిగొమ్మలందు మాఁ
దంగమనీయమౌ మరక♦తంబులపోల్కి వెలుంగు పచ్చ జీ
రంగులఁ * బట్టియాడుటకు ♦ రానిటుచేర; శమీమహీజమా!

ఉ. దక్షిణదెచ్చికోలుకయి ♦ తావకపత్రముఁ గోలడుల్చి నా
కుక్షి భరించుకోవలయు ♦ కోర్కులు పుట్టవు; * నేఁడుగూడ నీ
సాక్షిగ నిల్చు నాభరత ♦ సాహసలక్ష్మికి బాష్పపూర్ణపూ
జాక్షరమాల్ జపించిచన ♦ నాశజనించెను; గాన వచ్చితిన్.

* దత్తమండలమునవారు శమీపూజనాఁడు గుఱ్ఱములనలంకరించి సవారిచేయుదురు. బాలురు 'జీరంగు' లనఁబడు పచ్చతెక్కలుగల భ్రమరములను బట్టి సొడకుదారముగట్టి యాడింతురు. ఛాందసులు జమ్మిపత్రిఁగొనిపోయి మంత్రపూర్వకముగ నూరిలోనివారికిచ్చి దక్షిణలఁగైకొందురు.

శమీ శమయతే పాపమ్| శమీ శత్రువినాశనీ
అర్జునస్య ధనుర్ధారీ| రామస్య ప్రియదర్శనమ్.



కృష్ణవేణీహారితసస్య ♦ పృథివియందు
శ్రీశమీపుణ్య కళ్యాణ ♦ కంఠసీమ
తుంగభద్రాశుభోపాంత ♦ రంగములను
అందికొనుము శమీలక్ష్మి! ♦ యాంధ్రభూజ.

శమీపూజ.

ఇంత చాలును. ఇందుఁ బ్రత్యేక కవుల విభిన్న కల్పనలకు విషయభేదము లేమిచేఁ గలిగిన యత్యంత సమీప బంధుత్వమును వేఱుగ విప్పి చూపనక్కరలేదు. ఇట్లుండఁగ, వర్ణింపవలసిన విషయము లన్నియు లాక్షణిక నియమితములై యభిన్నములగుటచేతను, కవిఁ గావలయునని తహతహపడువాఁడు వాని నెఱుఁగనిది ముందడుగు వెట్టరాదు కావునను, కవి చేయవలసిన పనులు, చేయఁబోవు పనులు, సర్వావగతము లయ్యెను. కావ్యమునఁ బదములందేతప్ప నర్థములందు 'నవ్యత' చాలవఱకు నశించినది. కాన మన కవులు నొకరుచెప్పినమాటయే పదములుమార్చి చెప్పఁ జొచ్చిరి. ఆ మాటలను ఛందోనియమాదులకైన లోఁబడక గద్యరూపముగ గంటకు నాలుగు కావ్యములుగా రచించెనేని చదువరు లతని నేమి చూచి 'కవి' యందురు? కావున నందఱెఱిఁగిన విషయములను సులభముగా వచనరూపమున రచించువాని కంటె, యతిప్రాసాది నియమములకు లోనై, కొన్ని శబ్దాలంకారములను తోడుచేసికొని పద్యరూపముగ రచించువాఁడు గౌరవార్హుఁడు గాకపోయినను శ్లాఘార్హుఁడనుటలో సందియ మేమి? ఈ కారణముచేతనే ప్రబంధకవులు క్వాచిత్కముగ గద్యముల వ్రాసినను అవి పద్యములకంటె దుర్గ్రహతరములుగా రచించిరి. ఇదియే క్రమక్రమముగ గద్యమునకుఁ గవితాపాత్రత్వమును దప్పించినదని నా యాశయము. ఏ విషయము వచించినను బద్యరూపముగనే రచింపవలసి వచ్చెను. కావుననే మన లాక్షణికుఁడును కవితాగంధముగూడలేని వ్యాకరణచ్ఛందోరూప విషయములన్నియుఁ బద్యముల మూలముగనే శాసించెను. లేకున్న నతఁ డప్పకవియగు టెట్లు?

(ఆ) ఇతని మతమునఁ గవిత్వ మలంకారప్రధానమే గాని రసప్రధానము గాదు.

"సావాగ్యారసవృత్తిస్స్యాద్భ్యోహి రసోయథాతథం కవిభిః" అను మూలశ్లోకమును వ్యాఖ్యానము చేయుచు,

"గీ. తగ రసాశ్రయ వాక్యసంతతులఁ గూర్చి
కావ్యము లొనర్చు వారపో కవులనంగ,
నట్లు గావున నేభాషనైనఁ గవితఁ
బలుకు వారికి సాధింపవలయు రసము."

అని విధిలేక వచించినాఁడు. మఱియొక చోట 'రససంప్రసక్తిచేఁ బొసగును బద్యంబు' అని వ్రాయుటయుఁ గొననాలుక మాటయే. వర్ణము, పదము, వాక్యము, అర్థము, భావము, రసము, పద్యము, కావ్యము అను నెనిమిది పదార్థములలో పూర్వాపూర్వము లుత్తరోత్తరములకుఁ గారణము లగునని సీసపద్యము నాల్గుపాదముల యెనిమిది తునకలలో నిమిడించి వ్రాయునపు డతనికిని దెలియక వచ్చినమాట. ఇతని సత్యమైన సిద్ధాంతమును,

"గీ. ఆశుధారా కవిత్వములందు శయ్య
లుపమ లుత్ప్రేక్షలును లేకయుండుఁ గాన
నెంత చర్చించినను బద్య మంతసార
వంతమగుఁ గాన నిలుకడ వలయుఁ గృతికి."

అను పద్యము ఘోషించెడిని. కృతియందు 'చర్చింప' వలసిన విషయములు 'ఉపమలుత్ప్రేక్షలు' నే కాని రసము గాదు. ఒకవేళ లాక్షణిక పక్షపాతులు గొందఱు అలంకారములు రసోపస్కారకములు కావున కృతియందలంకారములే ముఖ్యములని యందురేమో! కాని ప్రతి పద్యమునందును రసముండియే తీఱునా? మనకు తొమ్మిదేగదా రసములు? పుర సూర్య చంద్రోదయాదివర్ణనములందుఁ బ్రతిపద్యమునందును బై తొమ్మిది రసములలో నేదేనొకటి వచ్చునట్లు వ్రాయఁదరమా? అట్లు వ్రాయలేమేని నప్పు డలంకారముల ప్రయోజనమేమి? అట్లుగాక యలంకారము లున్నచోట్లనెల్ల రసదేవత సరస్వతివలె గుప్తగామినియై మన కెఱుఁగరాక యుండునని వచింపనగునా? మఱియు రసప్రధానమైన పద్యములందును అలంకారోపయోగమును గూర్చి,

"దోషహానంగుణాధానం కర్తవ్యంనియమాత్కృతే
కామచారః పునః ప్రోక్తో౽లంకారేషు మనీషిభిః"

అని ప్రాచీనగీర్వాణలాక్షణికుల సిద్ధాంతము. దీని నాధునికులు దోషనిరాసప్రధానవాదమేకాని యలంకారముల యావశ్యకతను బాధించునది కాదని యంగీకరించిరి. నిజముగ నలంకారముల ధర్మము రసోపస్కరణమే యైనచో వాని నెట్లెంతవఱకు నుపయోగింపవచ్చునో కూడదో కవియే నిర్ణయింపవలయుఁగాని మనము నియమింపఁ జాలము. మఱియుఁ గవికి రసమే యుపాస్యదేవత యగునేని యతఁ డలంకారశాస్త్రము నెంత మఱ

చిన నంతమేలు. అలంకారములు రసాధీనములుగాని రస మలంకారాధీనముగాదు. కావున కవి కలంకారశాస్త్ర పరిచయము యోగికి సంసారవాసనవంటిది.

(ఇ) కావ్యమునకు జీవకళ ధ్వని. ధ్వనిప్రధాన ముత్తమమనియు, వాచ్యవ్యంగ్యార్థములు తుల్యముగానున్నచో మధ్యమమనియు, ధ్వనిరహితమధమమనియు, నీకడపటి దర్థప్రధానముగాక శబ్దప్రధానమయ్యేనేని నధమాధమమనియుఁ గావ్యమును లాక్షణికులు విభజించిరి. అప్పకవి యీవిభాగ మార్గమునే తడవలేదు. ఇతని యుదాహరణ మార్గమునుబట్టి యూహించితిమేని యితని మతమునఁ గవిత్వము రెండుదెఱఁగులు:—౧ అర్థప్రధానము, ౨ శబ్దప్రధానము. రెండవది చిత్రకవిత్వము, బంధకవిత్వము, గర్భకవిత్వమునని మూఁడువిధములు. కవితను గూర్చి యీతఁడిచ్చినయుదాహరణములన్నియు నీరెండవ తెగకుఁజేరినవే. అప్పకవి సామర్థ్యమావిషయమందే చూపఁబడినది. శబ్దప్రధానకవితను మనలాక్షణికు లెంతతీవ్రముగా నిరసించిరో యంతకన్నఁదీవ్రతరముగా నదిప్రబలినది. కారణము అర్థప్రధానకవితయందుగల నియమబాహుళ్యమే. ఈనియమబాహుళ్యమే కల్పనాప్రపంచమునకు మార్గదర్శకము. కల్పనావిషయములు పరిమితములైనప్పుడు ప్రత్యేక కవులయందుఁగల కల్పనాశక్తియుఁ బరిమితముగావలసివచ్చెను. శబ్దప్రధానకవితయందింతకన్న నెక్కువవిశాలమగు నవకాశముగలదు. భాషాపాండిత్య మెంతయుండిన నంతవిస్మయనీయముగాఁ గల్పింపవచ్చును. అప్పకవియందు శబ్దకల్పకత యున్నంతయర్థకల్పకతలేదు. ఐననతఁడు గర్భచిత్రబంధ కవిత్వములను వివరించుచో 'కవులకుఁజెవులపండువులు సేయు' 'శ్రవణసుఖంబొనర్చు' నని వ్రాయుచు నవి హృదయానందకములు గావని తెలిసియో తెలియకయో సూచించి విమర్శకులకు విస్మయముఁ గల్గించుచున్నాఁడు.

(ఈ) ఇతని ముఖ్యకార్యములలో నొకటి కవులను విభజించుట. నేనెఱిఁగినంతవఱకు ఇతఁడే యీవిభాగమున కాదిమకర్తయని యూహించెదను. కవులేనుదెఱఁగులు.

౧ వివేకి: 'గణవర్ణ శబ్దార్థగుణదోషనికరంబుఁ బరికించి' కబ్బముఁ గూర్చువాఁడు.

౨ వాచకుఁడు: అనుప్రాసనియమము వదలక కవిత్వముల్లువాఁడు.

3 రాచికుఁడు: కావ్యమంతయు 'మృదుమధురోక్తుల వెదకి' నించువాఁడు.

౪ అర్థార్థి: మితపదములలో నతివిపులార్థము నిమిడించువాఁడు.

౫ శిల్పార్థి: యమకముల నాశ్రయించువాఁడు.

౬ భూషణార్థి: అలంకారనిరతుఁడు

౭ మార్దవానుగతుఁడు: సరళపదములతో విరళార్థమును జూపుచు రసముఁ బ్రతిపాదించువాఁడు.

ఒక్కకవియెడ నొక్కొకేగుణము లభించుట యరుదు. కావున నీవిభాగము గుణప్రాధాన్యముఁబట్టి యుండును. వివేకికి మన మప్పకవినే లక్ష్యముగాఁ గైకొనవచ్చును. ఏలయనఁగాఁ దక్కిన యేకవిగాని యితఁడు వచించిన 'గణవర్ణశబ్దార్థగుణ దోష'ములఁ బరికించు నోపికకలిగియుండఁడు. వానిని జూపుటకై చాలఁ బరిశ్రమించినవాఁడుగానఁ దానురచించిన 'అంబికావాదము' మొదలగు గ్రంథములయందు ఆనియమములను దప్పక 'పరికించి' యుండుననుట నిస్సందేహము. రామరాజభూషణునందును బమ్మెరపోతనయందును వాచకత్వము గలదు. రాచికులు తిమ్మన, చేమకూర వెంకటపతి, మొదలగువారు. శ్రీకృష్ణదేవరాయలర్థార్థి. శిల్పార్థిని ప్రత్యేకముగా మనకవులలోఁగనుఁగొనలేము. యమకరత్నాకరనళోదయాది కావ్యములు యమకమునకే ప్రత్యేకముగా జనియించినవి గీర్వాణవాఙ్మయమునఁ గలవుగాని తెనుఁగువారా త్రోవ నాశ్రయించినవారు నాకుం జూడలేరు.

"తే. అనుచు ననుచారియై విప్రుఁడరుగు దేరఁ
దేరగాండివమిడి యస్మదీయమహిమ
మహిమడుంగ మడుంగగు మనసుమాయ
మాయగన్నులఁగ్రమ్మఁగ్రమ్మఁజేతి నేను".

"క. మొనయంగనకా నీతో
మొనయంగనకాద్రిధరుఁడె, ముదితనుపవనా
తనుపవనాహతికోసఁగక
తనుపవనామదన నీముదంచితకరుణన్."

మొదలగు పద్యములొండు రెండు సోమనాథరామరాజభూషణాదులయెడ విక్షిప్తములై తెనుఁగునలభించును.

ఇంచుమించుగ మనకవులందఱు భూషణార్థులు. మార్గవానుగతుఁడు పెద్దన, లేక తిక్కన.

పైవిభాగమును జక్కఁగా విమర్శించితిమేని కవిత్వమను పదమునకు మనలోఁగల సత్యమైనయర్థము పదములకూర్పె కాని వేఱుకాదను టనుగ్రహము. శిల్పార్థియు వాచకుఁడును శబ్దాలంకారజీవులుగావున భూషణార్థియను పదమున కర్థాలంకారలోలుపుఁడనియు, మార్గవానుగతునియెడ "సరళపదములు"గాక రసముఁజూపుటయే ముఖ్యమనియు మనమర్థముఁజేసికొంటిమేని, ఇవిరెండు దప్పఁ దక్కిన విభేదములన్నియుఁ గేవలము శైలియనఁబడు పదముల కూర్పునే యవలంబించియుండునవి. అర్థార్థి మనకంటె కర్థప్రధానుఁడుగాఁ గానవచ్చునుగాని విమర్శించితిమేని విపులార్థములను బోధించుపదముల వెదకి కూర్చుటయే యతనిప్రధానకార్యమని తోఁచును. కవితాచర్చయందు భావశిల్పమునకుఁగల ప్రాధాన్యము పదశిల్పమగు శైలికి లేదని విమర్శక రాద్ధాంతము. మఱియు శైలి భావమునకుఁ బ్రతిబింబము గావున దానికి ప్రత్యేక స్వరూపమేలేదని కొందఱమతము. తలపునకు విపరీతమగు మాటయుండదుగావున భావభిన్నమగుశైలిగాని శైలివ్యతిరిక్తమగు భావముగాని యున్నదనుట న్యాయముగాదని యీరెండవ తెగవారి వాదము. కాని తలఁపును మీఱినమాట వ్యవహారముననుండదు. మనము సామాన్యముగ మాటాడునప్పుడు పదములకూర్పునుగూర్చి యోజింపము. కాని కావ్యమున నట్లుగాదు. అదికేవల భావప్రధానముగాదు ; మఱిశిల్పప్రధానము. కావున తలఁపునుబట్టి మాటలును మాటలఁబట్టి తలఁపును సంస్కరించుకొనవలసియుండును. భావము మహోన్నతమైనను, దానిని బోధించు పలుకులును దదనుగుణముగనున్ననేకాని కవిత యందునిలువదు. కావున శైలియనుపదార్థమొండుగలదనియు దానియెడను గవికి దృష్టియావశ్యకమనియు వచింపకతీరదు. అనఁగా నెంతవఱకుఁ బదశిల్పము భావపోషకమగునో యంతవఱకే కాని, భావౌన్నత్యమున కేమాత్రము భంగము గలిగించునట్లున్నను దానిని దిరస్కరించుట కవికిఁ గల ప్రథమధర్మము. ఎందాకనది భావానుసారియగునో యందాఁక నది భావముతో నేకీభవించి ప్రత్యేకతలేకయుండును. అప్పుడే యది హృదయానందకము. అట్లుగాక స్వార్థైకతత్పరమై భావమును లక్షీకరింపదేని శ్రవణమాత్రానందకముగావచ్చును. ఇదే శబ్దప్రధానకవిత.

అప్పకవి కవివిభాగమున కిదియ ముఖ్యావలంబనము. కాని యతని యభిప్రాయము ననుసరించి గర్భకవి, బంధకవి, చిత్రకవులను మఱిమూవు రీ విభాగమున జేరవలసియుండెను. యమకమునుబట్టి యొకనిని, అనుప్రాసమునుబట్టి యొకనిని విభజించినవాఁడు పై విభాగము నేలవదలెనో యెఱుఁగను. ఇట్లే "మృదుమధురోక్తుల"కును "సరళపదములకును" భేదముఁ గనిపెట్టినవాఁడు, దీర్ఘసమాసములకును విరళపదములకును వ్యత్యాసమేల చూపలేదో!

నిజముఁ జూడఁబోయినఁ గవుల విభజించుటయే యయుక్తము. మనయిష్టానుసారము వారు విభజింపఁబడువారుకారు. ప్రతిభామహత్త్వముకొలఁది వారుప్రాచీనరూపములవదలి నవనవరూపములఁ దాల్తురు. నేఁటికిఁ గవిత్వము ముగిసియుండెనేని కవులవిభేదములును ముగిసియుండి లక్షణాధీనములయియుండును. మనము చేయఁగల్గినదెల్ల నీవఱకు వాఙ్మయము నలంకరించిన కవుల త్రోవలనెల్లఁ బరికించి యవియిన్ని తెఱఁగులని లెక్కవేయుటయ. అప్పకవియు రాఁగల కవుల మార్గములను యోగదృష్టిచే గ్రహింపఁగల్గి వ్రాసినవాఁడు కాఁడనుట సత్యమే యైనను పైనేను విన్నవించినట్లు పదముల కూర్పునుబట్టి విభజించుటచే నతని విభాగము పరిపూర్ణముకాలేదు. ఇదివఱకుఁగల యాంధ్రకవులను భావశిల్పమునుబట్టి విభజించితిమేని వారు ముత్తెఁగులకుదురు:—

(౧) భావుకుఁడు : అనఁగా ప్రపంచగతులన్నియుఁ దనమనోదర్పణమునఁ బ్రతిబింబింపఁ జేసికొని తన్మయతఁ జెందువాఁడు. తనకావ్యమునందలి పాత్రముల యాకారము తాను ధరించి మనల ధరింపఁజేయువాఁడనుట. ఈ గుంపునకుఁ జేరు కవులందఱు సామాన్యముగఁ గథాకథకులుగానుందురు. కవిత్రయము, పెద్దన మొదలగు కొందఱే తద్గుణప్రధానులు. అందును మొదటి యుదాహరణము తిక్కన.

(౨) బోధకుఁడు : తన మనోగతులన్నియుఁ బ్రపంచహృదయములఁ బ్రతిఫలింపఁజేయువాఁడు. ప్రపం

చము తన్ననుసరింపవలసినదే కాని తాను ప్రపంచగతుల నంతగా ననుసరించువాఁడు కాఁడనుట. మనుష్యజీవితమునుగాని ప్రకృతిసౌభాగ్యమునుగాని యితఁడు మన మందఱము చూచెడు కనులతోఁ జూడఁడు. ఇతని కవిత్వమునందొకవేళ కథ గ్రహింపఁబడినను అందలిపాత్రములు కవిప్రతిబింబములే కాని సాధారణ ప్రపంచమధ్యమున దర్శనీయములుగావు. ఇతనికథ భావమునకుఁ బోషకము; భావము కథాపోషకముగాదు. ఈ తెగలోఁ గొందఱు కవులు నీతి ప్రధానులు. నేనెఱిఁగినంతవఱ కాంధ్రవాఙ్మయమున నిందాఁక నీతెగవారే ప్రబలియుండిరి. వేమన, బద్దెన మొదలగువారిని లక్ష్యముగాఁ గైకొనవచ్చును. మఱిభావప్రధానులై భావగీతముల రచించు నాధునికకవులు రెండవతెగవారు: శ్రీరాయప్రోలు సుబ్బారావుగారు మొదలగువారు.

(3) కల్పకుఁడు: అనఁగా తనకుఁగాని ప్రపంచమునకుఁగాని యనుభవగోచరములుగాక, యట్టివి రచించువారికిని వినుటకలవాటుపడినవారికిని దప్పఁ దక్కినవారి కర్థముకాని భావములఁ గల్పించువాఁడు. అలంకారములయెడఁ దక్కినకవులకంటె నితనికే దృష్టియు నావశ్యకతయు నెక్కువ. రామరాజభూషణుఁడు మొదలగువారి యందీ గుణము ప్రబలినది. తత్పూర్వులగు సోమ శ్రీనాథాదులయందును లేకపోలేదు. వీరే ప్రబంధకవులు.

పైవిభాగము భావప్రధానము. శాబ్దికుని నాలవవానిగాఁ గైకొనవచ్చును. శబ్దమునే ముఖ్యముగాఁ గొనిచేయు ద్వ్యర్థ, గర్భ, చిత్ర బంధాదికవిత్వములన్నియు నీజాతికిఁ జేరినవి. ఆంధ్రకవులలో నందఱయందును గొంత పై నాలుగులక్షణములును గలిగియే యున్నవి. విశేషమేమనఁగా నొకరిద్దఱుదప్పఁ దక్కిన వారందఱును జాలవఱకు శాబ్దికులే

(ఉ) నేనీవ్యాసమునఁ బలుమాఱు రామరాజభూషణుని నుదాహరణముగాఁ గైకొంటిని. నేనే మనలాక్షణికునకు సమకాలికుఁడనై యుంటినేని అతని సిద్ధాంతములను నేనెంతతీవ్రముగా ఖండించియుండినను మన్నించియుండునుగాని యీయపరాధముమాత్ర మతని కతిదుస్సహముగా నుండియుండును. ఏలనఁగా,

"తే. ఉపమగలిగిన శయ్యలనొప్పియున్న
నంఘ్రిభవునికావ్యంబు గ్రాహ్యంబుగాదు;
పాయసంబైన సంస్కారపక్వమైనఁ
గాకస్పృష్టంబు హవ్యంబుగానియట్లు"

అని ప్రథమముననే విషగణము వేసి శాసించినాఁడు. వెండియు 'ధరణీసురుఁడు' 'కవియనఁబరఁగు' నని నియమించినాఁడు. కావుననే రేఫలకారములకు యతిచెల్లదను విషయమును దెలుపుచో విపరీతవ్యాఖ్యానముఁ జేయుచు నుదాహరించిన 'లోలంబాలకయోర్త్త వచ్చి' యనుపద్యపాదముదప్ప నతని గ్రంథములనుండి యొక పద్యమైన నుదహరింపఁడయ్యె, మఱియు నితనికా రామరాజభూషణుని 'కాపుకవిత్వపుమాటల' యందెంత రోఁతయోకాని, కవులనందఱను గ్రంథాదిని స్తుతించుచో,

"రామరాజవిభూషణ రత్నఖచిత
చారుమస్తకలాపాప హారి వాక్య
గౌరవముఁ బెక్కుభంగుల గణనచేసి"

యని యయ్యలరాజు రామభద్రుని బొగడుచు, నతనివలన మనభట్టునకు సంభవించినదని మనవారు చెప్పుకొను నవమతినెత్తిపొడిచినాఁడు. కాని మనలాక్షణికుఁడెయ్యది కవిత్వమని భావించెనో యట్టి కల్పనాప్రధానప్రపంచమున సామ్రాజ్యపీఠము నధివసించుట కన్నిటికైన ననురూపుఁడైనవాఁడు రామరాజభూషణుఁడేయనియు నిష్పక్షపాతముగాఁ బరీక్షించితిమేని అయ్యలరాజురాముని 'బాఁపనకవిత' యతనియెడ నేర్చుకొనవలసిన దెంతయో కలదనియు నానమ్మిక. ఐనను నాదుడుకుఁదనము మన్నింప నప్పకవి మతానుసారులను వేఁడుకొనుచు నింతటితోఁ జాలించెదను.

— రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ.

# తిక్కనసోమయాజి

౧

పూజాలిసాంద్రకర్పూరమ్ములందు
ప్రాఙ్నదీ పాథోలవమ్ములయందు
మడుగు సన్ననిపాట
పొడుచు వెన్నెల తేట
కలవు తిక్కనపల్కు తెలుగుపల్కులకు.

౨

లోలపుంస్కోకకుహూమాధురియు
నవపుష్యరాగ సుందర పటిష్ఠతయు
అలరు మల్లియపువ్వు
నందు పిన్నని నవ్వు
కలవు తిక్కనపల్కు తెలుగుపల్కులకు.

3

కృష్ణవేణీ తరంగిణినున్న ఝరియు
తుంగభద్రా సరిత్తున నాగుహేల
ధవళ గోవ్రాతము
నవ నవనీతము
కలవు తిక్కనపల్కు తెలుగుపల్కులకు.

౪

లజ్జామనోహర లావణ్యమూర్తి
తేజోరుణాక్షి సందీప్త పాంచాలి
కనుల క్రొమ్మెరుపులు
కనుబొమ విఱుపులు
కలవు తిక్కనపల్కు తెలుగుపల్కులకు.

—అబ్బూరి రామకృష్ణారావు.

# ప్రేమ తత్వము

ఎద మెత్తనాటకై
పొదగుందరా, అంత
పదిగల యహమెల్ల
వదలి పోవునురా॥ ౧

వలపెఱుంగక బ్రతికి
కులికి మురిసేకన్న
వలచి విఫలమ్మొంది
విలపింప మేలురా॥ ౨

చెలివలపులేని నీ
కలిమి కాల్పనె? వినుము
వలపు దీగనె జీవ
ఫలము కాయునురా॥ 3

ప్రేమకన్నను యెక్కు
వేముందిరా? యెల్ల
కావ్యపదవులకన్న
ప్రేమె యెక్కువరా॥ ౪

ప్రేమించు సుఖముకై
ప్రేమించు ముక్తికై
ప్రేమించు ప్రేమకై
యేమింక వలయురా॥ ౫

—బసవరాజు అప్పారావు, బి.యే.

# గ్రంథ విమర్శనము

## "సతి"- "సావిత్రి"- "విదుషీమణులు"

మచిలీపట్టణములోని సరస్వతీ నికేతనమువారిచే ప్రచురింపబడిన సతి, సావిత్రి, విదుషీమణులను పొత్తములు మాకార్యస్థాన మలంకరించినవి. సరస్వతీనికేతనమువారు మున్ను బాలుర కత్యంతోపయుక్తమగురీతి భక్తియోగమను వంగీయపుస్తకమును తెనిగించి జనామోదమును వడసియుండిరి. వీరి నూతనప్రయత్నములు బాలికాపాఠశాలల కుపకరింప నుద్దేశింపబడుట మిక్కిలి కొనియాడదగి యున్నది. అందు సతి, సావిత్రియను పొత్తములు ముద్దులమూటగట్టుగతి చక్కని కాకితముల మీద నింపగుకూర్పుతో మనోహరములగు రంగులపటములతో ముద్రింపబడి యున్నవి. వీని ముద్రణము ఆంధ్రగ్రంథప్రచురపద్ధతులందొక నూతనమార్గమును గల్పించినదనుట కెంతమాత్రము సందియము లేదు. బాలురకును బాలికలకును విద్యాసక్తి గలిగింపుటకుగాను, నవ్వు పూవులను చెంగల్వమొగ్గలను పొత్తములలోవిస్తరించుచు మేలగు కథలను, దివ్యసుందరమనోసంపత్తిగల కథానాయకులను చక్కని పాకమున చిత్రించి, మనోహరమగు రీతి ముద్రించి చదివింపవలయునని "రస్కిను" మహర్షి ఉపదేశించియున్నాడు. అట్టి గ్రంథము లాంధ్రపుస్తకమండలమున ఈనాటివఱకును లేనికొఱంత సరస్వతీనికేతనమువారి 'సతీ' 'సావిత్రు'లచే దీర్పబడినది. ఈ రెండుపుస్తకములును బాలికాబాలురకుమనోహరములగుటయేగాక, వీనికథాంశములు హిందూదేశ నాగరికసంస్కారమున సుందరీమణు లుండవలసిన పగిది నిర్ణయించుచున్నవి. సతి, సావిత్రి, సీత వీరి మువ్వురిచరిత్రముల తిలకించినచో హైందవనారీలక్షణము నామూలముగ దేటవడును. భారతవర్షమందలి నానాభాగములలో నీ ముివ్వురు పుణ్యమూర్తుల చరిత్రలే నారీజనాదర్శములై నీతిబోధకములై యలరారుచున్నవి. వీనియాధారమున నే, పాశ్చాత్య నవలలచే కలుషితములైన స్త్రీ పురుషాంతరంగములు పునీతములై, భవిష్యద్భారతవిభూతికిని జాతీయోద్ధరణకును మూలకారణములై ఫలింపగలవని నమ్ముచున్నాము. సతీ సావిత్రుల చరిత్రములు కడు సుందరమైనవి. వానిని సుందరమగురీతి యచ్చొత్తి, తెలుగుదేశమున కుపకారమొనర్చిన సరస్వతీనికేతనము వారు ప్రజాప్రోత్సాహమున కెంతయు నర్హులు.

విదుషీమణులను చిన్ని పుస్తకములో హిందూదేశమున వేదయుగమునుండియు ఆధునికకాలమువరకు వన్నెగనిన విద్వన్నారీమణుల చరిత్రములును, వారిచే గావింపబడిన కృతులప్రశంసయు చెప్పబడియున్నవి. ఈ పుస్తకమును చదివిన బాలికలకు సారస్వతవ్యాసంగములందభిరుచి కలుగకమానదు. ఈకాలమున ఆంధ్రదేశమునందు స్త్రీవిద్య సచ్చారిత్రప్రబోధకము కాకున్నది. భౌతికకళావిస్ఫూర్తియు కలిగింపకున్నది. ఇహమునకు పరమునకు వినియోగింపని వెట్టిదారుల నడచుచున్నది. ఇట్టి సందర్భములలో హిందూదేశమున సారస్వతోపాసన మొనర్చి, జాతీయవాఙ్మయమునకు మహోపకారమొనర్చిన నారీమణుల విద్వద్విభూతుల గుర్తెరుగుటకన్న మేలగు విషయమేమున్నది? ఈ విదుషీమణుల చరిత్రలు బాలికలందరిచే జదివింపవలయును. (పు. సూ.)

# ఆంధ్ర దేశము.

సీ. చంద్రప్రతాపరుద్రుం డనందగిన ప్రతాపరుద్రున కేది కాపురంబు
రుద్రదేవీసమ రుద్రమదేవీప్రపూతచరిత కేది పుట్టినిల్లు
సరిలేని మూరురాయర గండ బిరుదాంక, కృష్ణరాయల కేది గేహసీమ
భోజసమాన విభ్రాజితకీర్తి రాజనరేంద్రునకు నేది జన్మభూమి
మహితబుద్ధిశాలి మనుమసిద్ధినృపాలమౌళి కేది రహస్యకేళివనము
ఖడ్గతిక్కనాది ఘనుల కేది నివాస, మట్టి యాంధ్రదేశ మలరుఁగాత. —మంగిపూడి వేంకటశర్మ.

# కథ—కలాపము

౧౯౧౫ సంవత్సరమునకు ఆంధ్రదేశగ్రంథాలయముల చరిత్ర ప్రకటింపబడినది. ఈ పొత్తమున ఆంధ్రదేశమందలి గ్రంథాలయముల చరిత్ర తెలిసినంతవరకు చేర్చబడినది. చరిత్ర తెలియనట్టియు, పేర్లుమాత్రమె తెలిసినట్టియు గ్రంథాలయముల పట్టిక గూడ ఇందు చేర్చబడినది. దీని ప్రకటనయొక్క ప్రయోజనమును గూర్చి పలువురు సదభిప్రాయముల నిచ్చియున్నారు. అనిబీసాంటమ్మగారిచే ప్రచురితమగు "న్యూ ఇండియా" పత్రిక ఈ గ్రంథమును గూర్చి ఇట్లు వ్రాయుచున్నది:—"ఈ గ్రంథమువలన ఆంధ్రజనప్రబోధమును, ఆంధ్రుల స్వధర్మాచరణపరాయణత్వమును తేటపడుచున్నవి."

* * *

ఈ సంచికతో గ్రంథాలయ సర్వస్వమునకు ద్వితీయవత్సరము ప్రారంభమగుచున్నది. "న్యూ ఇండియా" పత్రిక "సర్వస్వము"ను గూర్చి ఇట్లు వ్రాసినది:—"ఆంధ్రసారస్వతము ఏయేమార్గముల ఔన్నత్యమును జెందుచున్నదియు ఇందలి విషయములవలన బోధపడుచున్నది. గద్యపద్యరూపకములగు వ్యాసములును, ఆధునికాంధ్రగ్రంథరాజములమీది విమర్శనలును, మహాపురుషుల జీవితములు మొదలగునవియు నిందుగలవు. ఆంధ్రదేశమందంతటను విద్యను వ్యాపింపజేయుటకును, జనసామాన్యమంతయు భక్తితోను అనురాగముతోను సేవింపదగు సర్వజనసమ్మతమగు జ్ఞానాభివృద్ధిచేయుటకును ఆంధ్రవాఙ్మయమును ఇతరఆంధ్రోద్యమములును ఎట్లు కృషిచేయుచున్నదియు తెలుపుటకు ఇందలి యంశములు నిదర్శనములుగా నున్నవి. ఈ యుద్యమము మిక్కిలి శ్లాఘనీయముగ నున్నది."

* * *

గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమందు వ్యాపించుచు సర్వజనాదరణమును పొందుటయేగాక మన యరవ సోదరుల మనంబులగూడ నాకర్షించి ఈ యుద్యమమును తమ జిల్లాలయందుగూడ వ్యాపింపజేయవలయునను ఉత్సాహమునువారలలోనాయకులకు కలుగజేసినది. ఈ సంగతి మనకు గౌరవావహము కాకమానదుగదా. కడచిన నెలలో "తంజావూరు"నందు జరగిన మండల సభలో ఆసభాధ్యక్షులును, మద్రాసు హైకోర్టునందు ప్రసిద్ధిజెందిన న్యాయవాదులలో నొకరును అగు సి. పి. రామస్వామి అయ్యరుగారు- అరవదేశమునందు గ్రంథాలయోద్యమమన నేమియో తెలియకుండుట కడు శోచనీయమనియును, ఈ విషయమున ఆంధ్రసోదరులనుండి తాము తప్పక నేర్చుకొనవలసియున్నదనియు సభికులను హెచ్చరించుచు, ఆ జిల్లాయందు ఈ యుద్యమమును వ్యాపింపజేయుటకై ఉపసంఘము నొకదానిని స్థాపనజేయించిరి. మఱియు చెన్నపట్నమున స్థాపింపబడిన స్వరాజ్యసమితియొక్క నిబంధనలనుగూర్చిచర్చించుచు, ఆంధ్రదేశమందలి గ్రంథాలయ సంఘములు కూడ స్వరాజ్యసమితియొక్క యుద్దేశములలో కొన్నిటిని ఆచరణలోనికి తెచ్చునవియై యున్నవి గనుక, ఆసంఘములను గూడ ఇందునుగూర్చి నేర్పర్చబోవు నిబంధనలకు లోబడి స్వరాజ్యసమితికి చేర్చవచ్చునని చెప్పిరి.

* * *

కృష్ణాజిల్లా అంగలూరు గ్రామమునందున్న శ్రీ బాల సరస్వతీ పుస్తకభాండాగారము, "గుడివాడ తాలూకా బోర్డు" వారికిని, "జిల్లాబోర్డు" వారికిని విరాళములకై దరఖాస్తుల నంపెను. తాలూకాబోర్డువారు సొమ్ము లేదనిరి. కాని జిల్లాబోర్డువారు నెల ౧కి పదిరూపాయిల విరాళము నిచ్చుటకు అంగీకరించిరి. మిగిలిన గ్రంథాలయములుగూడ ప్రయత్నములను జేయవలయును. బెజవాడ "మ్యునిసిపాలిటీ"వారు ఆపట్టణమునందున్న శ్రీ రామమోహన ధర్మపుస్తకభాండాగారమునకు సంవత్సరమునకు రు ౬౦ ల విరాళము నిచ్చుచుండిరి.

* * *

రాజమహేంద్రవరమునందున్న శ్రీ గున్నేశ్వరరావు సోదరులు, భారతయోధులను గ్రంథమును ప్రకటించు నుద్దేశముతో వందలకొలది రూప్యంబులను వెచ్చించి కొన్ని పటములను వ్రాయించి అచ్చుదిమ్మలను తయారు చేయించినారు. వారాగ్రంథమును ప్రకటింపక, పటములను ఉపయోగించుకొనకపోయినను, గ్రంథాలయ సర్వస్వ

షునందు ప్రకటించుటకై వానిని ఎరువిచ్చినందులకు ఎంతయు కృతజ్ఞులము. గతసంచికయందు ముద్రించిన భీష్ముని యంపశయ్య, చక్రధారణ, కృష్ణరాయభారములును, ఈసంచికయందు ముద్రించిన అర్జునునిగూర్చిన పటమును వారిచ్చినవియేయై యున్నవి.

* * *

ఆంధ్రదేశగ్రంథభాండాగారసంఘముయొక్క కార్యనిర్వాహకసభ ౧౯౧౬ సం. సెప్టెంబరు నెల 3వ తేదీ మధ్యాహ్నమున గోదావరిజిల్లా ఆరెంపూడి అన్నవరగ్రామమునందు ఆగ్రామమునగల శ్రీ సత్యదేవమనోల్లాసినీ సంఘముయొక్క వార్షికోత్సవసమయమున, జరిగినది. అప్పుడీ తీర్మానములు చేయబడినవి:—

(౧) నైజామురాష్ట్రమునందు గ్రంథాలయోద్యమము వ్యాపింపజేయుటకై ౧ మాడపాటి హనుమంతరావుగారు ౨ భాగి సుబ్రహ్మణ్యంగారు 3 ఆలూరి గురురాజారావుగారు ౪ మాదిరాజు రామకోటేశ్వరరావుగార్లను ఏర్పరచడమైనది.

(౨) ౧౯౧౬ సంవత్సరము ఆగస్టునెల ౨౪ వ తారీఖువరకును లెఖలనుచూచి అంగీకరించడమైనది.

(3) గ్రంథవిభజన పట్టికనుగూర్చి ఇంతవరకును జరగిన పనికిగాను శ్రీయుత వెలిదెండ శ్రీనివాసరావుగారికి కృతజ్ఞతను తెలుపుచున్నారు. మిగిలిన పనిని పూర్తిచేసి ఈ గ్రంథమును వెంటనే ప్రచురించుటకు పూనుకొన్న శ్రీ పురాణం సూరిశాస్త్రిలుగారికి ఇంతవరకును తయారయిన వ్రాతప్రతిని పంపుటకు తీర్మానించడమైనది.

(౪) సంచారకార్యదర్శి ఖర్చులకుగాను రాబోవు ఆంధ్రమహాజనసభలోపున రు ౧౫౦ ల విరాళమునిచ్చుచున్న ఆంధ్రమహాజన సభాస్థాపితోపసంఘము వారికి ఈ సభవారు కృతజ్ఞతావందనముల నర్పించుచున్నారు.

(౫) నెల ౧కి రు ౨౦ లు మొదలు రు ౨౫ ల లోపున జీతముమీద సంచారకార్యదర్శిని ఏర్పాటుచేయుటకును, ప్రయాణపు ఖర్చులు ప్రత్యేకముగ నిచ్చుటకును తీర్మానించడమైనది.

---

# విశ్వజనని

[ఓలేటి పార్వతీశ్వర కవిగారిచే రచియింపఁబడినది]

శుభ్రాం విచిత్రవసనాం నవచంద్రచూడా
మన్నప్రదాననిరతాం స్తనభారనమ్రాం
నృత్యంత మిందుశకలాభరణాం విలోక్య
హృష్టాం భజే భగవతీం భవదుఃఖహంత్రీం.

౧ పండువెన్నెల జగమెల్ల ♦ నిండఁజేయు
నమృతకరునిలయం ♦ బైన యాకసమునఁ
గనదమృతమూర్తితోడ నా ♦ కనులయెట్ట
౪ యెదుట సాక్షాత్కరించు నీ ♦ వెవరు తల్లి?
మధురమందస్మితానన ♦ మండలంబు
మధురమోహనరూపంబు ♦ మధురశాంత
భావసంపూర్ణ సత్కృపా ♦ పాంగదృష్టి
౮ యెలయ నన్నలరించు నీ ♦ వెవ్వరమ్మ?
తరుణశశిరేఖ నీమౌళి ♦ మెఱయుచుండె
నభయవరదాయకం బైన ♦ హస్తయుగ్మ
మాశ్రయముఁ జూపుచుండె నీ ♦ యాత్మజులకు
౧౨ నన్నపూర్ణవు గావె మా ♦ యమ్మనీవు?
ఆదిశక్తి! మాయమ్మ! లో ♦ కావనమున
కతిదయామతి నీవిచ్చు ♦ నట్టి కనక
కుసుమమధురామృతములఁ జే ♦ కొనెడివీర
౧౬ లిందిరాగిరిజావాణు ♦ లేగదమ్మ?
జనని! నీకరుణామృత ♦ స్వర్ణవృష్టిఁ
బండు బంగారుతీఁగల ♦ పంట యిదిగో!
అమ్మ! నీచనుబాల కీ ♦ డైనయట్టి
౨౦ కలకఁదేరినవాహినీ ♦ సలిల మిదిగో!
దేవి! నీశాంతమూర్తితో ♦ డీటువచ్చు
కామనీయక నిర్మలా ♦ కాశ మిదిగో!
మాత! నీయూర్పుదావికి ♦ మాద్రియైన
౨౪ చారుజాతీసుగంధస ♦ మీర మిదిగో!
తల్లి! నీసుస్మితంబుతోఁ ♦ దలఁపఁదగిన
సురుచిర శరత్సుధాకర ♦ జ్యోత్స్న యిదిగో!
విశ్వపరిరక్షణంబు నీ ♦ విధియె కాన

విశ్వభూతహితంబుగా ♦ విశ్వమూర్తి
వెలయుచున్న నీచాయయే ♦ విశ్వమందు
నంతటను గానఁబడుచున్న ♦ దమ్మ! మాకు.
అనఘమూర్తి! నీ దివ్యద ♦ యామృతమునఁ
జల్లనై పాడిపంట లీఁ ♦ జాలి, జగము
కడుపు చల్లఁగా జేయగా ♦ గలుగు వేళ—
శారదా వేళ-నీ వేళ- ♦ జనని నిన్ను-
దల్లివగు నిన్ను-లోక మం ♦ తయును గూడ
నొక్క-రీతిగఁ బూజించు ♦ చున్న దమ్మ!
నిండుజాబిల్లి పండువె ♦ న్నెలల పేరి
మడుఁగు లొగ్గుచు నుండె నీ ♦ యడుగులకును
జక్కఁగాఁ బండి వంగి రా ♦ జనపుఁజేలు
భక్తి నీముందు సాష్టాంగ ♦ పడుచునుండె
సారసగుహాంతరంబులఁ ♦ జంచరీక
సమితు లోంకారమంత్రముల్ ♦ చదువుచుండెఁ
బాలవరియెన్ను లెలమి స ♦ ర్పణముఁ జేసి
చిలుక లభినందనంబులఁ ♦ జేయుచుండె
విమలతటినీతటములఁ గా ♦ శములు పుష్ప
విసరములతోడఁ జామరల్ ♦ వీచుచుండె
నమ్మ! విశ్వాత్మ వైననీ ♦ కఖిలజనులుఁ
దేటనీరును, జిలుగుము ♦ త్తెంపుసరుల
బ్రాలపరమాన్నములుఁ గట్టి ♦ యాలపాలు,
బలుసుపండులుఁ, బంచదా ♦ రలును, జెఱకు
పాలు, వేయి రేకుల తమ్మి ♦ పూలు, జాజి
పూలగుత్తులు, గూర్చిన ♦ మాలికలును
సన్నుతులతోడ నర్పించు ♦ చున్న వారు
వింతలే నీకు నివి యెల్ల ♦ విశ్వమూర్తి!
తల్లి దయతోడి నీదివ్య ♦ దర్శనంబు
కలిగె నాకింక నేమి కా ♦ వలసియుండు
నమ్మ! కొండంత దేవిఁ గొం ♦ డంత పత్రి
నర్పణము చేసి పూజింప ♦ నలవి యగునె?
ప్రేమమయమూర్తి! నిన్ను నా ♦ ప్రేమరసత
రంగితం బగుహృదయాంత ♦ రమున నిలిపి
గగనతత్త్వాత్మ వగునీకుఁ ♦ గల్పసురభి
కుసుమహారపరంపరల్ ♦ గూర్చినట్లు
అనిలతత్త్వాత్మ వైననీ ♦ కతిమనోజ్ఞ
పరిమళాగరుధూపంబు ♦ పట్టినట్లు
వహ్నితత్త్వాత్మ వగునీకుఁ ♦ బచ్చకర్ప
ముంచి నీరాజనము నివా ♦ ళించినట్లు
అమృతతత్త్వాత్మ వైన నీ ♦ కమృతకలిత
దివ్యపరమాన్నములు నివే ♦ దించినట్లు
భూమితత్త్వాత్మ వగునీకుఁ ♦ బొగడఁదగిన
దివ్యచందనకలశ మం ♦ దించినట్లు
సకలతత్త్వాత్మ వగునీకు ♦ సకలసదుప
చారములఁ జేసి పూజలఁ ♦ జరిపినట్లు
భావనముఁ జేసి యానంద ♦ పడుదు నమ్మ!
అఖిలలోకావనంబుగా ♦ నమృతవృష్టి
సాధుదృష్టిఁ గటాక్షించు ♦ సమయమందు
ననుపమానంద కలితలా ♦ స్యంబువలన
నాననంబున శ్రమజలం ♦ బంకురింపఁ
జలువచెంగావి పయ్యెద ♦ జారువారఁ
జిత్రమణిచయహారముల్ ♦ చిక్కువడఁగఁ
జికురబంధంబు వెన్నునఁ ♦ జెదరియాడ
నమలమణికుండలంబు లు ♦ య్యాల లూఁగఁ
గంకణంబులు మొలనూలి ♦ గంట లువియఁ
దరలిపోవక చలియించు ♦ మెఱుపువోలె
నతిమనోహరమూర్తి వై ♦ నట్టినిన్ను
నెమ్మనంబున నిల్పి ధ్యా ♦ నింతు నమ్మ!
జడధు లుప్పొంగఁగాఁ జేయు ♦ శక్తి వీవు
మట్టిముద్దల మెఱయించు ♦ మహిత వీవు
తోలుబొమ్మల నాడించు ♦ బాల వీవు
జగముఁ బుట్టించి పొదలించు ♦ జనని వీవు
ప్రళయమున మాయఁజేయు దే ♦ వతవు నీవు
ప్రకృతిఁ బాలించుపట్టంపు ♦ రాణి వీవు
అమ్మ! నీమందమధురస్మి ♦ తాంకురంబె
యవని కానందసాంద్రచం ♦ ద్రాతపంబు
కాళి! నీయెఱ్ఱనగుకడ ♦ కంటిచూపె
యఖిలలోకంబులకుఁ బ్రళ ♦ యానలంబు
అబ్జజాండంబు మొదలుగా ♦ నణువుదనుక
నిలుచు నీదివ్యతమశక్తి ♦ నేగదమ్మ!
దేవి! నీశక్తి నేమరి ♦ దేవులాడు
వాఁడు నిక్కంబుగా వెఱ్ఱి ♦ వాఁడుసుమ్మ!

౧౦౦ అమ్మ! నీదివ్యకరుణాక • టాక్షకలన
శాశ్వతానందవృష్టి, వి•జ్ఞానవృష్టి
యనుపమోత్సాహరసవృష్టి • కనకవృష్టి •
వెలయఁజేయుచు నజ్ఞాన • జలధినుండి

౧౦౪ లీల మాయాంధ్రభూమిఁ దే•లింపుమమ్మ!
నెమ్మదిని నిల్పి నిన్ను ధ్యా•నించుమమ్మఁ
జిత్తశుద్ధిగ నిన్నుఁ బూ•జించు మమ్మఁ
ద్రికరణంబుల నిన్నుఁ బ్రా•ర్థించుమమ్మ
౧౦౫ నభయదానం బొసంగి కా•పాడుమమ్మ!

# శ్రీనాథుని గ్రంథముల కాలనిర్ణయము

## ("హరవిలాసము" ననుసరించి)

శ్రీనాథమహాకవిప్రణీత కావ్యములలో హరవిలాసమనునదియొకటి. ఈ మహాకావ్యముయొక్క యొకప్రతియుఁ దెనుఁగు దేశమునందులేకుండ లోపించియుండెను. సీతారామాచార్యుల కాలమున దీనిని ఆంధ్రలోక మెఱుఁగదు. అఱవదేశములో, తంజావూరు పుస్తకభాండాగారమునందు దానిని సంపాదించియాంధ్రులకొసంగిన యశస్సు శ్రీ వీరేశలింగము పంతులుగారిది. దానిని మొదటఁ బ్రకటించిన గౌరవము సరస్వతీపత్రికాధిపతులది.

హరవిలాసమనునది శివమాహాత్మ్యమును వర్ణించునట్టి యేడాశ్వాసముల పద్యకావ్యము. ఇది యవచితిప్పయసెట్టికి నంకితము చేయఁబడినది. కొండవీటిని ౧౩౭౦—౧౪౦౦ వఱకుఁ బాలించిన కుమారగిరియొద్ద నీసెట్టి సుగంధభాండాగారాధ్యక్షుఁడుగ నుండెను. కవివర్ణనలతిశయోక్తులుకావేని ఈతఁడు ద్వీపాంతరములతోను, దేశాంతరములతోను వర్తకముచేయుచుండిన కోట్యధీశుండుగఁ గాన వచ్చుచున్నాఁడు. కావునఁ జరిత్ర విషయమున ఈ కావ్యమధికాదరణీయము. కాని ప్రస్తుత మావిషయమును గుఱించి విచారింపఁదలఁపలేదు. ఈకావ్యమునందు శ్రీనాథుని కావ్యముల కాలనిర్ణయముచేయుటకు మంచి సాధనముకలదు. అందునుగుఱించి యిచ్చటఁగొంత చర్చించెదను.

కృతిపతియొక్క తమ్ముఁడైన తిరుమలశెట్టిని వర్ణించుచుఁగవి యిట్లు వ్రాసియున్నాఁడు:—

చ. హరిహరరాయ పేరోజిస
హా సురధాణగజాధిపాది భూ
వరులు నిజప్రభావ మభి
వర్ణనసేయఁ గుమారగిర్యధీ
శ్వరుని వసంత వైభవము
సర్వము నొక్కఁడనిర్వహించు మా
తిరుమలనాథసెట్టికిని
ధీగుణభట్టికి నెవ్వరీడగున్.

ఈపద్యమునందు ముగ్గురు సమకాలికులయిన రాజుల పేళ్ళు చెప్పఁబడియున్నవి. వీరిలో హరిహరరాయలు విజయనగరాధీశుఁడు. ౧౩౭౭ మొదలు ౧౪౦౪ వఱకు రాజ్యముచేసెను. 'ఫేరోజిసహా'బహమనీరాజు. ౧౩౯౭ మొదలు ౧౪౨౨ వఱకు రాజ్యముచేసెను. కుమారగిరి కొండవీటిరాజు. ఈతఁడు శ్రీ జయంతిరామయ్యగారి మతమున ౧౩౭౨ మొదలు ౧౩౯౨ వఱకు రాజ్యము చేసెను; * శ్రీచిలుకూరి వీరభద్రరావుగారి మతమున ౧౩౮౩ మొదలు ౧౪౦౦ వఱకు రాజ్యముచేసెను. † ఈ ముగ్గురు రాజులు బ్రతికియుండి స్వస్వరాజ్యములను పాలించుచుండిన కాలము శ్రీజయంతిరామయ్యగారి యభిప్రాయ ప్రకారము ౧౩౯౭—౧౩౯౨ రెండు సంవత్సరములు. శ్రీ వీరభద్రరావుగారి యభిప్రాయ ప్రకారము ౧౩౯౭-౧౪౦౦ నాలుగు సంవత్సరములు. ఇట్లు హరవిలాసనిర్మాణకాలము మనము ఒకరెండు సంవత్సరముల అంతరముతో సరిగఁ గనుఁగొనఁ గలిగితిమి. ౧౪౦౦ వ సంవత్సర ప్రాంతమున ననఁగా ౧౩౯౨ లోనో ౧౩౯౯ లోనో, కుమారగిరి ప్రభుత్వపుఁ జివరకాలమున, ఈ కావ్యము వ్రాయఁబడినదని స్పష్టపడుచున్నది. దీనినిబట్టి యితరకావ్యములయొక్క కాలనిర్ణయముచేయవచ్చును.

శ్రీనాథకృతమైన కాశీఖండమునందు ఈక్రింది పద్యముకలదు:—

* Epigraphia Indica Vol. VIII page 13.

† ఆంధ్రుల చరిత్రము; 3-వ భాగము, ౧౭౧-వ పుట.

సీ. చిన్నారిపొన్నారి చిఱుతకూకటినాఁడు
రచియించితిని మరుత్రాట్చరిత్ర
నూనూఁగుమీసాల నూత్నయౌవనమున
శాలివాహనసప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాషఁ
బ్రౌఢనిర్భరవయః పరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకుని మహిమ
తే. బ్రాయమింతకు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండ మనుమహాగ్రంథ మేను
దెనుఁగుచేసెదఁ గర్ణాటదేశకటక
పద్మవనహేళి శ్రీనాథభట్ట సుకవి.

ఈ పద్యమునందలి "చిన్నారిపొన్నారి చిఱుతకూకటి"కిఁ బదునాఱేండ్లనియు, "నూనూఁగు"నకు నిరువదియైదేండ్లనియు, "నిండు జవ్వనము"నకు ముప్పదియైదనియు, "వయఃపరిపాకము"నకు నలువదియేండ్లనియు, మనము సాధారణముగ నర్థము చేసికొనవచ్చును. హరవిలాసమునందు నైషధము పేర్కొనఁబడినది. కావున హరవిలాసమునకుఁ బూర్వమైదేండ్ల క్రిందట నైషధము రచింపఁబడినదనుకొందము. హరవిలాసమునకు మనము ౧౪౦౦ ల ప్రాంతము కాల మేర్పఱిచినందున, నైషధ కాలము ౧౩౯౫ అగును. అప్పటికి శ్రీనాథుఁడు ౩౫ సంవత్సరములవాఁడనుకొనిన ౧౩౬౦ వ సంవత్సరప్రాంతమాతని జన్మకాలమగును. ఇఁక మరుత్రాట్చరిత్ర ౧౩౭౬ లోను, శాలివాహన సప్తశతి ౧౩౮౫ లోను, నైషధమునందుఁ బేర్కొనఁబడిన పండితారాధ్య చరిత్రము ౧౩౮౫ లోను, భీమఖండము ౧౪౨౦ లోను, కాశీఖండము ౧౪౩౦ లోను, రచింపఁబడియుండవచ్చును. "శివరాత్రిమాహాత్మ్యము" అను శ్రీనాథరచితకావ్య మొకటి ఆంధ్రసాహిత్య పరిషత్తువారికి దొరికినది. అది భిక్షావృత్తియను జంగముల మఠమువారికి నంకితమొనర్పఁబడినది. దానినిగుఱించి మనకు నధికము తెలియువఱకును అది ౧౪౩౫—౮ ప్రాంతమున రచింపఁబడినట్లు మన మెంచుకొందము. ౧౪౧౦ లో సింగిపుర శాసనమును, ౧౪౧౩ లో ఆలపాడు తామ్ర శాసనములును, ౧౪౧౬ లో అమీనాబాదు శాసనమును-శ్రీనాథుఁడు కొండవీటిరెడ్లయొద్ద విద్యాధికారిగనుండి రచించినట్లు కనఁబడుచున్నది. * శ్రీనాథుఁడు ౧౪౪౦ ప్రాంతమునఁ గీర్తిశేషుఁడైనట్లు మన మూహింపవచ్చును. ఏలయన, "కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి" యను చాటువువలన నీతఁడు రాజమహేంద్రవరము రెడ్ల ప్రభుత్వము అంతరించువఱకునుండెననియు, తరువాతఁ గొద్దికాలములోనే మృతుఁడయ్యెననియు అనుకొనవచ్చును. అల్లాడ వేమారెడ్డి శాసనములు ౧౪౩౭-౩౮ తరువాతఁ గానవచ్చుటలేదు.[1] వీరభద్రారెడ్డి శాసనములు ౧౪౩౩—౩౪ తరువాతవిలేవు.[1] ౧౪౪౩-౪౪ వఱకు రాజమహేంద్రవరము విజయనగర రాజుల పాలయినట్టును, రెడ్లప్రభుత్వ మంతరించినట్టును మనము రెండవ దేవరాయల ద్రాక్షారామ మందలి శాసనమునుబట్టి నిశ్చయింపవచ్చును.[2] కావున శ్రీనాథుఁడు ౧౪౪౦ కంటెఁ దరువాతఁ బ్రతికయున్నట్టు నిదర్శనములేవియు లేవు. శ్రీనాథుఁడు మొత్తముమీఁద నెనుబది సంవత్సరములు బ్రతికియుండెనని తేలుచున్నది. ఇట్లు పైని శ్రీనాథుని గుఱించి మనము తేల్చుకున్న కాలములన్నియు నీ క్రింది విధముగ పట్టికారూపమున నీయవచ్చును.

క్రీ. శ. ౧౩౬౦ జన్మకాలము.
౧౩౭౬ మరుత్రాట్చరిత్ర రచనాకాలము
౧౩౮౫ శాలివాహనసప్తశతికాలము.
౧౩౯౫ ఆంధ్రనైషధకాలము.
౧౪౦౦ హరవిలాసకాలము.
౧౪౧౦ సింగిపురశాసనకాలము.
౧౪౧౩ ఆలపాడుతామ్రశాసనకాలము.
౧౪౧౬ అమీనాబాదు శాసనకాలము.
౧౪౨౦ భీమఖండకాలము.

* Epigraphica Indica Vol. XI. P. 315.

1 Annual Report on Epigraphy for 1900 P. 25, and Ibid for 1894 P. 19.

2 Annual Report for 1900 P. 25, paras 64 and 65.

౧౪౩౦ కాశీఖండకాలము.

౧౪౩౫ శివరాత్రి మాహాత్మ్యకాలము.

౧౪౪౦ మరణకాలము.

పల్నాటి వీరచరిత్రమును ఎప్పుడు వ్రాసినది తెలియదు. అయినను హరవిలాసము రచించిన కాలము (౧౪౦౦) మొదలుకొని భీమఖండమురచించినకాలము (౧౪౨౦) వఱకును వేఱుకావ్యములు రచించినట్టు కానరాదు. కావున ఆకాలమునందు నీగ్రంథమును శ్రీనాథుఁడు రచించియుండునని మనమూహింపవచ్చును.

పైని చెప్పినదంతయు హరవిలాసముయొక్క నిర్మాణకాలమును బట్టి చేయఁబడిన యూహ. కాని హరవిలాసము కుమారగిరిరెడ్డికాలమునందు రచింపఁబడలేదనియు, శ్రీనాథుని చరమదశయందు వ్రాయఁబడియెననియుఁ జెప్పు పూర్వపక్షమొకటికలదు. ఇదివఱకు శ్రీనాథునిగురించి వ్రాసిన వారందఱును ఇట్లే వ్రాసినారు. * కాని యిందుకు వారు కారణములను ఇచ్చియుండలేదు. మనమాకారణములను ఊహించి నివారింపవచ్చును. హరవిలాసము చివరగ్రంథముగ నెంచుటకును, ౧౪౦౦ లో రచింపఁబడినది కాదనుటకును హరవిలాసగ్రంథమునందు నేవిధమైన యాధారమును కానఁబడదు. అది కుమారగిరియొక్క పెద్దసెట్టికి సంకితము చేయఁబడినది. కావున నది కుమారగిరికాలమునందే రచింపఁబడెననుకొనుట స్వాభావికము. కుమారగిరి చనిపోయిన తరువాత ౩౦ సంవత్సరములకో ౪౦ సంవత్సరములకో వ్రాయఁబడినదనుకొనుట యస్వాభావికము. ఇదియుఁగాక యీ గ్రంథమునందు, కృతిపతిని అతనిబంధువులను గుఱించి వ్రాసిన యీక్రింది గద్యపద్యములవలన కుమారగిరిసేవలో వీరుండగ నీగ్రంథము వ్రాసినట్లు మనమూహింపవలయును; గాని, కుమారగిరి చచ్చిపోయిన తరువాత నలుబది యేండ్లకు వెనుకటి సంగతులు జ్ఞాపకము తెచ్చుకొని వ్రాసెననుట పొసఁగనేరదు

"...కర్పూరవసంతరాయుండును......మాణిక్యసింహాసనాధీశ్వరుండును.........వశీకృతనిఖిలభూభుజుండును......నయోధ్యానగరస్వామియోయనఁబరఁగి జంబూద్వీప భూభువనమండలీమకుట మండనాయమానంబగు కొండవీటిపురంబు రాజధానిగాఁ గీర్తిలతాదిష్ఠతాష్టాదశద్వీపాంతరాళుండునగు కొమరగిరి నృపాలువలన నాందోళికాచ్ఛత్రచామర తురంగాది రాజ్యచిహ్నములు వడసి యమ్మహారాజునకుం బ్రతి సంవత్సరోత్సవంబునకుం దగిన............సుగంధద్రవ్యంబు లొడఁగూర్చియుఁ జీని సింకోళతవాయిహురుమంజిజలనోగి ప్రభృతి నానా ద్వీపనగరాకరంబులగు ధన......గాణిక్యంబులు తెప్పించియు......సదాచారుండును నవవిఖ్యాతిగాంచిన యవచిదేవయ తిప్పప్రభుండొక్కనాఁడాస్థానమండపంబున సుఖోపవిష్టుండై" (౧-౭)

"మ. ఖుసిమారన్ సురధాణినిండుకొలువై
కూర్చున్నచో నీకరా
భ్యసనంబు న్నుతియించురాయవచితిప్పా
(౧. ౨౨.)

"........కుమారగిర్యధీ
శ్వరుని వసంతవైభవము
సర్వమునొక్కఁడ నిర్వహించుచున్.
(౧. ౨౩.)

"కొమరగిరిరాజ దేవేంద్ర కూర్మిహితుఁడు" (౧. ౨౫)

క. కొమరగిరి వసంతనృపా
గమకవివరగంధసార కస్తూరీకుం
కుమ కర్పూరహిమాంభ
స్సముదంచితబహుసుగంధిశాలాధ్యక్షా. (౧. ౩౦)

ఇట్లు, హరవిలాసము వ్రాయునప్పుడు కుమారగిరి బ్రతికియుండెననియు, కొండవీటిలో రాజ్యము చేయుచుండెననియు, ఆతనియొద్ద పెద్దసెట్టిగా అవచి తిప్పయ యుండెననియుఁ జూపువాక్యము లీగ్రంథమునందు, బె


* హరవిలాసమును మొదట ప్రకటించినవారు (శ్రీపోలవరము జమీందారుగారు) "హరవిలాసము ౧౪౪౦ ప్రాంతములను రచించినట్లు స్పష్టమగుచున్నది" యని వ్రాసిరి. 'శ్రీనాథుని చారిత్ర'మనుబహుమతి వ్యాసము వ్రాసిన శ్రీ కూనపులి లక్ష్మీనరసయ్య గారు తమగ్రంథమునందు "(హరవిలాసము) ఈతని యంతిమ గ్రంథమని నేనూహించెదను" (౩౭-వ పుట) యని యభిప్రాయపడిరి. శ్రీ వెంకటరాయశాస్త్రిగారు దీనిని శ్రీనాథుని చివరగ్రంథమని యభిప్రాయపడిరి. (సర్వంకష టీక, పుట ౧౦) 'పెదకోమటి భూపాలుడు మరణము నొందిన తరువాత తాను రాజమహేంద్రపురముఁ జేరకమునుపు హరవిలాసమును రచించి ...... తిప్పయసెట్టి కంకితము గావించెను' (ఆంధ్రులచరిత్రము, ౩-వ భాగము, ౨౨౪ పుట) అని శ్రీ వీరభద్రరావుగారి యభిప్రాయము.

క్యాలు గలవు. ఇట్టివాక్యములున్నను, కుమారగిరి చని పోయినతరువాత తిప్పన అధికారము మూడిపోయినపిదప, హరిహర పేరోజు శాహోలు కీర్తిశేషులైన యెన్నిసంవత్సరములకుఁ దరువాత నీకావ్యము రచింపఁబడియెనని చెప్పుటకంటె విపరీతమైన సిద్ధాంతము మతియొకటి యుండదు. ఇది కుమారగిరిరెడ్డికాలమున రచింపఁబడలేదని చెప్పునెడల-నైషధము పెదకోమటి వేమారెడ్డికాలమున వ్రాయలేదనియు, భీమఖండము అల్లాడవేమ వీరభద్రులు బ్రతికియుండఁగఁ జెప్పఁబడలేదనియు, నొప్పుకొనవలసివచ్చి విపరీత సిద్ధాంతప్రసంగము ప్రాప్తించును.

ఈప్రకార మంతఃప్రమాణములవలన నిది ౧౪౦౦ వ సంవత్సరప్రాంతమునచే వ్రాయఁబడియెనని మాపి, యిఁక దీనికిఁ బ్రతికూలములైన బహిఃప్రమాణముల విచారించెదము.

హరవిలాసము ౧౪౦౦లోనిది యని చెప్పుటకు నడ్డముగ రెండు పూర్వపక్షములు రావచ్చును. ఒకటి హరవిలాసమునందు నాంధ్రనైషధమును పేర్కొనుట. రెండవది కృతిపతియైన తిప్పయ్యయొక్క వయస్సునకు సంబంధించినది. ఈరెంటిని క్రమముగా విచారింతము.

ఆంధ్రనైషధము పెదకోమటి వేమారెడ్డియొక్క మంత్రియైన మామిడి సింగన్నకు నంకితము చేయఁబడినది. * పెదకోమటి వేమారెడ్డి కొండవీటిరాజ్యమును కుమారగిరిరెడ్డితరువాత, ౧౪౦౦ మొదలు ౧౪౧౫ వఱకు శ్రీ వీరభద్రరావుగారి మతప్రకారమును, ౧౩౯౮ మొదలు ౧౪౧౫ వఱకు శ్రీరామయ్యగారి మతమునను, ఏలెను. కావున కుమారగిరికాలములో వ్రాయఁబడిన హరవిలాసమునందు నాంధ్రనైషధమును పేర్కొనుట యెట్లుసంభవించును? అందుచే హరవిలాసము తరువాత వ్రాయఁబడినదియని పూర్వపక్షము. మొదటచూచుటకు నీపూర్వపక్షము కొంత బలవత్తరమైనదిగాఁ గానవచ్చును. కాని కొంచెము ఆలోచించినయెడల నీపూర్వపక్షమునకుఁ బ్రత్యుత్తర మున్నదని తోఁచును. పెదకోమటి వేమారెడ్డి ౧౪౦౦లో కొండవీటిరాజ్యమునకు వచ్చినను అంతకుఁబూర్వ మేమియులేని యష్టదరిద్రుఁడుకాఁడు. కొండవీటి వంశములోనివాఁడు. పెద్దకుటుంబమువాఁడు. ఈక్రింది వంశవృక్షమువలన ఇతనికిని ఇతనిపూర్వపు కొండవీటి రెడ్డిరాజులకునుగల సంబంధము తెలియఁగలదు.




* నైషధమును అంకితమందిన మామిడి సింగన్న అనవేమారెడ్డికి మంత్రియని శ్రీజయంతి రామయ్యగారును (Epigraphica Indica Vol. XI P. 315, foot note), రాజమహేంద్రవరమునేలిన వేమారెడ్డికి మంత్రియని శ్రీవేదము వెంకటరాయశాస్త్రిగారును (శృంగారనైషధము, అవతారిక, పుట ౧౧), కుమారగిరిరెడ్డికి మంత్రియని శేతవరము వెంకటశాస్త్రిగారును (ఆనందముద్రాక్షరశాల శృంగారనైషధము పీఠిక ౧౫) వ్రాసియున్నారు. కాని శృంగారనైషధమునకుఁ జివర చివర 'శాక్యోపసంహారము'గాఁ గవిచే వ్రాయఁబడిన గద్యయందు 'పెదకోమటివేమ భూపాల కరుణాపాత్ర' యని వ్రాయఁబడియుండుటచే, కృతిపతి పెదకోమటియొక్క కుమారుఁడైన వేమారెడ్డికి మంత్రిగనుండెననుట స్పష్టము.

ఈవంశవృక్షము, శాసనములను వేమభూపాలీయమ్ అను కావ్యమును అనుసరించి వేయఁబడినది. ఇందు ప్రభుత్వము చేసినవారికి ౧,౨ అంకెలు వేయఁబడి క్రిందఁ గీటుగీయఁబడినది. అందు నైదవవాఁడు పెదకోమటివేమ. ఈతని పేరు వేమ; తండ్రిపేరు పెదకోమటి; కావున ఈతనిని పెదకోమటివేమయందురు. ఈతఁడు 'మాచ'ని వంశములోనివాఁడు. మాచనితమ్ముఁడైన '౧ వేమ' (ఈతనినే ప్రోలయవేమ యందురు) మిక్కిలి శూరుఁడగుటచే కొండవీటిరాజ్య మాతనికే పోయెను. ఇట్లు కొండవీటిరాజ్యము రెండవ వంశమునకుఁ బోయినను 'మాచ' అతనిరెండవ కొమారుఁడైన 'పెదకోమటి' అనామధేయులుగ నుండలేదనియు, రాజ్యము చేయుచున్నవారికిఁ దోడుగనుండిరనియు, మనమూహింపవచ్చును. * వేమభూపాలీయమునందు వీరిని గొప్పరాజులుగఁ గవి వర్ణించినాఁడు. ఆయతిశయోక్తిని వదలినను, కొన్ని గ్రామములు, బూతాది నిమిత్తమైనను, వీరిక్రింద నుండెనని యెంచుట ప్రమాదముకా నేరదు. కావున పెదకోమటి కుమారుఁడైన వేమారెడ్డి, కుమారగిరి మరణానంతరము రాజ్యమునకు వచ్చుటకుఁ బూర్వము ఒకచిన్న జమీందారుగను రాజవంశమునందు గౌరవముగలవాఁడుగను ఉండెననుటకు సందేహములేదు. శ్రీనాథుఁ డాకాలమున నాతనిమంత్రియైన మామిడిసింగన్నకు నాంధ్రనైషధమును అంకితమిచ్చి వేమరాజునకు మంత్రియని వర్ణించుటయందు విరుద్ధమేమియులేదు. అనఁగా కుమారగిరి కొండవీటిలోఁ బ్రభుత్వము చేయుచున్నప్పుడు ఆతని పెత్తాతమనుమఁడగు పెదకోమటి వేమారెడ్డికూడ కొండవీటికి రాజుగాకపోయినను ఒక చిన్నజమీందారుగ నుండెను. నాలుగూళ్ళుగలవారినిగూడ పెద్దరాజులుగను, వారియొద్దనున్న గుమాస్తాలను మంత్రులుగను వర్ణించుట మనకవుల సంప్రదాయమని యాంధ్రకావ్యపాఠకులకు నేను వేఱుగఁ జెప్పనక్కఱలేదు. ఈపెదకోమటిని నాయకునిఁజేసి వామనభట్టబాణుఁడను కవి సంస్కృతగద్యమునందు 'వేమభూపాలీయ' మను కావ్యమొకటి వ్రాసినాఁడు. దానిలో ఈతనిని, ఈతనితండ్రి తాతలను మహాచ్చక్రవర్తులుగఁ జెప్పినాఁడు!

పెదకోమటి వేమారెడ్డి అనవేమునికాలమున (చివరకాలముననై యుండును.) ప్రభువుగ నుండెననియు, నాతనికి మంత్రులుండిరనియుఁ జూపుటకు నాంధ్రనైషధములోనే యొకయాధారమున్నది. కృతిభర్తయైన సింగన్నయొక్క తండ్రియైన పెద్దన్న అనవేమభూపాలునియొద్ద మంత్రిగ నున్నట్లును, (౧-౨౭) పినతండ్రియైన నామన్న వేమరాజునొద్ద మంత్రిగ నున్నట్లును (౧-30) చెప్పఁబడియున్నది. పినతండ్రినిగుఱించిన పద్యము ఈక్రింద నీయఁబడుచున్నది.

శా. స్వామిద్రోహరగండలాంఛనునకున్
సంగ్రామ గాండీవికిన్
వేమక్ష్మాపతి కార్యభారకలనా
విఖ్యాత ధీశక్తికిన్
నామామాత్యున కన్యరాజనిటలా
వర్ణ ప్రశస్తభాగ్యాక్షర
స్తోమాపాకరణప్రవీణునకు మం
త్రుల్ సాటియే యెవ్వరున్.

ఇందుఁ జెప్పఁబడిన వేమక్ష్మాపతి పెదకోమటికుమారుఁడైన వేమారెడ్డియే. ఏలయన (౧) ఆకాలమున కొండవీటికిసంబంధించినవాఁడు వేఱు వేమారెడ్డి లేడు; (౨) ఈ పద్య మెచ్చటిప్రకరణమునుండి తీసికొనఁబడియెనో ఆప్రకరణమునందు ననఁగా నాంధ్రశృంగార నైషధపీఠికయందు నంతటను వేమశబ్దము పెదకోమటివేమ పరముగనే వాడఁబడియున్నది. ఒకానొకరు 'వేమ' అనగా 'అనవేమ' అని యర్థము చేసినారు. కాని దానిని ఒప్పుకొనుటకు వీలులేదు. శాసనములందును, గ్రంథములందును అన వేముని అనవేముఁడే యందురుగాని, వేముఁడని యెచ్చటను వ్రాసియుండలేదు. 'వేమ' యనగా 'ప్రోలయవేమ' యైనను కావలెను; 'కోటయవేమ' యైనను కావలెను; 'పెదకోమటివేమ' యైనను కావలెను; లేదా 'అల్లాడవేమ' యైనను కావలెను. సందర్భానువశమున నితరవేము లక్కడ నన్వయింపరు; గనుక వేమయనఁగా

* ఎఱ్ఱాప్రగ్గడ హరివంశమందలి కృత్యాదిపద్యములును, వేమభూపాలీయమందలి, మాచ, పెదకోమటులకు సంబంధించిన వర్ణనలును చూడనగును.

నైషధభర్తయైన సింగన్నకు రాజైన పెదకోమటివేము యన్నియె గ్రహింపవలెను. ఈరీతిగా నీ వేమారెడ్డి అనవేమారెడ్డి చివరకాలమునను, కుమారగిరిరెడ్డి కాలమునను ఒక చిన్న ప్రభువుగ వారికి సామంతునిగనో వారి రాజ బంధువుగనో యుండెను. ఆకాలమున నైషధమాతని మంత్రికి నంకితమీయఁబడెను. తరువాత కుమారగిరి చనిపోగా రెండవకుటుంబములోఁ బురుషులెవరును లేనందున పెదకోమటి వేమారెడ్డి కొండవీటిరాజ్యమునకు వచ్చెను అప్పుడు శ్రీనాథుఁడు విద్యాధికారిగనుండెను. [illegible]రంగపుర శాసనాదుల వ్రాసెను. ఇట్లు మొదట నైషధము వ్రాయఁబడినది; తరువాత హరవిలాసము రచింపఁబడినది. కావున మొదటి పూర్వపక్షమునకు సమాధానము వచ్చినది.

హరవిలాసము ౧౪౦౦ వ సంవత్సర ప్రాంతమున వ్రాయఁబడియెననుటకు నింకొక పూర్వపక్షము రావచ్చును. హరవిలాసమునందుఁ గవి కృతిభర్తకు బాలసఖుఁడని చెప్పఁబడియున్నది (౧. ౮). కృతిభర్త యీ క్రింది పద్యము (౧. ౯) చెప్పుటవలన వృద్ధని తోఁచుచున్నది:—

క. కంటిని విశుద్ధ సంతతి
వింటి పురాణములు పెక్కు- విశ్వమువొగడన్
మంటి బహువత్సరంబులఁ
గొంటి యశోధనము సుకవికోటి నుతింపన్.

కృతినందిన అవచితిప్పయ వృద్ధయిన, నాతని బాలసఖుఁడుగూడ వృద్ధే కావలయునుగదా. మా లెక్కప్రకారము హరవిలాసము రచనాకాలము (౧౪౦౦) వఱకు శ్రీనాథుఁడు నలుబదియేండ్లవాఁడుగనున్నాఁడు. కావున ఈ పూర్వపక్షమంత బలవంతమైనదికాదు. 'మంటి బహువత్సరంబులు' అని నేఁబదియేండ్లు సమీపించినవాఁడనవచ్చును. 'బాలసఖుఁడు' అనఁగనే తూచినట్లిద్దరికిని ఒక్కటేవయస్సుండనక్కరలేదు. ఇద్దఱికి నేడెనిమిది సంవత్సరములు భేదముండవచ్చును. శ్రీనాథుఁడు చిన్ననాఁడే పెద్దబుద్ధులుగల యప్రతిమప్రతిభాశాలి గనుక నాతనికంటెఁ బెద్దవారుకూడ నాతనితోఁ జెలిమిచేసి యుండుట యాశ్చర్యముకాదు. ఈ విధముగ రెండు పూర్వపక్షములును ఖండితములగుటచే హరవిలాసము ౧౪౦౦ ల ప్రాంతమున వ్రాయఁబడియెనన్న మనమూల సిద్ధాంతము నిశ్చలముగ నిలిచినది.

### ఉపసంహారము.

శ్రీనాథమహాకవియొక్క గ్రంథముల కాలనిర్ణయముచేయుటకు నిదియొక ప్రయత్నము. ఇంతియకాని రాయిగ్రుద్దినట్లును, వ్రాసుతగాచినట్లును ఈసంవత్సరమునసే యీ గ్రంథము తప్పక నిర్మింపఁబడినదని చెప్పుటకు నీ వ్యాసము వ్రాయఁబడలేదు. శ్రీనాథుఁ డాంధ్రవాఙ్మయంబున మిక్కిలి ప్రసిద్ధిచెందినవాఁడు. ఆతని కాలనిర్ణయమును, ఆతని గ్రంథముల కాలనిర్ణయమును వీలయినంతవఱకు సాధారణముగఁ జేయఁ బ్రయత్నించుట మన కర్తవ్యము; గనుక నేనొక విధముగ దారి చూపితిని. క్రొత్తశాసనములుగాని క్రొత్తగ్రంథములుకాని బయలుదేరి లెక్కయంతయుఁ దప్పినఁ జెప్పలేను; కాని, ఉన్న సాధనములే యాధారములుగ నిల్చె నేని పది సంవత్సరములు హెచ్చుతగ్గుగ నేను వేసిన లెక్క నిల్చునని నా తాత్పర్యము.

—కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు.

# దస్యులనగా నెవరు?

అతి ప్రాచీనకాలమునందు ఈ హిందూదేశమున "దస్యు" లను మోటుజాతి ప్రజలు నివసించుచుండిరనియు, పిదప కొంతకాలమునకు నాగరికులును విద్యావంతులును అగు "ఆర్యు" లను తెగవారు మధ్యాసియా ప్రాంతమునుండి క్రమక్రమముగ హిందూదేశమునకు వచ్చి అప్పుడిచ్చట నివసించు దస్యులనువారిని తమ భుజబలముచేత పారదోలి వారి ప్రదేశముల నాక్రమించి ఇచ్చటనే స్థిరనివాసముల నేర్పఱుచుకొనిరనియు, చరి

త్రకారులు కొందఱభిప్రాయపడియున్నారు. నేనిప్పుడీవ్యాసమునందు "దస్యులనగా నెవరు?" అనువిషయమును విమర్శింపదలంచినాఁడను.

ప్రపంచమునందున్న గ్రంథరాసిలో ఋగ్వేదము అతిప్రాచీనగ్రంథమనియు, ప్రథమగ్రంథమనియు, చరిత్రకారులు భాషాశాస్త్రతత్వజ్ఞులు అందఱంగీకరించియున్నారు. అట్టిఋగ్వేదమునందు ఆర్యశబ్దము దస్యుశబ్దము పలుతావుల ప్రయోగింపఁబడియున్నది.

అచ్చటచ్చట దస్యుశబ్దమును విశేషణముగ గ్రహించి వృత్రాదివాచిగను, అసురవాచిగను ప్రయోగించినను దస్యుశబ్దముయొక్క వివరము అచ్చటచ్చట కొన్నిమంత్రములందు గలదు. ఆర్యులనఁగా యజ్ఞయాగాదిసత్కర్మల నాచరించువారనియు, దస్యులనఁగా అట్టిసత్కర్మల నాచరింపక దురాచార నీతులయి యుండువారలనియు గనఁబడుచున్నది.

౧. మం. అకర్మా దస్యు రభినో అమన్తురన్యవ్రతో౽మానుషః। త్వం తస్యామిత్రహన్ వధర్దాసస్య దంభయ॥ ఋ. సం. ౧౦. ౨౨. ౮.

ఈమంత్రమువలన దస్యులనువారలు అకర్మలనియు, అన్యవ్రతులనియు తెలియవచ్చుచున్నది. అన్యవ్రతులనఁగా శ్రుతిస్మృతివ్యతిరిక్తకర్మల నాచరించువారని సాయనాచార్యభాష్యము.

౨. మం. విజానీహ్యార్యా న్యేచదస్యవో బర్హిష్మతే రంధయాశాసదవ్రతాన్। శాకీభవ యజమానస్యచోదితా విశ్వేత్తాతే సధమాదేషుచాకన॥

ఋ. సం. మం. ౧. ౫౧. ౮.

ఈమంత్రమునందు ఆర్యులనఁగా యజ్ఞాదికము ననుష్ఠించువారలనియు, దస్యులనఁగా కర్మవిరోధులనియు, లేక కర్మవిహీనులనియును చెప్పబడియున్నది.

ఆర్యశబ్దము ఈశ్వరవాచిగ వేదనిఘంటువు నందు గలదు. ఆయర్యశబ్దముపైన అపత్యప్రత్యయమురాగా ఆర్యశబ్దము సిద్ధించుచున్నది. మొత్తముమీద సదాచారాదికముచేతను అభిజనముచేతను శ్రేష్ఠులగువారిని ఆర్యులనుగా గ్రహించినటుల అందఱంగీకరించియే యున్నారు. కావున ఇచట ప్రమాణవచనముల నుదహరింప దలఁచలేదు. ప్రకృతమునందు దస్యుశబ్దమునకు సంబంధించిన విషయమునుమాత్రమే ఇచట చర్చించెదను.

వేదషడంగములలో ముఖ్యమయినదియు, వేదార్థవిషయమునందు అత్యావశ్యకమును అగునిరుక్తమను గ్రంథమును యాస్కాచార్యుఁడు రచించెను. ఆయాస్కాచార్యుఁడు దస్యుశబ్దమునకు అర్థము నీవిధముగ నిరూపించినాఁడు:—

దస్యుర్దస్యతేః క్షయార్థాదుపదస్యంత్యస్మిన్ రసా ఉపదాసయతికర్మాణి. నిరుక్తము. ౭-౨౩.

౧ రసములను (అనగా జలములను) నశింపజేయువారనియు ౨ కర్మల నాశనము చేయువారలనియు అర్థమగుచున్నది.

వేదచతుష్టయభాష్యకారుఁడగు శ్రీమత్సాయణాచార్యవర్యుఁడు తా నొనర్చిన ఋగ్వేదభాష్యమునందు అచ్చటచ్చట దస్యులనఁగా

౧. కర్మభ్రష్టులనియును *

౨. కర్మలనాశనముచేయువారలనియు ¶

౩. కర్మానుష్ఠాతలకు శత్రువులనియు ౭

వ్యాఖ్యానము నొనర్చియున్నారు.

ఈరీతిగ పలుతావులగలవు. గ్రంథవిస్తరభీతిచేత వదలుచున్నాఁడను. ఈ విషయమును పాశ్చాత్యవిద్వాంసులలో కొందఱుగూడ అంగీకరించియేయున్నారు. ౮

సంగతి సందర్భము లిట్లుండఁగా మనపూర్వులగు ఆర్యులు నిష్కారణముగ ఒకమోటుజాతివారిని వారి

* కర్మహీనాః శత్రవః ఋ. సం. ౬. ౬౦. ౬.

¶ ఉపక్షపయిత్రీః కర్మవిరోధినః బలవద్వృత్రసురాః. ఋ. సం. ౬. ౩౩. ౬.

౭ అనుష్ఠాతౄణాం ముపక్షపయితారః శత్రవః. ఋ. ౧. ౧౦౩. ౩.

౮ "It is true that, by the later authorities whom I have quoted, the Dasyus are regarded as degraded Aryans".

(Moir's Sanskrit Texts. Vol. II P. 365 Second Edition)

స్వగృహములనుండి పాఱఁదోలి వారియింటియందు ప్రవేశించిరని చెప్పెడి అపనింద నిరాధారము; కావున దానిని మనవారలు విశ్వసింపవలదని విన్నవించుచున్నాఁడను. నిజముగా నిట్టి క్రొత్తసిద్ధాంతములను చేసినవారలు తాము మొన్న మొన్న పుట్టినవారైనను, వేదములంత ప్రాచీనములు కాకపోయినను మనకంటె వేలకొలఁది సంవత్సరములక్రిందట పుట్టిన మనుస్మృతి మున్నగు గ్రంథములను అధునికములని త్రోసివేయుచుండుటచేత నేను ప్రప్రథమమున వేదమునుండి ప్రమాణమునుచూపించియుంటిని. ప్రమాణపరతంత్రులకు మనుస్మృతిమున్నగు గ్రంథములు మాన్యములేకావున నేను అట్టి గ్రంథముల నుండి ప్రమాణముల నిచ్చుచున్నాఁడను.

మనుస్మృతియందు "దస్యు"లను గూర్చిన వర్ణనమిీ విధముగనున్నది:—

శ్లో. ముఖబాహూరుపజ్జానాం యాలోకే జాతయో బహిః। మ్లేచ్ఛవాచశ్చార్యవాచ స్సర్వేతే దస్యవస్స్మృతాః॥ మను. ౧౦. ౪౫.

వ్యా. బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రాణాం క్రియాలోపాదినా యాజాతయః బాహ్యజాతా మ్లేచ్ఛభాషాయుక్తా, ఆర్యభాషోపేతావా తేదస్యవస్సర్వే స్మృతాః॥

అనఁగా బ్రాహ్మణ క్షత్రియవైశ్యశూద్రజాతులవారిలో ఆయావర్ణములవారాచరించవలసిన క్రియలు మున్నగువానిని వదలి స్వేచ్ఛగా చరించువారలు దస్యులని పిలువఁబడుచున్నారని యర్థము. క్రియాహీనులయి ఆర్యుల సామీప్యమునందుండుటచేత ఆర్యులు వ్యవహరించెడిభాషను సంభాషించుచున్నను, సన్నిహితసంబంధములేక దేశాంతరమునకు చేరి మ్లేచ్ఛభాషను సంభాషించుచున్నను వారలు దస్యులనియే పై శ్లోకతాత్పర్యము.

యవనులు, శకులు మున్నగువారలు ఖండాంతరముల నుండి ఇచటికివచ్చినవారలు కారనియు, వారందఱు ప్రప్రథమమున హిందూదేశమునందలి క్షత్రియజాతికి చేరినవారలనియు క్రమక్రమముగ సంస్కారవిహీనులయి శూద్రతుల్యులయినారనియు మనుస్మృతికారుఁడు చెప్పుచున్నాఁడు. *

ఐతరేయ బ్రాహ్మణము సప్తమపంచికయందు శునశ్శేఫుని కథగలదు. ఆకథయందు, విశ్వామిత్రమహర్షికి ౧౦౧ పుత్రులు గలరనియు, అందులో జ్యేష్ఠులగు ౫౦ మంది పుత్రులు తన యాజ్ఞను తిరస్కరించుటచేత కుపితుఁడై వారిని శపించెననియు, వారలె పుండ్ర-శబర-పులింద-మూతిబ-మున్నగు దస్యుజాతివిశేషము గలవారలైరనియు చెప్పఁబడినది. †

శ్రీమద్రామాయణమును పరిశీలించిచూచినను శక, యవనాది జాతులనువారు ప్రప్రథమమున ఆర్యావర్తదేశమునందే జన్మించిరనియు, కాలక్రమమున దేశదేశాంతరములకు వ్యాపించియుండవచ్చుననియు ప్రమాణవచనములు గనంబడును:—

విశ్వామిత్రుఁడనురాజు వేఁటకై అరణ్యమునకుఁబోయి మధ్యాహ్నకాలమునకు వసిష్ఠ మహర్షియొక్క పర్ణకుటీరమునకు చేరుటయు, అతఁడందఱకు తనదగ్గఱ నుండు శబలయను కామధేనువుయొక్క సహాయముచేత షడ్రసోపేతముగ భోజనము పెట్టి తగిన సౌకర్యముల నొనర్చుటయు, దానిని చూచి విశ్వామిత్రుఁడు లోభియై శబలను తనకిమ్మని వసిష్ఠుని అడుగగా అతఁ డంగీకరింపకపోవుటయు—తుట్టతుదకు విశ్వామిత్రుఁడు బలాత్కారముచేత ఆకామధేనువును అపహరింప ప్రయత్నింపఁగా కామధేనువు విజృంభించి తన అవయవములనుండి శక,

* శ్లో. శనకైస్తు క్రియాలోపాదిమాః క్షత్రియజాతయః। వృషలత్వం గతాలోకే బ్రాహ్మణా దర్శనేనచ॥ ౪౩॥

,, పౌండ్రకాశ్చౌడ్రద్రవిడాః కాంభోజాయవనాశ్శకాః। పారదా పల్లవాశ్చీనాః కిరాతాదరదాఃఖశాః ౪౪॥

మను. ౧౦ అ॥

వ్యా॥ ఇమాః వక్ష్యమాణాః క్షత్రియజాతయః, ఉపనయనాదిక్రియాలోపేన బ్రాహ్మణానాంచ యాజనాధ్యాపన ప్రాయశ్చిత్తాద్యర్థందర్శనాభావేనశనైశ్శనైః లోకేశూద్రతాం ప్రాప్తాః॥ ౪౩॥ పౌండ్రాదిదేశోద్భవాః క్షత్రియాస్సన్తః క్రియాలోపాదినా శూద్రత్వమాపన్నాః॥

† యేజ్యాయాం సోనతే కుశలం మేనిరే, తాననువ్యాజహార, తాన్వః ప్రజాభక్షీష్టే తి, తఏతేంధ్రాః పుండ్రాః శబరాః పులిందామూతిబా ఇత్యుదన్త్యా బహవోభవన్తి వైశ్వామిత్రాదస్యూనాం భూయిష్ఠాః॥

ఐత. బ్రా. ౭.౬.

యవన, కాంభోజ, బర్బరాదిజాతులను పుట్టించి విశ్వామిత్రుని సైన్యమును నిర్మూలమొనర్చుటయు బాలకాండమున వర్ణింపఁబడినది. †

మహాభారతమునందు యయాతి చరిత్రమొకటి గలదు. అతనికి అకాలమునందు ముదిమిసంభవింపఁగా అతఁడు తనపుత్రులను తన వార్థక్యమును గ్రహించి వారియౌవనమును తనకిమ్మనికోరెను. కాని వారందుల కంగీకరింపలేదని యయాతి కుపితుఁడై యదు, తుర్వసు, ద్రుహ్యు, అను అనియెడి పుత్రచతుష్టయమును శపించెను. వారి సంతానము యవనాది జాతిగ పరిణమించెనని గలదు. *

దీనివలన పాఠకులు గ్రహింపవలసిన విషయము లివి:-ఎవరో కొందఱు చెప్పినటుల మనము దేశదిమ్మరులమయి ఇచటికి చేరలేదు. ఆర్యులమగు మనము నివసించుటచేతనే మనదేశమునకు "ఆర్యావర్త" మను పవిత్రనామము పెట్టఁబడినది. ఈదేశమునం దెవరో కొండజాతులు దస్యులనువారు నివసించుటగాని వారిని మనము పరాక్రమముచేతగాని లేక దురాశచేతగాని హింసించి తరిమివేయుటగాని యథార్థముకాదు. అలసులయిగాని లేక ప్రకృతివైచిత్ర్యముచేతగాని లేక దుర్బోధచేతగాని వారివారికి ఏర్పఱుపఁబడినవిధుల నాచరింపక స్వేచ్ఛాచారులయిన ఆర్యులను తెగకుచేరినవారలే దస్యులని పిలువఁబడుచుండిరి. క్రమక్రమముగ వారు దూరదూర ప్రదేశములకు సైతము వ్యాపించుచుండుటచేత ప్రత్యేకప్రత్యేక భావములుగలవారుగఁగూడ నైరి. సంస్కారవిహీనులయి శూద్రతుల్యులయిన క్షత్రియజాతి విశేషులగు పౌండ్ర, ద్రవిడ, ఓఢ్ర, కాంభోజ, యవన, శక, పారద, పల్లవ, చీన, కిరాత, దరద, ఖశులనువారలు వారిలోకలసిపోయిరి. నానాఁటికి వీరి సంఖ్య మిక్కుటమగుటచేత ఈదస్యులనువారివల్లన మనపూర్వులగు ఆర్యులకు కొన్ని యపకారములు జరుగుచుండ తన్నిరసనమునకుగాను మనయార్యులు దేవతలను స్తుతించుచుండిరి; ఆస్తుతిని తెలిపెడి మంత్రములు ఋగ్వేదాదివేదములందు తెలియఁగలవు. దస్యులనఁగా చెడిపోయిన ఆర్యులని సారాంశము తేలుచున్నది. ఇఁకనైనను, ఆర్యవంశీయులమగు మనము ఇంద్రియచాపల్యమునకు లోనై మనముచేయవలసిన ధర్మమ్ముల నాచరింపక స్వేచ్ఛాచారులమయి చరించితిమేని మనముకూడ "దస్యుశబ్దవాచ్యులము" కాగలము. కావున అట్టి కళంకము మనయార్యులకు పట్టకపోవుఁగాక. ప్రతిభాండాగార కార్యదర్శియును, సభ్యుఁడును మన యార్యవిజ్ఞానవ్యాప్తికై ప్రయత్నించుచు మనదేశమునకుఁగల యార్యావర్తనామమును సార్థకపఱచును గాక. మనకు ఈభూమియే జన్మభూమియను విషయమును మరువకుందురుగాక.

—కనుపర్తి మార్కండేయ శర్మ.

---


† శ్లో. తస్య తద్వచనం శ్రుత్వా సురభి స్సాసృజత్తదా । తస్యా హుంభారవోత్సృష్టాః పల్లవా శ్శతశో నృప ॥ ౧౮ ॥
,, భూయ ఏవాసృజద్ఘోరాన్ 2 శకా 3 న్యవనమిశ్రితాన్ । తైరాసీత్సంవృతా భూమి శ్శకై ర్యవనమిశ్రితైః ॥ ౨౧ ॥
శ్రీమద్రామా. బాల. ౫౪.

శ్లో. తస్యా హుంకారతో జాతాః 4 కాంభోజా రవిసన్నిభాః । ఊధసశ్చాథ సంభూతా 5 బర్బరా శ్శస్త్రపాణయః ॥ ౨ ॥
,, యోనిదేశాచ్చ యవనా శ్శకృద్దేశాచ్ఛకా స్స్మృతాః । రోమకూపేషు 6 మ్లేచ్ఛాశ్చ 7 హారీతాస్స 8 కిరాతకాః ॥ 3 ॥
శ్రీమద్రామా. బాల. ౫౫.

* శ్లో. యత్త్వం మే హృదయాజ్జాతః వయ స్స్వం న ప్రయచ్ఛసి । తస్మాత్ప్రజా సముచ్ఛేదం తుర్వసో! తవ యాస్యతి ॥ ౧౩ ॥
మహా. ఆది. ౮౪ అధ్యా.

యదోస్తు 1 యాదవా జాతా స్తుర్వసో 2 ర్యవనా స్స్మృతాః । ద్రుహ్యో స్సుతాస్తు 3 వైభోజా అనోస్తు 4 మ్లేచ్ఛజాతయః ॥ ౩౪ ॥
మహా. ఆది. ౮౫.

3-0A



అమెరికాదేశమునందలి "పిట్సుబర్గు" నందున్న కార్నీజీ గ్రంథాలయమునందు
పిల్లలు చదువుకొను ప్రదేశము.

## విరహవీధి.

గీ. హేమపాత్రల చందన • మెండిపోయె। ద్వారములు మోయుచున్నవి • హారములను
సానలందింకె స్నానక • షాయగంధ। యబల! యెవనికోసము సగ • మయి కృశింతు.
గీ. చెక్కుచెదరని పాపట • చిక్కువడియె। వేణిబంధము శిథిలమై • పిరుదులందె
కరఁగి చెరగిన తిలక రే • ఖలను దుడువ। వతివ! యెవఁడాహరించె నీ • యార్ద్రహృదిని.
గీ. పాలుపొంగినగతి పొంగు • ప్రణయరక్తి। నాపుకొనలేని పసుచు ప్రా • యంబు తోడ
నమ్మియెవనికి నీమన • మమ్మికొంటి। వువిద! యీమేఘమాస న • వోదయముల.

—రాయప్రోలు సుబ్బారావు.

## గ్రంథాలయములు: శిశు శిక్ష.

భరతఖండమున ప్రజా నాయకులును, దొరతనమువారును, స్వదేశసంస్థానాధీశులునుకూడ ప్రజలకు విద్యను వ్యాపింపజేయుటకై పలువిధముల కృషి చేయుచున్నారు. శిశుశిక్ష విద్యావ్యాపకవిధానమందు ముఖ్యభాగము. పసిపిల్లలయందు అనేకములగు శక్తు లిమిడియున్నవి; వీనిని సరియైన మార్గముల నభివృద్ధినొందించినచో నత్యద్భుతములగు ఫలములు చేకూరును. పూర్వజన్మలయందు సంపాదించిన యనుభవముల నన్నిటిని బీజరూపమున తనయం దిమిడ్చుకొని శిశువు భూమియందుద్భవించుచున్నది. ఈ బీజరూపముననున్న యనుభవములన్నియు ప్రథమమున పాఠశాలయం దభివృద్ధి పొందవలసినవే యయ్యును, పాఠశాలయం దభ్యసించెడి పాఠములతోనే జ్ఞానాభివృద్ధి సాధకముల నంతమొందించక శిశువుయొక్క జ్ఞానము నభివృద్ధిపరచెడి మార్గముల నన్నిటిని అవలంబించుట ఆవశ్యకకర్తవ్యము. పసితనమున పిల్లలమనంబులు అతికోమలములై యుండుటచే, సంపూర్ణ మనుష్యత్వమును పొందుటకు కారణభూతములగు జ్ఞానసాధనముల నన్నిటి నవలంబింపఁజేసి వారి జ్ఞానమును చిన్నతనము నుండియే అభివృద్ధినొందింపవలెను. నేడు పసిపిల్లఁడుగా నున్నవాడు రేపటిదినము సామ్రాజ్యమందు హక్కులు బాధ్యతలుగల పౌరుడగుచున్నాడు. దేశములయొక్క భావిస్థితి, పసిపిల్లలకు విద్యాభ్యాసము చేయుట కవలంబించు మార్గములమీద నాధారపడియున్నట్లు ఏ ఇతర సంస్థాపనమీదను ఆధారపడిలేదు. విద్యాభ్యాసమనగా జీవయాత్ర సరియైన మార్గమున నడుపుటకు తగిన శక్తిని సంపాదించుట. ఇట్టి విద్య శిశువునందు దాగియున్న శక్తులనన్నిటిని విజృంభింపచేయుటయందు ప్రవర్తించవలెను. విద్యాశబ్దమునకు పైనచెప్పినంత వ్యాప్తి కలదను విషయమును గమనించుచు 'సార్వజనిక గ్రంథాలయము శిశుశిక్షణకెట్లు తోడ్పడును' అను నంశము ఈ వ్యాసమందుచర్చించబడును.

ప్రాచీన కాలమున శిశువులకు నుండు వాంఛలను ఆలోచనలను గమనించుట ఉపాధ్యాయుడు తన విధిగా నెంచుకొనలేదు. విద్యాశాఖాధికారులేమి రాజ్యపరిపాలనాధికారులేమి దేశమందలి పిల్లలకు విద్యాభ్యాసము సరియైన మార్గముల జరుగునట్లు చేయుటయం దత్యావశ్యకతను గమనించి యుండలేదు; అట్టి స్థితియందు పౌరగ్రంథాలయములకును పిల్లలకును సంబంధమేమియు లేదు. పూర్వపు గ్రంథాలయములు కేవల పుస్తకసమూహములు. అవి విద్యాధికులకొరకే ఉద్దేశింపబడినవైయున్నవి. జనసామాన్యమున కక్కడ ప్రవేశము లేదు. అట్టిస్థితిలో పసిపిల్లలకు ప్రవేశము లేకుండుట యొక వింతకాదు.

ఫ్రోబెల్ అను నాయన ఈ విషయమునందు నూతన శకమును ప్రారంభించెను. అప్పటినుండి విద్యాబోధకులు పసిపిల్లలను గూర్చి బాగుగ శాస్త్రపరిశోధన మొనర్చి వారి విద్యవిషయమై ఎక్కువ శ్రద్ధతీసుకొనుటకు ప్రారంభించిరి. ౧౮౮౯ సంవత్సరమునకు పూర్వము గ్రంథాలయములు పసిపిల్లల కుపకరించగలవను నంశము గ్రంథభాండాగారికులకు తెలియనే తెలియదు.

ప్రపంచమందలి దేశములన్నిటిలో అమెరికాదేశపు సార్వజనిక గ్రంథాలయములందు శిశుశిక్షనుగూర్చి జరుగుచున్నంత కృషి ఎచ్చటను జరుగుచుండుటలేదు. కావున దాని స్వరూపమెద్ది? దాని ప్రాప్యమెద్ది? ఆ సంస్థాపన పేరిట జరుగుపను లేవేవి? ఆదేశమం దవలంబింపబడు మార్గములెవ్వి? అందువలన పాఠశాలయందును ఇంటియందును అభ్యసించెడి విద్య ఎట్లు అభివృద్ధిపొందగలదు? అను నంశములను గూర్చి విచారింతము.

శిశువులు గ్రంథాలయములయందు తన శిక్షలో ఉన్నంతకాలము ముఖ్యముగా రెండు యంశములను గూర్చి భాండాగారికురాలు (ఆదేశముల భాండాగారములందు శిశుశాఖాధిపత్యము స్త్రీలచే ప్రాయికముగా నిర్వహింపబడుచుండును) వారలకు బోధించుచుండును. ఆయంశము లేవియన: (౧) గ్రంథాలయమును ఉపయోగపఱుచుకొను మార్గమెద్ది? (౨) గ్రంథములు చదువుటయందు విచక్షణకల్గి చెడుపుస్తకములను విసర్జించి మంచి పుస్తకములను మాత్రమేచదువుటకు నిచ్ఛ జనించునట్లు చేయుచు, గ్రంథపఠనమున కల్గెడి యానంద రసాస్వాదనాశక్తిని శుద్ధపరచి యభివృద్ధిపొందించుట ఎట్లు? గ్రహణశక్తి వయస్సుపై నాధారపడియుండదు. ఒక శిశువు ఎనిమిది వత్సరముల ప్రాయముననే పుస్తకములను చదివి లాభము పొందవచ్చును. మరియొకడు ౧౩ లేక ౧౪ సంవత్సరములు వచ్చినను కూడ అట్లుచేయలేకపోవచ్చును. కావున శిశుశిక్షాశాఖ కువచ్చెడివారి వయస్సునుగూర్చి గ్రంథాలయములలో అంతగా విచారించుట మానివేసిరి. తలుపులు లేని అరలలో గ్రంథాలయములందలి పుస్తకములు పెట్టుటకు ప్రారంభించిన పిదప శిశువులకు ప్రత్యేకశాఖయుండవలసిన యావశ్యకత పొడసూపెను. అప్పుడు పిల్లలు చదువుకొనదగు నవలలను ప్రత్యేకముగానుంచుటకు ప్రారంభించిరి. ఇందువలన పిన్నవయస్కులకును తదితరులకును సంబంధమంతగా లేకుండుటకు వీలుకల్గెను. నవలలు కాని ఇతరపుస్తకములలో, పిల్లలకు కావలసినవియు పెద్దలకు కావలసినవియు కలసియుండుటచే- పిల్లలు పెద్దలకు అవరోధమును కల్పించువారలుగా గణింపబడుచుండిరి. ఈ కారణమునుబట్టి పిన్న వయస్కులుపయోగించతగిన గ్రంథములన్నియు నొక చోట చేర్చబడెను. ఈ విధమున శిశుశాఖ ప్రత్యేకముగా గ్రంథాలయములయందు స్థాపింపబడెను.

శిశుశాఖప్రత్యేక మొకటి స్థాపింపబడిన పిమ్మట శిశుశిక్ష కుపకరించు నానావిధములగు పరికరములు సేకరించుట యావశ్యకమాయెను. శిశుశిక్షకు గ్రంథాలయము సాధనము కాగలదను నంశ మంగీకరించిన పిదప, గ్రంథాలయమందలి శిశుశాఖపై యాజమాన్యము వహించు నధికారియొకరు ప్రత్యేకముగా నేర్పడవలసివచ్చెను. తుట్టతుదకు ప్రత్యేకపుస్తకములతోను, పుస్తకములపట్టికలతోను, ఇతర పరికరములతోను శిశుశాఖ ప్రత్యేకభాగముగా గ్రంథాలయములయందు స్థాపితమాయెను. బాలబాలికలలో చాలమంది ప్రథమ శిక్షతోనే పాఠశాల వదలువారుగా నున్నారు. కావున వారు సంపాదించు జ్ఞానము పాఠశాలవదలిన పిమ్మట వారభ్యసించువిద్యపై నాధారపడియుండును. జ్ఞానము ఎక్కువభాగము పుస్తకములవలన సంపాదించవలసినదిగా నున్నది; గనుక పుస్తకములు మంచి మార్గముల నుపయోగించుకొను విచక్షణా జ్ఞానము పసితనముననే యలవడవలయును. పాశ్చాత్యదేశములయందు గ్రంథభాండాగారికుడు, జ్ఞానము సంపాదించుకొనదగు నుపకరణములనన్నిటిని శిశువు నెదుట పెట్టుటతోడనే తన విధినిర్వర్తించబడినదని తలంపక ఆ పరికరములను సరియైన మార్గముల నుపయోగించుకొనునట్లు బోధించుట కూడ ముఖ్యవిధియేయని గుర్తెరిగి యున్నాడు. మరియు మతమునందేమి భౌతిక శాస్త్రమందేమి చరిత్రయందేమి కళలయందేమి వాఙ్మయమందేమి తత్వ మెచ్చటెచ్చట నున్నదో దానిని వెదకి-ఆ తత్వమును గ్రహించి త

గ్రామమున కలిగెడి యానందము ననుభవించు శక్తి విద్యార్థికి కలవడునట్లు చేయుటయేగాక, సర్వకాలములయందును సకల దేశములయందు నుద్భవించెడి జ్ఞాననిధులగు మహాత్ముల గ్రంథముల నన్వేషించవలెనను నిరంతరాసక్తి విద్యార్థియం దుద్భవించునట్లు చేయుటయు నిప్పటికాలపు ఉపాధ్యాయుడు తన విధిగా గుర్తెరిగి యున్నాడు. కావున విద్యార్థి ఇంకను బడియందు చదువుచుండగనే విచక్షణతో గ్రంథములు చదువుకొనుటకు తగిన విమర్శనాశక్తిని సంపాదించుకొని, గ్రంథాలయమందలి పుస్తకములను గ్రంథముల పట్టికలు మొదలగువానిని మంచి యుపయోగమునకు తెచ్చుకొనుటకు తగిన సామర్థ్యమును పొందవలయును.

శిశుశాఖాధికారులగు గ్రంథభాండాగారికులును, ఉపాధ్యాయులును శిశుశిక్షయందు అన్యోన్య సహాయకులుగా నుందురు. పాఠశాలలయందు పుస్తకములు సమగ్రముగ నుండవచ్చును. అయితే ఆ పుస్తకములు సామాన్యముగా పాఠశాలలో చదివెడు గ్రంథములకు సంబంధించినవిగనే యుండును. ఇతర గ్రంథములు కావలయునన్న గ్రంథాలయములయందే లభించగలవు. పాఠశాలలకు గ్రంథాలయములందలి పుస్తకములను దీసుకొనివెళ్ళి విద్యార్థులకు పాఠములు బోధించు సమయమున ఆ గ్రంథములనుగూర్చి చెప్పునట్లు ఉపాధ్యాయులను గ్రంథాలయాధికారులు పురికొల్పుదురు. విద్యార్థులను ఉపాధ్యాయులను చేర్చి, గ్రంథాలయమున పనిచేయు నుద్యోగస్థులు వారల కుపకరించు గ్రంథములను ఇతర పరికరములను తమ గ్రంథాలయములయం దేమికలవో అవి ఎట్లు వారల కుపకరించునో అను నంశములనుగూర్చి ఉపన్యసింతురు.

కొన్ని గ్రంథాలయములయందు ఉపాధ్యాయులు తమబాలురను అచటికి తోడ్కొనివచ్చి పాఠములను బోధించు సదుపాయముల నేర్పరతురు. ఈ ప్రకారము గ్రంథాలయములయందు జరగు నీ పాఠములన్నియు పాఠశాలలో జరిగినట్లే పాఠశాలాధికారులు పరిగణింతురు. ౨౦ మొదలు ౫౦ వరకు బడిపిల్లల కుపయుక్తమగు గ్రంథములను చిన్న పెట్టెలలో పెట్టి గ్రంథాలయమందలి శిశుశాఖాధికారి ఉపాధ్యాయులవద్దకు పంపును. ఈ పెట్టెలు అవసరమైనప్పుడు పుస్తకములు పెట్టు అరలవలె తెరచునవిగగూడ నుండును. ఈ గ్రంథములను ఉపాధ్యాయుడు తన బాలురచే చదివించి పనితీరిన పిమ్మట గ్రంథాలయమునకు తిరిగి పంపును.

కొన్నిదినములయందు పిల్లలను చేర్చి గ్రంథాలయమందు కథలు చెప్పుదురు. ఇట్టి దినములయందు పిల్లలు అత్యంత ప్రీతితో చనుదెంతురు. ఈ కథలు ఒక్క వినోదజనకములేకావు. వీనివలన శిశువుయొక్క మేధాశక్తి విజృంభించును. సద్గ్రంథములయం దభిరుచి హెచ్చును. భాండాగారియందు ప్రీతిజనించును. అందుచే ఆయన చెప్పుమాటలయందు విశ్వాసము గలిగి ఆయన సహాయమును తరుచు కోరుటకు బాలునుద్యుక్తునిచేయును. అయితే కథలుచెప్పుటయందు మాత్రము ఎక్కువజాగ్రత్తచూపవలయును; లేనిచో ఇందువలన కొన్ని యనర్థకములు వాటిల్లగలవు. సద్వర్తన కలిగినట్టియు మంచి జ్ఞానము కలిగినట్టియు వారీపనికి పూనుకొనిన యెడల పసిపిల్లలకు జ్ఞానోపదేశము చేయుటయందు కథలు చెప్పుట మిక్కిలి ఉపయోగకరము కాగలదు. ఇందువలన పిల్లలలో పిల్లలు కథలు చెప్పుకొనుటకు ప్రారంభింతురు. అప్పుడు పెద్దలెవరైన ఉండి వారల నదుపులో నుంచవలెను. పిల్లలెప్పుడును కథలను బహురమ్యముగా చెప్పుకొందురు.

చాలపట్టణములయందు పాఠశాలను తెరచియుంచు కాలమందుకూడ సార్వజనిక గ్రంథాలయములకు విద్యార్థులను ఉపాధ్యాయులు కొనిపోవుదురు. అప్పుడు భాండాగారికుడు గ్రంథాలయపరికరములు- అనగా చదువరికి కావలసిన పుస్తకములను సులభముగా గ్రంథాలయమందు కనుగొనుట కేర్పరుపబడిన పరికరముల నన్నిటిని గూర్చి విద్యార్థులకు విపులముగా నుపన్యసించును. గ్రంథాలయమందు గ్రంథములెన్ని తరగతులుగా విభజింపబడినది ఏ తరగతి గ్రంథములందేయే యంశములుండునది కూడ బోధించును.

బాలుడు చదువుకొనుటకు తీసుకొన్న ప్రతి గ్రంథమును, వాని ప్రవర్తనను సన్మార్గమునకు త్రిప్పుటకును వాని ప్రాప్యములను పరిశుద్ధిపరచుటకును వాని యలవాటులను మార్చుటకును కొలదిగనో గొప్పగనో సాయప

డుచుండును. అమెరికా దేశమందలి గ్రంథాలయములలో ప్రతి సంవత్సరమునందును కోట్లకొలది గ్రంథములను బాలురే ఉపయోగించుచున్నారని చెప్పిన ఈ వాక్యమందలి యథార్థము బోధపడకపోదు. ౧౯౧౧ సంవత్సరమున న్యూయార్కు గ్రంథాలయములోనే ౨౪,౫౯,౭౭౭ గ్రంథములను- ౧౯౧౨ సంవత్సరములో ౨౯,౫౬,౦౪౪ గ్రంథములను- బాలబాలికలు మాత్రమే చదివిరి. ౧౯౧౧-౧౯౧౨ సంవత్సరములందా గ్రంథాలయమందు చదువబడిన మొత్తము గ్రంథములలో మూడవవంతు బాలబాలికలే చదివిరి. శిశుశిక్షాశాఖాభివృద్ధికి మూలసాధనము శిశు శాఖాధికారియొక్క ప్రసన్నత. ఈ సంగతులన్నిటిని ఎరిగిన పిదప, అమెరికా దేశమందలి గ్రంథాలయములలోని శిశుశాఖ ఆదేశాభివృద్ధికి ముఖ్యసాధనముగా నున్నదని చెప్పిన ఎవరు విశ్వసించరు!

కొద్ది సంవత్సరముల క్రిందటివరకు అమెరికాదేశపు గ్రంథాలయాధికారులు తమ సంస్థాపనలనుగూర్చి బహిరంగప్రకటనలను చేసియుండలేదు. ఇప్పుడట్టి స్థితిని మాని తమ గ్రంథాలయమం దితరగ్రంథాలయములకన్న విశేషము లేవికలవో వానిని వీలైనప్పుడెల్ల ప్రకటించుచుందురు. గ్రంథాలయము తన విధిని పూర్తిగ నిర్వర్తించుకొనవలెనన్న, దానివలన జనులకు కల్గెడి లాభము లన్నిటిని ప్రజలందరికి తెలియునట్లు చేయుట గ్రంథాలయాధికారులకు ముఖ్య కర్తవ్యమని ప్రజాసామాన్యమిప్పుడు నమ్ముచున్నారు. మంచి పరిస్థితులయందున్న ప్రతి గ్రంథాలయముయొక్క ఉత్కృష్టతను అందలి ఉద్యోగస్థులు పాఠశాలలయందును తదితర ప్రదేశములందును ప్రకటించుచుందురు.

ఒకప్పుడు శిశుశాఖాధ్యక్షునకు తెలియనట్టియు ఎక్కువ ఉపయోగకరమగునట్టియు అంశమును ఒక బాలుడో బాలికయో చెప్పుచుండును. బాలురకు ఎక్కువ ఉపయోగకరమైనదేదియో కనుగొనుటయేగాక బాలుడు వాంఛించునదేదియో కూడ కనుగొనుట యావశ్యకము. బాలుడు తాను చదువు పుస్తకమునుగూర్చి ఎట్టి యభిప్రాయము కలిగియున్నాడో తెలిసికొనకుండ, భాండాగారి "ఈ పుస్తకము చదువుము" "ఆపుస్తకము చదువు"మని బాలునకుసలహానిచ్చుచు పోయినచో-కొంతకాలమునకు భాండాగారియందు నమ్మకముచెడి గ్రంథాలయమునుండి బాలుడుమఱలిపోవచ్చును. కావున భాండాగారికుడు శిశువుయొక్క అభిప్రాయములను కనుగొనుచు అవసరమైనచో వానిని సవరించవలెను; గాని ఎప్పటికిని నిరాదరణ చేయరాదు.

ఎన్ని ప్రయత్నములు చేసినను కొందరు బా[illegible] గ్రంథాలయములకు రానేరారు. వీరిలో చాలమంది బీదలౌటచే వారికి రాతీరదు. అట్టిచో వారిగతి ఏమికావలెను? వారజ్ఞానకూపమున నెల్లకాలము మునిగి యుండవలసినదేనా? అట్లుకాకున్న గ్రంథాలయమునుండి సద్గ్రంథములు వారికి చేరుటెట్లు? వారి నట్టి యజ్ఞానాంధకారమున వదలుట నాగరికుల లక్షణముకాదు. వారు గ్రంథాలయములవద్దకు రానిచో వారిచెంతకే గ్రంథములు పోవలెను. కావున ఇట్టిబీదలుండు స్థలములకు ౪౦ లేక ౫౦ పుస్తకములనుంచిన పెట్టెలు పంపబడుచుండును. గ్రంథాలయములనుండి వారమున కొకతూరి ఈనిరుపేదలతో ఆటలాడుటకును, వారలకు కథలు చెప్పుటకును వారలందరకు పుస్తకముల పంచిపెట్టుటకును గ్రంథాలయమునుండి ఉద్యోగస్తుడొకడు పంపబడుచుండును.

ఇండ్లువదలి రెక్కలమీద జీవనముచేయుటకై వెళ్ళువారి సహాయముకొరకై గ్రంథాలయముల యాజమాన్యముక్రింద పాఠశాలలోగాని స్నానములుచేయు స్థలములయందుగాని పసిపిల్లల నేరములు విచారించుట కేర్పడిన న్యాయస్థానములయందుగాని "పఠనమందిరములను" గ్రంథాలయముల ఆదరణక్రింద ఏర్పరచెదరు.

శిశుశాఖ గ్రంథాలయములో ముఖ్యభాగముగ[illegible] నంగీకరింపబడిన పిదప శిశుశాఖాధికారికి ప్రత్యేకపు [illegible]తు ఉండవలసిన యావశ్యకత రూఢిపడెను. ఇందుకు ప్రత్యేకముగా అమెరికాఖండమందు కొన్ని పాఠశాల లేర్పడెను. ఇందు పట్టపరీక్షయందు [illegible]క్కువ పరీక్షకు తాళగల్గినవారికిగాని ప్రవేశము[illegible] ఈ పాఠశాలలయందలి విద్యావిధానము రెండు[illegible]లు. గ్రంథాలయపాలనతోకూడిన సామాన్యశి[illegible] భాగము. పసిపిల్లల శాఖతోకూడిన ప్రత్యేకశి[illegible]

డవశాఖ. ఈ రెంటికిగల యన్యోన్య సంబంధముకూడ చక్కగా బోధించబడును. ఇదియంతయు రెండు సంవత్సరములు పట్టును. అభ్యాసమువలన విద్యార్థుల కౌశలము పరీక్షింపబడును.

౧౮౯౦ సంవత్సరమునకు పూర్వము ఈ సంబంధమగు కృషి అమెరికా గ్రంథాలయములయందు జరుగుచుండుటలేదు. అటుపిమ్మట ఇందునుగూర్చి వ్యయపెట్టు ద్రవ్యమునకు మితియేలేదు. ఇంగ్లాండు దేశమున ఈ నూతనమార్గములు గ్రంథాలయాధికారులకు పూర్తిగ రుచించుటలేదు. ఇతర ఐరోపాదేశములతో పోల్చిచూచినచో ఇంగ్లాండుదేశమే ఈ యంశమున ముందంజవేయుచున్నదని చెప్పకతప్పదు. జర్మనీవా రిప్పుడిపుడు శిశుశాఖాభివృద్ధినిగూర్చి తీవ్రదీక్ష వహించుచున్నారు. జర్మనీదేశమందు మొదటి"బాలగ్రంథాలయము"౧౯౦౯ సంవత్సరములో స్థాపితమాయెను.

అమెరికా ఖండపు సార్వజనిక గ్రంథాలయములయందు బాలశిక్షకై జరిగెడి ముఖ్యవిధానము లిట్టివి. గ్రంథాలయములందలి శిశుశాఖ పాఠశాలయందును ఇంటియొద్దను విద్యాభ్యాసము చేయుటయందు చేయు సహాయమిట్టిది. ఒక్కన్యూయార్కుపట్టణమందే ౧౯౧౨ సం॥ములో ౨౯,౫౯,౦౪౪ పుస్తకములు బాలురచే నుపయోగింపబడినవను యంశము జ్ఞప్తికి తెచ్చుకొన్నప్పుడును, గ్రంథాలయమువలన లాభము పొందని బాలుడుగాని బాలికగాని పట్టణముయొక్క ఏమాఱుమూలనైన నుండరను యంశమును జ్ఞప్తికి దెచ్చుకొన్నప్పుడును, అమెరికాఖండపు వర్తమానౌన్నత్యమునకు గ్రంథాలయములయందలి బాలశిక్షాశాఖ ఎట్టి సాధకమగుచున్నదో మనకు స్ఫురించకమానదు.

ఇందూదేశమంతటను దొరతనమువారేమి ప్రజలేమి విద్యాభివృద్ధికై పాటుపడుచున్నారు. విశ్వవిద్యాలయముల సంఖ్య హెచ్చుచున్నది. కావున పాఠశాలలకంటె ఇతరమగు విద్యావ్యాపక సాధనములను ప్రాముఖ్యతలోనికి దెచ్చుటకిది మంచితరుణము. ఈ సాధనమే సార్వజనిక గ్రంథాలయము. ఇది విశ్వవిద్యాలయముకంటె మిక్కిలి మహత్తరమైనది. ఏలననగా విశ్వవిద్యాలయమందు విద్యనభ్యసించు భాగ్యము కొలదిమందికేయబ్బగలదు. పౌరగ్రంథాలయమునకు బాలశిక్షాశాఖ ప్రథమప్రవేశద్వారము. పాఠశాలలో బోధించెడు విద్యకుతోడు గ్రంథాలయమునందలి బాలశిక్షాశాఖయొక్క సహకారము లేనిచో బాలురవిద్య పరిపూర్ణతనొందనేరదు. బాలురవిద్య సమగ్రముకానిచో జాతివృద్ధినొందదను యంశము నిర్వివాదమేకదా. భరతఖండమందలి గ్రంథాలయములుపాతత్రోవలనుండి మరలవలెను. పౌరగ్రంథాలయమందు బాలురకు కలస్థానమును భారతీయులు బాగుగా గుర్తెరుగవలెను. బాలశిక్షాశాఖను స్థాపించుటయేగాక దానిని సమగ్రతతో నిర్వర్తించునట్లు చేయుటకూడ తమముఖ్యవిధియని వారు తెలుసుకొనవలెను. గ్రంథాలయాధ్యక్షులేకాక గ్రంథకర్తలుకూడ బాలురపై 'శీతకన్ను'నువైచినారు. వీరి యౌదాసీన్యమువలన ప్రథమతరగతులతో చదువు చాలించువారికి చదువుకొనుటకు గ్రంథములు దేశమున కరువైనవి.

తమ బాలురకు ఉత్తమవిద్య నభ్యసింపజేయగల సామర్థ్యముండియు, వారికొఱకై పుస్తకమునుగాని పత్రికలనుగాని కొనుటకు వెనుదీయు తలిదండ్రులే ఈ విషయమున ఎక్కువ దోషులైయున్నారు. వారెంత పెద్ద స్థితిలోయున్నను పుస్తకములను పత్రికలను తిరిపె మెత్తుదురు. అందువలన తమకుఁ గల్గెడి యవమానమును వారు గణించరు. ఈ ధనకాంక్ష హేయమగువరకు వారు ప్రవృద్ధి పర్చుకొందురు. తాము సంపాదించు కొంచెపుకూలిలో కొంత ద్రవ్యము వెచ్చించి స్వంతముగా వార్తాపత్రికలను చిన్న పొత్తములను కొని చదువుకొను పాశ్చాత్యదేశములందలి కూలీలును జట్కా తోలువారును ఈ యంశమునందు మన దేశమందలి ధనాఢ్యులకంటె ఎక్కువ ఆత్మగౌరవము కలవారుగా నున్నారు. ఇట్టి నైచ్యము మన దేశీయులందుండుటచేతనే మన దేశమందెన్నియో మహత్తరములగు సంస్థాపనలు బూడిదపాలాయెను. ఇట్టి నైచ్యముచేతనే విద్యాసామర్థ్యములు కలవారు మనదేశమందున్నను, ఉన్నతమగు యాశయములతో పత్రికలును గ్రంథములును వెలువడకపోవుట తటస్థించుచున్నది. ఇందువలననే మన దేశమందు మాతృభాషలో రచించుగ్రంథములసంఖ్య తక్కువగా నుండుటయు, స్థాపించబడిన వార్తాపత్రికలకును, మాసపత్రికలకును ప్రోత్సాహము లేకుండుటయు తటస్థించుచున్నది.

—సూరి వేంకటనరసింహశాస్త్రి బి. ఏ.

# శ్రీకృష్ణదేవరాయలు.

సీ. నావాడముఖదేశ • నాథులు కప్పమ్ము, లనుగొంచు ద్వారమ్ము • లనువసింప
గేయప్రబంధ ఫ • క్కిని వందిమాగధుల్, జయబిరుదావళుల్ • సదువుచుండ
నష్టదిగ్గజములై • నట్టి పెద్దనముఖ, కవివరుల్ కృతులకా • న్కలగ నొసఁగ
నిరుప్రక్కలను వన్నె • నింపుచుఁ గత్తులఁ, జేబూను భటుల సు • శ్రీ చెలంగ
గీ. సకలరాజన్యమస్తక • స్థగితపద్మ । రాగమణికాంతి పుంజనీ • రాజితాంఘ్రి
జలజుడై సింహపీఠినిఁ • గొలువుఁదీర్చు । కృష్ణరాయలప్రాభవ • మెన్నదరమె.

మ. ఉదయాహార్యము ముట్టడించె నటుపై • నోహాహాయనం గొండవీ
టి దగన్ బట్టికొనెన్ బదంపడినదా • డిన్ జమ్మిలోయాఖ్య నా
పిదపన్ గొట్టముఁ బొట్టునూరు నటుపై • వేగన్ హరించెన్ దయా
స్పదుడై మీఱిన కృష్ణరాయలకిలన్ • సాటెవ్వరెంచన్ మదిన్.

చ. అలసురభాషఁ బ్రోచెను మ • హామహుడై యలరారు భోజుడ
ట్టుల మనతెల్గుబాసను గ • డుంగడుఁ బ్రోచెను విద్దెలోన బె
ద్దలయిన పెద్దనాదులను • దద్దయుఁ దన్పుచుఁ గృష్ణదేవరా
యల కెనరారులోకమున • నంచు జనుల్ కొనియాడ నిచ్చలున్.

శా. ఏలోకంబున నున్నవాడొ మృతుడై • యీ యాంధ్రదుఃఖంబు తా
నాలోచింపక యే, సమస్త కకుబ • బ్జాస్యాశిరోదేశ స
ల్లీలాకల్పితమా క్తికాయత యశో • లీనస్వరూపమ్ముతో
నీలోకమ్మున నున్నవాడనుచు • నూహింపంగ సర్వాంధ్రులున్.

—జంధ్యాల వేంకటశివకవులు.

# శ్రీకృష్ణదేవరాయలు.

మహమ్మదీయుల ఆగమనానంతరము, హిందూదేశమున ప్రసిద్ధికెక్కిన హిందూ రాజ్యములలో నెల్ల విజయనగర సామ్రాజ్యము అగ్రగణ్యమై నిరుపమానమై వెలసినది. అల్లాఉద్దీన్ కాలమున మలిక్ కాఫర్ అను సేనాని ఓరుగల్లు రాజ్యమును కొల్లఁగొట్టినప్పుడు ఆ ఆస్థానమునుండిన హరిహరరాయలు, బుక్కరాయలు అను అన్నదమ్ము లిద్దఱును పరదేశాన్వేషులై తుంగభద్రాతీరమునకుఁ జని- శ్రీమద్రామాయణమున పంపాతీరమనియు, ఋష్యమూక పర్వతప్రదేశమనియు ప్రసిద్ధిచెందిన ప్రాంతమున విద్యానగరమను పురమొకట కట్టించి [illegible] యేరాజధానిగా ఒక చిన్న రాజ్యమేర్పఱచుకొనిరి. [illegible] విజయనగర రాజ్యమనియు పేరు. ఈ విజయనగర రాజ్యము దినదినాభివృద్ధి నొందుచు సుమారు ౨౫౦ సంవత్సరములకాలమును అఖండవైభవోపేతమయి, తుదకు



శ్రీ కృష్ణదేవరాయలు.

3UB i

బహమనీసుల్తానుల క్రౌర్యమునఁ జిక్కి అంతరించినది. ఈ రాజ్యమును మూడు వంశములవారు ఏలిరి. మొదటిది హరిహరవంశము (క్రీ. శ. ౧౩౩౬-౧౪౭౨). రెండవది నరసింగవంశము (క్రీ. శ. ౧౪౭౨-౧౫౪౨). మూడవది అళియరామరాయ వంశము (క్రీ. శ. ౧౫౪౨-౧౫౬౫) (తళ్ళికోట యుద్ధము; విజయనగర నిర్మూలనము - ౧౬౧౪). వీనిలో శ్రీకృష్ణ దేవరాయలు రెండవ వంశమున మూడవవాఁడు.

కృష్ణదేవరాయల కాలమునందీ సామ్రాజ్యము దక్షిణహిందూస్థానమంతటను వ్యాపించినది. రాయల చరిత్రము, చరిత్రరూపముగా లభింపలేదు. వారి జన్మసంవత్సరము విషయమునను రాయచూరి యుద్ధవిషయమునను, నిర్యాణవత్సరపు విషయమునను ద్వంద్వాభిప్రాయములు కలవు. హిందువులకాదినుండియు చారిత్రికవిషయముల యందాసక్తి లేకపోవుటచేత చరిత్ర నిర్మాణమునందనేకములగు చిక్కులు కలుగుచున్నవి. ఆకాలపు ప్రబంధములను బట్టియు, శిలాశాసనములను బట్టియు, తామ్రఫలకదానశాసనములను బట్టియు, నాణెములను బట్టియు, కొంతవట్టుకు చరిత్రను సంగ్రహింపవలసియుండినది. నికోలో కాంటి, పేయస్, న్యూనీజ్, మొదలగు దేశాటనపరులును వర్తకులును విజయనగరమును జూచి తమ యనుభవములను, అభిప్రాయముల సహితముగా లిఖించియున్నారు. వీరిలో పేయస్ అను పోర్చుగీసు చరిత్రకారుఁడు కృష్ణదేవరాయల సమకాలికుఁడు. ఈతఁడు క్రీ. శ. ౧౫౨౦ లో విజయనగరమునకు వచ్చి అచ్చటి సామ్రాజ్య వైభవము నతిరమ్యముగా వర్ణించియున్నాఁడు. బహమనీసుల్తానులలో ప్రముఖుఁడును బిజాపుర రాజ్యాధిపతియు, విజయనగరమునకు బద్ధద్వేషియునగు అలీల్ షాహయొద్దనుండిన ఫెరిస్తాయను మహమ్మదీయ చరిత్రకారుఁడు విజయనగరరాజుల విషయమై కొంతవట్టుకు వ్రాసెను; గాని అదిపక్షపాతభూయిష్ఠమయినందున అంత విశ్వసనీయము కాదు. రాయలకాలమున వెలువడిన ప్రబంధములును వైనుడిపనవి తప్ప మఱివేరు ఆధారములేవియును లేవు. ఇందువలన అతని సంపూర్ణచరిత్రము వ్రాయుట కలవికాదు.

శ్రీకృష్ణదేవరాయలు సింహాసనారూఢుఁడగు వఱకును అతని చరిత్రమేమో మనమెఱుఁగము. ఆయన జన్మసంవత్సరమిట్టిదని నిర్వచించుటకు గట్టియాధారము లేవియు లేవు. ౧౪౬౫వ సంవత్సరమున జననమొందెనని యొకరును, ౧౪౭౨వ యేట పుట్టెనని మఱియొకరును వ్రాసియున్నారు. ౧౪౬౫వ సంవత్సరముననే జన్మించియుండినయెడల ౧౫౨౦లో రాచూరియుద్ధము జరుగునప్పటికి రాయలకు ౫౫ సంవత్సరముల ప్రాయముండవలెను. కాని, పేయస్ అను నాతఁడు రాయలను వర్ణించుచు నతఁడు యౌవన సంపన్నుఁడనియు, సింగమును సరిపోలు దేహదార్ఢ్యము కలవాఁడనియు, కాయసౌష్ఠవము కలిగిన అందకాఁడనియు వ్రాసియున్నాఁడు. ౫౫ సంవత్సరముల ప్రాయపు వాఁడే వర్ణనలకుఁ దగియుండునా అని సంశయింపఁ దగియున్నది. కావున ౧౪౭౨వ సంవత్సరముననే ఆయన జననమొందెననుట సమంజసముగా నున్నది.

రాయల నిర్యాణదినమును సహితము ఇట్టిమబ్బే క్రమ్మియున్నది. అల్లసాని పెద్దన చాటుధారగా చెప్పిన యొకపద్యమునుబట్టి చూడగా శాలివాహనశకము ౧౪౪౭ టికి సరియగు క్రీ. శ. ౧౫౨౯వ సంవత్సరమున రాయల స్తమించినట్లు తెలియుచున్నది. కాని, సూయల్ దొరగారు తన 'ఫర్ గాటెన్ ఎమ్పయిర్' (విస్మృతసామ్రాజ్యము)లో ౧౫౩౦లో రాయలు మృతినొందిరని నిర్ధారణ చేసియున్నాఁడు.

కావున కృష్ణదేవరాయలు ౧౪౭౨వ సంవత్సరమున జనించి ౪౦ సంవత్సరములు బ్రదికి ౧౫౩౦ లో అంతరించెనని ఆధునిక చరిత్రకారుల యభిప్రాయము.

కృష్ణరాయలతండ్రి నరసింహరాయలకు ఇద్దఱు భార్యలు. అందు తిప్పాంబ పట్టపురాణియనియు నాగాంబ భోగకాంతయనియు కొన్ని శాసనములవల్ల తెలియుచున్నది. నాగాంబను వైవాహికవిధులతోఁ బెండ్లియాడలేదనుకొందము. అంతమాత్రముచేత ఆమె నీచురాలనియు, గౌరవార్హురాలుకాదనియు ఎంచి ఆమెను ఆమె పుత్రుఁడగు కృష్ణరాయలను నిరసించుట తగదు. ఆమెయందు మహత్తరమైన గౌరవములేకయా రాయలామే

పేరు శాశ్వతముగా నిలుచునటుల నాగలాపురమును కట్టించెను.

మగధాధీశుఁడయిన చంద్రగుప్తుని వీరమాత మురశూద్రయైన నేమి? రాయల తల్లి హీనకులజయగు భోగకాంత * యనిపించుకొన్న నేమి? చంద్రగుప్తకృష్ణరాయల జగద్విఖ్యాత కీర్తికి ఇసుమంతయును కొఱఁతవాటిల్లదు.

కృష్ణదేవరాయల చిన్ననాటి చరిత్రమున కాధారము లేవియు లేనందున ఆవిషయము మనకేమియును తెలియదు. అతఁడు బాల్యమునుండి మహా పరాక్రమవంతుఁడనియును, బుద్ధిశాలియనియును వాడుకగా వచ్చిన కొన్ని కథలవల్ల తెలియుచున్నది. కృష్ణరాయలకు సవతితల్లి యగు తిప్పాంబ అతనిపైఁ గల అసూయచేత అతనిఁ జంపింప ప్రయత్నించెననియు అప్పటి మంత్రియగు తిమ్మరసు అతనిని కాచెననియు గాథకలదు. కృష్ణరాయలకు రాజ్యమియ్యకూడదని తలచి, అతని అన్నయగు వీరనరసింహరాయలు తన యవసానకాలమున తిమ్మరసును రప్పించి, "కృష్ణరాయని కన్నులూడంబెఱికి తెచ్చి చూపుము" అని యాతని నాజ్ఞాపించెను. కాని, ఆమంత్రిశేఖరుఁడు మేకకన్నులు తెచ్చి చూపెనట. ఈపైనుడివిన రెండు గాథలును ఎంతమాత్రము నిజమో, ఏమాత్రము కల్పితమో మనము చెప్పఁజాలము. కాని, కృష్ణరాయునియెడల తిమ్మరసునకు గల అనురాగాభిమానములును పక్షపాతబుద్ధియు వీనివలన వెల్లడియగుచున్నవి. తిమ్మరసు మంత్రియొక్క సహాయముచేతనే కృష్ణరాయఁడు నిరభ్యంతరముగా పట్టాభిషిక్తుఁడయ్యెను. కావున రాయలకు తిమ్మరసునందెక్కువ గౌరవముండెను. రాయలాయనను 'అప్పా అప్పాజీ' అని తండ్రినివలె పిలచుచుండెను. ఇందువలననే, ద్రావిడులు వారిద్దఱి పేర్లను అరవభాషలో "రాయర్, అప్పాజి" అని కూడఁబలుకుట ఇప్పటికిని వాడుకపడియున్నది.

పాడుపడిన హంపిలో పంపాపతి దేవాలయమునందలి ఒకశాసనమువలన క్రీ. శ. ౧౫౦౯లో రాయల పట్టాభిషేక మహోత్సవము జరిగినట్లు తేలుచున్నది. పట్టభద్రుఁడైనందులకు జ్ఞాపకచిహ్నముగా నతఁడొక విశాలమైన సభామందిరమును, అత్యున్నతమగు గోపురమును కట్టించెను. తన రాజ్యపదవిని స్థిరపఱచుకొనవలెననెడి యుద్దేశముతో అతఁడు తన తమ్ముఁడగు అచ్యుతరాయలను, అన్నకుమారుఁడగు తిమ్మరాజును చంద్రగిరి దుర్గమున చెఱఁబట్టి నిరాటంకముగా రాజ్యముచేయ నుద్యమించెను. రాజ్యమునకు వచ్చిన రెండు మూడు సంవత్సరముల వఱకును తిమ్మరసుమంత్రియొద్ద రాజ్యతంత్రముల నభ్యసించెను. బైరముఖానుచే శిక్షితుఁడగు అక్బరువలె, కృష్ణరాయఁడును తిమ్మరసుచే సుశిక్షితుఁడై రాజ్యకార్యధురంధరుఁడయ్యెను.

విజయనగర రాజ్యమునకు ఉత్తరమున, దానినంటి బిజాపురరాజ్యముండెను. ఇది బహమనీ సుల్తానులలో నొకఁడగు అదిల్‌షాహాచే పాలింపఁబడుచుండెను. విజయనగర రాజులకును, బిజాపుర సుల్తానులకును తరతరములుగా బద్ధవైరముండెను. విజయనగర సామ్రాజ్యము స్థాపితమైనప్పటి నుండియు, బహమనీ సుల్తానులతోడి

* శ్రీకృష్ణదేవరాయలు చనిపోయిన పిమ్మట పదునైదు సంవత్సరములలో శ్రీరాజనాథకవిచే రచియింపబడినట్టి "అచ్యుత రాయాభ్యుదయమ్" అను సంస్కృతకావ్యము నందీ ప్రకారమున్నట్లు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు వ్రాయుచున్నారు:—

1 అద్వైరపక్షోణిపతి ప్రకాణ్డై। రాకాజ్ఞణీయ స్వయశోఽవతారః
వసన్నతస్యాం వసుధాపతీనాం। కన్యామణీః కాశ్చన పర్యణైషీత్.
2 తిస్రోనృపస్య త్యభవన్నభీష్టా। స్తిప్పాంబికా తాసుచ నాగమాంబా
పట్టాభిషిక్తాః పతిదేవతానా। ముత్తం సభూసామణి రోబమాంబా.
3 తిప్పాంబికాయాం ద్విజసంప దేఽభూ। ద్విఖ్యాతిమా న్వీరనృసింహరాయః
నాగాంబికాయాం నరసావనీన్ద్రో। కీర్త్యాకరోఽ జాయత కృష్ణరాయః.

అర్థము;— 1 పూర్వపు రాజశ్రేష్ఠులుగూడ మనసుపడునట్టి నిజకీర్తి ప్రసారముకలిగి యా నరసరాజానగరములో వసియుచు, ననేక వసుధాధిపతుల కన్యారత్నములను వివాహమాడిన వాడాయెను. 2 ఆ భార్యలలో దిప్పాంబిక, నాగాంబిక పతివ్రతలకు శిరోభూషణమగు ఓబమాంబయును ముగ్గురు రారాజునకు ప్రియులుగను పట్టపురాణులుగను నుండిరి. 3 ఆ నరసరాజునకు దిప్పాంబవలన బ్రాహ్మణుల సంపదకొలఁది కీర్తిమంతుఁడగు వీరనృసింహ రాయలును, నాగాంబికయందు యశోనిధియగు కృష్ణరాయలును జన్మించిరి.

ఈ యంశములనుబట్టి నాగమాంబ రాజపుత్రియనియు, పట్టమహిషియనియు కృష్ణరాయలు సద్వంశజాతుడనియు స్పష్టమగుచున్నది. (గ్ర. స. సం.)

పోరు పరంపరగా జరుగుచు నేయుండెను. బహమనీరాజ్యము- బిజాపురము, గోలకొండ, అహమ్మద్ నగరము, బీరారు, బీదరు అని అయిదు స్వతంత్రరాజ్యములుగా విభజింపఁబడిన పిమ్మట, బిజాపురపు సుల్తానులకును విజయనగర రాజులకును మనస్పర్థలు మఱింత హెచ్చెను. కృష్ణా తుంగభద్రలకు నడుమనుండు రాచూరి మండలముకొఱకు ఈ రెండు రాజ్యములకును అప్పుడప్పుడు యుద్ధములు సంభవించుచు నేయుండెను. కావున కృష్ణరాయలకును బిజాపురపు అదిల్ సాహకును బద్ధద్వేష ముండెను. ఈ కారణముచేతనే, పోర్చుగీసు గవర్నరు అగు ఆల్బుకర్కు బిజాపురమునకు చేరియుండిన గోవాను స్వాధీనపఱచుకొన్నప్పుడు, కృష్ణరాయలు పోర్చుగీసువారల పక్షమును వహించెను (1510). అంతవఱకును జరుగుచుండిన బిజాపురపు సుల్తానులతోడి గుఱ్ఱపు వర్తకమును మార్చి, దానిని రాయలు విజయనగరమువైపు మఱల్చుకొనెను. అప్పటినుండి గుఱ్ఱములేమి, కత్తులేమి, టోలీడో అయుధములేమి- ఇది అది యననేల, విదేశమునఁగలుగు యుద్ధసామగ్రి, పోర్చుగీసు వర్తకుల మూలమున, విజయనగరమునకు పారలివచ్చినది. అశ్విక బలములును కాల్బలములు అనేకములు తయారు చేయఁబడినవి. రాజధానియొక్క చుట్టుగోడలను కందకములను కాచుకొనియుండుటకు మాత్రము మూడులక్షలసైన్యములుండినప్పుడు, దిగ్విజయార్థము కృష్ణరాయలతో వెడలిన సేనాపరిమితిని మీరలే యూహింపవచ్చును.

శ్రీకృష్ణదేవరాయలు ౧౫౧౧లో దక్షిణ దిగ్విజయమునకు వెడలెను. రెండు సంవత్సరములలోగా కర్ణాట ద్రావిడ మళయాళమండలములు రాయల స్వాధీన మయ్యెను. తిరుగ కృష్ణరాయఁడు ౧౫౧౪లో పూర్వోత్తర దేశములపై దండయాత్ర చేసెను. మొదట కటక పురీశుని యధీనమునందుండిన నెల్లూరు మండలములోని ఉదయగిరిని తీసికొని, పిమ్మట శత్రువుల కభేద్యమనిపించుకొనిన కొండవీటి దుర్గముపై దాడివెడలి దానిని సాధించెను. ఈ వార్తవిని కుపితుఁడై కటకగజపతి నాల్గులక్షల సైన్యముతో వచ్చి కృష్ణుకు ఉత్తరమున విడిసెను. కృష్ణరాయ లతని నెదుర్కొని ఘోరముగాపోరి, ఓడించి, పాఱఁగోలెను. పిమ్మట, కొండవీటి సమీపముననున్న బెల్లముకొండ, నాగార్జునకొండ, కొండపల్లి మొదలగు దుర్గములను కైకొనెను. తరువాత ఉత్తరమునకు పోయి జమ్మిలోయ కోన సీమలను, విశాఖపట్టణ మండలమున కొంత ప్రదేశమును స్వాధీనపఱచుకొనెను. అనంతరము రాయలు ౧౫౧౫ లో విజయభేరి మ్రోగించుచు తన రాజధాని చేరెను.

పూర్వదిగ్విజయమునుండి మరలివచ్చిన తర్వాత కృష్ణదేవరాయఁడు విజితరాష్ట్రముల పరిపాలనకు తగిన యేర్పాటులు చేయుచు, రాజ్యాంగశాఖలను సంస్కరించుచు, రయితుల యుపయోగార్థము చెఱువులను కాలువలను త్రవ్వించుచు, ఇట్లనేక విధములఁ ప్రజాక్షేమ మరయుచు- అయిదువత్సరముల కాలము గడపెను.

చిరకాలమునుండి తురుష్కులకును తమకును వివాద భూమిగానుండి, బిజాపురపు తురుష్కరాజగు అదిల్ సాహయొక్క స్వాధీనముననున్న, రాయచూరు ముద్గల్లు దుర్గములను కైకొనవలెనను కోరిక కృష్ణరాయల మనస్సు నప్పుడప్పుడు బాధించుచుండెను. తన మనోభీష్టము తీర్చుకొనవలెనని కృతనిశ్చయుఁడై ౧౫౨౦ వ సం॥న యుద్ధమునకు బయలుదేఱెను. ఈ యుద్ధము కొఱకు కృష్ణరాయలుచేసిన సన్నాహ మత్యద్భుతము. ప్రత్యక్షముగా యుద్ధమునుజూచిన న్యూనీజు అను చరిత్రకారుఁడు రాచూరి ముట్టడినిగూర్చి విపులముగా వ్రాసియున్నాఁడు. అతని లెక్కప్రకారము కాల్బలముమాత్రము ఏడు లక్షలకు పైఁబడి యుండెనఁట. ఇతర సైనికులును సేవకులును చేరి ౧౦ లక్షల జనులు యుద్ధమునకు వెడలిరి. కృష్ణా తుంగభద్రలచే ఆవృతమై, బిజాపుర విజయనగర రాజ్యములకు వివాదభూమియైన భూప్రదేశమునకు రాయచూరు ముఖ్యదుర్గము; కృష్ణరాయల సేనాప్రవాహము ఈ దుర్గముపైకి పారలివచ్చినది. రాయచూరుముట్టడి అతిఘోరముగా జరిగినది. ముట్టడిమాటవిని, అదిల్ సాహ గొప్పసైన్యమును తీసికొనివచ్చెను. అప్పుడు జరిగిన ఘోరరణమున తురుష్కులు బొత్తిగా పరాజితులై కాళ్ళకు బుద్ధిచెప్పిరి. అంతట కొలఁది దినములలోనే రాచూరిదుర్గము కృష్ణదేవరాయల హస్తగత

మాయెను. పిమ్మట ముదిగల్లుదుర్గముకూడ అనాయాసముగా రాయల యధీనమాయెను.

పరాభవమునొందినవాఁడై అదీల్ సాహ రాయలకడకు సంధికొఱకు రాయబారమునంపెను. అప్పుడు రాయలంపినసంధినిబంధనలను సుల్తాను అంగీకరింపలేదు. అంత కృష్ణరాయఁడు కోపోద్దీపితుఁడై, బిజాపురముపై దండెత్తి ఆరాజధానిని ధ్వంసముచేసి దారిలోని కల్బర్గా దుర్గమును స్వాధీనపఱచుకొనెను. ఎన్నో సంవత్సరములక్రిందట అంతరించిన బహమనీరాజ్యమును కల్బర్గలో పునస్థాపితము చేయనెంచి రాయలు ఆవంశజులలో నొకనిని తిరుగ కల్బర్గలో పట్టభద్రుని గావించెను. ఈ కారణముననే కొన్ని శాసనాదులలో కృష్ణరాయలకు "యవనరాజ్యస్థాపనాచార్య" అను బిరుదమును వాడియున్నారు.

## రాజ్యవ్యవస్థ

కృష్ణానదికి దక్షిణముననున్న దేశమంతయును శ్రీకృష్ణదేవరాయల యాధిపత్యముననుండెను. ఈతనిది నిరంకుశప్రభుత్వము. ఈ సామ్రాజ్యమున కప్పము గట్టు సామంతరాజులనేకులుండిరి. వీరలు విజయనగరమునకు కప్పము కట్టుచుండిరను మాట యొకటేకాని, తమతమ యేలుబడులయందు నిరంకుశాధికారమును పొందియుండిరి. వీరిలో ముఖ్యులు ఆఱుగురని న్యూనీజు చరిత్రకారుఁడు పేర్కొనియున్నాఁడు. బంకాపురము, గరొసొప్ప, కళ్ళికోట, ఘటకల్లు, బర్కూరు, అను నీయాఱును సామంతసంస్థానములు.

సామంతరాజ్యములు పోఁగా మిగిలిన దేశమున కృష్ణరాయఁడు రాజప్రతినిధుల నేర్పఱచి, వారినుండి సైతము కప్పములను గైకొనుచుండెను. విజయనగరప్రాంతమును తన స్వయం ప్రభుత్వముక్రింద పెట్టుకొనెను. రాయల రాజప్రతినిధులకు 'నాయకుల'ని పేరు. మొత్తము మీద సామ్రాజ్యమున సుమారు ఇరువదియైదుగురు నాయకులుండిరని తెలియుచున్నది. వీరిలో ముఖ్యులు శ్రీరంగపట్టణము, వేలూరు, జింజి, తంజావూరు, మధుర, తిరునల్వేలి మొదలగు మండలములకు నాయకులై- ఆయాపురములను ముఖ్యస్థానములుగా నేర్పఱచుకొని, యేటేటను తప్పక విజయనగరమునకు గప్పము చెల్లించుచుండిరి. సామంతరాజులవలెనే నాయకులుకూడ కప్పములు చెల్లించుచుండుట చూడ, వీరును తమతమ ప్రాంతములయందు రాజులవలె నిరంకుశాధికారము కలిగియుండిరని తేటపడుచున్నది. అయినను, సామంతులకుండినంత స్వతంత్రమును, గౌరవమును వీరికి లేదనుట మాత్రము నిశ్చయము.

## సైన్యము

రాష్ట్రసంపాదనము కొఱకును, రాజ్యపోషణకొఱకును రాయలయొద్ద నుండిన సైన్యసంఖ్య సుమారు పదిలక్షలకు మించియుండెను. రాజుయొక్క సైన్యవైభవమును గుఱించి 'పేయస్' బాగుగ వర్ణించియున్నాఁడు. రాజుగారి పదిలక్షల సైన్యములో కవచధారణముగల ౩౬౦౦౦ గుఱ్ఱపు దళముండెను. ఈ సేనలన్నిటికిని రాజు ముఖ్యసేనాధిపతి. రాజే ప్రదేశమునకు పంపఁదలచినను, పంపుట కేసమయమందైనను సైన్యము సిద్ధముగా నుండును. శత్రురాజులకు తన పరాక్రమముఁ జూపవలసివచ్చినప్పుడు, ఇరువదిలక్షల సైన్యమునయినను యుద్ధభూమికి రప్పింపసామర్థ్యముగలవాఁడని చెప్పుదురు. ఇంతటి గొప్పసైన్యమునకు జీతములిచ్చుటకును, సైనికులను మంచి వ్యవస్థయందుంచుటకును చేసిన యేర్పాటులు శ్లాఘనీయములు. రాజు, దేశమునందధికాదాయము వచ్చు ప్రభువులను రప్పించి వారికి యుద్ధవిద్యను శాస్త్రోక్తముగ నేర్పి, వారిని సేనానాయకులుగఁ జేసెను. వారు తమతమ యాదాయములకుఁ దగినట్లు, రాజు నియమించిన లెక్కచొప్పున కాల్బలమును, గుఱ్ఱపుదళమును, ఏనుగులను పోషించుచు, సైన్యము నెల్లప్పుడు యుద్ధసన్నద్ధమై యుంచవలయును. రాజాజ్ఞయైనప్పుడు ప్రభువులు తమతమ సేనలకు తామే నాయకులై, ఎట్టికాలమందెక్కడికి పంపినను పోవలయును. సైనికులను కూర్చుభారము ప్రభువుది. కావున నతఁడు ధైర్యశాలులను చూచి, తన సేనయందు చేర్చుచుండును. విజయనగర సైన్యములందొక్క పిటికియైనను కానరాదన్న 'పేయస' వ్రాసినమాట కొంత యతిశయోక్తియైనను మొత్తముమీ

ద స్థైర్యసాహసములయందును, పోరునందలి పట్టుదలయందును, ఆకాలపు సైన్యములలో ముందెన్నదగినవని చెప్పక తప్పదు. అంతటి యుత్తమవ్యవస్థయందుంచిన సైన్యము లెచ్చటికిపోయినను విజయమొందుటయందేమియాశ్చర్యము గలదు.

## వ్యాపారోత్పత్తులు

సామ్రాజ్యమునం దొకప్రక్క యుద్ధము జరుగుచుండగా మఱియొకప్రక్క వర్తకవ్యాపారములు తిన్నగా జరుగుచుండెను. వృత్తులకేమియు భంగము లేకుండెను. విదేశములనుండి నీలములు, పచ్చలు మొదలుగాఁగల రత్నములును, వస్త్రములును, ఇంకను ప్రపంచమున దొరకునట్టి ప్రతివస్తువును విజయనగర పురమునందు విక్రయింపఁబడుచుండెనని "పేయస్" అను పోర్చుగీసు చరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు. ఇఱిమ్మాఁడ, విదేశవర్తకము సముద్రముమీఁదుగా జరుగుచుండెనని వేఱుగ చెప్పనక్కఱలేదు. పశ్చిమతీరమునందలి భటకల్లు, బసరూరు, అలప్పె, కళ్ళికోట అను రేవులగుండా విదేశ వ్యాపారము జరుగుచుండెను. విజయనగరపు సామంతరాజులలోనొకఁడగు జామొరిన్ పోర్చుగీసువారికి వర్తకముచేయవచ్చునని యనుజ్ఞ యొసంగుటకు పూర్వము, మూరులు అను ఒకతెగ మహమ్మదీయుల మూలమున దక్షిణహిందూదేశమునుండి వస్తువులనేకములు పారసీకము, అలెగ్జాండ్రియా, కాంస్టాంటినోపిలు మున్నగు స్థలములకెగుమతి యగుచుండెను. పోర్చుగీసువారు వచ్చినపిమ్మట, మూరుల వ్యాపారమును వారుకొంత పంచుకొనిరి. కృష్ణదేవరాయలు సింహాసనమునకు వచ్చిన పిమ్మట పోర్చుగీసువారి మూలమున వేనవేలు గుఱ్ఱములును, అసంఖ్యాకములగు వివిధ యుద్ధోపకరణములును దిగుమతి చేయఁబడెను. రాయలకాలమునందు వ్యాపారమత్యున్నతదశఁగాంచెననుటకు సందియములేదు.

ఇక రాజ్యమునందలి యుత్పత్తులనుగూర్చి విచారింతము. గోధుమలు, వడ్లు, అనుములు, ఉలవలు, కందులు, సెనగలు మొదలగు ధాన్యములు సమృద్ధిగా పండి, చౌకగా విక్రయింపఁబడుచుండెను. పాంబను, మన్నారు సింధుశాఖలనుండి, యమూల్యములగు ముత్యములుతీయఁబడి విజయనగరమునకుఁ బంపఁబడుచుండెను. రాజ్యమునందు వజ్రపుగను లనేకములుండెననియు, వానినుండి వజ్రములు విరివిగా తీయబడుచుండెననియు, రాజు తనకు కావలసినవి తానుంచుకొని, మిగిలినవాని నమ్మించి విశేషలాభము పొందెననియు లిన్స్కోటన్ అనువాఁడు వ్రాసియున్నాఁడు. కర్నూలు అనంతపురము జిల్లాల ప్రాంతములనుండు వజ్రకరూరునందును, విజయనగరమునకు సమీపముననుండిన బల్లఘట్టము అను ప్రదేశమునందునుగల గనులనుండి, అమూల్యవజ్రము లసంఖ్యాకములుగఁ దీయఁబడుచుండెను. తురుష్కులు తల్లికోట యుద్ధానంతరము విజయనగరమును కొల్లగొట్టినప్పుడు కోడిగ్రుడ్డంత వజ్రమొకటి దొరకెనట. అది రాయల సవారి గుఱ్ఱపుముందరిజూలున కలంకారార్థము వ్రేలాడఁగట్టబడియుండెనట. "గేస్పా-డి-ఆర్టా" అను నతఁడు క్రీ. శ. ౧౫౩౮ సంవత్సరములో ఒకచిన్న కోడిగ్రుడ్డు ప్రమాణముగల వజ్రమును విజయనగరమునందు చూచినట్లును, అది ౩౧౨౪ క్యారట్లు తూకమున్నట్లును, 'ట్యావర్నియర్' అను చరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు. పదునాల్గవ శతాబ్దమున దక్కనునందు బంగారము తామ్రమువలె సమృద్ధిగా నుండెననియు దేవగిరి ఓరుగల్లు ద్వారసముద్రము మొదలగు రాజధానులనుండి మాలికాఫరు ౯౦ వేల మణుగుల బంగారును ఎన్నియో పెట్టెలనిండుగ ముత్యములును దోచికొనిపోయెననియు, ఫెరిస్టా అను మహమ్మదీయ చరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు. దీనినిబట్టిచూడగా, ఆకాలమున విజయనగర సామ్రాజ్యమున ధనలక్ష్మియథేచ్ఛగా తాండవమాడుచుండెనని వేఱుగా చెప్పనక్కఱలేదు.

## శిల్పకళ.

శ్రీకృష్ణదేవరాయఁడు, షాజహాన్ చక్రవర్తివలె శిల్పకళలయందు మిక్కిలి యభిమానముకలవాఁడు. పట్టాభిషేకమైనతోడనే సభామందిరమును పంపాపతిదేవాలయమునకు గోపురమును కట్టించెను. పూర్వ దిగ్విజయయాత్రనుండి మరలివచ్చిన తరువాత క్రీ. శ. ౧౫౧౩లో కృష్ణస్వామి దేవాలయమును కట్టించెను. అదేయేటు, తన నగరియొద్ద హజారరామస్వామికాలయమును కట్టించెను.

౧౫౨౮ లో ఉగ్రనృసింహ విగ్రహమొకటి చెక్కించెను. ఈ శిలామూర్తి మిగుల పెద్దదిగను, చూచుటకు భయంకరముగను ఉండును. తురుష్కులు విజయనగరమును కొల్లగొట్టినప్పుడు ఈ విగ్రహము ననేకచోట్ల పగులగొట్టిరి. ఐనను, అది యిప్పటి వఱకును దర్శనయోగ్యమై తనరారుచున్నది. దేవాలయములయందును, విగ్రహములందును గల చెక్కడపు పని మిగుల శ్లాఘ్యమై యున్నది. క్రీ. శ. ౧౫౨౧ సం॥మున కృష్ణరాయలు కొఱ్ఱగల్లువద్ద సస్యసమృద్ధి కొఱక ఆనకట్టను కట్టించి, అక్కడనుండి రెండు కాలువలను త్రవ్వించెను. అవి యిప్పటివఱకును ఉపయోగపడుచున్నవి. గోవానుండి పోర్చుగీస్ ఇంజనీయరొకనిని రప్పించి, రాజు పెద్దచెఱువొకటి త్రవ్వించెను. అతఁడు తన మాతృగౌరవార్థ మామెపేర నాగలాపురమను ఊరు కట్టించెను. అదియే, ఇప్పటి హోసపేట.

## రాయల గుణవర్ణనము

శ్రీకృష్ణదేవరాయల జీవితము, అతని గుణాతిశయములను వర్ణింపనిది పూర్తికాదు. పేయస్ అనునాతఁడు రాయలను బాగుగ వర్ణించియున్నాఁడు. శ్రీకృష్ణరాయల ఒడ్డుపొడుగులు అధికము కాకపోయినను చూపునకు గంభీరముగాఁ గనబడుచుండెను. అతని ముఖవర్చస్సు నిరుపమానము. దినదినమును దేహపరిశ్రమ చేయుచుండినందున, అతని యొడలు తాలివలె కర్కశమై బిఱ్ఱుపాటియుండెను. అతఁడెఱుఁగని సాములు కుస్తీపట్లును లేనేలేవు. అస్త్రశస్త్రముల ప్రయోగమునం దతఁడసమాన ప్రజ్ఞను సంపాదించెను. అతని దిగ్విజయములను గూర్చి విన్నవారికి, అతఁడు శౌర్య ధన పరిపూర్ణుఁడని వేఱుగా చెప్పనక్కఱలేదు. అతఁడు దయామయుఁడని రాయచూరి యుద్ధమే చెప్పుచున్నది. అతఁడు కట్టించిన గోపురములును దేవాలయములును అతని దైవభక్తిని చాటుచున్నవి. విష్ణుచిత్తీయమును వ్రాసినందున నతఁడు విష్ణుభక్తాగ్రేసరుఁడని తేలుచున్నది. అయినను శివద్వేషి కాఁడు. మత సహనము అతనియందు సంపూర్ణముగ నుండెను. రాజ్యమునందు మహమ్మదీయులును క్రైస్తవులును హిందువులతోఁ బాటు స్వమతావలంబులై యుండినదే ఇందులకు సాక్షి.

ఇంతటి గుణరాశియయ్యును, కృష్ణరాయలయందు కళంకము లేకపోలేదు. అతఁడహంభావభరితుఁడై, శత్రుత్వము పాటించిన రాజులయెడ కటుస్వభావము కలవాఁడై వర్తించెను. ఈ గుణములు కొంతమట్టుకు రాజులయం దుండవలసినవేకాని, అవి, విజయనగర సామ్రాజ్యమునకు హానికరములై పరిణమించెను. అదీల్ షాహ రాయచూరియుద్ధమునందోడిపోయిన పిమ్మట సం[illegible]ధి కొఱకతఁడు రాయలకడకు రాయబారమంపెను. అందులకు కృష్ణరాయఁడు "నాకాళ్ళపైఁబడి పాదములను ముద్దిడినఁగాని సంధికియ్యకొనను" అని జవాబునంపెను. ఇది వినఁగానే అదీల్ షాహయొక్క ఒడలు కోపోద్రేకముచేత మండిపోయెను. అప్పటినుండి బహమనీసుల్తానులైదుగురును విజయనగర సామ్రాజ్యనాశనమునకు బద్ధకంకణులయిరి. తుదకాగతికి తెచ్చువఱకును వారిరోషానలము శమింపలేదు.

రాయల కటుస్వభావమును, శత్రునిర్మూలన దీక్షయు భావికాలమున రాజ్యమునకు ముప్పుగా పరిణమించినను, అతని జీవితకాలముననవి, దక్షిణహిందూదేశమునందెల్లయెడలను అతని జయభేరిని మ్రోగింపఁజేసెననుటకు సందియమేమియు లేదు. ఈ గుణములు లేనియెడల సామ్రాజ్యమున కంతటి విస్తీర్ణతయు, వైభవమును ఒనగూడకపోయియుండునో-ఏమో-మనము చెప్పఁజాలము.

అతఁడు రాజ్యమేలిన యిరువదియొక్క సంవత్సరములలో నానాదిక్కులయందలి శత్రువుల లోఁబఱచుకొనెను. అఖండసామ్రాజ్యమును సంపాదించుట యేమి, యుద్ధమునకును యుద్ధమునకును గల వ్యవధియందష్ట దిగ్గజములనఁ బరఁగిన కవిపుంగవుల కవనముల నాలించి వారలకుఁదగు మర్యాద లొనర్చుటేమి, సంస్కృతాంధ్రములయందు ప్రవీణతఁగాంచి ఆముక్తమాల్యదాది గ్రంథముల రచించుటేమి- ఇట్టి ఘనకార్యముల నొనర్చిన- శ్రీకృష్ణదేవరాయఁడు సంవత్సరమున కొక్కసారియైనను మనకు సంస్మరణీయుఁడు కాకపోఁడు.

—రా. శ్రీనివాసరావు.

# తిమ్మరుసు

కఠినమై గ్రాలు చెఱసాల ♦ కటకటాల
ప్రక్క నోగిరము దెచ్చి ♦ బ్రాహ్మణుండు
తినఁడు కడసారి తినఁడని ♦ మనవిచేసి
గ్రుడ్డునకుఁ గుంచెడుగ నీళ్ళుఁ ♦ గ్రుక్కుచుండె.

*　　　*　　　*

బొసలు నెరసెను మేనున ♦ ముడుతలొదవె
వృద్ధుఁడొక్కఁడు చెఱఁబడి ♦ వేగుచుండె
శాంత వైరాగ్యముల, సది ♦ చింతఁ దెలుపు
చూపులం జెడు కన్నులఁ ♦ జూడఁడయ్య!
చెఱనుబడియుండె, నేరంబు ♦ చేయలేని
వృద్ధుఁడక్కట ! తప్పేమొ? ♦ వినఁడు వినఁడు !
ఆతఁడే యెద్దియో మాట ♦ లాడుచుండె.
"దుష్టబుద్ధులు సెప్పిన ♦ దోషములకుఁ
గష్టపతులక్కటా ! కూయు ♦ కారులకును
గుమతులాడెడు హితవగు ♦ కొండెములకు
రాజుచెవియొగ్గె ; మాట ని ♦ రాకరించె,
బంధివైచెను ; సనవులఁ ♦ బడయఁడకట !
కంటఁబడి కారణంబులఁ ♦ గఠినముగను
నడుగఁడదె పోనె దయఁజూపఁ ♦ డాయన నను
అయ్యయో ! నేరమెఱుఁగని ♦ యిట్టినన్ను
చంపివేయఁదలంచుట ♦ సాహసంబు !
సాహసము ! సాహసంబిది ♦ సాహసంబు !
ఇప్పుడేమందు? నననేల? ♦ యింతకంటెఁ
బాపమందునొ యంచు నే ♦ బరితపింతు
నాదు మరణంబునకు భీతి ♦ కాదు; విప్ర
ఘాతకుఁడు ! పాపి! నేరంబుఁ ♦ గనక చంపె
ననెడి యపకీర్తిపాలయి ♦ యణఁగుననుచు
భయమునొందెదఁ బ్రాణము ♦ లభయమె విడువ?
గీతఁజదివిన నాకిది ♦ చేతకాదె ? "
అనుచుఁ జెఱసాలనుండిన ♦ మనుజుఁడనఁగ
" సయ్యా! కాలంబు—! తిమ్మరు ♦ సయ్యా!వినుము!
తారుమారయ్యె, పడపుటఁ ♦ దరణివోడెచె ;
నాంధ్రరాష్ట్రంబు నీవేళ ♦ నదలిచితివి;
కోటలెన్నియొ జయమొంది ♦ గూర్చినావు ;
పుడమిసాధింపఖడ్గముఁ ♦ బూనినావు ;
శూరులెల్లరు భ్రాంతులై ♦ చూచుచుండ
క్షత్రియులమించి కదనంబు ♦ సల్పినావు ;
కలియుగంబున ద్రోణాది ♦ ఘనులమాడ్కి
విప్రశాపంబు శరశక్తి ♦ వింతఁ జూపి
భూరి కర్ణాటరాజ్యంబు ♦ బొంగరముగఁ
ద్రిప్పినాఁడవు; కాలంబు ♦ తిరుగబడియె ;
శత్రురాజులఁ బెక్కండ్ర ♦ జయమునొంది
చెఱకుఁ బంపిన నీ వయో ♦ చెఱనుబడితి
వక్కటా! కత్తిఝుళిపింపు ♦ లడఁగిపోయె ;
ప్రేమ నప్పాజి యనియెడు ♦ పిలుపుపోయె;
రాయలే శత్రువై పోయె ♦ రామ! రామ !
కన్నులెఱ్ఱఁగఁ జూచిన ♦ గడగడేది ?
దూరమునఁ జూచి యెదురేగి ♦ గారవమున
బ్రక్కఁ గూర్చుండఁ జేసెడి ♦ పరువమేది?
కావ్యముల్చేసి చూపెడి ♦ గౌరవంబు
కత్తిఁ జూపింపుటాయెఁ గాఁ ♦ గాలమహిమ !
రాజుతోఁ జెల్మి పాముతో ♦ రాగమట్టు
లెప్పుడో ప్రాణముల్దీయు ♦ నెఱుఁగకుండఁ
గాకయుండినఁ జెఱఁబెట్టి ♦ కలఁచు నాతఁ
డట్టులుంపక ఘోరంబు ♦ నకట! తలఁచు—
తలఁచుటేమిక నన్నియుఁ ♦ దథ్యమయ్యె
దైవమున్నేఁడు మదిలోనఁ ♦ దలఁచి సుఖము
పొందు మీనాఁడె కన్నులఁ ♦ బొడిచివేయ
నాజ్ఞపుట్టెను రాజాజ్ఞ ♦ యగును తండ్రి!"
అనుచు నన్నంబు తెచ్చిన ♦ యతఁడు వల్క
కన్నులను నీరు గారఁగఁ ♦ గడచిపోయె
యోజనమ్మనిఁగియున్న యా ♦ యోధువీడి.

*　　　*　　　*

శిరముపంకించె నామంత్రి ♦ శేఖరుండు
పొడుగు నిట్టూర్పు నొక్కటి ♦ విడిచె నపుడు,
విజయయాత్రలఁ దనమనో ♦ వీథిఁ జూచి
ముక్కుతో రెండుమారులు ♦ మూల్గి నవ్వె
యోజనంబులు పోయిన ♦ యోజనములు

శిరముమండింపఁ దోఁపక ♦ కరమునిసిగి
ఫాలతలమునఁ జేయిడి ♦ పాలుపోక
"సతిని బిడ్డలఁజూడంగ ♦ సమయమీఁడు
వారలకు ముందుగతిఁజూప ♦ వరమునీఁడు
నేరమున్గూర్చి యడిగెడు ♦ నీతిలేదు
బయటవిడిచిన కష్టంబు ♦ పడెదరనెడు
క్రొత్తమంత్రుల మాటలు ♦ కూర్చెనింత!"
అనుచుఁదలఁపోసి విసువున ♦ నవనివ్రాలె.

* * *

* * *

వైష్ణవంబున కిప్పుడు ♦ వనరుమీరె
భూపతియు వారిచేతుల ♦ బొమ్మయయ్యె,
"ఒక్కగానొక్క పుత్రుఁడు ♦ దక్కకుండఁ
జంపి తనసుతుఁగద్దెపై ♦ నుంచిచూచి
కులుక నెంచెనే? మనుజుఁడే? ♦ క్రూరుఁడయ్యె
నెంతపనిచేసె తిమ్మరు ♦ సెట్లుమారె!"
ననుచు రాయలు దుఃఖము ♦ నందఁజూచి
"మిమ్ముజంపక రాజాజ్ఞ ♦ మీరలేదె?
చంపినట్లుగ నజనేత్ర ♦ మంపలేదె?"
కొండెకాఁడిట్లు తరియని ♦ కొరికెఁ జెవుల,
నచ్చె రాయలకామాట ♦ లిచ్చగించె
దుఃఖభారంబు బుద్ధిని ♦ దోఁపనీదు
తనకు రాజ్యంబునిచ్చిన ♦ దాత యతఁడు
చేతులారంగ నిట్టులుచేయఁ ♦ గలఁడె
మంత్రితిమ్మరుసిట్టుల ♦ మాయచేసి
కొడుకుఁబలెఁ బెంచినట్టి త ♦ న్బుడమిఱేని
చేతులారంగఁ బెండిలి ♦ చేసిచూచి
తానెవేసిన మొక్కను ♦ దానె త్రుంప
సాహసించునె యని మది ♦ నూహలేదు;
విప్రుఁడయ్యుయు శిశుహత్య ♦ వెఱపులేక
చేయునే యని తలఁపఁడు ♦ చెడ్డబుద్ధి;
మతమువారల మాటలు ♦ హితములయ్యె ;
అయ్యవారల మాటల ♦ నతఁడునమ్మె ;
మంత్రిబంధింప వెంటనే ♦ మాటనిచ్చె;
గాలవశమున బుద్ధి సం ♦ గతులుమారి
పోవ పుణ్యమె పాపమై ♦ పోవునేమొ ?

* * *

కినుకనుండుట వైష్ణవుల్ ♦ కీలెఱింగి
హృదయశల్యంబు వాపంగ ♦ నదనటంచు
నేరముల్ జెప్పి ముద్రిక ♦ కోరితెచ్చి
గ్రుడ్లుతీయంగనాజ్ఞను ♦ గూర్చివ్రాసి
పత్రమునసద్ది యప్పుడే ♦ పంపిరకట !
రాయ లెఱుఁగఁడు వీరి దు ♦ రంతమంత.

* * *

కటికివాఁడక్కటా! నాల్గు ♦ కాసులంద
గత్తిచేఁబూని చెఱసాల ♦ కడకుఁబోయె;
బీగమున్దీసి ద్వారము ♦ భీతిఁదెఱచె;

* * *

"వచ్చితివె? రమ్ము! నీపని ♦ నాపుకొనుము.
రామ! శ్రీరామ! రామయ్య! ♦ రామచంద్ర!"
అనుచుఁ గనుమూసి తిమ్మరు ♦ సయ్య పలికె;
గుండెనీరయ్యె, భటునకు ♦ గ్రుడ్లనీరు
గ్రమ్మె, గాత్రమువణకెను ♦ గత్తిజారె ;
"ఏమి? రావేమి? భటనీతి ♦ నెఱుఁగవేమి?
మాటలాడకు జంకకుఁ ♦ బోటులెవ్వి?"
అనఁగ గర్జించుసింగంబు ♦ గనినలేడి
వణుకుచుండెడి భాతి నా ♦ భటుఁడువణకె;
"బాబు! పొడువంగఁజాలను ♦ బాకుతోడఁ
బొడుచుకొని నేనె ప్రాణముల్ ♦ విడుతు"ననెను.
"భయమునొందకు వృద్ధుఁడ ♦ భయములేదు"
"పాపమయ్యా!" "రాజాజ్ఞకుఁ ♦ బాపమేమి"
"కొలువునిచ్చిన ప్రభువులఁ ♦ గూల్చుటెట్లు?"
"మఱచిపొమ్మది నేను తి ♦ మ్మరుసుగాన్,
నీవు చంపకయుండినఁ ♦ జావులేదె ?
ఇంకొకఁడు వచ్చుఁ జంపఁగ ♦ నేల వెత్తె ?
ఇంక నెన్నాళ్ళు బ్రతుకుదు ♦ నేదినిలుచు?
రమ్ము! పొడువుము! మీరకు రాజునాజ్ఞ!"
"రాయలిదె వచ్చె! రాయలు! రాయ"లనెడు
పరిజనంబులతొందర ♦ భటుఁడుచూచెఁ,
దన్నెచంపునో యనుభీతిఁ ♦ దల్లడిల్లి,
భయముతోఁ గత్తినెత్తెను ♦ బలముఁగూర్చి,
వడిగ వచ్చెడు నడుగుల ♦ సడులువినుచు

వెఱపుతోఁ గత్తిఁ గ్రుచ్చెఁ ది ♦ మ్మరుసుకనుల;
రెండుపోటులు కన్నుల ♦ నిండిపోయె ;
రక్తధారలు కండలు ♦ రావె? గ్రుడ్లు!
"ఆగుమాగుము పొడువకు ♦ మాగు"మనుచు
జేత నదలించుచును గత్తి ♦ జీరువార
పట్టుసరిగంచు టొల్లివా♦టట్టెజార
ధవళవస్త్రంబు కాళ్ళ బం ♦ దాలుగాఁగఁ
బరుగులెత్తుచు వే రాయ ♦ లఱుగుదెంచె.

* * *

తెల్లబోయెను భృత్యుఁడు ♦ "తీర"ననెను
మంత్రి పడిపోయె మూర్ఛలో ♦ మాటలేదు.

* * *

"ఏమి? యేమవి? కన్నులే! ♦ యేమి"యనుచుఁ
గనుల నీరెండ రాజు ని♦ర్ఘాంతపడియె
ఱెప్పవాల్పలే దూపిరి ♦ త్రిప్పలేదు
"రాజ్యమిచ్చిన మంత్రి నా ♦ ప్రాణములను
గాచి రక్షించినట్టి యా♦ఘనుని నకట!
ప్రేమ నీతులఁ జెప్పన♦ప్రెగ్గడ నహా!
గద్దె నెక్కించి మనిచిన♦కార్యవాదిఁ
బెండ్లిసేయుచుఁ బ్రాణముల్ ♦ పెరలుతీయఁ
బ్రాణమడ్డుగనుంచిన ♦ ప్రాణదాతఁ
గత్తికట్టియు శత్రులఁ♦గదనమునను
దోడునీడగఁ దెరలించి ♦ తోడుపడిన
తండ్రియంతటి మంత్రినిఁ ♦ దప్పుదలఁచి
నీతిమఱచితి కర్మంబు ♦ లాతిమతము
వారు నాచిన్ననాఁటి యా♦వార్తఁ దెలిపి
"మోసమీతనికడనుండె♦మొదటినుండి
రాజునకు ద్రోహము జ్జేయు♦రాక్షసుండు"
ననఁగ నామది వారల♦నాదరించె,
మోసమంతయుఁ దెలిసెను♦నాసుతుండు
మంత్రిచేఁ జావలేదను ♦ మాటవింటి,
దైవముగఁ బూజలొనరించు♦తండ్రినకట!
చంపినాఁడేను దుష్టుఁడఁ♦జావురాదు
ఏమిసేయుదు బ్రతుకుట ♦ లెందులకిఁక.

* * *

ఇటుల వాపోయి యటునిటు♦నెఱిఁగిచూచి
"స్వప్నమా? భ్రాంతియా? యిది♦సత్యమగునె?"
అనుచు నారాటమొందెడు♦నతనిమంత్రి
రక్తధారలు గారఁగ ♦ రాగమొదవ
చెంపపైఁగారురక్తంబు ♦ చేతనూడ్చి
నాల్కతడబడ మాటలు ♦ పల్కలేక
చేతితో నూరడిల్లంగఁ ♦ జేసెసన్న ;
రాయలదిచూచెఁ గన్నుల♦రాలె జలము!

* * *

ఇంతలో నెవ్వఁడో వచ్చి♦యేడ్పుతోడ
"మంత్రిభార్యయు బిడ్డలు ♦ మరణమొంద
గ్రుడ్లుపొడిచితి"నని చెప్పి ♦ కూలఁబడియె
"హావిధీ!"యంచు రాయండు♦నచటఁబడియె
చాపచుట్టుగ దుఃఖంబు ♦ నాపలేక.

* * *

"దోషమెఱుఁగని బిడ్డల♦దుష్టబుద్ధిఁ
జంపుమంత్రులచే నిఁక ♦ జరుపుకొనుఁడు!
అస్తమించెను మనసూర్యుఁ♦డస్తమించె!
ధర్మవిద్యల నగరంబు♦దగ్ధమయ్యె!
రాయలిట్టుల మోసంబు♦చేయఁబడియె!
కన్నడంబున నిఁక లక్ష్మి♦కదలిపోవు!"
ననుచు వణకుచు గుండెల ♦ నణచుకొనుచుఁ
తనకుఁ జుట్టును జేతులఁ♦దడవుకొనుచుఁ
బాదములయొద్దఁబడియున్న♦బ్రభునిఁబట్టి
కాయమునఁ జేర్చి బిగియారఁ♦గౌఁగిలించి
"నీకు దైవంబు సుఖమిచ్చు♦నెనరుతోడ
నెఱుఁగకయె చేయుతప్పుల♦మఱవఁగలఁడు
సుఖమునొందుము నీవెనా♦సుతుఁడవగుము!"
ఇట్టిప్రేమంపుమాటల ♦ నెన్నొపల్కి
వేడికన్నీరునకుమాఱు ♦ వెడలుచుండ
వేడికన్నీళ్ళతోఁ జేరి ♦ వెడలుచుండు
రక్తధారలఁబడిపోయె ♦ రాజుమీఁద
బట్టలన్నియు గదియంత ♦ భయముగొల్పు
శుద్ధభీభత్సపటమూపుఁ♦జూపునటుల!
మంత్రిపడిపోయె, కదలఁడు! ♦ మాటలేదు!

* * *

మంత్రిమాటలు పిడుగులై ♦ మాడ్చివేయ
భటులు రాయలఁగోటకు ♦ నెటులొ చేర్ప
లోనికేగెను నేలపైఁ ♦ బూనెళయ్యె;
నాఁడు మొదలుగ రాయలు ♦ గోడు నెడియె;
దుఃఖవార్ధిని మున్గెను, ♦ తోడు లేదు;
పెద్దనాదుల మాటలు ♦ ప్రియము కావు;
ఆలుబిడ్డల దరిఁ జేరఁ ♦ డాయె నెపుడు
నొడలు తేల్గుట్టినట్టులఁ ♦ బడసె బాధ;
విప్రుఁ జంపిన పాపంబొ? ♦ వెఱ్ఱిభ్రమమొ?
కృష్ణరాయండు లేవఁడు ♦ క్రీడు నెంచు
కుడువఁడన్నంబు నేమియు ♦ నడుగఁ బోడు
లేవలేదింక మరణంపుఁ ♦ ద్రోవఁ ద్రొక్కె
'మంత్రిపాదములను బట్టి ♦ మన్ననలను
బడయుటకుఁ బోలు'నని జను ♦ ల్పలికి రకటా!

* * *

విజయ నగరంబు పిమ్మట ♦ వృద్ధిగనదు!
వీరలోకంబు నిఁక నట ♦ వృద్ధిఁగనదు!
ముష్కరంపు తురుష్కుల ♦ మూకలయ్యె!
పట్టపగ లాలుబిడ్డలఁ ♦ గొట్టి చంపఁ
జూచు శూరుల కన్నుల ♦ జురుకులయ్యె
విగ్రహంబుల మూతులు ♦ విరిగిపోయె!
ధర్మహర్మ్యంబులన్నియుఁ ♦ బాడుపడియె!
కోటగోడలు క్రమముగాఁ ♦ గూలిపోయె!

పురములోపల నిండ్లన్ని ♦ బూజుగట్టె!
గుళ్ళపై గుడ్లగూబల ♦ కూతలయ్యె!
లయకరుండగు నటరాజు ♦ లాస్యమాడె!
కాళి కంకాళి శక్తులు ♦ గ్రమ్ముకొనియె!
భూత ప్రేత పిశాచముల్ ♦ బొదలిపోయె!
పాడుపడిపోయె! దిబ్బలు ♦ బీడులయ్యె!
ముళ్ళు మొక్కలు నెల్లెడ ♦ మొలచిపోయె!
క్రీచురాల్ నక్కలక్కడఁ ♦ గేరుచుండె!
కవుల గ్రంథములన్నియు ♦ గంగఁగలిసె!
మాధవుఁడు సాయణుఁడు ♦ గట్టి చుని చినట్టి
విద్యానగరంబు లేదిఁక ♦ విధివిధాన
మకటా! వేదభాష్యంబు ♦ లాడుచోటఁ
బులులు నక్కలు నాడంగ ♦ నలువ వ్రాసె!
హృదయమున్నట్టి నరులెల్ల ♦ నేడ్వవలసెఁ!
దెలుఁగువారలు దీనులై ♦ మెలఁగవలసె!
మంత్రిగా నుండవలసిన ♦ మనుజు బాధ
లొందగాఁ జేసి యేన్పుఁ ♦ డందెసుఖము!

* * *

"విప్రుచే వృద్ధిఁ గాంచెను ♦ విజయనగరి
విప్రుఁ జంపగ నశియించె ♦ విజయనగరి"
యనుచుఁ బ్రజలెల్ల నెల్లెడ ♦ నాడుకొనిరి.

—వసంతుఁడు.

# "తెనాలి" తాలూకాయందలి గ్రంథాలయములు.

కడచిన గ్రంథాలయచరిత్రకు చరిత్రనంపినవి ౨౨ను, చరిత్ర నంపనివి ౧౬ను కలసి ౩౮ గ్రంథాలయము లీతాలూకాయందున్నవి. ఇవియేగాక యింకను వల్లభాపురము పిడపర్రు, అయితానగరప్పాలెము, తెనాలి, వోలేరు, తుమ్మపూడి, మున్నగుచోట్లను గ్రంథాలయములున్నవి. తాలూకా గ్రంథాలయసంఘ మేర్పడినది. ఇందన్ని గ్రంథాలయములను జేర గోరబడినవి. కాని కొన్ని మాత్రమే చేరినవి. ఈతాలూకా గ్రంథాలయసంఘమును గూర్చి ప్రత్యేకము నివేదింపుకొననుంటిని. కాన ప్రస్తుతము గ్రంథాలయముల సహజస్వభావముల నతిస్వల్పముగ నిందుదహరించుచున్నాను.

ఈ గ్రంథాలయముల యథార్థస్వరూపస్వభావముల నెరిగికొన నేనొకటి రెండుమారులు తాలూకాయందు సంచార మొనరించితిని. ఏయయిదారు గ్రంథాలయములఁ దప్ప మిగిలినవాని నన్నిటిని నేను స్వయముగా జూచితిని. నా జూచినంతలో గ్రంథాలయచరిత్రకు సరిపడు నములనే గలిగియున్నవి. ఏపొరబాటుననో ఒకటరే. స్వల్పవిభేదములున్నను అవి నిరసనాపాత్రములు.

గ్రంథాలయములన్నియు గ్రంథాలయతత్వము నాచరణలో బెట్టుచున్నవని నేను సాహసించి వ్రాయలేకున్నను ఈయుత్సాహమే, యీపూనికయే, భావికాల గ్రంథాలయోద్యమాభివృద్ధికి శుభసూచకమన వచ్చును.

రేవేంద్రపాటి వీరేశలింగ పుస్తకభాండాగారమును, శృంగారపురం జ్ఞానదాయినీ గ్రంథాలయమును, పెదపాలెము ఆర్య బాలసమాజమును, పెరుకలపూడి జ్ఞానోదయ పుస్తక భాండాగారమును, ఈమని శ్రీనివాస సమాజమును, సంగం జాగర్లమూడి సర్వజన విద్యాప్రదాయినీ పుస్తక భాండాగారమును, కోరినవారి కుచితముగ గ్రంథముల నింట్లకిచ్చుచున్నవి. కోరినవారి కెట్టియాభ్యంతరమును లేక గ్రంథము లింట్లకియదగునను నిబంధనతో నటులొనర్చుచున్న యీ గ్రంథాలయముల కార్యక్రమ మెంతయు ప్రశంసాపాత్రము. దుగ్గిరాల భాషాభిలాషిణీసంఘము స్త్రీలకును, సాంఘికేతరులకును గ్రంథముల నింట్లకు కొన్ని కట్టుబాటులతో నిచ్చుచున్నది. మిగిలిన గ్రంథాలయములు చందాదారులకే గ్రంథముల నింట్లకిచ్చును. అన్నిగ్రంథాలయములలోను చందాదారులుకానివారు గూడ తెరచియుండినకాలములో నిరభ్యంతరముగ వలసినపత్రికలనో గ్రంథములనో చదువుకొనవచ్చును. శృంగారపురము జ్ఞానదాయినీపుస్తకభాండాగారమును, తెనాలిజార్జిధర్మపఠనమందిరమును, ఈపూరు జ్ఞానప్రవర్ధనీసమాజమును పాఠశాలలద్వారా బీదలవిద్యాభివృద్ధికి తోడుపడుచున్నవి. అనంతవరము భారతీవిలాస విద్యానిలయము మాత్రము ప్రత్యేక మొకబాలికాపాఠశాలను నెలకొల్పినది. సంగం జాగర్లమూడి శ్రీవాగీశ్వరీ నిలయగ్రంథాలయమును, కూచిపూడి సరస్వతీనిలయమును, దుగ్గిరాలసంఘమును బాలబాలికల జాతీయవిద్యాభివృద్ధి కనువగు కొన్ని పరిషత్తుల నేర్పరచి వానిని సాగించుచున్నవి. కొల్లూరువిద్యార్థిబృందము బీదబాలురకు విద్యార్థివేతనము లొసగుచున్నది. ఈతాలూకాలోగల గ్రంథాలయములన్నిటిలోను కొలకలూరు రాధాకృష్ణగ్రంథాలయముమాత్రము ప్రత్యేకమొకరి హక్కుగా భావింపబడుచున్నది. అట్లుండియు కొందరిచే కొన్నిగ్రంథముల నేని చదివించుచున్నదని వినుటయు సంతసము. ప్రస్తుతము కూచిపూడి బాలురవిద్యాభివర్ధనీసంఘము, క్రాప సుజనవిధేయ సంఘము, తెనాలి యంగుమెన్సు ప్రోగ్రెసీవు అసోసియేషనులు మూయబడినవి. స్థాపకులును కార్యనిర్వాహకులును విద్యార్థులై గ్రామాంతరములం దుండుటయును, గ్రామములయందు చదువరు లంతగ లేకుండుటయు, ఉన్నవారికి గ్రంథాలయోపయోగ మగ్రాహ్యమగుటయును ఇవి మూయబడుటకు గల కారణములు. కనుక ఇకముందేని గ్రంథాలయ కార్యనిర్వహణ భార మెప్పుడును గ్రామములో నుండువారియందే ఉంచుట ఉచితమనియు, గ్రంథాలయాభివృద్ధికి శుభప్రదమనియు గ్రంథాలయ స్థాపకులగు ఆంగ్లవిద్య నభ్యసించువారికి మనవిచేయుచున్నాడను. దంతలూరు బాలభారతీసంఘము, నందివెలుగు స్వదేశీయ వాణీరత్నాకరము, చినపరిమి అగ్రహారము వీరశైవపుస్తకభాండాగారము, వరహాపురం ఆంధ్రభాషాభివర్ధనీసంఘము, పెదపద్రు, అయితానగరప్పాలెముల గోక్లేపుస్తకభాండాగారము- వీటిని నెలకొల్పినవా రుత్సాహవంతులును ఉదారహృదయులు నగు యువకులేకాని, వారియుత్సాహమునకు తగినంత కార్యదీక్షతో కృషిసల్పినకాని యీగ్రంథాలయములభివృద్ధినంద నేరవు. పరోపకారచింతతో నూతనపక్కాని కార్యోపక్రమణముచేసి గ్రామస్థులయభిమానముల నందికొని కర్తవ్య కార్యనిర్వాహకు లగుదురుగాకయని యీ గ్రంథాలయముల వారిని కోరుచున్నారము. కార్యనిర్వాహకులు తమ విధిని సక్రమముగ నెరవేర్చినచో యీమని శ్రీనివాససమాజ మిదివర కెంతటి యున్నత దశయందుండెడివో? దాని కార్యకర్తయే తాలూకాగ్రంథాలయసంఘ సహాయకార్యదర్శులుగ నెన్నుకొనబడిరి; గనుక శ్రీనివాససమాజమిక ముందేని యభివృద్ధిని గాంచుచు దాపున నున్న మోరంపూడి విద్యాభిలాషిణీసంఘమునకు మార్గదర్శనియగుగాక! పెదపాలెము ఆర్యబాలసమాజమునకును, దుగ్గిరాల భాషాభిలాషిణీసంఘమునకును, సంగంజాగర్లమూడి సర్వజనవిద్యాప్రదాయినీగ్రంథాలయమునకును స్వంతభవనములు గలవు. రేవేంద్రపాటి వీరేశలింగపుస్తకభాండాగారమునకు భవన మర్పింపబడ సిద్ధముగ నున్నది. అనంతవరము భారతీవిలాస విద్యాని

లయమునకు భవనము తయారగుచున్నది. ఈ తాలూకాలో 'రిజిష్టరై'న దీగ్రంథాలయమొక్కటియే! మూలపూరు శ్రీమదిందిరా నిశాంతగ్రంథనిలయమునకును, పెదరావూరుబాలసమాజమునకును భవనముల నిర్మింప వాగ్దానములు జరిగినవి. కొల్లిపరవాణీవిలాస విద్యానిలయమును, మోరంపూడి విద్యాభిలాషిణీసంఘమును, అమృతలూరు ఉభయభాషాసంజీవనీసంఘమును, జాగర్లమూడి శ్రీవాగీశ్వరీనిలయమును, కొల్లూరు విద్యార్థిబృందమును, ఈమని శ్రీనివాససమాజమును భవన నిర్మాణప్రయత్నములొనర్చుచున్నవి. కార్య నిర్వాహకుల సంతతపరిశ్రమచే నీగ్రంథాలయములకు త్వరలోనే స్వంతభవనములబ్బును గాక! స్వంతభవనము లేర్పడినగాని గ్రంథాలయముల స్థిరత్వము నిశ్చయింపబడదు. స్థిరత్వము నిశ్చయింపబడినగాని గ్రంథాలయోద్యమ తత్త్వము గ్రాహ్యమై ఉపకరింపదు. కాన ఆంధ్రభాషోద్ధారకులగు ధనవంతులెల్లరు శారదామందిరముల గట్టింప ప్రార్థితులు.

ఈతాలూకాలోగల గ్రంథాలయము లన్నియు సాలునకు దాదాపిరువదివేల గ్రంథములను, కొన్ని వార్తాపత్రికలను జనసామాన్యముచే చదివించి విజ్ఞానవ్యాప్తికి తోడగుచున్నవి. దాదాపు ముప్పది గ్రంథాలయములు గ్రంథాలయసర్వస్వము మొదటిసంపుటమును దెప్పించినవి. ఈతాలూకాలోని కొన్ని గ్రంథాలయములు "ప్రారంభవిద్యాభివర్ధనీసంఘము"నుస్థాపించి ఉచితకృషినొనర్చుచున్నవి. అత్తోటయను గ్రామమున హార్డింజిపేరపాఠశాల నెలకొల్పబడి దాదాపు ౧౦౦ బాలబాలికల కుచిత విద్యనొసగుచున్న దీసంఘకృషియే! ఈసంఘాభివృద్ధితో పాటు గ్రంథాలయాభివృద్ధికిని తోడ్పడ తెనాలితాలూకా వాసులను మరిమరి గోరుచున్నాను. ఈతాలూకాయందంతటను ఆంధ్రదేశగ్రంథభాండాగారసభవారి యేర్పాటు ప్రకారము గ్రంథాలయ పరిపాలనా పద్ధతుల నాచరణలో పెట్టుటకు యోచనమొనరింపబడుచున్నది. గ్రంథాలయజీవనమున కాధారప్రాయమగు గ్రంథవిభజనపట్టిక కెదురుచూచుచున్నాము. అదిబయల్వడినగాని గ్రంథాలయ పరిపాలనా పద్ధతు లొకే రూపమును దాల్పవలనుగాదు.

—సత్తెనపల్లి హనుమంతరావు.

## వృద్ధదాసి

ఉ. ఇంటివసారపంచ నును
పెచ్చిన ఓటిని బెద్దవాయిపై
కంటనుబోసికొంచు, లవ
ల్లన రుబ్బుచుఁ, జుట్టుఁ ద్రోయుచున్
మంటికి నెత్తుగా నిటు క
మర్చుచునుండిన వృద్ధదాసి తా
నొంటిగ నాత్మలో నెద్దియొ
యోజఁగుమారిలుచుంటఁ గాంచుచున్.

మ. "ముసలీ! రుబ్బగ జబ్బసత్తువుడిగెన్
బో? పూటయన్నంబునున్
పసిగాఁ బెట్టుటలేదు పో? యటుల వి
స్తారంబు బొవ్వంబు లా
వెస రాలంగను నేడ్చెదేటికె యనన్
వేవేగ మోఁజేయిఁ గన్

గొసలన్ ద్రాముచు నూర్పుఁబుచ్చి పనిచేఁ
గొంచిట్లు మాటాడెడున్.

ఉ. "నాన్నయగారు! ఏటికి వి
నంగను నాదగు చిత్రగాథ, యెం
దున్నది తీర్పలేరుగద,
యుత్తములెక్కడొకాని యిండ రా
పన్నులపాట్లు లెక్కగొనఁ
బ్రాతది యయ్యెను గష్టజీవనం
బెన్నఁగ నాకు, నింకను ని
సీ! యనిపించఁగ నేల నోటితోన్.

క. కానీ యడిగినవారలు
కానన్ నోడువంగనయెడుఁ ♦ గలిమినికొన్నా
లైన యనంతర మకటా!
ప్రాణంబుల లేమి నీడ్వ ♦ భారముకాదే?

ఉ. పుట్టినదాన తూరుపునఁ
బున్నెము లచ్చియుఁ దూగు కాఁపురన్
బట్టినికాఁ, బెఱింగితిని
నట్టిలుఁ బాయమువీఱు, వస్తువుల్
పెట్టుక పెండ్లియాడితిని
పేరును మోసిన పెద్దకాఁపు ; నా
పట్టిననోము లేవయెనో ?
భర్తగతించెను గొన్ని నాళ్ళకే,
కట్టడిముండమోత ననుఁ
గానఁగ నోపక నాదు బందుగుల్
పట్టున నొక్కజవ్వనిని
భర్తగఁ జేసిరి మాఱు ; వింత క
ల్పట్టెడు నేమొ మీకు ? నల
వైపున మాకొలమున్ మగండు పో
పట్టున నేడుమాఱులు వి
వాహము కానగునంట ; అంతటన్
పట్టనముల్ విదేశములు
పాయక యిర్వురమట్టెపోవుచున్
గట్టివయస్సుచే విడెను
కష్టఫలంబును కూడవెట్టుచున్
బొట్టెల నిద్దఱన్ గనుచుఁ
బొందుగఁ గాపుర మొక్క కొన్ని నా
ళ్లెట్టులొ పుచ్చఁగల్గితిమి ;
ఇంకఁబయిన్ దలక్రిందుకానకా
పట్టిన సుంత కల్మిని న
భాగ్యత నాపతి త్రాగుడందులన్
దిట్టతిమాయ నాసవతు
ద్రిప్పుల వేనను దాన సంతయున్
జెట్టి దరిద్రతన్ మిగిలి,
పేదరికమ్మన నన్నుఁ గోసి, యా
మట్టునెపోయెఁ, గొంపయును
మాన్యము లప్పులపాలుసేసె, నీ
పొట్టను పోసికొమ్మనుచుఁ
బోవిడిచెన్ ననుఁ, జిన్నికుఱ్ఱలన్.

గట్ట! యటంచు మోసికొని
కంఠమునందలి గుల్లగుట్ట నే
గుట్టున దాచుకొన్నయవి
కొంచును నమ్మక గౌరవంబునన్
గుట్టునఁబెట్టి చాలవఱకున్
జరిగించితి ; బెద్దవాఁడు న
ట్టిట్టుఁ బొలంబు కూలిపని
కేగుచుఁ దేగలవాఁడుకాఁగఁ గన్
గుట్టెనో పాముదైవమునకున్
బడె నల్ల విషూచి వానినిన్
బొట్టను వెట్టుకొంటి ; నటు
పోయినఁ జావక చిన్నివానినిన్
బెట్టుకయుంటి ; దెచ్చుకొన
వేఱుగ సాధనమేమిలేమి నేఁ
డిట్టుల మీకు దాసినయితిన్ —
గలయన్నిదినాలు శక్తిమై
గట్టును దాటగన్ దగదె ?
కాని కటా యదియున్ జరాప్తిచే
మట్టుపడెవిధమ్ముగను
మానసమున్ వెఱపించుచుండె నీ
ర్వట్టిన యుల్వలే నలుగు
పాటవమున్ గనజాలకుంటి నిం
కెట్టి యవస్థపట్టునొకో
క్షుత్తగ నేయునె బిచ్చమున్న నం
చుట్టిని నూగులాడుచును
నూరకె యేడ్చితిఁ వేఱుకారణం
బెట్టిదిలేదు లోపమున
కేయిడువారలు మీర లన్నియున్.

క. అనుచున్ జెప్పెడు లోపల
పనియయ్యెను నదియునంత • బాబయగారూ !
చనెదనటంచును బోయెను ;
గనుజూపుల జాలివెల్లి • గా వెనుఁబఱఁగన్.

—కవ్వకొండల వేంకట్రావు, బి.ఏ; బి.యల్.

# ఆంధ్ర భాష

"స్వస్థానవేషభాషా భిమతాస్సంతోరసప్రలుబ్ధధియః । లోకేబహుమన్యంతే । వైకృతకావ్యానిచాన్యదపహాయ" అను సూక్తి చొప్పున నెల్లవారికిని స్వకీయవేషభాషలం దభిమానము వెలయుచుండుట స్వాభావికమె. అభిమానమెంతయున్న నేమి? దేశీయుల సామర్థ్యాదులనుబట్టిగదా భాషయు నభివృద్ధిని గాంచుచుండును. దేశీయు లసమర్థులయియుండునపుడు వారి యభిమానము దేశభాషలకేమి యుపకారము చేయఁగలుగును? దేశీయులు సుఖస్థితిలేక పరచక్రాదిభయముచేతను దారిద్ర్యాదులచేతను బీడితులగుచున్నపుడు వారివలన దేశభాషలకేమి యుపకారము సంభవించును. కాఁబట్టి సర్వవిధములచేతను దేశాభివృద్ధియే భాషాభివృద్ధికి మూలకారణమని చెప్పుటకు సందేహము లేదు.

దేశభాషలకును సంస్కృతమునకును, నాంగ్లకళాశాలలందు గొంత ప్రాధాన్యము నిచ్చియు 'విద్వాన్' 'శిరోమణి' మొదలగు పరీక్షలను ప్రత్యేకముగా నియమించియు, నాంగ్లప్రభువులు గొంతవఱకుఁ బ్రోత్సాహము నిచ్చుచున్నారు. ఆంగ్లేయభాషయం దాఱితేఱిన మనవారు పాశ్చాత్యుల నాగరికతను మన భాషావాఙ్మయములకుఁ గొంతవఱకుఁ జవిచూపుచున్నారు. దేశభాషామయములగు గ్రంథమాలలు పత్రికలును బయలువెడలి భాషావాఙ్మయములను బోషించుచున్నవి. ముద్రణాలయములు వ్యాపించి వాఙ్మయాభివృద్ధికిఁ దోడ్పడుచున్నవి.

అట్లయినను దురదృష్టవశమున మనవారు తమకుఁగల యుత్సాహమునకుఁ దగినట్లు మంచియత్నములను జేయకున్నారు, కొన్నివిషయములందుఁ జేయఁజాలకున్నారు. పత్రికాధిపతులు తగిన పండితులను సంపాదించి భాషావాఙ్మయవిమర్శనములను వృద్ధిచేయకున్నారు. అత్యుత్తమభాషతోఁ దమ పత్రికలను వ్రాయకయు, భాషాపోషకవిషయముల కధికముగాఁ బత్రికలందుఁ జోటీయకయు, నేవో కొన్ని విషయములను నేదోయొక విధమయిన భాషతో నింపుచున్నారు. ఇఁక గ్రంథకర్తలు తగిన భాషాజ్ఞానమును సంపాదింపకయె గ్రంథరచనమునకుఁ దలపడుచున్నారు. ఇందులకుఁ దగిన కారణము లేకపోలేదు. దేశభాషలు రాజభాషలు కానందున నున్నతపదవుల నందుటకుఁగాని ధనసంపాదనము చేయుటకుఁగాని సహాయకారులు కాజాలకున్నవి. కావుననే సామాన్యముగా బుద్ధిమంతులెల్ల నాంగ్లేయ భాషాభ్యాసముతోడనె తమ విద్యాభ్యాసకాలమునెల్ల వినియోగించుచున్నారు. హైస్కూలులందును గళాశాలలందును విద్యార్థు లుపాధ్యాయులు చెప్పు పాఠములు సరిగా వినకున్నను నెక్కువశ్రద్ధతోఁ బరిశ్రమచేయకున్నను నుత్తీర్ణులగుచున్నారు. హైస్కూలుక్లాసులలో దేశభాషల మార్కులెట్లున్నను బై క్లాసులలోఁ జేర్చుకొనుచున్నారు. ఇఁక బాలురకట్టి విషయమున శ్రద్ధగలుగును. విద్యరావలసినకాలములో నీరీతిగాఁ జదివి యింగ్లీషుభాషలోఁ గృతప్రతిష్ఠులైన పిమ్మటఁ గొందఱు హూణభాషాభ్యాసమునఁ గలిగిన నాగరకతావిశేషమున దేశభాషాభివృద్ధికి యత్నించియు, దేశభాషాజ్ఞానము సంపాదింపఁ బ్రయత్నించియు, సఫలమనోరథులు కాఁజాలకున్నారు. కొందఱట్టి సామాన్యజ్ఞానము తోడనె గ్రంథరచనకుఁ దలపడి తమకును భాషకును నెన్నో లేనిపోని చిక్కులను గల్గించుకొనుచున్నారు. ఇఁక నాంగ్లభాషాజ్ఞానము లేని కేవల పండితులలో ననేకు లుదరపోషణ వ్యాపారముతోడనె కాలమునెల్లఁ గోలుపోవుచు దేశభాషాపరిశ్రమమును బూర్తిగాఁ జేయఁజాలక యేదో కొంత జ్ఞానమును సంపాదించి యంతతోనె కృతకృత్యుల మయితిమని తలంచుచున్నారు. ఇట్టివారు నూతనమార్గములను ద్రొక్కుట యటుండఁగాఁ బ్రాచీనుల గ్రంథములను బూర్తిగా నర్థముచేసికొనుటయె దుర్లభమగుచున్నది. వీరికి వ్యవహారభ్రష్టమగు సంస్కృతభాషయందుఁ గొంత పరిచయముండుట గలదు; గాన వీరు సంస్కృతమువలెనె యిప్పటి దేశభాషలుగూడఁ జిరకాలముక్రిందట వ్రాయఁబడిన వ్యాకరణములకు లొంగియుండక తీఱదని తలంచుచు, నట్లుండని

ప్రాచీనకవిప్రయోగములను సవరించి వారి మర్యాదను గాపాడఁగోరుచున్నారు. ఇది మిక్కిలి శోచనీయము. వ్యాకరణములకు నాధారములగు కవిప్రయోగములు వ్యాకరణములకు లోఁగకుండుటలో వింతయేమున్నది. వైయాకరణులు తమకు స్ఫురించినవానినిమాత్రమె సంగ్రహించి యుందురు. అంతమాత్రమున నట్టి దుర్బలవ్యాకరణములను బట్టి కవిప్రయోగములుదిద్దుటకంటె నన్యాయము వేఱేమున్నది! ఇట్లు దిద్దివేయుచుండుట మన తెనుఁగువారిలో నప్పకవినాఁటికె వ్యాపించియున్నదని యీక్రింది యప్పకవీయపద్యమె చెప్పుచున్నది.

ఉ. నన్నయముఖ్య సత్కవిజనంబుల కావ్యములందు
లేఖకుల్ । గొన్నియుఁ బాఠకాధములు గొన్ని
యుఁ బోకడ వెట్టి తక్కువై । యున్నెడఁ జూ
చి జానపదులోడక దిద్దినతప్పుత్రోవ లె । ల్లన్ని
జమంచుఁ గైకొనిన లక్షణ వేత్తలు సమ్మ
తింతురే.

దురదృష్టవశమున మనవారు చిరకాలమునుండి పైరీతి నాంధ్రమహాకవుల కావ్యములను దమతమ వ్యాకరణ జ్ఞానమును బట్టి దిద్దివేసి నిజమయిన కవిప్రయోగము లెవ్వియో లోకమునకుఁ దెలియకుండునట్లుచేసిరని చెప్పుటకెంతయు విచారించుచున్నను. ఈరీతి నొక్కొక్కకాలమున నొక్కొక్కవ్యాకరణము బయలుదేఱుటయు, నాయాకాలములకుఁ బ్రసిద్ధములయియున్న మహాకవుల కావ్యములు తత్తద్వ్యాకరణానుసారముగా దిద్దివేయఁబడుచుండుటయు, జరుగుచు వచ్చినందున ప్రాచీనమహాకవుల కావ్యములొక్కొక్కటి పెక్కురూపములతో వేలయుచుండుట సంభవించినది. పై విషయము చదువరుల హృదయమున నెలకొల్పుటకయి యొక్క యుదాహరణమును మాత్ర మిచ్చుచున్నాను.

"ఒనర నింపు నించు । ననిమొడు వీనిపై"

అని యిట్లు విన్నకోట పెద్దన ధాతువులకుఁ జు వర్ణాంతతయుఁ బు వర్ణాంతతయు నంగీకరించి

కం. "కోపింపుట కోపించుట । కాపింపుట పసుల
నొప్పఁగాపించుటనా । నేపారునట్టి పలుకులు । లోపు
గ బహుళములు జగతిలో నెఱుఁగఁదగున్"॥

అని యుదాహరించి యున్నాఁడు. క్రమక్రమముగ వైయాకరణులలోఁ గొందఱు పు వర్ణాంతత్వము ధాతువుల కంగీకరింపలేదుగాని కొన్ని రూపములందు మాత్రమె పత్వము నిత్యమని యంగీకరించిరి. "అనుబంధప్రార్థనయోర్ణ్వ్యతిరేకాదికే చచోః పస్స్యాత్" అను నాంధ్రశబ్దచింతామణిసూత్రమునకు వ్యాఖ్యానము చేయునపు డహోబలపండితుఁడు "నుతిస్త్రీయాం క్తిన్" పోష ఘు ఇ ప్రత్యయః వర్తమానార్థ వివక్షయావసతిరనుబంధకః, ఇంచుగాగమః, పాదేశః, చురితిక్రియాపదానామితిచుః- వ్యతిరేకార్థ ఇత్యాదివక్ష్యమాణ సూత్రేణ డుజ్, అనుక్తన్యాయేనసానునాసికోచ్చారణం జిత్" నుతింపుచున్నాఁడు. పోషింపుచున్నాఁడు (అహోబలపండితీయము-463 పేజీ) అని యుదాహరించియున్నాఁడు. దీనినిబట్టి మనవారు చెప్పుచున్నట్లు "నుతిస్తున్నాఁడు" అనునది యొక్కటియే గ్రామ్యముకాక "నుతించుచున్నాఁడు" అను బాలవ్యాకరణ సిద్ధరూపము నయితము గ్రామ్యమెయని చెప్పక తప్పదుగదా.

పైరీతిని ప్రాచీన వైయాకరణులు వ్రాసియుండుటచేఁ గావలయు సామాన్యముగాఁ బ్రాచీన తాళపత్రగ్రంథములందు వర్తమానార్థక రూపములందెల్లఁ బత్వరూపమును దఱచుగా వ్రాయఁబడియున్నది. సర్వలక్షణసారసంగ్రహమునఁ గూచిమంచి తిమ్మకవి యీవిషయమును గుఱించి వ్రాయునపుడు "కావింపుట కావించుట । భావింపుట మఱియు దీనిభావించుటనన్ । గావెలయుఁ గృతులఁదుపిన । గ్రావసుతా ప్రాణనాథ ప్రమథసనాథా" అని వ్రాసి, పత్వరూపము సామాన్యముగా నాంధ్రవాఙ్మయమునందెల్ల నగపడుచుండుటచే "కావింపుటకు సులభమే కావించుటకు" అని యిట్లు ప్రసిద్ధమగు పత్వరూపమున కుదాహరణమును మాని క్వాచిత్కమగు పత్వాభావరూపమునకె కవి ప్రయోగములంజూపియున్నాఁడు. ప్రకృతమునందన్నో యియ్యది కేవలము విపరీతమయియున్నది. ముద్రితములగు నిప్పటియాంధ్రగ్రంథములందెక్కడను వర్తమానార్థకరూపములందుఁ బత్వము మచ్చునకైనఁ గానరాదు. కావుననే బహుజనపల్లి సీతారామాచార్యులవారెట్టెటో శ్రమపడి వెదకి వెదకి పత్వరూపమునకు శత్రర్థమునందు రెండుదాహరణ

ములనుమాత్రము సంపాదించి యందుఁ బత్వముండవచ్చు నని ప్రౌఢవ్యాకరణమునందు సూత్రించి యున్నారు. ఇట్టి వైపరీత్యము సంభవించుటకు సూరిగారి బాలవ్యా కరణమును, గవి ప్రయోగములను దిద్దివేయుటలో మన వారికిఁగల సాహసమును, మూలకందములని చెప్పుటకు సందేహము లేదుగదా.

"ఆగమాన్య చకారముల కద్విరుక్తములకు ముత్తు పరమగునపుడు పవలగు" (బాల-క్రియా-౮౮సూ) అను సూత్రముచే వర్తమానార్థమునఁ బత్వము రాకుండుటయే గదా పయి నుదాహరించిన వైపరీత్యమునకు బ్రధాన కారణము. పాపము! సూరిగారి వ్యాకరణమేమో ప్రా చీనవ్యాకరణసమ్మతమనుకొని మనవారిట్టి సాహసము నకుఁ దొరకొనిరి; కాని యాయన నిబంధనములు వేఱుగ నున్నవని గ్రహింపఁజాలరైరి. "నుతించుచున్నాఁడు" అ నునది యాంధ్ర శబ్దచింతామణిచొప్పున గ్రామ్యమని మనవారెఱుంగరుగదా. అల్లుటెంగినను నిట్టివైపరీత్యము పుట్టకుండును.

విచక్షణులారా చూచితిరా వ్యాకరణముల మాహా త్మ్యము- అయ్యో! కారణాంతరములచేతను లోకవ్యవ హారముచేతను వ్యాకరణములు మాఱుచుండ వానితో పాటుగఁ బ్రాచీనమహాకవి ప్రయోగములును మాఱు చుండవలయునా? ప్రాచీనాంధ్రము నవీనాంధ్రమునను భేదము లేక యాంధ్రభాష నన్నయనాఁటి నుండి నేఁటివఱకు నొక్కరీతినే యున్నదను నపసిద్ధాం తము మనస్సులందు మనవారికి గాఢముగా నాటు కొని యుండుటచేఁగదా పయిరీతిని మనవారు ప్రాచీన మహాకవి ప్రయోగములను సవరించుటకు సాహసించిరి. మీఁదుమిక్కిలి, యిప్పటికవులు కొందఱు వ్యవహారవశ మున భాషలోఁ బ్రవేశించిన యుత్తమములగు ననేక పదములను దమ గ్రంథములందుఁ బ్రయోగించియు, మొ న్న మొన్నటివఱకు నాలుగైదు ముద్రణములవఱకు నట్లె యుంచియు, ఇటీవలి గ్రామ్యవాదపు గంధరగోళము తోఁ దమగ్రంథములెల్లఁ దప్పులని యొప్పుకొని యిప్ప డిప్పుడు మరలఁ దమగ్రంథములలోని యట్టి పదములను దీసివేసి బాలవ్యాకరణముతో సరిపెట్టుకొనుచున్నారు. పరిశీలింపఁగా వ్యవహారమున నున్న పదములలోఁ గవుల కామోదమును గల్పింపఁజాలినపదముల కసాధుత్వమెట్లు సంభవించును. అరయ నరయ వ్యాకరణ కోశాదిమాత్ర ప్రసిద్ధములగునట్టి ప్రాచీనాంధ్రపదములకన్న నీయు త్తమ వ్యావహారికపదములే యుత్కృష్టములని గ్రహింప వలసియున్నది. అదృష్టవశమున మనవారు పట్టలేదుగాని పదవిషయమునఁ బట్టిన యీపట్టుదల నర్థవిషయమునం దును వాక్యరచనావిషయమునందును బట్టినచో నిఁక గ్రంథముల మాటయటుండఁగా నోరు మెదపుటకైన నవ కాశము లేకపోవునుగదా.

—వఝ్ఝుల చినసీతారామస్వామిశాస్త్రి.

## ఆటలు *

(వివిధములు.)

సీ. దూఁచియు, జాబిల్లి♦బూచి, కన్నులకచ్చి,
గుడిగుడి గుంజాలు,♦కుందెనగిరి,
చీఁకటిమొటికాయ,♦చింతాకు చుఱుదులు,
పులియాటలును,♦జిట్లపొట్లకాయ,
తూరనదుక్కాలు,♦తూనిగ తానిగ,
చిడుగుడు, మొకమాట,♦చిల్లకట్టె,
దాఁగిలిమూఁతలు,♦తనుబిల్ల, యాలాకి,
గుబ్బట, గురిగింజ,♦కొండకోఁతి,
చిక్కణబిల్లయు,♦జెల్లెముగోడుగును
బిల్లబిద్యము, లక్కి♦బిక్కదండ,
గడ్డెనబోడి, యొ♦క్కసికొక్కు, బరిగాయ
పోటు, గీరనగింజ,♦బొంగరములు,

* ప్రాచీనుల ఔన్నత్యమును చూపునట్టి భాగములను మన ప్రాచీనకావ్యములనుండి దీని శ్రీనాళం కృష్ణారావుగారు గ్రంథరూపమున తయారు జేయు చున్నారు. అందుండి వీటిని గైకొంటిమి.

కెంచులబేరి, దో♦పిల్లి, గాసిపటంబు,
సరిబేసి, పుటచెండు,♦చాకిమూట
గోటదొర్లుడుకాయ,♦గొబ్బిళ్ళు, మోపిళ్ళు,
నీగపోగిసబంతి,♦దాగిలాట,
వెన్నెలకుప్పలు,♦వ్రేలు బొట్టగ, గిరి
సింగన్నవత్తియుఁ,♦జిందుపఱుపు,
గచ్చకాయలు, కిట్టు♦గానుగత్రిప్పుళ్ళు,
గుఱ్ఱెక్కుడు,మంటె♦గూళ్ళు, సూళ్ళు,
కాలికింజంబును,♦గట్టెగుఱ్ఱము, వినా
యకుతిరినూనె, కో♦ట్లాట, చెమట,
కాయెత్తుగొడుగు, బొం♦గరము, రాసన్నాట,
పొడుగుళ్ళు, నుయ్యాల,♦బోగ్లపక్క
బండికలును, జొప్ప♦బెండ్లమంచంబులు,
గంగెద్దులాటలు,♦గనికెకుండ,
వీనెగాజులు, పోతు♦టీనెగుఱ్ఱంబులు,
నాల్గుకంబాలాట,♦నట్టకోతి,
దంటికన్నగమంటె,♦గంటెపోట్లాటలు,
సింగన్నదాటులు,♦జిరుకురాతి
దాబాటలను, మంచి♦తాటాకుచక్రచ
క్రాలత్రిప్పుడు, తోచి,♦గాయపదుపు,
పాడు పాతరమాళ్ళు,♦పాతరల్, బంతులు,
చిమ్మనగ్రావులు,♦చిఱ్ఱుబుఱ్ఱి,
లాకుపేకలు, జంద్ర♦లాటలు, చుంద్రాళ్ళు,
గిలకలు, చిటుకెలు,♦కీచుబురలు,
కోలాటములు, పిల్ల♦గ్రోవులు, గుమ్మడి
క్రోవికూఁతలు, నూఁదు♦క్రోపు, లొడ్డు
విడుపు, నెట్టునగాయ,♦పిండ్లమ్మలాటలు,
పులిజూదములు, కట్టె♦పుట్టెచెండ్లు,
దాయాలు, సొగటాలు,♦దాట్రాయ, చదరంగ
మును, జోటురాళ్ళు,♦మూఁతపాడుపు,
వామనగుంటలు,♦వడిగుప్పిగంతులు,
చెఱకులపందెముల్,♦చిమ్ముతాయి,
తుమ్మెదరేఁపుళ్ళు,♦కుమ్మరసారెలు,
బందారుబసవన్న,♦పత్తికాయ,
తిరుగుడుబిళ్ళల♦త్రిప్పుళ్లు, జరుగుళ్ళు,
చటితాళ, మీళలు,♦నెటికెతట్లు,

తే. తాటియాకుల చిలుకలు,♦తాళ్ళపాము
లు.........యాడుకొనుచు. హంస. 3 ఆ. ౧౮౬

సీ. బొమ్మల పెండ్లిండ్లు,♦బువ్వపుబంతులు,
పుణికిళ్ళు, నిట్టుక్కి,♦బొమ్మరిండ్లు,
గుజగుజరేకులు,♦గొబ్బిళ్ళు, నీగగే
బుడిగిన్ని, జాబిల్లి,♦పుక్కటిల్లు,
గుజ్జనగూడులు,♦కోలుకోలన్నలు,
గీరనగింజలు,♦పారుపట్లు,
పిప్పిళ్ళు, త్రొక్కిళ్ళు,♦బేడిసె తిరుగుళ్ళు,
నచ్చనగుండ్లు, దా♦యాలు, పాళ్ళు,
తే. లడరు వామనగుంట,♦లాదైనయట్టి
యాటపాటల.........హంస. ౫ ఆ. ౧౫౫

సీ. చిట్లపొట్లాకాయ,♦సిరిసింగణావత్తి,
గుడుగుడుగుంచాలు,♦కుందెనగుడి,
డాఁగిలిమ్రుచ్చులా♦టలు, గచ్చకాయలు,
వెన్నెలకుప్పలు,♦తన్నుబిల్ల,
తూరన తుంకాలు,♦గీరన గింజలు,
పిల్లదీపా, లంకి♦బిల్లగోడు,
చిమ్మగు, దువ్వలపోటె,♦చెండు, గట్టినబోది,
యల్లి, యుప్పనఁబట్టె,♦లప్పళాలు,
తే. చిక్కనాబిల్ల, లోటిల్లు,♦చింద, తాది
యైన శైశవక్రీడా వి♦హారసరణి. కాళ. 3-33.

సీ. కోలక్రోఁతులు, బిల్ల♦గోళ్ళు, దూరనగోల,
లందలంబులు, మఱి♦కుందికాళ్ళు
పుట్టచెం, డుప్పనఁ♦బట్టె, లాలంకులు,
గుడుగుడుగుంచాలు,♦గుంటచాళ్ళు,
చీఁకటిమొటికిళ్లు,♦చిమ్ముబిల్లలు, నెట్లు,
బొట్టనఁగోలలు,♦బొమ్మరాలు,
కుప్పిగంతులు, పిడి♦గ్రుద్దులాటలు, పిల్ల
దీవులు, గొబ్బిళ్ళు,♦గూవనాలు,
తే. గుళ్ళు, దాఁగిలిమ్రుచ్చులు,♦గోడిపట్టె
లేలపాటలు, సరిబేసు,♦లీలకూఁత,
లాదిగా శైశవక్రీడ♦లాడిరచట
రామ కృష్ణులు గోపదా♦రకులఁ గూడి.
విష్ణు. ౭ ఆ. ౨౦3.

మ. దినముల్ కొన్నిచనంగ నంతఁ గడు న
ద్ధిం బొమ్మ పెండ్లిండ్లు, గు
జ్జెనగూ, ళ్లిచ్చనగండ్లు, పింపిళులు, కు
చ్చెల్, గీరనంగింజ, లో
మనగుంటల్, కనుమూసిగంతనలు, కం
బాలాట, లోనైన ఖే
లనముల్ మీఱఁగ బోంట్లతో నలరె బా
లారత్న మెల్లప్పుడున్. కళా. ౬.౨౦౨.

క. సరిలేనియంజి, సాగటా,
లరుదగు జూదంబు, నెత్త♦మచ్చనగండ్లున్
దిరమగు నోమనగుంటలు,
సరసత మెయి నాడుచున్న♦సతులంగనియెన్. భోజ.

క. అచ్చిన్ని చెలువడాఁగన
ముచ్చిళ్ళును, నాల్గుకంబ♦ములయాటలు, మేల్
మచ్చులును, గచ్చకాయలు,
నచ్చనగండ్లాడు సరివ♦యస్యలతోడన్.
పాంచా. ౧ ఆ.

మ.స్ర. బిరిగాయల్, కందుకంబుల్, పెనకువవితముల్,
బిల్లగో, ల్లింగెపాకల్,
సరిజేసుల్, తూర్లతుంకాల్, తగరుల విడుపుల్
జాళువా బొంగరంబుల్,
సిరిసింగన్నాలవత్తుల్, చిడుగుడుపరువుల్,
చిందరాటల్ మొదల్గా
సరివాండ్రంగూడి యాడున్ జనవరసుతు
డాశైశవక్రీడయందున్.ఇందుమతీ.౨.౧౮

గుఱ్ఱములనెక్కి బంతియాడుట. (Polo)

చ. తనహృదయంబు వెంబడిన
తప్పక ఘోటక మంతనంత నే
పనుపడనిల్చి ముందఱికిఁ
బారి కెలంకులకుం దొలంగిరా
వెనుకకు నేగుఁదెంచి కడు
వేడ్క యొనర్పఁగ బంతియాడ నె
మ్మని గనకంపుఁగోల నడి
మింటనె త్రిమ్మరఁదారి కొట్టుచున్.
ప్రభా. ౨ ఆ.

చ. ఎగురఁగవైచి కొట్టుటది
యెంతభరంబని బంతి యగ్రగా
మిగ వడిఁ బాఱవైచి పుడ
మింబడనీకయె దాని మీఁటి చి
త్రగతి హయంబుఁదోలుచును
గ్రమ్మఱ మీఁదికిఁ గొట్టి యాడె విం
తగఁ దనచేతి రత్నమయ
దండము కాంతులు గాడిపాఱఁగన్.
ప్రభా. ౨ ఆ.

అల్లోనేరేళ్ళు.

క. ఎల్ల సుఖంబులఁ జేకొనఁ
జెల్లుట యౌవనమునంద ♦ చిక్కిన వటి పా
టిల్లునె, వెన్నెల దినముల
నల్లోనేరేళ్ళు గాక ♦ యావలఁగలవే. భాస్క. సుం.

కఱ్ఱతో బంతియాడుట (తరుముడు చెండు)

ద్వి. ఆయెడ రఘురాముఁ ♦ డాప్తులుఁ దాను
నిండారుప్రేమతో ♦ నెడ్డెలు గట్టి
చెండును దండంబు ♦ చెలువొప్పఁ బట్టి
తరమిడి యాడెడు ♦ తటిని నైకేయ
వరపుడా మందర ♦ వడి నేగుదెంచి
చిట్టట్టుచేతులఁ♦ జెండుదట్టుటయు
కట్టలుక రాముఁడా ♦ కాష్ఠంబుచేత
నడచిన...............రంగనాథ. బాలకాం.

సీ. గుడిగుడిగుంజాలు, ♦ చిడుగుడీ, చింగణా
బిల్ల, గద్దెనబొడ్డి, ♦ చిల్లగోటి,
చిరిసింగణాబంతి, ♦ తరుముడుచెండును,
వెన్నెల కుప్పలు, ♦ కన్నుకట్టు,
చీఁకటిమొటికాయ, ♦ చింతాకు చుణుదులు,
పులియాటలును, చిట్ల ♦ పొట్లకాయ,
తూరనదుంకముల్, ♦ దోపిడి యాటలు,
బంతి, యాలంకి, దీ ♦ పమ్మనములు,
పొట్ట గీరన గింజలు, ♦ బొంగరములు
గచ్చకాయలు, దాఁగిరి ♦ మ్రుచ్చులాట,
బంతి, మెకమాట, జిందర ♦ పరపులాట,
ననెడి శైశవదుర్వృత్తి ♦ నధిగమించి.
ప్రబంధ. ౬౧౩.

### కుబేరాక్షకేళి.

సీ. క్రీడించునొకవేళ ♦ దాడిబాలుఁగూడి
యక్షీణగతి కుజే ♦ రాక్షకేళి.
పాండు. ౪ అ.

### హరిణక్రీడనము.

వ. .........అందఱు 'హరిణక్రీడనం' బను నాటకుం
దొడంగి......హరివం. పూర్వ. 7 ఆ.

### జీకురుబండ.

సీ. తోఁగరాచలువమేడ ♦ మగతాకొణిఁగాలోవ
పలకల'జీరుకు ♦ బండ' లాడి.
చంద్రాంగచరిత్ర. ౧ ఆ.

సీ. చల్లనితలఁపుతా ♦ చట్లవీఁదటఁ జల్ల
'జీర్కు'లాడెడువేల్పుఁ ♦ జేరువలును
యయా. ౨ ఆ.

వ. జతనంబున హస్తంబులూఁది 'జీర్కుబండల' దిగజా
తిరి. పారి. ౪ ఆ.

### కందుక క్రీడ.

ఆ. మనకుఁ బ్రొద్దుపోదు ♦ మనమిందఱము రెండు
గములవారమగుచు ♦ గందుకముల
శిలలు గుండ్లుసేసి ♦ చేరి క్రీడింతము
రెండు వలయు జయప ♦ రాజయములు.

వ. అని యిట్లు పలికి తానును (కృష్ణుఁడు) బలభద్రుండును పెన్నుద్దులై యితరవల్లవులెల్ల నుద్దించుకొని చిఱుద్దులై వచ్చిన సమయంబున విభజించుకొని రెండు గములవారై మార్గంబులందుఁ దృణదారుశిలాకల్పితంబులగు గుండ్లు లొడ్డి కందుకశిలాది ప్రక్షేపణంబుల లక్ష్యంబులఁ దాఁకవైచి జయాపజయ నిర్ణయంబులు సేకొని వాహ్యవాహక లక్షణంబుల నిర్జితులు జేతల వహించి క్రీడించుచు......భాండీరకంబను వటంబు జేరి యాసమయంబునఁ గ్రీడయందు శ్రీరాముడు శ్రీకృష్ణుని వహించె భద్రసేనుండు వృషభు నెక్కించుకొనియె బలభద్రుండు ప్రలంబు నారోహించె. భాగ ౧౦. పూర్వభాగము ౨౨౯.

# ఆంగ్లేయ వర్తక సంఘము— దామెర్ల వేంకటాద్రినాయకుని మొదటి కౌలు §

ఆంగ్లేయులు మొట్టమొదట వర్తకమునకై మనదేశము వచ్చిచేరిరను విషయమెల్లరకు విదితము. అప్పటికి వీరికి రాజ్యకాంక్ష యేమాత్రము లేదు. వ్యాపారముఁ జేసి ధనమార్జించుటయే వీరిముఖ్యోద్దేశము. వ్యాపారసౌకర్యమునకై సముద్రతీరమునందలి రేవుపట్టణములలో నచ్చటచ్చట కార్ఖానల నేర్పరచుకొనిరి. బొంబై రాజధానిలోని సూరతుపట్టణమును, జావాద్వీపమునందలి "బాంటా"మను పట్టణమును ఆంగ్లేయులు మొట్టమొదట వ్యాపారములు చేయుచుండిన రేవుస్థలములు. మనకోస్తాన ౧౬౧౧ వ సంవత్సరములో మచిలీపట్టణమునందొక కార్ఖానాను స్థాపించిరి. ఈ కార్ఖానాలు కర్మాగారముల నుటకు వీలులేదు. ఎగుమతి దిగుమతుల సరుకులను నిలవచేయుటకును, కంపెనీవారి సేవకులు కాపురముండుటకును కట్టిన గిడ్డంగులని చెప్పవచ్చును. అప్పటికాలమున హాలెండు దేశీయులగు డచ్చి వర్తకులు ఆంగ్లేయవర్తకులకు ప్రత్యర్థులుగ నుండిరి. ఆంగ్లేయులకు పూర్వమే డచ్చి వర్తకులు మచిలీపట్టణమున నొక కార్ఖానాయును, నెల్లూరు ప్రాంతమునందున్న పులికాటు సరస్సుతీరమున నొక కోటయుఁ గట్టుకొని వర్తకము జరుపుచుండిరి. ఆకాలమున మచిలీపట్టణము గోలకొండ నబాబుది. పులికాటు పట్టణము ప్రాచీన విజయనగర సామ్రాజ్యములోనిది. ౧౫౬౫ వ సంవత్సరము తల్లికోటవద్ద జరిగిన యుద్ధము

§ Vestiges of Old Madras Vol. 1. అను గ్రంథమునుండి వేమూరి విశ్వనాథశర్మ ఎం.యే. గారిచే వ్రాయబడినది.

లో మహమ్మదీయులవలన హిందువులు పరాజితులై విజయనగర సామ్రాజ్యము చితికిపోయెను. విజయనగరాధీశుడటుతరి తిరుపతి దగ్గరనున్న చంద్రగిరికి పారిపోయి, నాయకుల ద్వారా దక్షిణదేశమును మాత్రము పాలించుచుండెను. ఈనాయకులు పేరునకు సామంతులైనను క్రియలో స్వతంత్ర రాజులుగ వ్యవహరించుచుండిరి. పెనుకొండ, శ్రీరంగపట్టణము, ఆర్మగము, పూనామల్లి, జింజి, తంజావూరు, మధుర పట్టణములలో చంద్రగిరిరాజుక్రింద నాయకు లధికారమును చలాయించుచుండిరి.

ఆంగ్లేయులకును డచ్చివారికిని వర్తకమునందు పోటీలుపడి వర్తకము విజృంభించుట కవకాశము లేకపోయెను. అంతియకాక నావాబుయొక్క యధికారులకును ఆంగ్లేయవర్తకులకును మనస్పర్థ లేర్పడినవి. ఈకారణములనుబట్టి ఆర్మగమునందు రాజ్యముచేయుచున్న నాయకు నాశ్రయించి యాంగ్లేయులా పట్టణమునం దొక గిడ్డంగిని ౧౬౨౬ వ సంవత్సరమున స్థాపించిరి. కాని ఆర్మగము డచ్చివారి పులికాటు కార్ఖానాకు సమీపమున నుండుటచేత నంతవృద్ధికెక్కలేదు. "ఫ్రాన్సిస్ డే" (Francis Day )అను నతడు ఆర్మగమునందు నాయకుడుగనుండెను. బందరులో "థామస్ ఇవి"(Thomas Ivie) ముఖ్యాధికారి. డచ్చి వర్తకులపోటీకి ఆగలేక దక్షిణాదిన గిడ్డండిగట్టుటకు మరియొక ప్రదేశమేదయిన చూచిరమ్మని 'ఇవి' దొరగారు 'డే' దొరగారి నాజ్ఞాపించిరి. ఈ యాజ్ఞానుసరణముగ డే దొరగారు బందరునుండి పాండుచేరివరకును కోస్తానంతయు పర్యాలించి, తిరుగు ప్రయాణములో ప్రస్తుతపు మైలాపూరున కుత్తరము మూడుమైళ్ళ దూరములోనున్న "మద్రాసుపట్నము"న మకాము జేసెను. అచ్చట దామెర్ల వెంకటాద్రినాయకునితో రాయబారము సలిపి "మద్రాసుపట్నము"న కోటగట్టుటకు కవులు వ్రాయించి తీసుకొని తిరిగి బందరు చేరెను. ఉత్తరమున పులికాటు మొదలుకొని దక్షిణమున మైలాపూరువరకు దామెర్ల వేంకటాద్రినాయకుడే లుచుండెను. ఈతని ముఖ్యరాజ్యస్థానము వందవాసిపట్టణము. ఈతని తమ్ముడు అయ్యప్ప నాయకుడు పూనామల్లిలో రాజ్యముచేయుచు కోస్తావ్యవహారములన్నియు నన్నగారికి బదులుగ తానే విచారించుచుండెను. అప్పటికే పోర్చుగీసువర్తకులు మైలాపూరు సరిహద్దులలో నొక కార్ఖానాను గట్టియుండిరి. ప్రస్తుతపు కాళహస్తి జమీందారులు దామెర్ల వెంకటాద్రినాయకుని సంతతివారె. వీరి కూటస్థునికి ఐదవపురుషుండగు దామెర్ల కుమార చిన్నప్పనాయుడు "చిన్నకుప్పపు"ను గ్రామమును గట్టించెను. ఇదియే చెన్నపట్టణముగ మారినది. వెంకటాద్రి నాయకుడాంగ్లేయులకు వ్రాసియిచ్చిన కౌలు తెలుగులోలేదు. ఇంగ్లీషులోమాత్రము మూడుప్రతులున్నవి. అందుకు తెలుగిచ్చుట వ్రాసెదను.

"ఆంగ్లేయ వర్తకసంఘము తరఫున ఆర్మగములో నధికారము చలాయించుచున్న ఫ్రాన్సిస్ డేగారికి దామెర్ల వెంకటాద్రినాయకుడు వ్రాయించి దయచేసినఫర్మానా.

"ఆర్మగములో నింగ్లీషువారి ప్రతినిధియగు ఫ్రాన్సిస్ డేగారు తనకిదివరలో ననేక పర్యాయములు మేముచేసిన వాగ్దత్తములమీద గంపెడాశపెట్టుకొని మా మద్రాసుపట్నమను రేవుస్థలమునకువచ్చి మారాజ్యములోను, మాప్రజలతోను సఖ్యతగలిగి వర్తకముచేసుకొనే విషయములో మాతో స్వయముగ భేటీ జరిగినందువలనను, మాకు ఆంగ్లేయులయెడ గలిగిన వాత్సల్యమునుబట్టి సదరు ఫ్రాన్సిస్ డేగారికిగాని లేకవారి కంపెనీ తరఫున తత్కాలమున పనిజేసెడి మరియొక యేజంటునకుగాని తమయనుకూలమునుబట్టి మద్రాసు పట్నమునగాని చుట్టుప్రక్కలగాని యొక కోటగట్టుకొనుటకు ఈఫర్మానామూలముగ నధికారమీయడమైనది. పూర్తియగు వరకును కోటకట్టుటకయ్యెడి ఖర్చులు మేమేభరించెదము. కాని పూర్తియైన తరువాత నాంగ్లేయులు కోటలో పాదమిడినవెంటనే ఖర్చులుతిరిగి మాకు వాపసుచేయవలసియుందురు. మరియు నింగ్లీషువారియెడ మాకుగల పూర్ణానుగ్రహముగ జూపుటకుగాను వారుకోటలో ప్రవేశించినది లగాయతు రెండుసంవత్సరములవరకు డేదొరగారికి కాని కంపెనీవారి మరియొక యేజంటునకుగాని మద్రాసుపట్నమునందు పరిపాలనాస్వతంత్రమీయడమైనది. రెండు సంవత్సరములు దాటినతరువాత మద్రాసుపట్నపురేవులో వసూలయ్యెడి సుంకములలో

గాని తదితరపరంబడిలోఁగాని సగముసాలుకే కంపెనీవారు హక్కుఁగలిగియుండురు.

"ఇంతియగాక, పైరెండు సంవత్సరములేగాక యెల్లప్పటికిని మద్రాసు పట్నపురేవులో కంపెనీవారి పక్షమున జరిగెడి యెగుమతి దిగుమతుల సరకులపై పన్నులుండవు. కాని రేవుదాటి మారాజ్యములో కాని యితరనాయకుల రాజ్యములో కాని కంపెనీవారు సరకులు కొనినను అమ్మినను అట్టిసరకులమీద, నితరవర్తకు లిచ్చెడిపన్నులో సగమీయవలసియుండురు.

"మరియు సదరు కంపెనీవారు ఆచంద్రార్కముగ టంకసాల స్వంతముగ నేర్పాటుజేసికొని నాణెములు జేయుట కధికారమీయడమైనది. అందునకై యేర్పడిన కూలివాండ్ర వేతనములు దప్ప నితరములగు పన్నులేవియు నీయనక్కరలేదు.

"మద్రాసుపట్నములో నివసించునట్టిగాని, యికమీదవచ్చి నివసించెడిగాని వర్తకులకు, అద్దకులకు, సాలెవాండ్రకును, మానమ్మకముమీద మీరు వర్తకసరిలో అప్పులిచ్చి వారా వాగ్దత్తములను చెల్లింపనియెడల మీకు వారివ్వవలసిన సొమ్ము మేము చెల్లింపడమగును; లేదా వారు మారాజ్యములో నెచ్చటనున్నను మీకు వప్పగింత పెట్టఁబడఁగలరు. రేవుపట్టణములోనిఁగాని పడవలమీదగాని ఉపయోగార్థమై యాంగ్లేయులు మారాజ్యములోకొనెడి తినుబండారములకు నెట్టివిధములగు పన్నులనీయనక్కరలేదు.

"ఆంగ్లేయులయొక్కగాని వారితో వర్తకముచేయుటకై మద్రాసురేవునకువచ్చిన మరియేజాతివారివిగాని పడవలు ప్రమాదవశమున మునిఁగి మారాజ్యములోని కోస్తాకు కొట్టుకొని వచ్చినయెడల హతశేషములగు సరకులు పడవలు అడిగినవెంటనే యీయఁబడును."

౨౨ జూలై ౧౬౩౯.

ఈకౌలు తెలుఁగులో వ్రాసినట్లు కనుపడదు. ఏలయన, మద్రాసుపట్నములో కోటఁగట్టవలసి వచ్చినప్పుడు తానుకోట నిర్మాణమునకై ముందుగ డబ్బు పెట్టుబడి పెట్టెదనని వాగ్దత్తముచేయలేదనియు, తనమాటలను తర్జుమాఁజేసి డే దొరగారికి బోధపరచిన ద్విభాషివలన నాంగ్లేయులు పొరపాటు పడిరనియు వెంకటాద్రినాయకుఁడు వాదించెను.

# జాతీయ విద్య

లోకము విజ్ఞానమయము. చిరకాలసంవర్ధితంబైన లోకవిజ్ఞానము సకలజాతులందును, దేశములందు నుపలక్షితము. విజ్ఞాన మయంబులైన జాతులు దేశములు వ్యక్తి వికాసమునకును, లోకపరిణామమునకును దోడ్పడుచున్నవి. లోకకళ్యాణమునకును, మానవాభ్యుదయమునకు తోడ్పడని వ్యక్తులు, సంఘములు, జాతులు వర్ధిలక నశింపగలవు. లోకవ్యాప్తంబైన వివిధవ్యక్తులు, సంఘములు, జాతులు, దేశములు వర్ధిలుట దైవనిర్ణయము. దైవనిర్ణయము లోకవ్యవస్థలందు పరికల్పితము. దైవనిర్ణీతములైన సకల వ్యవస్థలు వేరువేరు యుగములందు భిన్నరూపములను దాల్చుచుండును. మారిన వ్యవస్థల కనురూపముగ నూతన ధర్మములును, నూతనోద్యమములును, మానవకోటియందు తలయెత్తుచుండును. సకల ధర్మములకును, సకలోద్యమములకును విజ్ఞానము కీలకము. విజ్ఞానరహితములైన వ్యవస్థలుగాని, యుద్యమములుగాని చిరకాలము నిలువజాలవు. ధర్మసంవర్ధితములైన సంఘవ్యవస్థలను పోషించుట విజ్ఞానమయులగు మానవులకు కర్తవ్యము. యుగసంధియందు తలయెత్తిన ధర్మరక్షణము సామాన్యమానవులకు సులభసాధ్యముకాదు. యుగసంధియందు మహానుభావు లుదయించి కార్యపరతంత్రులై దైవనిర్ణీతమైన కార్యము సాధించెదరు. కార్యసాధనమునందే విజ్ఞానబలోపేతులగు మానవులకును జ్ఞానరహితములగు క్షుద్రజంతువులకును విభేదము గన్పట్టుచున్నది. మానవులు సంస్కారస్వరూపులు; క్షుద్రజంతువులు సంస్కారరహితములు. కర్మపేక్షాపరత్వమునకును, కార్యసాధనమునకును సంస్కారము మూలము. జన్మకు సంస్కారము ఫలము. మానవుల సర్వసంస్కారములు జన్మతో ప్రారంభమగుచున్నవి. జన్మతో

నంకురించిన సంస్కార బీజములు గురుకులవాసమునందు సద్గురుప్రసాదలబ్ధజ్ఞానమువలన మొలకలెత్తి లోకానుభవముచే వృక్షమై మనఃపీడనమువలన ఫలప్రదమై త్యాగశీలమువలన పరిశుద్ధమై లోకోద్ధతికి వినియోగపడుచున్న విచిత్ర సంస్కారము కుదిరిన మానవుని స్థిర సంకల్పములు సంఘ హృదయమున సంచరించుచు నుద్వేగమున నూతన మార్గములను కల్పించుకొని లోకవ్యవస్థల నుజ్జీవింపజేసి భావపరివర్తనమునకు దోడ్పడును.

భరతవర్షమునందు గృహమును, బ్రహ్మచర్యాశ్రమమును, ఆచార్యుడును సంస్కారమునకు మహానిలయములు. భరతవర్షమునందు గృహస్థాశ్రమము సకల ధర్మానుష్ఠానములకును మూలము. నిష్ఠుర బ్రహ్మచర్యమువలన చిత్తశుద్ధియు ఇద్రియ నిగ్రహమును సంయమమును కలుగును. మనోసంయమమువలన సకల సంస్కారములను సిద్ధించుచున్నవి. ఆచార్యుడు ధర్మజ్ఞుడు. సత్కర్మోపదేశకుడు. భారతధర్మమునందాచార్యుడు సర్వపూజ్యుడు. లోకపరికల్పితములైన వ్యవస్థలందు భారతగృహమద్వితీయము. గృహరాజ్యమునకు స్త్రీ రాజ్ఞి. సంఘతంత్రమును, రాజ్య తంత్రమును గృహపాలనమునందు నిబిడీకృతములు. భావిధర్మములును, భావ్యౌన్నత్యమును వర్తమాన స్త్రీవర్గమునందు ప్రక్షిప్తము. మాతృగర్భమున శిశువునందు నాటుకొనిన సంస్కారాంకురములు సద్గురూపదేశమువలనను, శిక్షణమువలనను క్రమవికాసమునుగాంచి ఫలప్రదములగుచుండును. నారదమునితత్వోపదేశముతో మాతృగర్భమునం దుద్భవించిన ప్రహ్లాదుని భక్తిసాగరము, పరమభాగవతకథాశ్రవణ, మనన, ధ్యాన, కీర్తనములవలన నుప్పొంగి జగత్తునంతను ముంచివేసెను. కణ్వాశ్రమమునందు శకుంతలపొందిన చిత్తసంస్కారము ఆమెను పతితిరస్కృతను గావింపలేకపోయెను. సత్యవంతుని ప్రణయామృతమును గ్రోలిన సావిత్రీదేవి నేవావ్రతమునుబూని యమపాశములను భేదించి భర్తను పునర్జీవితుని జేసెను. చిత్త సంస్కారములేని యోగులు బ్రహ్మపదమునుండి పతితులగుచున్నారు. రాజులు, రాజ్యభ్రష్టులగుచున్నారు. జాతులు క్షీణించుచున్నవి. దేశములు నశించుచున్నవి. సంస్కారప్రభావముచే దుష్టులు సాధువులగుచున్నారు. మూర్ఖులు పండితులగుచున్నారు. చండాలురు దేవత్వమును బొందుచున్నారు. శత్రువులు మిత్రులగుచున్నారు. అప్రత్యక్షము ప్రత్యక్షమగుచున్నది. విషము అమృతమగుచున్నది. మానవులు అసురత్వమును బొందుచున్నారు. లోకము ద్వేషభావములేక మంగళప్రదమగుచున్నది. మానవుల సకలాభీష్టములు సిద్ధించి భూలోకము స్వర్గతుల్యమగుచున్నది.

తమ సంతానమునకు ఉచితసంస్కారములనుచేయుట గృహస్థులకు పరమధర్మమని స్మృతులు విధించుచున్నవి. తల్లిదండ్రుల సుశిక్షణమువలనను ఉత్తమవిద్యార్జనమువలనను పిల్లలశక్తిసామర్థ్యములు వికసించి ఉత్తమపౌరులై, ధర్మనిష్ఠులై జాతికలంకారప్రాయులగుదురు. శిశుపోషణమును శిశుపాలనమును సంఘాభివృద్ధికి లక్ష్యము. అక్షరాభ్యాసము ఆర్యులషోడశ సంస్కారములలో నొకటి యగుటయే విద్యాప్రతిపత్తి స్మృతికర్తల లక్ష్యమునందుండెననుటకు ప్రబలతార్కాణము. మనదేశమునందు ప్రాచీనకాలమున గురుపదము సర్వోత్కృష్టము. ఆచార్యులు సర్వజనపూజ్యులు. వారు సంఘమునకు ప్రాజాపత్యము వహించి తరతరములకును ఆరాధన యోగ్యులైరి. రఘువంశగురువగు వశిష్ఠుని ఇతిహాసము చిరస్మరణీయము. ప్రాచీనార్యసంఘమునందు గురువర్యునకుగలస్థానము పృథివీపతికైనను లేకుండెను. ఆస్థితి నేటికిని కొద్దిగనో గొప్పగనో కలదు; కాని చాలవరకు సంఘాకర్షణశక్తి ప్రస్తుతమాచార్యునినుండి మరలినది. ఆశక్తి మారుముఖము పెట్టినప్పటినుండియు గురుశిష్యవాత్సల్యము కృశించినది. ఒండొరులకుండవలసిన సమాన ప్రత్యయభావము పోయినది. ఆధునిక గురువునకు సంఘమునందు లక్ష్యములేదు. సంఘలక్ష్యములేని గురువర్గము శిష్యకోటికి లాభప్రదము కాదని మనమిప్పుడే గ్రహించుచున్నాము. గురుశిష్యుల పరస్పరానురాగాభావమునకు మనదేశమునందు తరుచు విద్యార్థులు కట్టుకట్టి విద్యాలయములకు పోకుండుటయే నిదర్శనము. గురువునకు శిష్యవాత్సల్యమును, శిష్యునకు గురుభక్తియు నున్నయెడల- పాట్నావిద్యార్థులకును విద్యాలయాధికారులకును భేదభావమంకురించినప్పుడు తిరిగి యుభయపక్షములకును పొందు పొసగుటకు కొందరు మధ్యవర్తు లెందుకు

కలుగజేసికొనవలసి వచ్చును? శిష్యులులేని యాచార్యుని గురుత్వమెట్లు సిద్ధించదో సంఘలక్ష్యములేని యాచార్యుని గురుత్వము నట్లే సార్థకము కాదు. "యథాగురుః తథాశిష్యాః" యను న్యాయము సర్వకాల సర్వావస్థలందును వర్తించుచున్నది. విద్యాశిక్షణము లోపభూయిష్ఠమైనప్పుడు ఆలోపములు గురుశిష్యులందు గోచరము. ఆచార్యుని గురుపదము సార్థకము కానప్పుడు వ్యక్తియందును, జాతియందును ప్రత్యభిజ్ఞానము కలుగదు. స్వయంవ్యక్తిత్వమును ప్రత్యభిజ్ఞానమును లేని జాతులు సభ్యతనే పరమోద్దేశముగ భావించుసంఘములందు యర్హణీయమైన స్థానమును పొందనేరవు.

లోకోత్పత్తికి కారణభూతురాండ్రగు స్త్రీల విజ్ఞానమునుబట్టియు భావిపౌరులగు బాలికాబాలకుల విద్యాశిక్షణమునుబట్టియు దేశముయొక్క సభ్యతను నిర్ణయించవచ్చును. విజ్ఞానమయులగు నార్యులు స్త్రీకి అగ్రస్థానమిచ్చి పూజించిరి. భరతవర్షమునందు స్త్రీ గృహలక్ష్మి. గృహరక్షణము మానవకోటికి ముఖ్యకర్తవ్యము. గృహరక్షణమునుండి, సంఘవ్యవస్థలును సంఘవ్యవస్థలనుండి, రాజ్యతంత్రమును వికసించినట్లు ఇతిహాసతంత్రజ్ఞులమతము. నైమిశారణ్యమునకు ఋషిసత్తములుపోయి పరమపతివ్రతాలలామయగు లోపాముద్రను కీర్తించిన విషయమును బట్టియే ప్రాచీనకాలమునందు భరతవర్షమున స్త్రీవర్గమున కెట్టి స్థానముండెనో వ్యక్తము. ప్రాచీనకాలమునందార్యులు స్త్రీల నంధప్రాయముగ పూజించియుండలేదు. విజ్ఞాన సముపార్జనమునందు వారు స్త్రీపురుషులకు భేదమును పాటించియుండలేదు. వారనవరతము స్త్రీలను విజ్ఞానమయులుగ చేయుటకే పాటుపడుచుండిరి. స్త్రీలు ఆరాధనచేసినప్పుడు దేవతలు విశేషము తృప్తిపొందుదురని ఆర్యఋషుల మతము. ఆధునికకాలమునందు స్త్రీల కుచితస్థానమిచ్చి బాలికాబాలకులు భావి పౌరులను తత్త్వార్థమును గ్రహించి, వారిక్రమవికాసమే జాతీయ వికాసమునకు మూలమని భావించి, వారి విద్యాప్రతిపత్తికి పాటుబడుచున్న దేశములు లోకరాజ్యమునందు నాయకమణులై వెలయుచున్నవి. జాతీయతా ప్రభావమును సంపూర్ణముగ గ్రహించిన ఐరోపారాజ్యములు ఒకే కుటుంబమునందు జన్మించిన బాలికా బాలకుల క్రమ వికాసమును యోగక్షేమములను భావిభాగ్యమును తల్లిదండ్రులదేగాక జాతీయసంపదయని నిర్ణయించి వారి యభ్యున్నతికి సాధనభూతములైన కట్టుబాట్లను చేయుచున్నారు. స్త్రీలారోగ్యవంతులైన శిశువులను కనుటకును మార్గముల నన్వేషించుచున్నారు. శిశువు జన్మించినవెనుక యథాశాస్త్రీయముగ పెంచి పెద్దవానిని జేయుటకుకూడ కట్టుదిట్టములను చేయుచున్నారు. వ్యక్తియం దంతర్గర్భితమైయున్న శక్తిపుంజమును వికసింపజేసి, జాతియందు కేంద్రీకరణము జేయుటకై పాలకపాలితు లేకముఖమున పాటుబడుట తమనియమిత ధర్మమని వారుగ్రహించిరి. చిత్తసంస్కారమును, విద్యాపటిమయు లేనిది వ్యక్తియందు ప్రక్షిప్తమైయున్న సుగుణములును, వివేకమును, శీలమును, జ్ఞానమును వికసించదు. మహోన్నతమైన పరమావధిమానవుల లక్ష్యమై యుండినగాని వారు కార్యారంభమునకు బూనుకొనరు. సర్వకార్యాచరణమునందును ఆత్మోపలబ్ధి ప్రాచీనార్యులకు పరమాదర్శముగ నుండెను. వారా లక్ష్యమును దృక్పథమునందుంచుకొని ఆశ్రమ నియమముల నేర్పాటుజేసి మానవులను తరింపజేయుచుండిరి. ఆధునికకాలమునందు రాజసగుణప్రధానములైన ఆదర్శములు ప్రధానస్థాన మలంకరించుచున్నవి. రాజులకు రాజ్యకాంక్ష పెరిగినది, ద్వేషభావము హెచ్చినది, స్పర్థవృద్ధియైనది. దేశములను అన్యాక్రమణమునుండి రక్షించుటకు సుశిక్షితమైనయోధకవర్గ మవసరము. రణనీతి నభ్యసించుటకును, యుద్ధములందు పోరాడుటకును బలాఢ్యులును, దార్ఢ్యవంతులును పనికివచ్చెదరుగాని బలహీనులు పనికిరారు. పాశ్చాత్య దేశీయులు దేహదార్ఢ్యసంపాదనమునకు శతాబ్దములనుండి పాటుబడుచున్నారు. వాణిజ్యమువలనగాని దేశసంపద వృద్ధికాదు. పరిశ్రమనిర్మాణములేనిది వాణిజ్యము సాగదు. పాశ్చాత్యులు నెలకొల్పని పరిశ్రమలును, వారవలంబించని వర్తకమును లోకమునందు లేదని చెప్పిన యతిశయోక్తి కాజాలదు. శరీరపాటవమును, వ్యక్తివికాసమును సంఘౌన్నత్యమును యాదర్శములుగ పాశ్చాత్యులు తమలక్ష్యమునందుంచుకొని పరిశ్రమచేయుచున్నారు. పాశ్చాత్యులకు ధన సంపాదనమును, కీర్తియును ఆరాధన యోగ్య

మలయినవి. పాశ్చాత్యదేశములం దుదయించిన నూతన భావము నిర్బంధవిద్యానియమమువలన కార్యరూపము నకు వచ్చినది. ఆత్మజ్ఞాన కాంక్షయు, పరలోకాపేక్షయు ప్రాచీనార్యుల యాదర్శము ఫలించుటకు సాధన భూతములయ్యెను.

లోకమునందు పౌరుష విహీనులును, అర్థశూన్యులు కొఱగారు. సంపదలులేనిజాతికి శీలములేదు, శౌర్యము లేదు, ప్రాభవములేదు, అధికారములేదు. రాజ పోషణ మువలన జనులు వర్ధిల్లుదురు. శ్రీమంతులైన ప్రజలు దేశ మునందు వివిధపరిశ్రమలను స్థాపించి సంపదను వృద్ధిచే యుదురు. ఒక జాతి వికసించి సమగ్రసామర్థ్యముతో జీవయాత్రను గడుపుటకు ప్రజలయందు శరీరపాటవము ను మనోశిక్షణమును అవసరములు. కావున పాశ్చాత్య దేశములు ప్రత్యేక లక్షణలక్షితములైన జాతీయవిద్యావి ధానము నేర్పాటుజేసికొని వర్ధిల్లుచున్నవి. జాతీయ వి ద్యావిధానమునందు జర్మనీ సామ్రాజ్యము ప్రప్రథమ మున కార్యక్షేత్రమున ప్రవేశించి, లోకమున కాదర్శ భూతమైనది. జర్మనీయందు జాతీయ శిక్షావిధాన మేర్పడి ఒక శతాబ్దము గడచినది. ఆంగ్ల సామ్రా జ్యమునందు స్కాట్లండుదేశము నిర్బంధ విద్యావిధా నము నేర్పరచుకొనుటకు ప్రథమము. విద్యాపటిమ యం దా దేశ మగ్రస్థానమును వహించు చున్నది. ఇంగ్లండు, వేల్సు, ఐర్లండుదేశములును నిర్బంధవిద్యాశిక్ష ణమునకై చాల కృషిచేసి జర్మనీతో తులతూగుటకు పాటుబడుచున్నవి. తరువాత నమెరికా సంయుక్తరా ష్ట్రములు కార్యరంగమునకు దిగినవి. ఆంగ్లసామ్రాజ్యము నందు కంటెను అమెరికా సంయుక్త రాష్ట్రము లందు విద్యాసౌకర్యములు విశేషముగ పరికల్పి తములని తాము రచించిన "అమెరికాసంయుక్తరాజ్య ము"లను గ్రంథమునందు లజపతిరాయిలాలు ఉదహరిం చియున్నారు. నిర్బంధవిద్యావిధానమువలన లోకము నందలి జనులు విద్యావంతులై తమ పొట్టబోసికొని సు ఖముగ జీవించుటకు వీలుకలుగుచున్నది. సుఖజీవనము పారమార్థికచింతకు సాధనము. పొట్టబోసికొనుట కా ధారములేని మానవులందు వ్యక్తిత్వము వికసించుటకును, ప్రత్యభిజ్ఞానము కలుగుటకును వీలులేదు. వ్యక్తిత్వమును ప్రత్యభిజ్ఞానమునులేని దేశములందును జాతులందును లోక కళ్యాణమున కవసరములైన సంఘవ్యవస్థలు త్వరితముగ వృద్ధిపొందవు. ప్రజాప్రబోధము జాతీయాభ్యుదయమున కును, దేశౌన్నత్యమునకును మూలము. రాజ్యధర్మము ప్రజ లయందు వికసించుటకు సుస్థిరమైన పాలన నవసరము. సుస్థిరమైన పాలనమున్నప్పుడును పాలకులు ప్రజాసం ఘములను పోషించి పాలితుల యోగక్షేమమున కవసర మైన బాధ్యతను వహించినగాని వారు సర్వతోముఖమైన యభివృద్ధిని పొందజాలరు.

ఆధునిక సభ్యతానిలయమనదగిన అమెరికాసంయుక్త రాష్ట్రములందు పాలితపాలకులచే పరికల్పితములైన వి ద్యావ్యవస్థలు విద్యాప్రతిపత్తియందు శైశవదశయందున్న దేశముల కాదర్శనీయములు. శిశుక్షేమమునకు విద్యాప్ర దానమునకు నా దేశవాసులుచేయుచున్న పని సంస్తవనీయ ము. స్త్రీపురుషుల విద్యాభివృద్ధిసందర్భమున తద్దేశపాల కులు వహించిన బాధ్యతను తెలిసికొనినప్పుడు విద్యాభిమా నులకు నుత్సాహజనకముగనుండును. సకలదేశములందును ఔదార్యవంతులగు దాతలుగలరు. వారు యథాశక్తిని సరస్వతీదేవి నారాధించుచునే యున్నారు. ప్రజాసం ఘములును కొద్దిగనో గొప్పగనో సరస్వతీపూజను చే యుచునే యున్నవి. ఇవిగాక వ్యక్తులును విద్యాపీఠము ల నేర్పరచి తోడిమానవుల జ్ఞానాభివృద్ధికి తోడ్పడుచు నే యున్నారు. ఎందరుదాతలు, ఎన్నిప్రజాసంఘములు, ఎందరువ్యక్తులు విద్యాకృషి చేయుచున్నను సరస్వతీ దేవిని పూజించి తనివినొందింపగలవా రెవరుందురు? పాలితవర్గమునం దెందరు విద్యాభివృద్ధికి పనిచేసినను వారికృషివలన పాలకులు వహించవలసిన బాధ్యత లఘు త్వము నొందజాలదు. పాలకులు చేయుపనికి పాలితులు చేయు సాహాయ్యము పరిశిష్టముగ నుండునేగాని వేరు కాదు. శిశుక్షేమమునకై యమెరికాదేశమునందు పాలిత వర్గము వారెన్నియో సంఘములను నెలకొల్పియున్నారు. స్త్రీలకు గర్భోత్పత్తియైనది మొదలుకొని శిశువు జన్మిం చువరకును మాతలకు వారు సలహా జెప్పుచు అవ సరమైనయెడల సాహాయ్యసంపత్తిని జేయుదురు. శిశువు జన్మించిన తరువాతను మాతలకు వారు పోషణ విధులను, ఆరోగ్యవిధులను బోధించెదరు. దాదులను

నియోగించుకొనజాలని సామాన్యకుటుంబీకుల గృహములకు దాదులును, స్త్రీలును వెళ్ళి మాతలకు సలహా జెప్పుచుందురు. దాదిసామర్థ్యమునకు మించిన పరిస్థితులందు వైద్యురాండ్రనుపంపి వైద్యసాహాయ్యమును చేయించెదరు. సంతానవతియగు స్త్రీ యనారోగ్యప్రదేశమునందు వాసముచేయుచున్నను శిశువునకు సరియైన ఆహారములేక బాధపడుచున్నను, వానికి సంబంధించిన యిబ్బందులను తొలగించెదరు. శిశువునకు ప్రాజ్ఞతవచ్చి విద్యాబుద్ధులు నేర్చికొని పరాపేక్షలేకలిన స్వాతంత్ర్యవహారములను తాను దిద్దుకొను సామర్థ్యము వచ్చువరకును వాని యోగక్షేమము లరయుట సంఘముల ధర్మము. పాలితవర్గము స్థాపించిన శిశుక్షేమ సంఘములుగాక పాలకులుకూడ శిశువుల యుపయోగార్థమై సంఘములను నెలకొల్పియున్నారు. చంటిపిల్లల మరణములను గురించియు, అనాధబాలబాలికలను గురించియు, పిల్లల నేరములను విచారించు న్యాయస్థానములనుగురించియు, పాలకవర్గపు సంఘములు విచారించుచుండును. పిల్లలకు ప్రమాదములు కలుగకుండగను, బాలరోగములను నివారించుటకును, వేయేల- వివిధగాష్ట్రములందు పెరుగుచున్న పిల్లలకు సంబంధించిన సర్వవిషయములందును కట్టుగిట్టములను జేయుటయు వారివిధియై యున్నది. పిల్లల వయఃప్రమాణము జాతి తల్లిదండ్రులస్థితిగతులకును, జన్మప్రదేశమునకును సంబంధించిన విషయములన్నిటిని సంఘాధికారులు గ్రంథస్థముచేసి యుంచుదురు. పిల్లలు ప్రాజ్ఞులగువరకును వారి సమగ్రచారిత్రమును సంఘాధికారులు గ్రంథస్థముచేసి యుంచుదురు. పిల్లలు ప్రాజ్ఞులగువరకును వారి సమగ్రచారిత్రమును సంఘాధికారులు తయారుచేసి వారెక్కడకు బోయినను నేమిచేయుచున్నను కనిపెట్టుచుందురు. పిల్లలకు విద్యాభ్యాసముచేయువయస్సు వచ్చువరకును సంఘములు వేయికండ్లతో కనిపెట్టుచు పిల్లవానిని పెంచుటయందును, వానియారోగ్యరక్షణమునందును తల్లిదండ్రులకు దోడ్పడుచుందురు. గర్భవతులగు మాతల సంరక్షణభారమును పాలకపాలితవర్గము లుభయులును వహించెదరు. పిల్లలకు చదువులు నేర్చికొను స్థితి వచ్చిన వెనుక తల్లిదండ్రులతో నిమిత్తము లేకను వారి చదువు సందెల బాధ్యతను పాలకవర్గము వహించును. పాలకులచే స్థాపితమైన విద్యాలయమునందు ప్రతి బాలుడును బాలికయు విద్యాభ్యాసముచేసి తీరవలయు. పాఠశాలలందు జీతములిచ్చుకొన నక్కరలేదు. కొన్ని రాష్ట్రములందును నగరములందును, పుస్తకములను కాగితములను, సిరాను, పలకలను పాలకవర్గమువారే నుచితముగ నిచ్చెదరు. తల్లిదండ్రులు సరిగపోషింపలేని పిల్లలకు తిండి సదుపాయమునుకూడ చేయుదురు. బాలికాబాలకులు విద్యాభ్యాసముచేయు కాలమునందు వారి విద్యార్జనమునకును, శరీరపోషణమునకును, నివాసమునకు సంబంధించిన విషయములం దేలోపము రాకుండ పాలకపాలితవర్గములుభయులును సర్వశక్తితో కనిపెట్టుచు కట్టుదిట్టములు చేయుదురు. విద్యాభ్యాసముచేయు బాలబాలికులకు ధర్మప్రవృత్తి కలిగించుటకై దేశమునందలి ధార్మికసంఘములతో బాటు పాలకవర్గాధికారులు ప్రత్యేకసంఘములను నెలకొల్పిరి. వీథులందును, మద్యవిక్రయాంగణములందును, తదితరదురభ్యాస నిలయములందును, ప్రవేశించి బాలికాబాలకులు చెడిపోకుండ జాగ్రత్తపెట్టుటకు ఇనస్పెక్టరులు నియోజితులై యున్నారు. పిల్లలను సన్మార్గమునకుద్రిప్పుటకు వారికి న్యాయాధికారము గలదు. మన దేశమునందువలె మనోవికాసము లేని పిల్లలను శిక్షించుట వారికర్తవ్యముకాదు. దురభ్యాసములందు ప్రవేసించి చెడిపోవుచున్న పిల్లలను ఇనస్పెక్టరులు పట్టుకొని పిల్లలకొరకు స్థాపితములైయున్న న్యాయస్థానములకు తీసికొనివెళ్ళి గృహమునందు లప్పిదము చేసిన పిల్లవానిని లల్లిదండ్రులేవిధమున మందలించి బుద్ధిచెప్పుదురో నదే విధముగ వారిని మందలించెదరు. అవయవవికాసమునకు భంగకరములైన వృత్తులందు పిల్లలను పనిచేయించకుండను, వారి శక్తికిమించిన పనిపాటలు చేయించకుండను, కొన్నిగంటల ప్రమాణముదాటి వారికి పనిపాటలు చెప్పకుండగను పాలకులు నియమములను చేసియున్నారు. పొట్టజరుగక తల్లిదండ్రులు పిల్లలనువారికి హానికరములగు వృత్తులందు దింపి, వారిచేత అడ్డమైన చాకిరి చేయించకుండగను కట్టుదిట్టములు గలవు.

బాలికాబాలకులు పాఠశాలలందు విద్య నేర్చుకొనుచున్న కాలమునందే సాహాయ్యము చేయుటతో శిక్షణ సంఘాధికారుల కార్యభారము తీరుటలేదు. వారు బాలికాబాలకుల యున్నతవిద్యాలాభమునకు తోడ్పడుదురు. ఉన్నతవిద్య నభ్యసించుటకు వీలులేనివారి నేదో యొకానొక వృత్తియందో పరిశ్రమయందో ప్రవేశపెట్టి వారికి కావలసిన శిక్షణము నొసగెదరు. ఏదోయొక వృత్తియందు ప్రవేశించినను బాలికాబాలకులు తమ తీరికకాలమునందు చదువుకొనుటకు సాధనాంతరములను కల్పించెదరు. పురుషుడుగాని స్త్రీగాని తన స్వోపయోగమునకును, స్వాభివృద్ధికిని అవసరములగు యవకాశమును వీలును కలిగించుకొని బాగుపడుటకు వారు సాహాయ్యభూతులగుదురు. జీవయాత్రకు ప్రారంభించిన స్త్రీలకును పురుషులకును పాఠశాలాధికారులును, కళాశాలాధికారులును సలహా జెప్పుచును, లేదా తదితరములగు సాహాయ్యసంపత్తిని చేయుచును, పరమోత్కృష్టమగు తమ గురుపదమును సార్థకపరుచుకొనుచుందురు.

సకలదేశములందును కొద్దిగనో గొప్పగనో భౌతిక సంపదయుండును. తత్సంపదాభివృద్ధినిబట్టి దేశముయొక్క దారిద్ర్యభాగ్యము నిర్ణయము. దేశసంజాతులగు స్త్రీ పురుషుల పరిశ్రమము ననుసరించి స్వయంవ్యక్తిత్వములేని భౌతికసంపద వృద్ధిపొందును. స్వయంవ్యక్తిగల మానవులు పాటుపడి దేశమును సంపచ్ఛోభితముగ జేయుట దైవనిర్ణయము. జాతియం దుద్భవించిన బాలబాలికలు దేశమునకు యథార్థమైన సంపత్కారకులనియు, వారి ప్రజ్ఞాతిశయమే భావిభాగ్యమునకు నిదానమనియు వారియందు ప్రక్షిప్తములై యున్న శీలమును వివేకమును జ్ఞానమును వికసింపజేయుట తమ పరమధర్మమనియు, అమెరికా సంయుక్తరాజ్యములందు పాలకులును సంఘములును గ్రహించి, వారి దేహవికాసమునకును మనోవికాసమునకును ధర్మప్రవృత్తికిని సర్వతోముఖమైన ప్రయత్నములను జేయుచున్నారు. జననీజనకుల కలిమిలేములతోగాని బాలబాలికల జరుగుబాటుతోగాని నిమిత్తములేక వారు స్వతంత్రముగ తమ జన్మకు స్వతస్సిద్ధమగు సర్వసాహాయ్యమును పాలకులవలనను, సంఘములవలనను పొందుటీశ్వరోద్దేశమని అమెరికా రాష్ట్రాధికారులును ప్రజలును గ్రహించిరి. మానవులు తమ జన్మఫలమగు సంస్కారమును, స్వత్వమును పూర్ణగ పొంది బాగుపడినతరువాతనే వారి పౌరధర్మము ప్రారంభమగుచున్నది. మానవుల పౌరధర్మగ్రహణముతో జాతులు వికసించి, దైవోద్దేశములు ఫలప్రదమగును. దైవాభీష్టము సిద్ధించినప్పుడు లోకము మంగళప్రదమగును.

—కర్రా లక్ష్మీనరసింహము.

# ఆత్మప్రబోధము

గ్రీష్మతపనుఁడు వెట్టు గా♦డ్పియల సొలసి
భ్రమయుఁ బట్టణకోలాహ♦లముల విసివి
జలధితీరపు వాలుకా♦స్థలములందు
శాంతిఁగన నెంచి చనితి నా♦ప్రాంతములకు.
ప్రియహితుల నెవ్వరినిఁగాని ♦ పిలువలేదు
తఱచువాడుకవిడిచి పు♦స్తకముగూడఁ
జేతఁగొనిపోవలేదు ; స♦చేతములగుఁ
బ్రకృతి శోభల సృష్టిచి♦త్రములఁ గాంచి
వానిసౌందర్యతేజ సం♦పదలయందు
వాని పరివర్తనప్రభా♦వముల యందు
లీనమయిపోవ తమమనో♦ లీలలెల్ల
మోదరసవార్ధిమున్గి యు♦ప్పొంగుచుండు
వార లేకాంతసంచార ♦ పరులుగాని ;
ఎవరితోఁగాని విహరింప ♦ నేగగలరె
నిర్మలానందసరసునం ♦ దేలుటుడిగి ?
వెడలి పట్టణపురిశాల ♦ వీధులందుఁ
బ్రక్కల వెలార్చు మేడ కొ♦ప్పగోముచాలు
నతులగతిని విద్యుత్ప్రవా♦హముల వెంటఁ

బఱువులెత్తెడు శకట తీ♦వ్రతనుఁగనుచు
దారి నెదురగు బైస్కిళ్ళఁ ♦ దప్పుకొనుచు
నరుగుచుంటిని చెవులు గిం♦గురుమనంగ.

కొంచెకొంచెము ప్రజల సం♦కులము గడిచి
శకటముల దారిఁదప్పి ప్ర♦శాంతములగు
రథ్యలన్ శీతలపు సమీ♦రంబు లోలయ
హాయినందుచు మెలమెల్ల ♦ నరుగుచుంటి.

తీక్ష్ణగోసహస్రంబు శాం♦తింపఁజేసి
ముసలితనమున సూర్యుండు ♦ మూలముడుఁగ
నపరదిగ్విటంకంబున ♦ కరుగుచుండెఁ
దేజముడిగినవార లిం♦తియ యనంగ.

చలియు వాతాళివీవనల్ ♦ బూనివిసర
శాంతినీరంధ్రవీథి నే ♦ కాంతుడ నయి,
లోనఁబుట్టిన భావక♦ల్లోలచయము
నందు లీనమైయుంటి బా♦హ్యమును మఱచి.

కొంతవడిపోవునంతటఁ ♦ గొండలట్లు
నీలనీరదపంక్తి వ♦న్నియలఁ గ్రమ్మ
నుదధివీచీసహస్రమ♦య్యెదుటఁ దోచి
పెరుఁగు, లోనిభావంబుల ♦ విరియఁదోలె.

విరిసిపోయిన తలపుల ♦ పేటియందుఁ
బొంగిపారలు తరంగ మృ♦దంగరుతులు
సరససంగీతపరికరో♦త్సవముతోడఁ
గ్రొత్తభావంబులనుఁ దెచ్చి ♦ కుదురుగొలిపె.

ముదముచే లోచనములు పెం♦పును వహించె
నేమియానందమో వచి♦యింపలేను
కనులనిండుగ బాష్పముల్ ♦ గ్రమ్మితొలఁకె
హృదయ మా యీశ్వరునికడ ♦ కెగిరిపోయె.

ఎగిరిపోయిన హృదయంబు ♦ మగుడవచ్చి
తన గృహంబునుఁజేరు నం♦తకునుఁ గనులు
మూసికొని నిల్చితిని రాతి ♦ బొమ్మఁబోలె
పిమ్మటన్ బెద్దయూర్పును ♦ విడిచియొకటి
మందమందపునడల నే ♦ ముందుకరిగి
యలలతాకునఁ నించుక ♦ యార్ద్రమైన
యిసుకపాన్పులగూర్చుండ, ♦ యెగయుచున్న
సతత శీతల శీకర ♦ సముదయముల
జూడఁదొడఁగితి నాత్మ మె♦చ్చులు జనింప.

రవళిసలిపెడు నూర్మికా♦గ్రములయందు
వెలుఁగుచుండిన వింతకాం♦తులు నశించె.
సూర్యభగవాను డబ్ధి యం♦చులనుఁ జేరి
నగము నగముగ మున్గి ని♦ష్క్రాంతుడయ్యె.

తరతమంబుగఁగూడి హైం♦దవమునందుఁ
బెరసియున్న యజ్ఞానంబు ♦ విరియఁజేయఁ
బ్రకృతిపురుషుడంపిన ప్రబో♦ధకుడనంగ
నిర్మలాంబర సంచార ♦ నియతుఁడైన
చంద్రుఁడకలుషజ్ఞాన జ్యో♦త్స్నలనునించె
నెల్లకడలఁ బియ్యపుఁబిండిఁ ♦ జల్లినట్లు.

జలధిదేవుని క్రమభా♦షణముఁ దక్క
శాంతికన్యకోచ్ఛ్వాస ని♦స్స్వనముఁ దక్క
శబ్దమే లేదు ; జగము వి♦శ్రాంతిఁ జెందె
నాకుమాత్రము శాంతి యిం♦తయును లేదు.

నిర్జనప్రదేశమని శం♦కింపలేదు
ఇంటికరుగుఁ గోరిక జని♦యింపలేదు
ప్రకృతి సమకూర్చు సౌఖ్యవా♦రాశి మునిఁగి
యెల్లజగమును మఱచి ని♦స్పృహుఁడ నయితి.

సహజదౌర్బల్యమింత పొ♦సంగియుంట
మీఁది యుత్తరీయము నేల♦మీఁద వైచి
దానిపై నొరఁగితిని ; ని♦ద్రాకుమారి
మోహనము వైచి నిద్రలో ♦ ముంచెనన్ను.

గాఢనిద్రావశుండనై ♦ కనులుమూసి
స్వేచ్ఛఁ బవళించియున్న నన్ ♦ జేరి, మహిత
తేజమొకర్తు నన్ బ్రబో♦ధించి పలికె.
నా వచోమధురిమము ని♦య్యదనునందు
మ్రోగుచున్నది చెవులలో ♦ మోహనముగ.

చిత్రమహనీయతేజ వ♦చించుచుండ
భక్తివిరచితభయము న♦న్బట్టికొనియె
తలఁపులెన్నియొ పాఱఁజి♦త్తరువువోలె
నూఱకే నిల్చి వింటి న♦త్యుత్సుకతను.

"ఉ. ప్రాఁబడియుంట వేదయుగ
భావములెల్లనశించె; మేఘమా
లాబహుళావృతంబయి క
ళల్ విడి హైందవపూతధాత్రి, మి

ధ్యాబలమైన భావ్యమున
యందలి యాచరణంపుఁ ద్రాళ్ళతోఁ
లోఁబడి ముక్తిమార్గముల
లోతు నెఱుంగుట మానెనక్కటా!

"ఉ. ఈయధికాంధకారము ల
యింపగజేయుటకే, పత్రిప్రభా
లీయసపుస్తబుక్చయచ
లీకృతదుష్కృతజాలుఁడౌ సుపా
ధ్యాయుఁడు రామమోహన వ
దాన్యదివాకరుఁడుద్భవించి సు
జ్ఞేయముగాగ ధర్మముల
నేర్చెనెఁ సుకృతాంతరంగుడై.

"చ. వనములరాలు గిరిజలనుఁ
బండుల నాకుల నారగించి, జీ
వనము భరించుచుఁ విమల
భావమునొక్కట నిల్పి నిత్య చి
న్తనమునఁ దత్త్వముఁ గని జ
నావళికిఁ బ్రకటింపఁ ష్యునిఁ
బనిచిన రామకృష్ణఋషి
వర్యుఁడు నిట్టులెబుచ్చె జీవితఁ.

"మ. గురుపాదంబులచెంత జ్ఞానియయి, లో
కుల్ భ్రాంతి మగ్నాత్ములై
పిరసప్రక్రియఁ జూడగానగు మతా
భిప్రాయముల్ గోరి తా
మరరుల్ దీసుకస్వాగతం బిడ వివే
కానందపుం స్కోకిలం
బు, రసావేశతఁగంతమెత్తి సరసం
పుంగీతి బోధింపదే.

"చ. తరుణము వేచియున్నది వృ
థా నిదురించెదవేల? నీదు సో
దరులు స్వతంత్రజీవనవి
ధమ్ముల నారయ నుద్యమింప, సా
దరతవహించి తోడ్పడ ము
దమ్మున నిద్దురలేచి పొమ్ము నీ
వరసి యొనర్పఁగల్గిన స
హాయమె సేయుము శంక వీడుచుఁ."

అని వచించి యంతర్హితం బయ్యె నామె
కనులదెరచి దిక్కులు ♦ గలయఁగంటి
నలలసుశ్రావ్యనాదంబు; ♦ లప్పుడప్పు
డరుతనున్న రసాలంబు ♦ నధివసించి
కూయుచుండినకోయిల ♦ కూయితక్కఁ
దనువుసోక్కఁ త్తవీచువాతములు దక్కఁ
బైనివెలిఁగెడు జంద్రబింబంబుదక్క
నేమియునుఁ గంటఁబడలేదు ఎవరునన్ను
నాగతిని బ్రబోధించిరో ♦ యరయలేక
చలనమందని మదితోడఁ ♦ జల్లనైన
సికతమున శాంతివహించి ♦ యొక విఘడియ
కూరుచుంటిని లోనుండి ♦ యా రవంబు
మందమందముగా వినం ♦ బడుచునుండె
గనులు మూసినయపుడు నే ♦ వినినయంత
దాళితాళినాయంతరాత్మయే వచింపు
చుండె; నంత నాత్మప్రబో ♦ ధోదయంబు
గల్గెనని లేచి యుదయపుఁ ♦ గార్యములుగ
స్నానమాడి దైవోపాస ♦ నము ముగించి
యుత్తరీయంబుఁ గైకొని ♦ యొడలగప్పి
కొని, రయంబున గేహ ♦ మార్తండనైతి
బాలభానుని కిరణముల్ ♦ బడకమున్న.

—కలచవీడు వేంకటరమణాచార్యులు.

# కిరాతార్జునీయము

మానవుల యభ్యున్నతికిఁ బ్రధానము సాహసము. అంతరాయములకు లోఁబడక సాహసమవలంబించినవా రెప్పుడు స్వకృత్యముల నెఱవేర్చుకొని పూజ్యస్థానమధి గమింతురు. సాహసములేకున్న వాఁ డెట్టిస్వల్పకార్యమునం దైన నుత్తీర్ణుఁడు గానేరక, ఉన్నతపదవి నొందజాలక, కడుంగడు హీనదశనొంది బ్రతికినను మృతకల్పుఁ డగును. కాని నీతిబాహ్యమైన సాహస మెవ్వనికినిఁ బనికిరానేరదు; నీతిబాహ్యమైన కార్యాదులయందుఁ

జూవెడి సాహసవంతులు ఇహపరదూరులగుటయేగాక కష్టములనుగూడ పొందుదురు.

తొల్లి ధర్మజుండు ద్యూతంబున రాజ్యసర్వస్వమును గోలుపోయి యనుజసహితుండై భార్యాసమేతముగ ద్వైతవనమున ద్విజవరపరివృతుఁడై మహామునులవలన ధర్మ రహస్యములఁ దెలిసికొనుచుండెను; అయినను, కుసుమకోమలగాత్రియగు పాంచాలియు, మహాబలసంపన్నులగు భీమాదులును దనమూలమున నరణ్యావాసక్లేశము ననుభవింపవలసివచ్చెఁగదా యని చింతించుచుండెను. అప్పుడు, ద్రౌపదికి ద్యూతానంతరము నిండుపేరోలగంబున దుర్మదాంధులగు ధార్తరాష్ట్రులొనరించిన దుష్కార్యము స్మరణకువచ్చి కోపమాపుకొననేరక ధర్మజునికడకేగి కౌరవులపైఁ బాండవాగ్రజున కసూయపొడమ నిట్లనియె.

“దేవా! మహేంద్రతుల్యులగు భరతాదులనాటగోలెఁ గ్రమాగతమైన రాజ్యమును, మదపుటేనుఁగు పూదండవోలెఁ జేఁజేత విడచితిరిగదా. కపటస్వభావులగు వారితోఁ గపటముగ నుండకున్నఁ, గవచవిహీనమగు శరీరమును బాణములు బాధించునట్లు బాధించకుందురా. మాయికులగు దుర్యోధనాదులయెడ మీ యమాయికప్రవర్తనమే చేటునకు మూలము. అదియేగాకున్న శౌర్యధైర్యములుగలవారెవ్వరు అనురక్తయగు భార్యనుబోలె రాజ్యమునువదలి పౌరుషాభిమానశూన్యులై వర్తించెదరు. ఆర్యా! క్రోధాగ్ని మిమ్మేల బాధింపకుండెనో యెఱుఁగఁజాల. సఫలమైన కోపముగల ప్రభువులకు సర్వులు వశ్యులగుదురు. మార్దవస్వభావముగల భూధవుని నెవ్వరు గణియింపరు. రక్తచందనధారియై వివిధమణిభూషణ భూషితాఖిలగాత్రుఁడై మహారథంబులపై సంచరింపఁదగిన భీమసేనుండు ఘోరారణ్యంబులఁ బరాగకలితగాత్రుఁడై పాదచారియై సంచరించుచున్నవాఁడైనను, తేజశ్శాలియై యుత్తరకురుభూములజయించి రాజసూయాధ్వరం బమోఘముగ నెఱవేర్చిన యర్జునుఁడు నారచీరలు కట్టవలసివచ్చినను, కఱకురానేలలఁ బొరలుచు సుకుమారగాత్రంబులు కంది కాయలు గాయ తైలసంస్కార శూన్యములగు శిరోజములు విరియఁబడి మొగమునైఁ బడఁ గందమూలములఁ దినుచు నేఁడు కాననంబుల సంచరించుచుండినను మీకొకింతయైనను గరుణ గానరాదుగదా. కష్ట సుఖములు సర్వసామాన్యము లయినను, బురుషకారములేక కార్యములు సిద్ధిఁబొందుట దుర్లభమనియును శత్రువధ గావించి ఖేదమునపనయింపుఁడనియు పెక్కుతెఱఁగులఁ బలికెను.

పిమ్మట భీమసేనుండు కౌరవకృతాపకారములను స్మరియించి క్రోధతామ్రాక్షుండై ‘దేవా! ద్రౌపదిపలికినపలుకులు న్యాయమార్గానుకూలములు గాని వేఱు కాదు. పండితులు ఎవరు పలికినను అర్థమునే గ్రహింతురు గాని స్త్రీలనియు బాలురనియు వక్తల వివక్షచేయరు. దండనీతిమొదలగు వానియందారితేరిన నీమనము, బురదఁబడిన యేనుఁగువోలె నడఁగుటకుఁ గారణమెఱుఁగను. తొల్లి సమస్తవైభవోపేతులమై, యిప్పుడీ కష్టననుభవించుటకంటె వేఱు సంతాపముండనేరదు. ఇదియునుంగాక ప్రతాపశాలులకు సమయవిచారణసేయఁ బనిలేదు. మఱియు నుత్సాహశూన్యులగు మానవులకుఁ గార్యసిద్ధి లేదు. పుత్రమిత్రసహితముగఁ గౌరవుల నేనొకండ నీగదాదండమునకుఁ బలియిచ్చివచ్చెద. నాకాజ్ఞయిండ”ని బరిపరివిధముల ధర్మజునకుఁ గ్రోధోత్పాదన మొనరింప యత్నించెను. సత్యనిగళనిబద్ధుఁడగు యుధిష్ఠిరుండు-తొందరపడి యేకార్యము సేయరాదనియు, నవివేకమున నల్లానర్పుట యాపదలకు మూలమనియుఁ జక్కఁగ విచారించి చేసెడువారికే సంపదలు స్వయముగావచ్చుననియు మనకు యుద్ధకాల మిదికాదనియు నెన్నియో ధర్మములఁజెప్పి వారిని క్రోధవిముఖులఁ జేసెను. తరువాత నజ్ఞాతవాసానంతరముంగూడ, మహాలోభచిత్తులగు దుర్యోధనాదులు తమ రాజ్యము తిరుగీయనేరరనియు, నందువై యుద్ధంబు సిద్ధంబనియు నెంచి సమస్తాస్త్రశస్త్రవిశారదులును, మహాసత్త్వసంపన్నులును, ద్విజులునగు ద్రోణాదుల జయించుట దుస్తరమనియుఁ దలపోయుచుండెను. అప్పుడు సత్యాసక్తుండును, ధర్మతత్త్వజ్ఞుండు నగు వేదవ్యాసుండు విచ్చేసి ధర్మజునివలన సకలసపర్యలఁగైకొని ప్రహృష్టాంతరంగుండై ధర్మజుని విచారణకారణమెఱిఁగి ప్రతిస్మృతియను మంత్ర ముపదేశించి దీన నీ యభీష్టసిద్ధియగుననియు, దీనిని సర్వగుణసంపన్నుఁడును ధైర్యశాలియు నైన యర్జునున కుపదేశించి యొకింతకా

లమాతని వియోగమును సహించి, తపంబున కంపుమని యు, దాన నింద్రు నీశ్వరు మెప్పించి విజయుండు విజయసాధకములగు నాయుధములఁ బడయుననియును జెప్పి యా సాత్యవతేయుండు స్వస్థానంబున కరిగెను. పిమ్మట ధర్మజునకు సోదరవియోగము దుస్సహమైనను గార్యగౌరవము నభిలషించి ప్రియసోదరున కీయుదంతం బంతయుం జెప్పి యమ్మహామంత్రం బుపదేశించి తపస్సున కానతిచ్చెను.

అప్పాండవమధ్యముండును సోదరుల వీడ్కొని పాంచాలి నాశ్వాసించి కవచమును ధరించి తూణీరముల నేకరించి సాహసమవలంబించి గాండీవమాత్రసహాయుండై, దట్టమయిన అరణ్యముతో నిండియున్న మహేంద్రపర్వతంబు గాంచి, అది తపోనియమంబున కుచితప్రదేశమని యెంచి,

"మ. ధనురస్త్రంబులు గేలిదాల్చ శరధి
ద్వంద్వంబు నేపార వీ
పునబంధించి కిరీటియై కవచియై
పూనెం దపశ్చర్య య
ర్జునుఁడత్యంతగరిష్ఠనిష్ఠ నమరేం
ద్రుంగూర్చి యయ్యింద్రకీ
లనగాగ్రంబునఁ బ్రత్యనీకవిజయ
శ్లాఘాభిలాషంబుగన్.

"గీ. గాండివముతోడ నొకయోగ♦దండయష్టి
యస్త్రములతోడఁ గొన్ని ద♦ర్భాంకురములు
కలపములతోడఁ బుండరీ♦కంబుతోలు
దాల్చి క్రీడి విరుద్ధపు♦తపము సేసె.

అప్పుడు అయ్యమరవిభుండు వృద్ధబ్రాహ్మణరూపధారియై యీతని మనోనిశ్చయ మెఱుఁగఁగోరి సమీపించి యిట్లు వలుకఁదొడఁగెను.

"గీ. అన్న యెవ్వరివాఁడ వీ♦యడవిలోనఁ
దపము సేసెదు నీమంత్ర♦తంత్రపదులు
పాకశాసన దేవతా♦ప్రార్థనాను
సూచకములైన యవియన్ని♦చూడనిపుడు.

"క. శరచాపధారణంబున్
బరమ మనశ్శాంతి దాంతి♦పరిపాకంబున్
బరికింపఁ జంకదుడ్డును
శరణార్థియు ననెడు♦నట్టిచందముదోఁచెన్.

"శా. ఈభద్రాకృతి యమ్మహాభుజయుగం
బీవీర్ఘకోదండమీ
యాభీలత్వ మొకండొకండ భువనై
కాధ్యక్షతా హేతువే
లాభంబాత్మఁదలంచి చేసెదొకో గో
లాంగూల భల్లూక మ
త్తేభాకీర్ణ వనాంతరంబునఁ దపం
బేకాగ్రభావంబునన్.

"గీ. ఈశ్వరునిఁగూర్చి చేసెద♦వేని లెస్స
మాధవునిగూర్చి చేసిన♦మాకు హితము
బ్రహ్మఁగూర్చి చేసిననది♦పరమ తరము
తగునె యిల వజ్రధరుఁగూర్చి♦తపము సేయ.

"సీ. ఆసహస్రాక్షుని♦యాత్మసంశుద్ధికిఁ
బరమసంయమియింటి♦పంచసాక్షి
ఆనిర్జితేంద్రుబా♦హావిక్రమమునకు
భుజగాంతకునియాక♦పోకసాక్షి
యాసునాసీరున♦హంకారగరిమకు
నిషిధాచలముమీఁది♦నెలవు సాక్షి
యాశచీవల్లభు♦నౌచిత్యకలనకుఁ
దాపసుచేతిపూ♦దండసాక్షి

గీ. ఇట్టిదేవేంద్రువలన నీ♦వేమి ఫలము
వడసెదవు చాలు నీవాంఛ♦పాడుగాను.
వాఁడు నీకంటె నేమిట♦వాసిగలఁడు
తగదు చాలింపుమీ విరు♦ద్ధంపు తపము.

ఇట్లు వృద్ధభూసురవేషధారియగు దేవవిభుం డెంత సెప్పినను వికారమును బొందక తపంబొనరించుచుండ నాకపట భూసురుండు నిజరూపమున బ్రత్యక్షమై వరంబు వేడుమనెను. అయ్యర్జునుండు సకలాస్త్రశస్త్రవిశారదులైన ద్రోణాదులఁ జంపఁదగిన సాధనసంపత్తి నొనఁగూర్పుమన నాయమరపతి ఇట్లనియె:— "కుమారా! అట్టిదివ్యాస్త్రము లీశ్వరారాధనమునఁగాని సమకూరవు; కాన ఈశ్వరునిగూర్చి తపంబొనరింపుము. మగుడదర్శనం బిత్తు"ననియంతర్హితుండయ్యె. అంత నాకిరీటి యాపర్వతంబుపై నిశ్చలమనస్కుఁడై సెలయేళ్ళ ముప్పొద్దులు స్నానం బాచరించుచు శివప్రీతికరంబులైన కర్ణికారాది వివిధకుసు

షంబుల నర్చింపుచు భౌతికమును మఱచి తదేకధ్యానమునఁ దపంబొనరింపుచుండె. అంత ఈశ్వరుం డర్జునుని ధైర్యసాహసములఁ బరిశీలింప వేదములను శ్వానములుగను బ్రమథులను గిరాతులుగను బంపి తానుగూడ కిరాతవేషధారియై భార్యాసమేతుండై, కిరీటిసమీపించుచుండెను. అప్పుడు కాలమేఘసంకాశంబైన దేహకాంతి గలిగి చంద్రకిరణముల బుఱడించు తెల్లని వాడికోఱలు మెఱయ కలువరేకులవోలె నిగనిగలాడు నల్లని చెవులుగలిగి నెత్తురుఁ గ్రక్కు గుండ్రని కన్నులు గలిగి ఘురఘురధ్వనుల విస్తరిల్లఁ జేయుచుఁ బుట్టలఁ గోరాడుచుఁ దీవెలఁ ద్రెంపుచు నాశ్రమవృక్షములఁ గూల్చుచు భయంకరాకారమున నొక క్రోడము శివార్జునుల మధ్య కఱుదెంచెను. అపుడు శివుండొక వాడి నారసంబును పార్థుండొక యమ్మును దాని మేన గాఢిపార నేయ, నా బాణశాపాతంబుల కోర్వఁజాలక యాయడవిపంది క్రిందుమీఁదై ఱింగి కొండలంబగు చిత్తంబునఁ గ్రిందఁబడియె. అంత మహానా కిరాతుడు పార్థునివంకఁ దిరిగి "ఓయీ, నీ వెవ్వఁడవు పర్వతాధిపతినైన నేనును నా పడఁతియు వేటయందలి ప్రీతిచేఁ బెక్కు మృగంబులఁ జంపఁ బ్రతిజ్ఞ సల్పితిమి. వెనుకముందుఁ జూడక నా ప్రతిజ్ఞకు భంగము గూర్చెదవా. చంకదుడ్డును శరణార్థియనునటుల నీ వేషము తాపస విరుద్ధము. నీ ప్రవర్తనము శాంతికి వ్యతిరేకము. ఏ తాపసియైన నీవలె నస్త్రశస్త్రములతో దపమాచరించెనా. నీవు కపటివి క్రూరుఁడవు. నేఁగొట్టిన పందినిఁ గొట్టిన దుర్మార్గుఁడవు. మా యుత్సాహమునకు భంగము గావించిన నిన్నీ కొండకోఁడు నిశిత శరకాండంబులఁ జెండక యూరక విడుచువాఁడు గాఁడు. పౌరుషమున్న దేని యుద్ధమున కురమ్మ"ని నొనాఁడ బలికెను. అర్జునుండు శాంతము విడక "ఓయీ పులిందరాజా యేలయిట్లు వక్రోక్తులాడెదవు. ఆశ్రమమందలి వృక్షములను భంగము గావించు క్రూరజంతువును జంపుట దోసమా" యని చెప్పెను.

ఇట్లు పార్థుండు పల్కనక్కొండ కిరాతుండు "ఓయీ నీ నక్క వినయములతోఁ బనిలేదు. వేటనియమంబునకు విరుద్ధముగాఁ బ్రవర్తించి మమ్మాక్షేపించుచుంటివా. తాపసివగుటచే నిన్నుపేక్షించితి"ననెను. మాయాకిరాతుడు పార్థునకు రణోత్సాహంబు గల్పించి యుద్ధసన్నద్ధుఁడై యుండె. అర్జునుండును గాండీవంబు సవరించి ధనుష్టంకారంబు సేసి నిలువంబడి వెనుదీయక క్రోధతామ్రాక్షుండై జూపఱ కాశ్చర్యము గలుగునటులఁ బరుషములాడుకొనుచు ధిక్కరించుకొను శరాఘాతములఁ బూసిన మోదుగులకరణి చెలువొందుచుండె.

ఈ ప్రకారము విజయాకాంక్షను విజయమాయాకిరాతులు పోరాడుచుండ నయ్యీశ్వర ప్రభావంబునఁ బార్థుని యక్షయతూణీరంబుల బాణంబులు చిక్కక దివ్యాస్త్ర మంత్రాక్షరంబులు స్ఫురింపక మనంబు వికలంబై ప్రాగల్భ్యము తగ్గినను, గిరీటి వెనుకదీయక సాహసంబూని గాండీవంబెత్తి లోకంబాకులంబంద ప్రమథులు తల్లడిల్ల పార్వతి కంపింప శివుని శిరంబుపైఁ గొట్టగా

"సీ. కఱకు వెంట్రుకలలోఁ బఱచు మందాకిని
సుకుమార దేహంబు స్రుక్కఁబాఱె
నవతంసకుసుమమాల్యంబైన శశిరేఖ
బ్రహ్మకపాలరంధ్రమునఁ దూఱె
నెట్టియంబుగ బిగ్గఁ జుట్టిన పెనుబాము
బిగియూడి నొసటిపై డిగ్గఁగఁ జాఱె
నలికనేత్రము కిత్తి యారజ్యమానమై
యుప్పలసందుల నిప్పులుమిసె.

గీ. నగజభయమందెఁ బ్రమథులు బెగడుగుడిచి
రుపనిషత్తులు ఘోషించె నొక్కపెట్టఁ
గాలకంఠుని మౌళిశృంగాటకంబు
గాండివంబున దాటింపఁ బాండవుండు.

అంత నా మహానాకిరాతుండు పార్థ ప్రహారమును లెక్కఁగొనక తన బాహుయుగళిచేఁ బిట్టు బిగియఁబట్టిన నప్పాండురాపట్టి యొకింత శాంతసంరంభుఁడయ్యెను.

శా. అంతం జంద్రకళాధరుండు నిజబా
హాగాఢపీడాపరి
శ్రాంతుండై యటఁ బాండునూతియెదురన్
బ్రత్యక్షమయ్యెన్ గృపా
వంతుండై యహిరాజహారములతో
స్వర్వాహినీ వేణితో
దంతిత్వక్పరిధానపల్లవముతో
దామ్రజ్జటాపంక్తితోన్.

ఉ. చెంచెతయయ్యెఁ బార్వతియుఁ
జెంచులు భూతములై నిజాకృతిన్

మించిరివేలుపుల్ నభము
మీఁద లలాటమునందు నంజలుల్
నించి నమస్కరించిరి వి
నీతియు భక్తియు నుల్లసిల్లఁ గా
వించె బ్రణామముల్ గరము
విస్మయమందుచుఁ బార్థుఁడత్తరిన్.

ఇట్లీశ్వరుండు దయార్ద్రచిత్తుండై పార్థుని యెదుటఁ బ్రత్యక్షమగుడు విజయుండనేక విధంబుల నుతించి. శివునివలన శత్రు సంహార సాధకంబగు పాశుపతంబు సమంత్రకంబుగ గైకొనియె.

—శ్రీరాముల సచ్చిదానందశాస్త్రి.

# పూజావబోధము

శా. తేజోవంతులరయ్యుఁ దల్లిఋణముం ♦ దీర్పం బ్రయత్నింప కీ
యోజన్ మిన్నకయుంట భావ్యమె? నవీ ♦ నోత్సాహసంపూర్ణ ని
ర్వ్యాజస్వాంతులరై యనారతము స్వా ♦ ర్థత్యాగచర్యామలాం
భోజాతమ్ముల నాంధ్రదేశజననిన్ ♦ బూజింపుడీ సోదరుల్.

మ. ప్రకటారాతిచమూవిదారణకళా ♦ పారీణ బాహాబలా
ధికులన్ రాజనరేంద్ర కృష్ణముఖ థా ♦ త్రీ కాంతులన్ గన్న స
ర్వకళాస్ఫూర్జిత వీరమాత విపులై ♦ శ్వర్యమ్ము గోల్పోయి యూ
రక వాపోయెడుఁ దద్వ్యథానలము నా ♦ ర్పం బూనుడీ సోదరుల్.

మ. పరదేశాంగనలెల్లరుం దనదు సౌ ♦ భాగ్యమ్ము వీక్షించి య
బ్బురమున్ జెంద నఖండనాగరికతా ♦ స్ఫూర్తిన్ విరాజిల్లి మున్
గరిమంబుంగని నేటికిట్లు శిథిలా ♦ కారంబుతో దీనతా
భరయై చింతిలు నాంధ్రమాతవగఁ బా ♦ పం జూడుడీ సోదరుల్.

శా. శ్రీనీరేజభవాంగనా ప్రవిమ లా ♦ శీర్వాద సంప్రాప్త వి
జ్ఞానోపార్జిత సంస్కృతాంధ్రకవితా ♦ సామ్రాజ్యులన్ బూజ్యులన్
నానాభావనిగూఢకావ్యఘటనా ♦ నైపుణ్యులన్ దిక్కన
శ్రీనాథాదులఁ గన్న యాంధ్రజననిన్ ♦ సేవింపుడీ సోదరుల్.

—పోచిరాజు సీతారామయ్య.

# ఏలపాటలు.*

ఆదికవుల కరుణార్ద్రచిత్తమే వారి కవితాప్రాశస్త్యమునకు హేతువైనది. రామకథావిధాతను గూర్చి కాళిదాసమహాకవి

"శ్లోకత్వమాపద్యతయస్యశోకః"

అని ప్రశంసించెను. ఆత్మానాత్మవివేకము కలిగి జగములనెల్ల సమదృష్టితో గారవించుచు, సత్వగుణంబుల కాటపట్టులయి బరగు మునీంద్రులే యాదికవులుగ నెంచబడుచున్నారు. వీరి యనుభవనివేదనమే వేదమై, పూజ్యమై మెప్పొందియున్నది. వీరి బోధనములే సకలరాజన్యసమాదరణీయములై, జాతీయసంఘాలయాధారములై స్మృతులుగ బరిణమించినవి. వీరి యంతఃకరణవిన్యాసములే కావ్యరత్నములై రాజిల్లుచున్నవి. స్వాను

* సంస్కృత, ఆంధ్ర, ఆంగ్లేయ భాషావిశారదుడగు విద్యార్థినిచే వ్రాయబడినది.

భవమును ప్రకటింపు తెరవులందలి భేదములచే శ్రుతి స్మృతి గావ్యభేదములు గలుగుచున్నవి.

తస్మాద్వా, ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః। ఆకాశాద్వాయుః, వాయోరగ్నిః అగ్నేరాపః, అద్భ్యః పృథివీ। పృథివ్యాఓషధయః, ఓషధీభ్యోన్నం; అన్నాత్పురుషః.
—శ్రుతి.

మాతృదేవోభవ - పితృదేవోభవ - ఆచార్యదేవోభవ। యాన్యనవద్యానికర్మాణి తానిసేవితవ్యాని। యాన్యస్మాకగ్ం సుచరితాని, తాన్యుపాస్యాని నోఇతరాణి.
—స్మృతి.

షష్టివర్షసహస్రాణి జాతస్యమమకౌశిక ।
దుఃఖేనోత్పాదితశ్చాయం నరామం నేతుమర్హసి॥
విప్రయుక్తోహి రామేణ ముహూర్తమపినోత్సహే ।
జీవితుం మునిశార్దూల నరామం నేతుమర్హసి ॥
—రామాయణకావ్యము.

ఈ మూడువాక్యముల శైలిని బరికించినచో మొదటిదియగు శృతివచనమందు స్వానుభవము సాధువుగ జెప్పబడియున్నది. రెండవదానియందు ఆజ్ఞాధికారములతో నిర్దేశింపబడియున్నది. మూడవదానియందు హృదయమర్మముల భేదింపురీతి వర్ణింపబడియున్నది. ఈ మూడు వాక్యములవలనను చదువరుల మనఃస్థితి యౌన్నత్యమును బొందుచున్నది. ఆనందము కలుగుచున్నది. మనస్సున కొకవిధమగు వికాసము, సంతోషము, ప్రీతియు నేర్పడుచున్నవి. కాని యీ వాక్యములందు అర్థగౌరవముకొరకుగాని, వచనాసౌష్టవముకొరకుగాని, కవి యత్నించినట్లగుపడదు. తన బుద్ధికితోచినరీతి సూటిగ సాధుపదములతో, తన యభిప్రాయమును చిత్రించెను. "ఋషీణాంపునరాద్యానాం వాచమర్థోనుధావతి" అను వాక్య మీ మాటియందును స్పష్టమగుచున్నది. పూర్వకవులు శబ్దసౌష్టవ మభిలషింపరు. అలంకారముల నపేక్షించరు. వృత్తముల విస్తరించరు. శబ్దశాస్త్రముల గౌరవించరు. నిర్మలమై, పవిత్రమై, నిర్హేతుకమై, యాత్మప్రేరితమయిన మనోవిన్యాసప్రాబల్యమే వీరి కవితానైపుణ్యమునకును, వీరి నిరుపమ కల్పనాశక్తికిని కారణమగుచున్నది.

మహాకవులందరును మంచి ద్రష్టలైయున్నారు. వీరి పంచేంద్రియముల జ్ఞానగ్రహణశక్తి సామాన్యమానవులందు కన్న మిక్కిలి వికసించియున్నది; ఈ బాహ్యేంద్రియ విస్ఫుటనమునకు తోడు వీరి యాధ్యాత్మికదృష్టియు బలుతెరంగు లధికముగ నుండును.

"అతిచతురకవేర్దృష్టిగప్యుజ్జితోర్వీ । ప్రాప్యవ్యోమ్నాంతరాళం పునరపిసహసావిందతే ధ్యానముర్వ్యాః"

వీరి మానసము కడుమెత్తనైనది. వీరి యంతఃకరణ జగద్వ్యాప్తమైనది. వీరి రాగద్వేషములు, సుఖదుఃఖములు, క్రోధానుకంపములు, స్వవిషయములందుగాక జగద్హితార్థమగుతావుల వ్యక్తమగుచున్నవి. తన్నెంత మరచితే, కవి యంత మిన్నయగునని కొందరు రసజ్ఞులు చెప్పుచున్నారు. వాల్మీకి, కిరాతునిపై కోపగించినరీతి, 'ధురంధర'ను చిత్రకారునిచే చిత్రింపబడియున్నది. అందు వాల్మీకి, నిస్పృహతో "మానిషాదప్రతిష్ఠాంత్వ మగమః శాశ్వతీసమాః" అని పల్కినట్లగపడును; గాని వీని చర్యయందు దాషహర్షికట్టి మనస్తాపము కలుగలేదు. లోకహితమే వీని యాత్మప్రవృత్తికి కారణము. గద్య వాల్మీకియని పేరొందిన 'స్కట్టుహ్యూగో', మహాకైరాతుల వర్ణించుపట్లగూడ నిట్టి నిస్పృహయేజూపట్టును. 'అయాగో' 'రిచ్చర్డు దిథర్డు' 'మాక్బెత్తు' మున్నగు క్రూరులయెడ 'షేక్స్పియరు' రిట్టి నిస్పృహయే ప్రకటించుచున్నాడు. మహాకవుల రీతి ఇదియే. తొల్లిటి కవులందు విశాలమైన ప్రకృతిపరిజ్ఞానమునకు తోడు తాము చూచినవిషయములయెడ హాయోగీంద్ర సాధ్యమగు నిస్పృహ గాన్పించుచున్నది.

కావున పూర్వకవుల తెరవులలో ప్రపంచానుభవము అంతఃకరణపారిశుద్ధ్యము, నిస్పృహయు గోచరించుచున్నవి. వీనికితోడు కావ్యాలంకారరాహిత్యము, శాస్త్రనిబంధనాగ్రహణయు విశదమగును. వీరికి భావమే కావ్యోద్దేశ్యమగుచున్నది. అలంకారము నిరుపయోగమగుచున్నది. ఈ విధముగ నుత్పన్నమయిన సత్కవిత్వము కాలవైపరీత్యమునం జేసి యనేకమార్పులం జెంది శబ్దాలంకారచమత్కారపూరితములగు కృతుల జెలరేగి రుచిభేదములును, పాకభేదములును, వృత్తభేదములును తామరతంపరలై యతిశయిల్లి, విద్వజ్జనానందకరమై

లోకహితము కానేరక కావ్యోద్దేశ్యమును సమర్థింపజాలక చెడియున్నది.

శ్లిష్టాసభంగాసద్వర్ణ్యా నిర్దోషా సద్గుణా మృదుః
నానాభంగీవిలాసాచే త్కృతిర్వికృతిరన్యథా॥

మున్నగు కావ్యలక్షణము లేర్పడియున్నవి. ఒకేఅర్థమును సూచించు నీ దిగువ పాదముల రెంటిని బరికించి కావ్యసాధనములందలి భేదముల గమనింపుడు.

"సముద్రఇవగాంభీర్యే ధైర్యేచహిమవానివ"

కుపితరాఘవ ఘనక్రూరనారాచంబు తనువుదాకని నాటి వనధిరాజు। క్రుద్ధకుంభోద్భవ భ్రూలతా కాటిల్యవిహృతి కుంగని నాటి వింధ్యశిఖరి। .........గాంభీర్యసారమునను। ప్రకటస్థైర్యకళా కలాపములయందు......"

తొల్లిటికవులనాటియు, ఇటీవలివారి వక్రగతులును పైయుదాహరణములవలన స్పష్టమగుచున్నవి.

సంస్కృతకావ్యరీతులు వాల్మీకికాలమునుండి మురారివరకేగతి విస్తరించి వికృతిజెందియుండెనో, యాంధ్రకవితారూపములుగూడ జంగమకథలు, సుద్దులు, యాలపాటలనుండి యముక్తమాల్యద, వసుచరిత్రాది జటిలప్రబంధములరూపము, నాగతినే జెందియున్నవి. తొల్లిటి కవితారీతులు పండితజనదూషితములై సభాగర్హితములై పామరజనానందకరములై నీచాశ్రయము జెందియున్నవి. కొన్నికొన్ని తావుల నివి శృంగారదూషితములై యున్నవి.

యదాప్రకృత్యైవజనస్యరాగిణో
భృశంప్రదీప్తో హృదిమన్మథానలః॥
తదాత్రభూయః కిమనర్థపండితైః
కుకావ్యహవ్యాహుతనివేశితాః॥

బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారును, శ్రీమానవల్లి రామకృష్ణకవిగారును ఆంధ్రమునంగల తొల్లిటి కావ్యరూపములయందలి చందములగూర్చి యనేక తావులముచ్చటించి యున్నారు. నన్నయనన్నెచోడులకు పూర్వము బలువన్నెలగన్న తెనుగుబాసలో దేశీయకావ్యసాధనము లనేకములుండినవి. ఇట్టిసాధనములే ప్రస్తుతము సంస్కృతాంగ్ల సారస్వత ప్రభావమున మార్పొందని యాంధ్రసీమలలో వాడబడుచున్నవి. హైందవ పాశ్చాత్య విద్యాసంస్కారమొందిన దేశభాగములలో సైతము జనసామాన్యమీ కవితాసాధనములవలననే తమకు వలయు హితవాక్యములను, నీతిబోధనను, కావ్యరతియు గైకొనుచున్నారు. సంస్కృతాలంకార నిబంధనల ననుసరించి రచింపబడిన కావ్యముల జదువువారు తెలుగుదేశములో ఒకలక్ష యుండవచ్చును. అదియును సంశయాస్పదమే. కాని దేశీయకావ్యసాధనములవలన ఆనందము జెందువారు కోటి ఏబదిలక్షల జనమునకు తగ్గియుండరు. దీని కారణమేమి?

సంస్కృతాలంకారముల ననుసరించి వ్రాసినవారు ప్రౌఢకవులు. వారు పల్లెనాటిలోని మిద్దెకొంపలోకూర్చుని హిమాలయ తుషారములను వర్ణించుచుందురు. రానురాను వారికన్నులు మూతవడినవి. నిఘంటుపద సముదాయమభివృద్ధి జెందెను. వారు మాటలపోగులరి. వారి రసములు ఆలోచనలు, వారిపదసామాగ్రి, కావ్యరీతులును సంస్కృత సారస్వతమునుండియో, పారసీకమునుండియో, ఆంగ్లవాఙ్మయమునుండియో దొంగిలింపబడినవే కాని యాంధ్రసారస్వతమునకు జెందినవి కావు. ఆంధ్రుల ప్రత్యేకజాతీయతనుజూపించునవి కావు. ఆంధ్రవాణియొక్క పూర్వసాంప్రదాయముల సూచించునవి కావు. ... చ్చ తెనుగు ప్రబంధములుసైతము సంస్కృతకావ్యరీతుల ననుకరించెడివే. వీనిలో చాలభాగము రసరహితముగ నున్నవి. యాలపాటలందీ దోషములు లేవు. అవిచక్కని దేశీయపదములతో, ఆంధ్రుల తొల్లిటి యభిప్రాయములను జిత్రించుచున్నవి. ఇందలి పదములు సూటియైనవి. సూటియగుటయేగాక చిన్నపిల్లలకును, పిన్నసంస్కారముగల జాతులకునుంగల పదలోపమున కుక్కాలి యందముగ నున్నవి. మనము బైసికల్, ద్విచక్రి, పదచాలిని మున్నగు ప్రౌఢపదములతో చూపు త్రొక్కుడు బండిని యాలపాట కారకుడు 'దొరలుతొక్కె మరల బండీ' అనే ముద్దుమాటలతో వర్ణించియున్నాడు. పూర్వకవుల రీతులలో ఇట్టి బాలకవాచాలత్వమే ముఖ్యాంశముగ నున్నది. ఇందలి సౌకుమార్యము, రామణీయకము - ప్రశాంత సౌందర్యమును సామాన్యముగ ప్రౌఢకవనమునందు గోచరింపవు. అదియునుగాక యాలపాటలలో తెనుగుభాష సార్థకోపే

యోగమును జెందుచున్నది. అది తెనుగు రాగాలయాశ్రయమైన సంగీతమున కుపకరించెడిభాష. దీనిస్వీయవ్యక్తి భక్తి శృంగారరసములకు సంబంధించిన ప్రశాంత మాధుర్యము. ఒక్కొకదేశభాష కాయాదేశీయభావముల ననుసరించెడి స్వీయవ్యక్తి యేర్పడుచుండును. హిందూస్తానీ వీరభీభత్స రసములకు ముఖ్యసాధనము. సంస్కృతము కరుణారసమున నేర్పడినది. ఆంగ్లభాష వ్యావహారిక ధూర్తనయమునకును ప్రకృతిచాంచల్యమునకును తగినభాష. ఆంధ్రమాటలనే భక్తిశృంగారరసములవలన జనించు ప్రశాంతమాధుర్యమున కునికిపట్టు. యాలపాటలలో యీనైజవ్యక్తి కడుదూరము గోచరించును. యాలపాటలు మహాప్రబంధములుకావు. ఉపక్రమణోప సంహారములతో అందముగదీర్చినవికావు. ఎట్టి కావ్యాలంకారముల వెలుగున వీనిఁబరీక్షించినను వీనియందసంపూర్ణతయు, దూష్యగ్రామ్యమును గోచరింపక మానవు. కాని యాంధ్రదేశాభిమానమున తెలుగుమానసుల హృదయసీమలు రగులునప్పుడు, తెలుగుశిల్పములు తెలుగు దుకూలములు తెలుగు వంటలు, తెలుగు దినుసులే వారి మానసమును తృప్తిపరచునప్పుడును తెలుగే వారి పరమదేవతయై బరగునప్పుడును యాలపాటల లోపములంతలోపములుగ నిలువనేరవు. ఆంధ్రుడు సంస్కృతసారస్వతమపారముగ జదివి కాళిదాసమయూరాదుల రమణీయఘణతులయందోలలాడుగాక! ఆంగ్లసారస్వతపు వివిధభావాంతరాళములజొచ్చి చెన్నొందుగాక; పారసీకపు గానసౌకర్యమున మైమరచుగాక; పూర్వ పశ్చిమఖండముల వివిధభాషలసొంపు తిలకించుగాక! వానిభావవాహక నైపుణ్యమెట్టిదైనను యగుగాక! రాత్రి వీధులవెంట, గుంపులై దేశీయగానక్రమములతో దేశీయఛందోబద్ధమైన యాలపాటలను పాడు సోమరిపిల్లగాండ్ర ప్రభావమునకా విదేశభాషా సౌందర్యములు పోలజాలవు. ఈ పాటలు మనహృదయమును కరగించును; మనసు నుత్సాహపరచును; ఏదోయొక క్రొత్తరసము ఒకనూతనశక్తి మనదేహమునజొచ్చి పులకరింపజొచ్చును. వానిప్రభావము వినినవారికే గోచరించును. భక్తికీర్తనలు, తత్వములు ఎంతసామాన్యమో యాలపాటలుకూడ నంతసామాన్యమే. శృంగారరసప్రధానమగు కీర్తనలలో సామాన్యముగ విప్రలంభశృంగార మధికముగ నున్నది. పూర్వరాగమున విచారము తక్కువ; హెచ్చరిక ఎక్కువ. విప్రలంభమున విచారము అధికము.

"నాకు నీకూ దూరమాయె నల్లకొండాలడ్డమాయె!
చాంద్రగిరీ చీరెలంపావోయి"

కరుణాత్మకమగు విషాదము బహురుచికరముగ వచ్చుచుండును.

రావిచెట్టెక్కావు రాగాలుతీశావు
రాలిపోలవు లంజకొడక్కోరెంకయ్య"

దయ, జాలి, ప్రేమవలని భయము ఇంతచక్కగా సంస్కృతాంధ్రాంగ్లేయ కావ్యములలో నెచ్చటను మాకు స్ఫురించలేదు. "ప్రేమపశ్యతి భయాన్యపదేపి" యను భారవి సుభాషిత మీవెంకయ్య పాటలో మూర్తీభవించి యొప్పుచున్నది. స్వస్థానమునువీడి, యాత్మగౌరవమును విడనాడి, వీధులపాలయి చెడిపోవుచున్న ప్రియురాండ్రయెడ భర్తలకును తల్లిదండ్రులకును అన్నదమ్ములకును గలుగు విచార మీ దిగువ దొమ్మరిపాట నతిక్రమించి వర్ణించిన కవులెవ్వరు ?

"రంగులైన చీరెకట్టి, బజారంచు రెవికతొడగి
బజారుపాలైతివే రమణి ముద్దులగుమ్మ."

నాయకా నాయికల సంభాషణలలో సంస్కృతకవుల చమత్కారముల నేకములు యాలపాటలలోగానుపించును.

నామగడూ వాడకెళ్లే నాకుతోడూఎవరులేరూ!
కోడికూసేవేళదాకా తోడురారావన్నెకాడా!
టనానాటంకషలో.

శృంగార విలాసవర్ణనములలో సంస్కృతాలంకారిక సమ్మతములగు పద్యరత్నములతో సరియగు నీక్రింది ద్విపదములోని యందమును చదువరులు బరికించెదరుగాక !

చింతచెట్టూచిగురుచూడూ !
చిన్నదాని యీడుచూడూ
అద్దములో నీడచూడూ-
ఇద్దరికీ జోడుచూడూ॥ టనానాటంకషలో॥

ఇందలి స్వారస్యము, ఉపమోత్ప్రేక్షరూపకనిదర్శనాద్యలంకారములలో దేనిలోనూ చేరక వీని యన్నిటి

రుచిని కలిగి ప్రకృతిని జక్కఁగ వర్ణించుచు, శృంగార పర్యవసాన సంపాదనకు వలయు భావముల ప్రకటించుచు, తేటగు పదములతో అర్థ వేగము క్రియాత్వరితమును గల్గియుండుటచే- యీద్విపదమునకు సరియగునవి బహు అరుదుగ మాత్రమే గోచరించును.

"పశ్యమేపార్థరూపాణి శతశోథసహస్రశః"అను తావున వ్యాసులవారును, "కానెట్టీ, మరయసు"ల పరస్పరానురాగము నభివర్ణించునెడ విక్టరుహ్యూగోమహర్షియునీ తెలుగు యాలపాటలోని ద్విపదమును సమీపించుచున్నారు.

పైనొకతావున చెప్పినరీతి తెలుగు యాలపాటలలో కొంతచక్కని పసితనము కాన్పించుచున్నది.

నరసాపారమునుంచీ। నలిగీనలిగొస్తంటే।
తాళ్ళపాలెముకాడా తగిలిందీజరమూ।
జరము చలిజరము పులకరము
దణ్ణం దణ్ణామంటే వదలాదే జరమూ! జరమూ!

ఇదిఎంత పసిపాటగానున్నదో చూడండి! ఎంత జాలికరము! ఎంతభయంకరము! వానికి తగిలిన చలిజ్వర కంపమే మనలగూడ బాధించునట్లగుపడుచున్నది. విటుని మాయలకు లోబడి లోకమెట్టిదియో గుర్తెరుగని పసిదానిమాట లీపాటలో విశదముగ చిత్రింపబడియున్నవి.

"కొత్తాకోరంకిదాకా వస్తావంటే పిల్ల?"
"కొత్తాకోరంకిదాకా వస్తాగానీ, నన్ను
కొట్టకుండ తిట్టకుండ ఉంటావంట్రా?"

ఈవరమెంత యమాయకముగనున్నది? ఎంతచిన్నటివార్తగ దోచుచున్నది? ఎంతరసవంతముగను, స్వభావోచితముగను, నిజముగను ఉన్నది?

యాలపాటలలో కొన్ని నీతిబోధకములగు విషయములుకూడగలవు.

"తల్లిపిల్లనిడసి యాడుసేసుకున్న భార్యనిడసి
దొమ్మరదానియెంటపోతే! డోలుమెడకు యేసెరా!
"కల్లుతాగిఒళ్లుమరచీ కైపుయెక్కి తిరుగబోకూ
పెళ్ళిచేసీ పంపుతారూ పెందలకాడే మేలుకోరా!
టనానా టంకఛలో॥

కొన్ని తావులలోమాత్రము "ఓమారుఖయ్యాము" చెప్పెడి రీతి విషయ వ్యాపారపారవశ్యమున ఒడలెరుంగక సంచరించెడు దురూపదేశములుగానవచ్చును; కాని. ఇవియు నా మహాకవివాక్యములబోలె భీభత్సరసోదయహేతువులై నీతిదాయకములగు వాక్యములుగ నుపయోగించు ననుటకు సందియములేదు.

"రారపోదాము సారాయితాగుదాము
వారమేసిరోజులాకువోళ్ళు తెలియకుందాము॥ రార॥
"ఏలూర్చజారుచూడు సేవలమ్మగుడిజూడు
సారైదుకాణంచూడు సారమై సీకుల్చూడూ!

కాని ఇట్టివియును స్త్రీవిషయమున పాడబడు శృంగార గీతములలోని ప్రయోగములును శృంగార రసాస్వాదనార్థ ముపయోగించున ట్లగుపడుట లేదు! వానిని పాడునపుడు ఒకవిధమగు ఉద్రేకము ఆనందము సంతుష్టియు నుద్భవించును. ఆంధ్రుని హృదయాంతరంగమున నూతన సౌభాగ్యములును నూత్నరసవిలాసములును జిందులాడును. చిరకాలమునుండి విడనాడి మరపొందిన మిత్రుల దర్శించిన తెరంగున నీయాలపాటల సురుచిర కీర్తనము తెలుగు భాషాభిమానుల మానసముల్లుల్లసిల్లజేయును.

ఈ పాటల రూపమున దేశీయ గీతములు దేశచరిత్రలు దేశభక్తియు నేర్పవచ్చును. ఉత్పలమాల శార్దూలాది వృత్తము లింతవరకు ప్రజాసామాన్యమునజేరలేదు. ఇకముందు జేరునను యాశయులేదు. ప్రజాసామాన్యమున ప్రాకి వన్నెకెక్కిన కీర్తనల రీతుల నవలంబించి మనము గఉపదలచిన విషయములనందు ఇమిడ్చినచో త్వరలో యాంధ్రదేశమున నూతనాభిప్రాయములు విస్తరింపగలవు. చదివినవారు కొద్దిమంది. చదువనివా రసంఖ్యాకులు; వీరివద్దకే రసజ్ఞులును కార్యజ్ఞులును నగు పండితులు తమజ్ఞాన దివ్వెను తేవలయుగాని జనసామాన్యము వారివద్దకు రానేరదు. వారిమార్గముల ననుసరించినగాని వారికి మన అభిప్రాయములు, ఆదర్శములు జేరనేరవు.

# దీపావళి

అవయవిపొందు సౌఖ్యమునకు నవయవముల సౌఖ్యము ఆవశ్యకము. మన యవయవములలో నేదేని గిడ్డిడిన మనసుఖమునకు భంగము కలుగును. ఇట్లే ఒక రాజ్యమునకు గల రాజ్యాంగములలో నేదికుంటుపడినను రాజ్యముకంతకు చేటావహిల్లును. ప్రపంచములో నేభాగము సంస్కారవిహీనమైనను, ఏభాగము పాపభూయిష్ఠమైనను, ఏభాగము కల్లోలితమైనను, ప్రపంచ స్థితులు విపరీతములగును. కావున నీ ప్రపంచమునకు సృష్టికర్తయగు పురుషుడు సృష్టికి మొదటినుండియు తాను నిర్మించిన లోకములయొక్క సౌఖ్య సంపత్తికై ప్రత్యవయవ వ్యవస్థలేర్పరచియున్నాడు. మరియు నెవ్వరేదివలయునని కోరిన వారది పొందుటకు తగిన మార్గములు జూపించినాడు. ఈవ్యవస్థలలో గొన్ని తప్పక జనుల కాచరింపవలసినవి. మరికొన్ని కోర్కెల నెరవేర్చుకొనుట కాచరింపవలసినవియునై యున్నవి. ఇట్టి నిబంధనలను భగవదంశ సంభూతులై ధర్మశాస్త్రప్రణేతలైన మహామునులు వ్యాసపరాశరాదులెల్ల దేశకాలపాత్రముల ననుసరించి సకల శాస్త్రముల సంశోధించి సజ్జనసమ్మతముగా తగినరీతిని పరివర్తనముల నొనర్చుచువచ్చిరి. వీనిలో సంధ్యావందనాదు లవశ్యకరణీయములును, వ్రతములు మొదలగునవి వర్ణచతుష్టయమువారికి నాచరణీయములయి కార్యఫలంబు లిచ్చునవియునై ఆయా నిర్ణయింపబడిన దినములలో నాచరింపవలసినవిగా నున్నవి. ఇట్టివ్రతములకు శరత్కాలము ప్రశస్తమై జనమనోవినోదకరంబై వన్నెకెక్కినది. ఋతుమండల మధ్యమున రామణీయకతచే శరత్తు రాణివలె రాజిల్లుచున్నది. విచిత్రహేమవసనముల ధరించి, శరశరాసన రూపములచే రథ్యాజనులను ఝళిపించుచు హనుమత్పతాకములతో జయజయ శబ్ద ముఖరములగు బాల పటాలములు చాపముల నాకర్షించు టీశరత్కాలము నందే. ఆపణవీధుల నాదర్శములతో కొట్టముల నలంకరించు ధనలక్ష్మీపూజ నారంభసంభ్రమ ఘూర్జరజనముల వ్యాపార ప్రచారమై పుణ్యప్రదర్శనములకిదియ యుక్తతమమైన కాలము. ప్రభాతవేళల నదీ తటాకాది జలాశయ స్వచ్ఛశిశిరతోయముల గ్రుంకులిడి విశుద్ధదేహబుద్ధీంద్రియముల దీపదానములకు గడగు కార్తికేయార్చనానుభావతత్పర దేవ బ్రాహ్మణ హాహాహూటీశోభమాన మీ శరత్కాలము.

కొన్ని కాలములు తాపాధికములుగాను కొన్ని వర్షాధికములుగాను మఱికొన్ని శీతాధికములుగాను ఉన్నవి. కావున సమతత్వంబై యొప్పు నీ శరత్కాల మొక్క వ్రతములకేగాక యుద్ధయాత్రాదులకు మహత్కార్యములకుగూడ ననుకూలపడియున్నది. ఈ శరత్కాలారంభమున విజయాభిలాషకులగు భూపాలకులు తమయొనర్పబోవు యుద్ధయాత్రలో విజయము చేకూర్చుటకై రౌద్రరసప్రధానియు విజయదాయినియు దుర్గేశ్వరియునగు కాళికను నవరాత్రి దీక్షతో నుపాసించి బలిపూజాదుల నామెను తృప్తిపఱచి, యామె ప్రసాదంబును శిరంబున నిడికొనెదరు. తదుపరి ధర్మరక్షణమునకు గాని దేశక్షేమమునకు గాని ప్రత్యర్థులగు దుష్టపార్థివుల భంజించుటకై చతురంగబలంబులతో విజయదశమినాడు విజయయాత్రకు బయలువెడలుట కలదు. ఈయాచారము ననుసరించియే యిప్పటికిని హిందూ రాజులును హిందూ జమీందారులును నవరాత్రములలో దేవి నుపాసించుట దశమినాడు వివిధాలంకార పరిష్కృతంబులగు మత్తగజంబులపై నెక్కి వినోదించుటయు కలదు. పిల్లపోయినను పురిటికంపు పోలేదు. ఈ శరత్కాలాంతమున యుద్ధయాత్రనుండి మరలి తమ దేశములు జేరి విజయోత్సాహముచే దీపావళియను పండువ నొనరించెడివారు. అట్టియెడ తమతమ ప్రభుభక్తి విశ్వాసములను సంతోషమును తెలియజేయుచు జనులెల్లరును దీపములచేతను ఇంకను విజయసూచకములైన శతఘ్నికాది ధ్వనులచేతను వేడుక లొనర్చుచుండిరి. ఈ దీపావళి కార్తికమాసామావాస్య దినమున జేయంబడు నుత్సవము. కార్తీక కృష్ణ చతుర్దశి నరకచ

తుర్దశియనియు, కార్తికకృష్ణ చతుర్దశినాటి ప్రాతఃకాలమున చంద్రోదయసమయమున నభ్యంగస్నానము జేయవలసినదనియు "నిర్ణయసింధు" నిర్ణయము. నరక చతుర్దశినాడు తెల్లవారు జామున నూవులనూనెతో తలయంటుకొని మంగళస్నాన మాచరింపవలసినదని ప్రమాణము గలదు. కొన్ని ప్రార్థనలయందు యమునిగుఱించియు నరకమును గుఱించియు నొక్కి చెప్పుటచేత, ఈదీపదానములు ఈమంగళస్నానములు నరకభయమును బాపుటకై యేర్పడినట్లు తేటపడుచున్నది. మనుష్యులు సహజముగా పుణ్యపాప కర్మములు రెండును చేయుచుందురు. పాపములను పోగొట్టుకొనుటకు వ్రతాదులొనర్చుచునేయుందురు. ఇదియు నట్టిదే. కాని ఈ దీపాదుల నింకొక విధముగా నన్వయింపవచ్చును. సంగ్రామరంగమున ననేక హత్యలొనరించియుందురు. కావున రాజులును రాజసంబంధులగు నుద్యోగులును సైనికులును ఈ ప్రకారముగ దీపదానాది విధులచే ప్రాయశ్చిత్తమొనర్చికొనవలసియుందురు. ఇచట రాజు లొనర్పవలసిన విధు లింకను గలవు. విస్తరభీతిచే వ్రాయుటలేదు. దేశమున కంతకు నీప్రాయశ్చిత్తవిధి యెందుకందురేమో. ఒకడు పాపమొనర్చిన తద్బంధుమిత్రులుగూడ పాలు పంచుకొనవలసియున్నది. కావున నీరాజసంబంధులకు బంధుమిత్రులగువారందరు నీ ప్రాయశ్చిత్తవిధికి లోబడవలసియుందురు.

ఇప్పటికిని సంధ్యావందన మొనర్చుచుండిన మనము నిత్యము నేమహర్షుల సంతతివారమని చెప్పుకొనుచు దేవతలకు జేతులొగ్గుచుంటిమో, అట్టిమహర్షుల యరచేతిలో నీలోకముల ధర్మపద్ధతు లాటలాడు చుండును. భగవంతుడుగూడ వారికి వెఱువవలసినదే. ఏదియెట్లు కావలయునని తలంచిన నది యట్లయి తీరవలసినదే. అట్టి మహిమను లేకారణముననో కాని ఈ కార్తిక కృష్ణామావాస్యనాటి దీపావళిని, ఆశ్వయుజమాస కృష్ణామావాస్యనాటి కాకర్షించినారు. మఱియు నింతేగాక కార్తీక శుక్లైకాదశినాటి క్షీరాబ్ధిశయనోత్థానవ్రతముదక్క, నాయేకాదశినాటినుండి మాసాంతముదనుక ఒనర్పవలసిన కడమకార్తీకవ్రతములన్నియు, ఆశ్వయుజములోనే యొనర్పవలసిన ట్లేర్పఱచినారు.[1] ఐతే కార్తికశుక్లైకాదశినుండియు చేయవలసిన వాశ్వయుజ శుక్లైకాదశి నుండి చేయవలయునని చెప్పలేదు. ఐనను కార్తికశుక్లైకాదశినాడు ఏకాదశీవ్రతము నాచరించుచునే యున్నారు. కాన ఏకాదశివరకును దప్పవిడిచి యచ్చటినుండియు నాచరింపవలసిన వ్రతము లాశ్వయుజ శుక్లైకాదశినుండియు ప్రారంభింపవలయుననియే పెద్దల యభిప్రాయమని గ్రహించుటొప్పగును.

నరకచతుర్దశియననేమి? ఈకాలమున కొందరభిప్రాయపడునట్లు నరకాసురుని శ్రీకృష్ణమూర్తి వధించిన పుణ్యదివసమని కాదు. అట్లైచ్చట నితివృత్తము కానరాదు. ప్రమాణాభావమున నది యంగీకరింపవలనుపడదు. మఱేమనిన, నరకలోకమును బొంది యచ్చటి పలువంతల పడకుండుట కీదినంబున యమతర్పణము అభ్యంగనస్నానము దీపదానము మున్నగు క్రియలొనర్పవలసియుండును. కావున ఈదినమునకు నరకచతుర్దశియని పేరుకలిగెను. మఱియు నరకచతుర్దశినాటి తొలివేకువను[2] జనులు సగము మేల్కాంచుచుండగనే పురస్త్రీలు మిక్కుటమగు నుత్సవానందముతో శూర్పడిండిమాది వాద్యధ్వనులచే తమభవనంబులనుండి పెద్దమ్మవారిని (అలక్ష్మిని) తరిమివేయుదురు. ఇదియేమో తెలియకపోయినను ఈయాచార మిప్పటికి నాచరణలోనున్నది. తెలతెలవారుచుండ తాటియాకు టపాకాయలు, ఫిరంగికాయలు మున్నగువానిచే నిప్పటికిని ధ్వను లొనర్చుచున్నారు. ఆనాటి సాయంకాలముననే (దీపావళినాడు) లక్ష్మిని బూజించుట.

దీపావళియన దీపములపంక్తులచే నొప్పునది.[3] ఈ దీపోత్సవమును చతుర్దశినాటిరాత్రి యొనర్పవలసినదిగా

1 శ్లో. అశ్వినస్యతుమాసస్య యాశుక్లైకాదశీభవేత్ । కార్తికస్యవ్రతానహ తస్యాంవై కారయేత్సుధీః——పద్మపురాణము.

2 ఏవంగతేనిశీథేతు జనేనిద్రార్ధలోచనే । తావన్నగరనారీభి శ్శూర్పడిండిమవాదనైః నిష్కాస్యతే ప్రహృష్టాభి రలక్ష్మీస్స్వగృహాంగణాత్——ఇతిపాద్మే.

3 శ్లో. దీపైర్నీరాజనాదత్ర సైషాదీపావళీస్మృతా——ఇతిమాత్స్యే.

పద్మపురాణమున షష్ఠోత్తరఖండమున గానబడుచున్నది; ఇందు నరకచతుర్దశినాడే దీపోత్సవమొనర్చుటయనియు, అమావాస్యనాడు లక్ష్మీపూజాదు లొనర్చుటయనియు, గలదు. అభ్యంగనస్నానమే నాటివేకువ నొనరింతురో యానాటి ప్రదోషసమయముననే దీపోత్సవము నొనర్పవలయును. మనయాచరణలోఁగూడ సామాన్యముగ నిట్లే యున్నది. కాని, వేకువజామున చతుర్దశియుండిన నాటి రాత్రి యమావాస్య కలియరాక మఱునాటిరాత్రి యైనచో, నా మఱునాటి రాత్రియే దీపోత్సవ మొనర్చుచున్నాము. ఇది యెందువలననో తెలిసినది కాదు. అమావాస్యలక్ష్మీపూజకు ముఖ్యము; కాని దీపోత్సవమునకు కాదు. ఏదిఎట్లయిననేమి. దీపావళినాడు కర్తవ్యాంశము లేమి, అట్టికర్తవ్యములకు ఫలమేమి, అను విషయములను గూర్చి మనమాలోచింతము.

దీపమన [1] విశ్వప్రకాశకమని యర్థము. ఇట్టి సమస్తవస్తుప్రకాశకమైన దీపమును సపాత్రంబుగ సదక్షిణాకముగ విప్రుల కొసంగితిమేని యాదానము విత్తబడిన తియ్యమామిడి విత్తుభంగి సహస్రగుణములుగ ఫలించి నిబిడపాపాంధకారబంధురంబగు నరకలోకంబునుండి మనలను దొలగించునని యార్యోక్తి. కావున సాధారణముగ వరవధూజనమెల్ల ఆనాడే దీపప్రదానము లొనర్చుచునే యున్నారు. ఇదియొకటి ముఖ్యము. ఆహారనిద్రాది జ్ఞానమొక్క నరజాతికేగాక తిర్యగ్జాతుల కన్నిటికిని గలదు. ఇంతమాత్రమున భేదమేదియు లేదు. తిర్యగ్జాతి విలక్షణంబగు నుత్తమజ్ఞానమొకటి మానవజాతికి గలదు. దాని పేరు పారలౌకిక చింత. ఇదియే మనుష్యజన్మకు వైశిష్ట్యమిచ్చుచున్నది. ఈ చింతయావంతయు నెఱుంగని మానవాధములు ద్విపాదములతోడి పశువులని యార్యోక్తి. ఇందువలన ఇహలోకములోని సౌఖ్యములకు పాటుబడుటను నిరసింపవలెనని మాయభిప్రాయముగాదు. ముత్తియమునకంటె రత్నముత్తమమనినంత, ముత్తియమును నిరసించినట్లగునా! పారలౌకిక సౌఖ్యముల కర్హుడగు వానికిహలోకసౌఖ్యములు దూరములుగావు. స్వర్గమున కెగఁబ్రాకువాఁడుట్టి కెగయలేకపోఁడు.

ముందు యమాది దేవతలకు బూజలును, ఆపయిని ఇహలోక భోగధాత్రియగు. లక్ష్మియాగమనమును సూచించు దీపోత్సవమును, నటుపైన లక్ష్మీప్రబోధ పూజలును, అనంతరము భవిష్యజ్జన్మలోనను సంపత్ప్రాప్తికై బలిచక్రవర్తి పూజాదులును ఏర్పరుపబడినవి.

—యనమండ్ర శ్రీరామమూర్తిశాస్త్రి.

# దీపావళి

వేదశాస్త్రంబునఁ గడుంగడు నాదరముతో నుపదేశింపఁబడి భగతవర్షీయులచే నాబాలగోపాలము చిరకాలమునుండి సర్వభాగములయందును మిక్కిలి భక్తిశ్రద్ధలతోడను, ఉత్సాహముతోడను నాచరింపఁబడు జాతీయోత్సవములలో "నరకచతుర్దశి" చే ననుగతమగు "దీపావళి" ఎంతయు వన్నెకెక్కియున్నది. జాతీయోత్సవములన్నియు ధార్మికములు, సాంఘికములు, రాజకీయములు, ఆర్థికములు అను నాలుగు విభాగములలో ప్రధానలక్షణములనుబట్టి చేరుచు సంకీర్ణస్వభావము గలవియై తరుచుగా గన్పట్టుచుండును.

ఈ నరకచతుర్దశి—దీపావళి పండుగలు అందు ఏ విభాగమున బడునని విచారింతము. సాంప్రదాయమునుఁ బ్రమాణమునుబట్టి చూడగా, ఈ పండుగలు ప్రధానముగా ధార్మికములేయని తేలుచున్నది. ఏలయన వీని ప్రయోజనములు నరకమునుండి తప్పించుకొనుట, పితరులకు స్వర్గప్రాప్తిని సంపాదించుట, అలక్ష్మిని బారదోలుట, ఆయురారోగ్యైశ్వర్యాదులఁ బడయుటయునై యున్నవి. ఇంతియగాక ఐతిహాసికరీతింబట్టి త్రివిక్రమకథతో సంబంధమును, చరిత్రమార్గమునఁ బూనినచో వేఱొక యర్థమును, రహస్యార్థముల బూనిన స్వారస్యాంతరమునుఁ జూపట్టును. తత్తదనుగుణముగా విభాగాంతర స్పర్శ సంభవించును.

ముందు నరకచతుర్దశియనియు దీపావళియనియు పేరు లెట్లువచ్చినవని రవంత విచారింతము. నరకవిషయి

1 దీప్యతే-ప్రకాశ్యతే-విశ్వమనేనేతిదీపః.

కోత్సవముల కేర్పాటుచేయఁబడిన చతుర్దశిగాన 'నరక చతుర్దశి' యగుచున్నది. ఈ 'నరక'శబ్దమునకు రౌరవ, కుంభీపాకాది భేదములుగల శాస్త్రప్రసిద్ధమగు 'నరకము' అర్థమా, లేక పురాణప్రసిద్ధుడును కృష్ణనిహతుడును నగు 'నరకాసురుడు' అర్థమా, యని సందియము వొడమును. హేమాద్రి, పాద్మాదులలోని "నరకభీరుభిః" "నరకభీరుణా" ఇత్యాది పదములు ఉభయార్థములకు నుపయోగించినట్లున్నను, 'కాలాదర్శము' లోని "యమలోకంనపశ్యతి" ఇత్యాదులవలన 'నరక'మే కాని 'నరకుడు' కాడని తేలుచున్నది. అయితే ప్రసిద్ధమగు నరకాసురవధ సాధారణముగా ఆచారమునందు భావనిష్ఠుడగు నరకాసురుని పూర్వగాథాచిహ్నముగా నేఁటను చంపుచున్నామనియే సూచించుచున్నది. జనసామాన్యమున కేలనోగాని ఇట్టి నమ్మకమె మనమునఁ బాదుకొని యున్నది. దీనినిబట్టి చూడగా, ఈ నరకాసురవధ కథకు సత్యాదారమగు నంతరార్థమున్నట్టు దోఁచుచున్నది. అది ముందు వివరింపబడును. దీపావళియన దీపపంక్తియని చుల్కనగా తేలుచున్నది. కాని, పితృదేవతలకును లక్ష్మికిని దీపనీరాజనమిచ్చుటచే దీపావళి యని మత్స్యపురాణమును* బట్టి తేలుచున్నది. ఈరెండు పండువులకును బరస్పరసంబంధ మెట్టిదియని ఇంచుక విచారించతగును. పూర్వదినాచరిత యమదీపముచేతను, అభ్యంజనస్నానముచేతను, తదనుబంధములగు క్రియాంతరములచేతను తాను యముని మెప్పించి నరకమునఁ బడకుండ నుండుటకై నరకచతుర్దశి పుట్టినది. దీపావళి యట్టి ఘోరనరకముననున్న పితృదేవతలకు స్వర్గమార్గముఁ జూపుటకై పుట్టినది. నరక ప్రతీకార త్యాగములు ప్రథమ సంబంధము. అయితే లక్ష్మీలాభార్థమయి సన్నద్ధులయి యుండుట, అలక్ష్మిని పాఱదోలుట రెండవ సంబంధము. వామనుడు బలిచక్రవర్తి నణచినపుడు కోరిన వరముచే † ఈ మూడు దినములు పరస్పర సంబద్ధములగుట మూడవ సంబంధము. ఇట్లు కలసిన రెంటిలో చతుర్దశికి సంబంధము కలిగియున్న నరకాసుర వధను చుల్కనగా త్రోసిపుచ్చజనదు. హరివంశము నం దిట్లున్నది:—

సీ. ద్వారకాపురమున దానవాంతకుఁడు
యోగక్షేమశాలియై కరుణ నఖిల
జగముల రక్షించు సన్నాహమునను న్న
యాసమయంబున నసురయొకఁడు
వనరుహాసనదత్త వరసముద్ధతుఁడు
ప్రాగ్జ్యోతిషపతి నరకుండునాఁగ
ధారుణీదేవికిఁ దనయుండు సర్వ
దేవతలకవధ్యుండు దితిజవంశ
తే. గీ. మంతటికిఁ దాన యొడయఁడై యదటుమిగిలి
యెల్లలోకంబులకుఁ జాల నెగ్గు సేయ
నంతయును వినికింకఁ జక్రాయుధుండు
దివిజరిపుఁగూల్చి మహిమ నుద్దీప్తుఁడయ్యె.

ఇపుడు 'ఆసాము' అను పేరుగల్గి, "కామరూప"మను నామాంతరముగల 'ప్రాగ్జ్యోతిష' దేశాధిపతియగు 'నరకుఁడ'ను నొక యసురుడు భూమికి కుమారుఁడట. బ్రహ్మనుండి వరములొందెనఁట. అందుచే భూలోకమెల్ల జయించి, స్వర్గమును జయించుటలో నింద్ర, వరుణ, యమ, కుబేరులఁ బీచమడఁచెనట. పదఁపడి బదరికావనాదుల బ్రాహ్మణులను ఋషులను, యజ్ఞములను పాడుజేసెనట. అంతట ధర్మవినాశము నోర్వక మునులు నింద్రుడును శ్రీకృష్ణభగవానుని వేడఁగా, ఆతడు నరకానుచరులగు మురాదుల సంహరించియు నరకునిచే దెబ్బఁదిని భార్యయగు సత్యభామను యుద్ధముచేయగోరెనఁట. సత్యకష్టము ఫలోన్ముఖమగుతతి నీశ్వరుండగు కృష్ణుఁడే తన యర్ధాంగియగు సత్యభామను సంభావించి నరకాసురుని వధించెనట. అంతట భూదేవి

"మ. కరుణం బుత్రుని నీవయిచ్చితి
త్రిలోకద్రోహిగాఁ జూచి చె
చ్చెర నిప్పోకలఁ బుచ్చితింక దివిజుల్
సిద్ధుల్ తపస్వుల్ గత
జ్వరులై తాల్తురుగాక మోదభరముల్
స్వాస్థిత్యమొప్పం జరా
చరభూతాళి యెలర్చుగావుత
భవత్సంప్రాప్త రక్షావిధిన్.

* "దీపైర్నీరాజనాదత్ర సైషా దీపావళీ స్మృతా"

† శ్లో॥ త్రిభిఃపాదై స్త్రిదివసైస్సా చాక్రాన్తాయత స్త్వయా । తస్మాదేతద్బలేరాజ్య మస్త్వహ్నాంత్రితయాంహరే.

*క. ఇవె రత్నకుండలంబులు
దివిజద్విషుఁ డింద్రునోడిచి తెచ్చినయవి శ్రీ
ధవ గొనుము తత్తనూసం
భవుఁగావుము నిలుపు తండ్రిపదమున వానిన్.

అని కోరగా నాతనికి సాలోక్యముక్తి నిచ్చెనట. ఇది ఇతిహాసము. దీనినె హృదయమున నుంచుకొని నరక చతుర్దశి నాచరించుచున్నామను జనాశయమునకు లౌకికార్థ మొండు తేటతెల్లమగుచుండును. అది యెదన, రాజు ఎంతటి బలాఢ్యుడయినను స్వశక్త్యుపార్జితములును పరాపకార ప్రయుక్తములు నగు సాధనముల నెన్నింటిని సంపాదించియున్నను, పరాభవమునె పొందును; జనసామాన్యముగాని సామంతులుగాని మహారాజాధిరాజులుగాని ఆతని బరిమార్ప నేరకున్నను, ధర్మస్థితిపాలకుఁడగు నీశ్వరుడే సత్యమును సాయముగఁగొని ఆతని నాశనమును సంఘటించును. ఈ విషయమును కలకాలము నాచారమునఁ బ్రదర్శించుచున్నచో న్యాయము దప్పి చరించు భూనాథులు సాక్షాత్తుగా నీతినేర్చుకొనుచుందురు.

ఇది యిట్లయిన గావచ్చును. కాని యాపండువునాటి క్రియల విధించునట్టియు ఫలముల బోధించునట్టియు శాస్త్రమున నీవిషయము చెప్పఁబడియుండనప్పుడు ఇట్లు ముడిపెట్టి లాభమేమియు లేదుకేమో. శాస్త్రోపదిష్టార్థమునకు నత్యంత సమీపమయి, తద్భావములనే స్థూలప్రపంచమున చిత్రించినట్లు వ్యాఖ్యానము చేయు నంతరార్థ మొకటి గానవచ్చుచున్నది. చూడుడు. "పురుషరూపమును దాల్చినట్టియు, నత్యంతోత్కటమయినట్టియు నరకమె, లేక పాపమె లేక అజ్ఞానమె నరకుడు. ఆతడె భూలోకములోని దుష్కర్మఫలరూపము గనుక భూసుతత్వము. బ్రహ్మభిన్నమగు నపరప్రకృతి యొక్క యుత్కర్ష చేతనె దుష్కర్మలు తత్ఫలములు వృద్ధి నొంది విజృంభించును గాన నరకునకు బ్రహ్మవర ప్రసాదిత్వము. పాప ఫలము సర్వ ధర్మ స్థితి ధిక్కార రూపము గాన మనుజులనె గాక దివిజులనె గాక దిక్పాలురఁ గూడ తిరస్కారము సల్పుట. కావుననె ధర్మమూర్తియగు యమధర్మరాజుకూడ "తన ప్రచండ దండఘాతమున కడంగక రెచ్చిన నరకుని వేటునకు

" * * * సొమ్మట్లపైకొన నూర్పులొక్కటై
నిడుదలుగాఁగఁ బ్రాణములు నిల్వక లల్లడిలంగ సంగరం
బుడిగి కృతాంతుఁడేగఁ దనయూరికి సేనకలంగి పాఱఁగన్."

అని చెప్పబడియె. ఇట్టి ధర్మగ్లానికి నోర్వక ధార్మిక చోదితుడయి ఈశ్వరుడె ధర్మోద్ధరణకు కడగెను. అపుడు సత్యమును తోడుగఁగొనిపోయెను. ఈశ్వరశాసనమునకుఁగూడ కొంతకట్టుకు నిల్చిన పాపమనగా అజ్ఞానము లేక నరకము సత్యముచేతనె సంహరించబడినది. కాని చివరకు సత్యానుగృహీతుండగు నీశ్వరుడే తన్నాశనమునకు హేతువయ్యెను. అప్పుడు నరకాక్రాంతమగు లోకము వెల్గునఁబడి, అపరప్రకృతిమూలమును భూగతంబుననగు క్రియాశక్తి వశంల ఈశ్వరసాన్నిధ్యమును జేరి, దైవీప్రకృతియొక్క తేజము ధర్మోద్ధారణార్థము విజృంభించెను. ఇట్టి యాధ్యాత్మికార్థము ఆగాధనుండి స్ఫురించుచుండుటచేతను, జనులవలంబించెడు సాంప్రదాయము లర్థవత్తులయియే యుండునను నమ్మకముచేతను, నరకచతుర్దశీవ్రతమున కనురూపమగు కథ ఆకల్పమున బొడకట్టమిచేతను ఈ కథను కొంతవఱకు వ్రాసితిని. ఇది యుపాదేయమగునాయను విషయము కోవిదైక శరణము.

ఇక నీ పండువు సంబంధమున నాచరింపవలసిన కర్మలఁ గుఱించియు తత్ఫలములఁగుఱించియు స్మృతిపురాణాదులేమి చెప్పుచున్నవియో విచారింతము. త్రయోదశీనిశాముఖమున "యమదీప"మను పేర దీపముంచినచో యమప్రీతియయి యపమృత్యువు నశించును[1]. అంతట చతుర్దశినాటి తెల్లవారుజామున అభ్యంగన స్నానము నరకమునకు వెరచు నందఱు చేయవలయును. అట్లుచేసినచో యమలోకమును చూడరు[2]. ఈ స్నానమునుచేయు

1 శ్లో. మృత్యునాపాశదండాభ్యాం కాలేనశ్యామయాసహ । త్రయోదశ్యాందీపదానా త్సూర్యజః ప్రీయతామమ.

2 ౧ చంద్రోదయే అభ్యంజనం - అవశ్యమేవకర్తవ్యం స్నానం నరకభీరుభిః. (హేమాద్రి-నిర్ణయామృతం.)

౨ ప్రాతస్స్నానంతుయఃకుర్యా ద్యమలోకం నపశ్యతి. (కాలాదర్శః)

టకు తిలతైలమునే ఉపయోగించవలయునని కొందఱును, సుగంధతైలముల నుపయోగించవలయునని మఱికొందఱును చెప్పుచున్నారు[1]. కాని ప్రయోజనభేదము కల్పింపవచ్చును. మొదటిది నరకనివారణమునకును రెండవది సంపదలకొఱకును అయియున్నవి. ఇట్లు తైలముతో స్నానముచేయునపుడు నరకక్షయముకొఱకై ఉత్తరేణియాకులను, తుమ్మియాకులను, తగిరిసాకులఁదలచుట్టుత్రిప్పి వేయవలెను.[2] ఈ స్నానమునుచేయుటకు కాలము మిక్కిలి ముఖ్యమయినది. ఆనిర్దిష్టసమయమునకు పూర్వమయినను పరమయినను, ఆసమయమును తప్పుగా నిర్ణయించినను మహాప్రత్యవాయములు కల్గునని చెప్పఁబడినది. ఆసమయఫలమునకు హేతువు కాలమునందు లక్ష్మియు జలమునందు గంగయు నుండుటయైయున్నది.[3] స్నానాంతరము ఆ యమావాస్యనాఁడు పగలు భోజనముకూడదని యొకచోటను, మినపయాకు కూరతో భోజనము చేయవలయునని మఱియొకచోటను ఉన్నది. ఈ వికల్పము దర్శశ్రాద్ధముచేయనివారలకును, బాలురు ఆతురులు మొదలగు వారలకొఱకునుఁ గానోపు.[4] ఇట్లు కొందఱి మతప్రకారము దర్శ శ్రాద్ధమును యమతర్పణమునుగూడ చేసి పగటిని గడపి సాయంకాలమున మాత్రమె దీపారాధనలుచేయుట యాచారమయి యున్నను త్రయోదశిమొదలు మూడు దినములు దీపదానములు జరుగవలయును.[5] ఈ దీపోత్సవము తైలముతోనే చేయవలయుననియు రమ్యముగా నుండవలయుననియు, దేవాలయములు మఠములు ప్రాకారములు ఉద్యాన వనములు వీథులు ఇండ్లు గుఱ్ఱముల కొఠములు-అన్నియు నలంకరింపబడవలయుననియు కల్పసిద్ధము.[6] దీపదానఫలము నాలుగు తెఱఁగులు. ౧ లక్ష్మికి స్వాగతదానము ౨ అలక్ష్మికి బహిష్కరణము 3 పితృదేవతలకు నరకమునుండి స్వర్గమార్గప్రదర్శనము ౪ తాను యమదూతల బాధింపఁబడకుండుట.[7]

భక్తిశ్రద్ధల మనకంటె మెండును ధనమున హిందూదేశములో నసమానులునగు బొంబాయి వర్తకుల చే ఈ దీపోత్సవము మిక్కుటముగాఁ జేయఁబడును. పట్టణమంతయు దీపమయమగునట్లుగా కల్పోక్తవిధిని అనుష్ఠింతురట. పై కల్పముననె ప్రదోషసమయమున లక్ష్మీపూజ యొండు నియమింపబడినది.[8] ఈ లక్ష్మీపూజామార్వాడీలకు ఘనపూజయై యున్నది. వీరు ఆంధ్రదేశమునఁగూడఁ బ్రతిపట్టణమందును దీపావళినాటిరాత్రి రాబళ్ళు రాజట్టుకొని, ఒకపళ్ళెరమును ధనముతోనింపి, రంగవల్ల్యాద్యలంకృతంబగు మందిరంబున సహస్రనామార్చనాదికముసల్పుటగనుచునెయున్నాము. కానివారయినను కల్పోక్తములగు బలిపూజను, గోవర్ధనపూజను జేయుచున్నట్టు గన్పట్టదు. ఇవిగాక మఱునాటి ఉద

1 ౧ తిలతైలేన కర్తవ్యం స్నానం నరకభీరుణా (పాద్మే)
౨ స్నానం సముపూర్వ్యనరై స్తుకార్యం । సుగంధతైలేన విభూతికామైః. (పృథివీచంద్రోదయే)

2 ౧ అపామార్గ మథోతుంబీ ప్రపున్నాటమథాపరం । భ్రామయేత్స్నానమధ్యేతు నరకస్యక్షయాయవై.
౨ అపామార్గస్య పత్రాణి భ్రామయే చ్ఛిరసోపరి. (మదనరత్నే - పాద్మే - బ్రాహ్మే)

3 కాలే లక్ష్మీర్జలేగంగా దీపావళ్యాశ్చతుర్దశీః. (కాలాదర్శే)

4 ౧ దివాతత్రనభోక్తవ్య మృతేబాలాతురాజ్జనాత్. (భవిష్యే)
౨ మాషపత్రస్యశాకేన భుక్త్వాతత్రదినేనరః (లైంగే)

5 కుర్యాత్సంలగ్నమేతచ్చ దీపోత్సవ దినత్రయం. (నారదః)

6 ౧ తతః ప్రదోషసమయే దీపాన్దద్యా న్మనోరమాన్ । బ్రహ్మవిష్ణుశివాదీనాం భవనేషు మఠేషుచ.
౨ ప్రాకారోద్యానవాపీషు ప్రతోళివిశిఖేషుచ । మంధురాసువివిక్తాసు హస్తిశాలాసు చైవహి.
3 దీపవృక్షాశ్చదాతవ్యాః (హేమాద్రి - స్కాందే)

7 ౧ నీరాజితోమహాలక్ష్మీ మర్చయేచ్ఛ్రియమశ్నుతే (పుష్కరపురాణె). అర్ధరాత్రేభవత్యేవ లక్ష్మీరాశ్రయితుంగృహాన్.
అతస్స్వలంకృతాలిప్తా దీపైర్జాగ్రజ్జనోత్సవాః. సుధాధవళితాఃకార్యాః పుష్పమాలోపశోభితాః. (బ్రాహ్మే)
౨ ఏవంగతేనిశీథేతు జనే నిద్రార్ధలోచనే । తావన్నగరనారీభి శ్శూర్పడిండిమవాదనైః.
నిష్కాస్యతేప్రహృష్టాభి రలక్ష్మీస్స్వగృహాంగణాత్. (మదనరత్నే.)
3 ........భూతదర్శయోః । ఉల్కాహస్తానరాఃకుర్యుః పితౄణాం మార్గదర్శనం. (జ్యోతిషః)
౪ .........దీపదానతః । యమమార్గాధికారేభ్యో ముచ్యతే కార్తికేనరః. (దివోదాసీయే)

8 భక్త్యాప్రపూజయేద్దేవీ మలక్ష్మీవినివృత్తయె. (కాలాదర్శే)

యమున ద్యూతమును, అపరాహ్ణమున "మార్గపాలీ"యను ఆటయును జెప్పబడినవి.

బలిపూజ-ఇది అమావాస్యనాటిరాత్రియె, రాజ్యలాభాభ్యుదయార్థమై రాజులచేతను, శ్రేయస్సుకొఱకు సర్వజనులచేతను ఆచరింపబడవలసినది. గృహమధ్యమున రంగవల్లిం జేసియందు బలినాహ్వానించి యర్చింపవలెను. [1] కాలవైపరీత్య మొనరించినచో చేటువాటిల్లునని కూడ చెప్పఁబడినది.

గోవర్ధనపూజ-ఇది గోసమృద్ధియు క్షేమమునుఁ జేకూరుకొఱకు గోమయముతో గోవర్ధన ప్రతిమం జేసి, ప్రాతఃకాలమున అలంకృతములగు గోవులసాన్నిధ్యమున అర్చింపవలెను. [2]

పై రెండుపూజలకును నరకచతుర్దశి దీపావళ్యమావాస్యలతో సంబంధమేమియని యించుక విచారింపనగును. ఇది మఱియొక సందర్భమున "త్రివిక్రమకథ" యని పల్కినదానివలనఁ దెలియును. ఆకథ సంగ్రహముగా నిట్లు నుడువఁదగును. "వామనావతారమెత్తిన విష్ణువు ఆశ్వీన త్రయోదశి మొదలు మూడుదినములలోనే క్రమముగా పాదత్రయముచే భువనత్రయము నాక్రమించి బలిని పాతాళమున కనిపి రాజ్యమింద్రునికిఁగట్టెను. కాని బలియొక్క గుణగణనమునకు మెచ్చి వరముగోరుమన బలిచక్రవర్తి (తనకొఱకు కాదు. లోకము కొఱకు) ఇట్లు కోరెను:—"ప్రతివత్సరమునను ఈమూడుదినములు మఱల నారాజ్యమగుఁగాక. ఆ దినములలో నెవ్వారు దీపదానముచేయుదురో వారియింట నీజవరాలు లక్ష్మి నివసించుఁగాక. అంధకారయుత గృహములుగలవారింట పెద్దమ్మ వసించుగాక. ఆదినములలో సుఖచిహ్నములు గలవారికి నిత్యసుఖమును, దుఃఖచిహ్నములుగలవారికి నిత్యదుఃఖమును గల్గుఁగాక. చతుర్దశిదినమున దీపదానము జేయువారి పితరులు నరకమునుండి స్వర్గమును చేరుదురుగాక". అందుచే సూతుఁడు వాలఖిల్యాదులకు నామూడుదినములు బలిరాజ్యమును కోరవలసినదనియు మహోత్సవముఁజేయవలసినదనియు నపుడు మణిమన్త్రౌషధాదులు సిద్ధుల నొందుననియు చెప్పెను. కావననె రాజ్యాభ్యుదయాదులఁగోరు రాజులును, పశుధాన్యాది సంపత్తులఁగోరు జనులును వానియందు మేటియు విష్ణ్వనుగ్రహీతుడును అగు బలినారాధించుట. కాని గోవర్ధనపూజ గోకులక్రీడలు వీనితో యత్కించిత్సంబంధమును మాత్రమె కల్గియున్నవియని చెప్పకతప్పదు.

బలిపూజానికము రాత్రి సలిపిన తర్వాత మఱునాడుదయమున ద్యూతమాడవలెనఁట. దానిలో జయముగల్గినవారికి జయమును, నపజయము గల్గినవారికి నపజయమును సంవత్సరమువఱకుఁ దటస్థించునఁట. [3]

ఆదినంబున నపరాహ్ణమున ననగా సుమారు రెండు గంటలయప్పుడు "మార్గపాలీ" క్రీడయనునది యాచరింపవలెను. ఇందుకునొక గట్టి క్రొత్తత్రాడును, దర్భలతోడను రెల్లుతోను నిర్మించవలెను. "మృగపాలిక"యన కస్తూరిలేడియగుటచే లేడితోలుతోఁజేసిన రజ్జువుగూడ పనికివచ్చునని తోచెడిని. దానినొకప్రక్క రాజపుత్రులును రెండవప్రక్క సామాన్యజనులును బట్టి మరలమరల లాగికొనవలెను. అప్పుడు సామాన్యజనులె గెలిచినచో వారికి జయము తాత్కాలికమేయనియు, రాజపుత్రులు గెల్చినచో సంవత్సరమువఱకు జయము కల్గుననియు సూచనయఁట. [4] ఇటుల పగటిపూటగడపి రాత్రి ఇష్టబంధువులతోగూడి కాలక్షేపము చేయవలెనట. పూజలఁగుఱించి కంటె ఈ యాటలగుఱించి విచారించుటలో జాతీయలక్షణములను మనపూర్వుల సంవిధానచాతురిని నెక్కుడు కనుఁగొనఁగల్గుదుము. ఇందు మన పూర్వుల

1 శ్లో॥ బలిరాజ నమస్తుభ్యం దైత్యదానవ వందిత । ఇంద్రశత్రో మరారాతే విష్ణుసాయుజ్యగోభవ.

2 శ్లో॥ గోవర్ధన ధరాధార గోకులత్రాణకారణ । బహుబాహుకృతచ్ఛాయ గవాంకోటిప్రదోభవ.

3 తస్మాద్ద్యూతం ప్రకర్తవ్యం ప్రభాతే తత్రమానవైః । తస్మిన్ద్యూతే జయో యస్య తస్యసంవత్సరం జయః.
పరాజయోవిరుద్ధశ్చ లాభనాశకరోభవేత్. (హేమాద్రి)

4 ౧ కుశకాశమయీంకుర్యా ద్యష్టికాం సుదృఢాం నవాం । తామేకతో రాజపుత్రా హీనవర్ణాస్తథాన్యతః.
౨ గృహీత్వాకర్షయేయుస్తాం యథాసారం ముహుర్ముహుః । జయోఽత్రహీనజాతీనాం జయోరాజ్ఞ స్తవత్సరం. (ఆదిత్యపురాణే)

మనుష్య స్వభావగ్రహణశక్తియు కట్టుబాట్లుచేయుట యందలి నేర్పునుఁగనఁడు.

ఇటులె "మార్గపాలి" క్రీడఁ జూడఁడు. ఇది పాశ్చాత్యుల క్రీడలలోని "టగ్ అఫ్ వార్"నకు ప్రతిరూపకమో మాతృకయో యనకచెల్లదు. దీనిలోని విశేషమేమన, ధర్మాచరణైకదేశమగుటచేతను దర్భాదియుపకరణములు కల్గుటచేతను పవిత్రతగలదు. ఉన్నత జాతి వారిని తక్కువజాతివారిని నిరుపక్షములవారిగాఁ జేయుటచే మైత్రిస్థానమగుచున్నది. తక్కుంగల ప్రయోజనములు పైవానికివలెనే యూహింపఁదగును.

ఆంధ్రదేశమున సుప్రసిద్ధముగ తూటాలనుగాల్చెదరు. ఇందుశతఘ్నులఁజేయువారును, తూటాలఁజేయువారు పూలపొట్లములను మతాబాలను అట్టి మఱికొన్ని చిత్రములనుఁ జేయువారును మొన్న మొన్నటివఱకు నెల్లెడల వేనవేలుండెడివారు. శాసనకాఠిన్యము హెచ్చిన కొలఁది ఈ యుత్సాహమును దీనిచే జీవించువారి వృత్తులును నశించి, జపానుదేశమునుండి వచ్చుబెండుపువ్వులు మొదలగునవి వెలసినవి.

మఱియు దీపావళినాటికి వర్తకులు తమ ఆయవ్యయముల లెక్కల సరిపుచ్చుకొని సంవత్సరమయినట్లు ఎంచు వాడుకయును ముఖ్యముగా బొంబాయి మొదలగుచోట్లగలదు. ఇందుచే భారతీయుల వ్యాపారవత్సరము దీపావళితోమారును. లక్ష్మీపూజగూడ నీపండుగయందుండుటచే నిది గడుంగడు సమంజసమయియున్నది.

ఇట్టిపూజలతోడను క్రీడలతోడను నాచారములతోడను ననుశ్రుతముగా వచ్చుచున్న ఈ పండువు జాతీయోత్సవములలో నెంతవన్నె కెక్కినదియో వీరె యూహింపఁగలరు. ధర్మమున నరకాపవాకరము. పితరులకు స్వర్గప్రదము. అర్థమునకా అలక్ష్మీనివారకము; లక్ష్మీసంపాదకము. కామమున మైత్రిని ఉత్సాహమును ప్రత్యాశను గల్పించు క్రీడలగల్గియున్నది. దీనివ్యుత్పాదకశక్తి (Educative influence) యన్ననో సర్వతోముఖము; ఆస్తికత్వము, విధిపరత్వము, శ్రేయస్కామత, మైత్రి, ఉత్సాహము మొదలగునవి యన్నియు దీనివలన నుత్తేజితములగుచున్నవి.


—కొలచిన వేంకటఅప్పాశర్మ ఎం. ఏ.

# శ్రీశ్రీ రాజా వెలుగోటి రాజగోపాలకృష్ణయాచేంద్రబహదర్

క. తనకీర్తియెంతకాలము
వినఁబడునిజ్జగమునందు వెలయఁగ నందా
కను బుణ్యలోకసౌఖ్యం
బున నెంతయు నుల్లసిల్లుఁ బురుషుండనఘా!

వేంకటగిరి సంస్థానాధీశ్వరులు వెలుగోటివారని రావువారని ప్రసిద్ధినొందిన పద్మనాయకులను కులమువారు. వీరి మూలపురుషుఁడు భేతాళనాయఁడని ప్రఖ్యాతిగాంచిన చెవ్విరెడ్డియను రాజు. ఈ రాజు ఘనతగాంచిన కాకతిగణపతిదేవుని రాజ్యకాలమున శౌర్యధైర్యవితరణాది గుణంబుల నాసార్వభౌముని మెప్పించి యనేక బిరుదావళులను, విస్తారరాజ్యములను బహుమానముగ బడసెను. ఈ భేతాళనాయఁడిట్టి గొప్పపదవి జెందుటకు ఒక కథ జెప్పుచున్నారు. ఈ భేతాళనాయుడు ఆదియందు పిల్లలమఱ్ఱియను గ్రామమునకు అధికారిగా ఉండెనట. అంతట ఒకనాడు ఆకస్మికముగ కొప్పెరధనము పొలములో పూడ్చియుండుటను కనుగొని దానిని పొందుటకు గాను బలికై యోచించుచుండగా- అతనిసేద్యకాఁడగు రేచుఁడను మాలవాడు తాను అందులకు బలిఅయ్యెదననియు, తనవంశము నిలుపుటకై రావువారియింట వివాహము జరుగునప్పుడెల్ల ముందుగా తన వంశమువారిలో నొక్కరికి వివాహము జరిగించుచుండవలయునను కొన్ని పద్ధతుల నేర్పాటుచేసికొని బలియయ్యెనట. ఈ నాటికిని ఈ యాచారము జరుగుచునే యున్నది.

ఈ వంశమువారు ఆయారాజులకాలములో నానాదేశములందు రాజ్యముల సంపాదించిరి. అందు బొబ్బిలి, పిఠాపురము, జటప్రోలు మొదలగు సంస్థానములిప్పటికిని సుప్రసిద్ధినొందియున్నవి.



శ్రీ శ్రీ ఉందే రాజాహరాజే మహారాజా సర్ వెలుగోటి రాజగోపాలకృష్ణయాచేంద్ర బహద్దర్
జి. సి. ఐ. ఇ. పంచహజారు మన్సబుదారు.
జననము ౧౮౫౭. మరణము ౧౯౧౬.

శ్రీ శ్రీమహారాజా వెలుగోటి రాజగోపాలకృష్ణయాచేంద్ర బహదర్ గారు మూలపురుషుడగు చెవ్విరెడ్డికి యిరువది యెనిమిదవతరమువారు. వీరి తండ్రిగారగు శ్రీ శ్రీ కుమారయాచమనాయడుగారు తమజీవితకాలములోనే అనగా ౧౮౭౮ సంవత్సరమున జ్యేష్ఠపుత్రులగు వీరికి రాజ్యభారమును ఒప్పగించి ౧౮౭౯ సంవత్సరమున అతివిభవముగ పట్టాభిషేకము గావించిరి. ఈ మహారాజాగారు సంస్కృతాంధ్రహిందూస్థానీభాషలను బాల్యమున విద్యాగుణసంపన్నులగు గురువర్యులయొద్దవిద్య నభ్యసించిరి.

వీరికి గురుభక్తి విశ్వాసములు అద్వితీయము. బాల్యమునందు విద్యాబుద్ధులుగఱపిన గురువులను, ఎల్లప్పుడు ఆదరమున గౌరవించుచు, వారి వృద్ధదశయందుతగిన సహాయ మొనర్చి పోషించుచుండిరి. దేవబ్రాహ్మణ విశ్వాసముగలిగియుండిరి. తమరాజ్యమున వర్ణాశ్రమధర్మముల గాపాడుచు, ప్రోత్సాహపఱచుచుండెను. వెంకటగిరిపట్నమున నెలకొనియుండు కాశీవిశ్వనాథస్వామివారికి ధూపదీపనైవేద్యములు, ఉత్సవాదులు సలక్షణముగ జరుగునట్లు దగిన వరుమానముగల కలవలపూడిని శ్రీస్వామివారికి ఏర్పాటుచేసిరి. మఱియు, రాజ్యమునందుగల దేవాలయములయందు ఉత్సవాదులు చక్కగ జరుగునట్లు కట్టుదిట్టముల నేర్పాటుచేసిరి. వీరి తల్లిగారిపేర "లక్ష్మీనరసాంబాపుర"మని పేరిడి రు 3,౦౦౦ వెలగల అగ్రహారంబును యోగ్యులగు బ్రాహ్మణులకు దానంబొసంగి దానివరుంబడిని వారికి ముట్టునట్లుచేసిరి. బాల్యమునందుండియు భారత రామాయణాదిగ్రంథంబుల జదువుచు నందుబోధింపబడిన రాజనీతులను పాలనావిధులను, ఆశ్రితభృత్యజనపోషణాక్రమంబులను, దండనావిధులను, చక్కగ అనుభవమునకు దెచ్చుకొనియుండుటవలన- యీ ప్రభువునకు మిక్కిలి బాల్యముననే రాజ్యభారము వహింపవలసివచ్చినను రాచకార్యములను మిక్కిలి నిపుణలతోను జనరంజకముగను, సంస్థానము వృద్ధియగునట్లును జరుపసాగిరి.

ఈ మహాప్రభువు వంశానుగతంబుగవచ్చు భృత్య సమూహంబును మిక్కిలి ఆదరమున గాపాడుచుండెను.

ఈ మహాప్రభువు తమకు యుక్తమనితోచిన కార్యములకుమిక్కిలివితరణతతో బహుమానములిచ్చుచుండెను. ఈ ప్రభువు తన భృత్యులయొక్క కార్యనిపుణత్వమును, నమ్మకమును యోగ్యతనుబట్టి క్రమక్రమముగా వారిని అభివృద్ధిలోనికి దెచ్చుచుండువారు గాని విద్యావంతుడనిమాత్రము గౌరవించువారుగారు. ప్రతిసంవత్సరమును ఉద్యోగస్థులయొక్క పనిని, వారుపడిన కష్టమును యోచించి వందలకొలది బహుమానములిచ్చువాడుకపెట్టుకొనియుండిరి. మఱియు భృత్యులయిండ్లయందలి శుభాశుభకార్యములకు వారివారి యోగ్యతలననుసరించి సహాయముజేసి పోషించుచుండిరి. గుప్తదానమే శ్రేష్ఠతమమైనదని వీరి యభిప్రాయము. అందుచేత వీరు చేసిన దానములయొక్క వివరము ఇతరులకు తెలియదు.

వీరికి ఆంధ్రభాషయందభిమానము మెండు. కవిత్వము జెప్పగల పండితవర్యులకు విశేషసహాయము జేయుచుండిరి. వీరిధనసహాయమువలన అనేకమంది పండితులు గ్రంథములను ప్రచురింపగలిగిరి. అట్టి పండితులలో గొందరికి వర్షాశనంబుల నేర్పాటుచేసిరి. వీరికాలమున ఆంధ్రకవులు రచింపగా నచ్చువేయింపఁబడిన గ్రంథములు ౧ రాధాకృష్ణసంవాదము ౨ శిశుపాలవధ 3 దశకుమారచరిత్రము ౪ శృంగారపద్యరత్నావళి ౫ అమరుక కావ్యము ౬ శ్రీకృష్ణాభ్యుదయము ౭ గీతగోవిందము ౮ బ్రహ్మకైవర్తములోని బ్రహ్మగణేశ ప్రకృతిఖండములు ౯ హాలాస్యమహాత్మ్యము ౧౦ కాళిదాసప్రకరణము ౧౧ వినోదకథాకల్పవల్లి ౧౨ గోపికథాకౌముది ౧3 సుమనోవినోదభాణము ౧౪ కథాసరిత్సాగరము ౧౫ యాచశూరేంద్రవిజయము ౧౬ ఉత్తరరామచరిత్రనాటకము ౧౭ సంస్కృత కవిజీవితములు ౧౮ రుక్మిణీపరిణయము ౧౯ రావణుని చరిత్రము మొదలుగాగలవి అనేకములు గలవు.

వీరికి ఆంధ్రమున జక్కని సాహిత్యము గలదు. అందువలన పండితులగువారు వచ్చినవారిగ్రంథములను స్వీయముగా పరిశీలించి వారితో జర్చించి వారివారి శక్తిసామర్థ్యముల దెలిసికొని గౌరవించుచుండిరి.

"ఆంధ్రసాహిత్యపరిషత్తు"ను మదరాసున స్థాపించి శ్రీరాజాగారిసహాయముగోరిరి. వీరీయుద్యమమును పట్టు

దలను యోచించి రు ౧౦,౦౦౦ ల గౌవర్న మెంటుపత్ర ములను బహుమానముగ నిచ్చిరి.

మద్రాసునందు శ్రీవిక్టోరియా మహారాజ్ఞి పేర ఘోషావైద్యశాలను గట్టుటకై ఒకలక్షరూపాయలను ప్రభుత్వమువారికొసంగిరి. నెల్లూరునందు క్రైస్తవులు హైస్కూలును స్థాపించి హిందూబాలురకుగూడ ఉన్నత విద్యను గఱపుటకు ప్రారంభించిరి. కొంతకాలమైనపిమ్మట ఈపాఠశాలాధికారులు హిందూబాలురను కొందరిని వారిమతములోనికిగలుపుకొనిరి. అప్పుడుకొందరుహిందూహైస్కూలును స్థాపించిరి. కానిఉత్సాహము మెండుగా నున్నను ధనసహాయము లేనందున ఈపాఠశాల నానాటికి క్షీణదశనొందసాగెను. అట్టిసమయమున విద్యాభిమానులును, స్వమతాభిమానులునగు శ్రీ రాజాగారు ఈధర్మముయొక్క ఆవస్యకతను చక్కగా దెలిసికొని దాని పోషణను తామే భరించుట కొప్పుకొనిరి. ఇప్పుడీపాఠశాల వెంకటగిరిరాజాగారి హైస్కూలని సుప్రసిద్ధి జెందియున్నది. ఈపాఠశాలయొక్క భవనముల కొఱకును, పోషణకొఱకును ఇదివరకనేక వేలరూపాయలుఖర్చుపెట్టబడెను.

ఇదియునుగాక అప్పుడప్పుడు మదరాసు మొదలగు గొప్పపట్టణములయందును, క్షుద్రగ్రామములయందును స్వదేశాభిమానముగలవారు యత్నించిన సత్కార్యములకెల్లను వెయ్యిమొదలు పదివేలవఱకును జెక్కుసారులు విరాళములనొసంగి కీర్తిగాంచి యున్నారు.

ఈమహారాజుగారికి బాల్యమునుండియు సామునందును గుఱ్ఱపుస్వారియందును మృగయావినోదమునందును అభిమానము విశేషముగా కలదు. వెంకటగిరి పట్టణమున గల అనేక గరిడీశాలలకు విశేషధనమును ప్రతిసంవత్సరమును ఒసంగి జీర్ణించుచున్న ప్రాచీనవిద్యలకు ప్రోత్సాహము గలిగించుచుండిరి. మఱియు తామును, రాజబంధువులును, నగరికి సంబంధించిన 'జట్లు' నౌకర్లును దేహపటుత్వము జెడకుండ సాముచేయుటకుగాను రాజభవనమునందే గరిడీస్థలము నేర్పాటుచేసి యున్నారు. వీరు గతించునప్పటికి ౫౯ సంవత్సరముల వయస్సుచెల్లియుండినను ప్రతిదినమును తప్పక గరడీలో సాముజేయుచు తక్కినవారిని బ్రోత్సాహపఱచుచుండువారు. ఈకాలమునందలి కాలిబంతిఆట, టెనిస్సు, క్రికెట్టుమొదలగు ఆటలయందు అభిమానముండినను- గరిడీసాముల వలన దేహమునకు స్థిరమైన పటుత్వము గలుగునని వారి నమ్మకమై యుండెను.

ఈప్రభువుగారు గుఱ్ఱపుపందెములు పోలోమొదలగు ఆటలయందుకూడ మిక్కిలి అభిమానముగలిగియుండిరి. అందువలన మదరాసులో స్థాపింపబడియుండు 'జంఖానా' కొఱకు అనేక వేలరూప్యములను ఖర్చుపెట్టి మేలైన సౌధమును జంఖానా మైదానమునందు గట్టించి యిచ్చిరి. హిందూవిశ్వవిద్యాలయమునకుగాను వీరు ఇరువదియైదువేల రూప్యముల విరాళమొసంగిరి. మదరాసునందు "ల్యాండుహోల్డర్సుఅసోసియేషన్" అను పేరుతో నొకసభనేర్పాటుచేసిరి. అందులకుశ్రీమహారాజాగారు అగ్రాసనాధిపతిగనుండిదానినిమిక్కిలి జయప్రదముగను జమీందారులకు మిక్కిలి ఉపయోగకరముగను జరుపుచుండిరి. జమీందారులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వమువారు శాసన నిర్మాణసభలోనికి దెచ్చినప్పుడెల్ల వాటివిషయమై చక్కగ నాలోచించి, జమీందారుల యొక్క అభివృద్ధికి నష్టకరంబులగు విషయములుండిన వాటినిగురించి సవినయముగను పట్టుదలతోను విన్నపములను జేయుచుండిరి.

ఈమహారాజాగారును శ్రీశ్రీ బొబ్బిలిమహారాజాగారును మిక్కిలి పట్టుదలతో గృషిచేసి "ఇంపార్టబిల్ యస్టేట్సుబిల్లు" అనుచట్టమును గౌర్నరుగారిచట్టనిర్మాణసభలోదెచ్చి అంగీకారముపొందునట్లు మిక్కిలి పాటుపడిరి. ఈబిల్లువలన అనాదిసంస్థానములు అన్యాక్రాంతములు కాకుండునట్లు సంరక్షింపబడుచున్నవి.

చట్టముల ననుసరించి వినయవిధేయతతో న్యాయముకొఱకు ప్రభుత్వమువారితో పోరాడుట తప్పుగాదని వారిదృఢనమ్మకము. తల్లిఅయినను, పనితొందరలలోబిడ్డయొక్క ఆకలిసమయము మఱచియుండినను, బిడ్డయొక్క రోదనలను విని ఆబిడ్డకు పాలిచ్చి పోషించుచున్నది. ఒకప్పుడు చిఱాకుపడినను నైజమగు తల్లి తన ధర్మమును మఱువజాలదు గదా!

ఈనామములనుగురించి వచ్చిన తగాయిదాయందు వీరువిశేషముగ పోరాడి పూర్వకాలమున మదరాసు

రాజధానియందలి జమీందారులు చేసిన భూదానములను నిలిపి శాశ్వత యశస్సును బడసియున్నారు.

ఈ మహారాజాగారి రాజభక్తి అద్వితీయము. రాజభక్తి అనునది యీకుటుంబమువారికి వంశానుగతంబుగ వచ్చుచున్నది. ఈకుటుంబమువారి పూర్వచరిత్రమును జదివిచూచినయెడల ఎచ్చటను ఏనాడును, ప్రభువునకు విరుద్ధముగ కత్తిగట్టి యుద్ధములుచేసినట్లు గనుపడదు.

ఇప్పుడు జరుగుచుండు ఘోరసంగ్రామము ప్రారంభమయినప్పుడు, వీరు మూడులక్షల రూప్యములు ప్రభుత్వమువారికి సహాయముగ నిచ్చిరి. మఱియును, యుద్ధనిధికి సహాయముగా అనేకవేల రూపాయలు పంపుచునేయుండిరి. వారి వాగ్దత్తమును వారి పుత్రులగు యిప్పటి రాజాగారు నడుపుచునేయున్నారు. ఇదియునుగాక శ్రీవారు మోటారు ఆంబ్యులెన్సుగాను రెండు మోటారులగొనియిచ్చిరి.

ఇట్టి మహోదారుడును, జనప్రియుడునగు ఈ మహాప్రభువు ౧౮౫౭ సం॥రమున జననమంది ౧౯౧౬ సం॥ం జూలై నెల ౨౩ తేది ఆదివారమున స్వర్గస్థులయిరి.

ఇప్పుడు శ్రీవారి ఏకపుత్రులగు శ్రీశ్రీ రాజా గోవింద కృష్ణయాచేంద్రబహదర్ గారు తండ్రిగారియొక్క అధికారమును వహించి వంశానుగతంబగుమర్యాదలననుసరించి ప్రజల మనస్సున కానందముగలుగునట్లు రాజ్యపరిపాలనజేయుచున్నారు.

— నెమలి సుబ్బారావు.

# శరదృతువు

౧

ఓ శరదాగమంబ నిను ♦ నుజ్జ్వలమూర్తిని సర్వసస్య సం
వేశిత దివ్యపూర్ణఫల ♦ వృద్ధినిఁ గన్నులఁ గాంచి కర్షక
స్వాశయముల్ ముదంబలర ♦ బ్రాహ్మణజాతి సమస్తదేవతా
భ్యాశ సపర్యఁజేసి కడు ♦ పారగ శారదగాంచగా వణి
గ్గీశయు లాపణప్రచుర ♦ దీధితులొప్ప సువర్ణజాల సం
వేశిత భూరిచర్చల న ♦ భీష్టసుఖాప్తినిఁ జూడఁగా ధరా
ధీశులు క్షత్రియుల్ జ్వలద ♦ ధిజ్య శరాసనపూజసేసి యా
కాశముపిక్కటిల్ల ఘన ♦ కాహళికాది రవంబెసంగ ది
క్కీశులు తల్లడిల్ల మహి ♦ నెన్నగ దిగ్విజయంబుసేయు నా
యాశలుపోయె నా బల మ ♦ యారె ఫలంబదిపోయె శౌర్య మ
మ్మా శుభదృష్టిఁ జూడు మొక ♦ మక్క వదక్క నికేమిలేదు మే
మో శివపూజసేయ నిది ♦ యొప్పునె నీకు నిదేమిఘోర మ
మ్మా శశికాంతిఁ జూచిన ర ♦ మానిధి పద్మముసొంపుఁ జూడ నా
కాశ వినిర్మలప్రభ ల ♦ గాధనదీనదముల్ ప్రపూర్ణ నీ
రాశయముల్ త్వదీయ మహి ♦ మాజిత శక్తిని జూపుచుండ మా
యాశలదేల తీర్చవిపు ♦ డైన నిను న్గనునట్టివార ల
మ్మా శతసంఖ్యలుండి ముద ♦ మార శరన్నవరాత్రులంచు వి
ప్రాశన శక్తిపూజనము ♦ లచ్చట నచ్చటఁ జేయుచుండియున్
నీ శరణంబు జొచ్చిరిఁక ♦ నీ బల శక్తులఁ జూపి తొల్లి మా
పో శరదంబవర్ణముల ♦ కున్నతిఁజేసి వసిష్ఠ భీమ వి
శ్వేశ సమాన విద్వదుర ♦ లేయన సంతతిమేలు మమ్మరో.

౨

శారదచంద్ర నీదుగుణ ♦ సంపద లెందరు సత్కవీశ లా
హో రహిమించునంచు నుతు ♦ లద్భుతవైఖరి చేసి చాటినన్

నీరజసర్వసంపదకు ♦ నీవు విరోధికి నేర్పుచూపు నా
శారద ధర్మమంచెఱిఁగి ♦ చక్కఁగ గర్వపు టుబ్బడంగుమీ.
పగలెంతేనిక్కృశించి మచ్చగొని య ♦ ప్పంబట్లు నిర్జీవివై
తగ దారాశ్రుతులకన్నవంగలసి యం ♦ తట వంతలేబొంది యీ
గగనాగారపు మానికంబవగుచుఁ ♦ గన్పింపఁగాఁ బోల నీ
కగు నీకీర్తికి కప్రభావగరిమం ♦ బౌనంచు లేరున్నచో.
ఔర శరచ్ఛశాంక నిను ♦ నంబరవీధి చరించుటన్ సుధా
సారము ప్రోదిచేసి తన ♦ సారము నీకడనుంప నా శర
త్సారము పోసి పోసి తగ ♦ సాకుదె సాకు చకోరకాళి ని
న్గోరఁగఁ జక్రవాకములఁ ♦ గ్రుచ్చెదె గాసిలఁజేయ న్యాయమే.
చూడుము చంద్ర నీ దశను ♦ చొచ్చు హిమాగమమందు నీదు ని
ప్పోడిమి మంచుచేఁ గవిసి ♦ పొల్చును సున్నపు పెంకుజాడ నా
వేడిమిచూపు ప్రొద్దులను ♦ వెచ్చగనుందువు కాంతిహీనమై
మూడును కీడు వర్షణముల ♦ ముస్గుదు నీరదపంక్తియందు నీ
ప్రోడతనంబు మాను మిటు ♦ పోవును పో శరదాగమం బిఁకన్.

— వేమూరి శివస్వామిశాస్త్రి.

# పురాణములు

సంస్కృత వాఙ్మయముయొక్క ప్రాచీనతయు పెక్కు విషయములలో దాని యాధిక్యతయు హైందవ, పాశ్చాత్య పండితులచేత నిర్వివాదాంశముగ స్థిరపర్పఁబడినది. తమ జన్మలనంతయు ధారపోసి, ప్రాపంచికభాషలలో సంస్కృతభాషయొక్క యుత్కృష్ట పదవిని కనుగొనుటయేగాక దానిని ప్రపంచమునకు వెల్లడించి కీర్తిగాంచిన విల్సను, కోల్‌బ్రూకు, మ్యాక్సుముల్లరు, విన్సెంటుస్మిత్తు, రమేశచంద్రదత్తు, రామకృష్ణగోపాల భండార్కరు మున్నగు మహానుభావులు హైందవులను కృతజ్ఞతాసముద్రమున ముంచివైచిరి. మానవజ్ఞానముయొక్క అన్ని శాఖలును సంస్కృతవాఙ్మయమున పరిపూర్ణపదవిని గాంచెను. హెర్బర్టుస్పెన్సరు, కాంటు మున్నగు ఆధునిక పండితోత్తములచే నూతనముగ స్థాపింపఁబడిన సిద్ధాంతము లన్నియును అనేకవందల సంవత్సరముల క్రిందటనే, ఆర్యావర్తమునకు వన్నెదెచ్చి కపిల, గౌతమ, శంకరాది మహనీయులచే సమగ్రముగ చర్చింపఁబడెను. చరకము, సుశ్రుతము మొదలగు ఆయుర్వేద గ్రంథములను పరిశీలించిన యెడల వైద్యశాస్త్రమును మన పూర్వులెంత ఉన్నతస్థితికి తీసికొనివచ్చినది స్పష్టమగును. అన్ని శిల్పములును అన్ని కళలును సాంగోపాంగముగ శాస్త్రయుక్తముగ వ్రాయబడియున్నవి. పాణిని మహర్షిచే శాస్త్రయుక్తముగ వ్రాయఁబడిన వ్యాకరణముకూడ సంపూర్ణతను పరిపక్వతను పొందినది. ప్రాచీనాధునికభాషలలో ఏభాషయందును ఇట్టి వ్యాకరణశాస్త్రము లేదు. చరిత్రరచనయందు మాత్రము మన పూర్వులకు కౌశలముగాని అభిరుచిగాని లేదని పాశ్చాత్యపండితుల యభిప్రాయమై యున్నది; కాని, ఇది సరికాదు. కాశ్మీరరాజుల చరిత్రాత్మకమైన రాజతరంగిణియును, సూర్యవంశపురాజుల ప్రభయును, అట్టి దేశవిశేషములను విపుల[illegible] శాది కావ్యములును, వాస్తవముగా చరిత్రము[illegible]ని, హిందూదేశచరిత్రకారులు హైందవ మహాయుగమును వ్రాయునపుడు మన గ్రంథరాజముల సాహాయ్యమును బొందఁజాలకపోవుట చరిత్రకారుల లోపముగాని సంస్కృతవాఙ్మయమునందు చరిత్రరచనకు వలయు సామగ్రిలేని లోపము గాఁజాలదు. హోమరు, వర్జిలు మున్నగు మహాకవుల గ్రంథములచే గ్రీసు రోమక చరిత్రములు దనరారుచుండ మన పురాణేతిహాసముల సహాయమును లేశమాత్రమును పొందకపోవుటచే హిందూదేశచరిత్రము పెంపును పొందలేనిదయ్యె. హిందూదేశ చరిత్రరచనయందు నవీనపథమును త్రొక్కి సంస్కృతవాఙ్మయసహాయముతో హిందూమహాయుగ చారిత్రమును చక్కఁగ వ్రాసిన రమేశచంద్రదత్తు, విన్సెంటుస్మిత్తుగార్లు చరిత్రకారులకు మార్గదర్శకులై యున్నారు.

సంస్కృత వాఙ్మయమున పురాణములొక మహాశాఖయై యున్నవి. అవి హిందూదేశ చరిత్ర నిర్మాణమునకు ప్రాణాధారములు. పురాణవాఙ్మయమును పరిశోధించి హిందూ జాతీయసభ్యతలో వాని యుత్కృష్ట పదవిని చాటిన విల్సను, కర్నలు, కెన్నెడీ యనువారలు మిక్కిలి ప్రశంసనీయులు. పురాణ విమర్శనమున ఈ క్రింది యంశములు ప్రధానములుగ తలంచితిని.

పురాణములన్నియును

"సర్గశ్చప్రతిసర్గశ్చ వంశోమన్వంతరాణి చ
వంశానుచరితంచైవ పురాణంపంచలక్షణమ్"

అను అమరసింహుని నిర్వచనము ననుసరించియే యున్నవా? లేక కర్నలు కెన్నెడిగారు అభిప్రాయపడినటుల పురాణములు కేవలము మతబోధకమాత్రమే సాధనములా? వీరి యభిప్రాయమునకు ఆధారము లేకపోలేదు. బ్రహ్మపురాణములోని యుత్తరఖండమంతయు బలజానదీమహాత్మ్యమును వెల్లడిచేయుచున్నది. శ్రీ మహాభాగవతము యొక్క షష్ఠస్కంధము విష్ణుభక్తితో నుప్పొంగుచున్నయది. మఱియు సంస్కృతవాఙ్మయమందు పురాణస్థానమెద్ది? చరిత్రనిర్మాణమునకు ఇవ్వి ఎంతవరకు సహకారిగా నుండును? వీటి విషయ నిర్మాణము, కావ్యనిబంధన, కవితారచన యెట్టిది? పురాణముల కాలనిర్ణయ మెటుల కనుఁగొనఁదగు? పౌరాణికమతమునకును, ఉపనిషత్తులలో నుద్ఘోషింపఁబడు వైదికమతమునకును సంబంధమెట్టిది? కొన్ని పురాణము లమరసింహుని పురాణనిర్వచనము ననుసరించి ... వుచే ప్రాచీనపురాణములన్నియు మనకు సక్రమముగా లభ్యమైనవాయను సందేహముకూడ పొడగట్టుచున్నది. ఈ కారణముచేతనె విల్సను పండితుఁడు పురాణముల కాలమును క్రీ. శ. ౧౨ వ శతాబ్ద ప్రాంతమవి నిర్ణయించెను. కాని, ఇది సరికాదనియును వానికాలము క్రీ. పూ. 3 వ శతాబ్దము తరువాతను క్రీ. శ. ఏడవ శతాబ్దమునకు పూర్వమును అని, విన్సెంటుస్మిత్తు పండితోత్తముఁడు ఆయన సుప్రసిద్ధమైన హిందూమహాయుగ గ్రంథమున ఈ విధముగ సమర్థించినాఁడు :—

"క్రీ. శ. ౧౧ వ శతాబ్దమునకె పదునెనిమిది పురాణములు సుప్రసిద్ధమైన వాడుకలో నుండి యున్నవని "అల్బెరూని" అను చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. క్రీ. శ. ఏడవశతాబ్దమున జీవించియున్న బాణమహాకవి తన హర్షచరిత్రమున మార్కండేయాగ్ని వాయుభాగవత పురాణములఁగూర్చి నుడివియున్నాఁడు. అచిరకాలము క్రింద లభ్యమైన గుప్తాక్షరలిపిలో నున్న స్కందపురాణ లిఖితపత్రమునుబట్టి స్కందపురాణము క్రీ. శ. ఏడవశతాబ్దమునకు పూర్వపుదని ధ్రువపడినది. వాయు, మత్స్య, బ్రహ్మాండ, విష్ణుపురాణముల భవిష్యద్రాజుల వర్ణన గుప్తచక్రవర్తులతోడను వారి సమకాలికులతోడను ఆపివేయఁబడినది. క్రీ. శ. 3 వ శతాబ్దమున వ్రాయఁబడిన "మిళిందుని ప్రశ్న"లను బౌద్ధగ్రంథము పురాణములను గురించి ముచ్చటించినది."

ప్రతి పురాణము ౧౮ పురాణములను గుఱించియు ౧౮ ఉపపురాణములను గుఱించియు వ్రాయుచున్నది. మత్స్య, పద్మపురాణములు పురాణముల నన్నిటిని తామస, రాజస, సాత్త్వికములని మూడువర్గములుగ భాగించియున్నవి. మఱొక పురాణవిభాగమునకు భక్తి ప్రధానము. సాత్త్విక పురాణములు విష్ణుదేవుని యాధిక్యతను చాటుచున్నవి. తామసవర్గము శివాగ్నులమాహాత్మ్యములతో నిండియున్నది. రాజసవర్గమునకు బ్రహ్మయే ప్రధానము. కలిపురాణములోని దుర్గామాహాత్మ్యమును బట్టియు, బ్రహ్మవైవర్తములోని రాధాస్తోత్రమునుబట్టియు రాజసపురాణములు శాక్తేయములనికూడ కొందఱూహించుచున్నారు. పురాణ శ్లోకముల సంఖ్య ౪,౦౦,౦౦౦. స్కంధపురాణము౮౧,౦౦౦శ్లోకములతో పురాణరాజమనిపించుకొనుచున్నది. పేరునకుఁ దగినట్టుల వామన పురాణమును బ్రహ్మ పురాణమును ౨,౦౦౦ శ్లోకములను మాత్రమె కలిగి అన్నిటికంటెను చిన్నవై యున్నవి. వాయుపురాణము మిక్కిలి ప్రాచీనమైనదిగా పరిగణింపఁబడుచున్నది. ప్రతి పురాణము ఇద్దఱు ఋషిపుంగవుల సంభాషణతో నుపక్రమింపఁబడును. గ్రంథము విస్తరించుకొలఁదిని యింక ననేకములైన యుపసంభాషణలతోడను చిత్రకథలతోడను అల్లుకొని యుండును. ఒక్కొకతఱి పూర్వజన్మపరిజ్ఞానముగల పక్షులకును మానవులకును సంవాదముగా ఈ సంభాషణలు పరిణమించును. ఈ పౌరాణిక సంభాషణలలో ప్రధానపాత్ర- రోమహర్షుఁడనియును సూతుఁడనియును నామాంతరములుగల లోమహర్షుఁడై యున్నాఁడు. ఈయన వ్యాసులవారి ప్రధానశిష్యుఁడు. "వ్యాసుఁడు" "సూతుఁడ"నునవి సామాన్యనామములనియును- రాజకీయ మతవిషయముల చర్చించుచు, రాజుల శౌర్యప్రతాపముల వర్ణించుచు, సృష్టి, ప్రళయవైచిత్ర్యముల నుద్ఘోషించుచు రాజసభలలోనుండు స్తోత్రపాఠకుల కందఱకిని యీనామ మన్వయించుననియును- వేదములకును పురాణములకును సంపాదకుఁడుగానున్న "వ్యాసుఁ

డు" శ్రీకృష్ణద్వైపాయనుడనియును కొందఱు పండితులూహించుచున్నారు. విషయము ప్రతి పురాణమునకు సామాన్యమే యని చెప్పవచ్చు. సృష్టి ప్రళయవైచిత్ర్యములు, దేవతామాహాత్మ్యములు. భూగోళ, ఖగోళ భౌతికశాస్త్రములు అతి ధారాళముగ చర్చింపఁబడును. అక్కడక్కడ స్థలమాహాత్మ్యములు, ఉపవాస వ్రతముల విశేషములును శ్రావ్యముగ బోధింపఁబడును. విష్ణుపురాణమన్నిటికంటెను అమరసింహుని పాంచలక్షణిక పురాణమును మిక్కిలి పోలియుండును. పైనుదహరించిన యంశములుగాక ఈ విష్ణుపురాణమందు వర్ణాశ్రమధర్మములును నీతిపద్ధతియును విపులముగా వ్రాయఁబడినది. కావుననే ఇది విష్ణుసంహితయనికూడ ప్రసిద్ధిగాంచినది. ఇక్కారణముచేతనే ఈ విష్ణుపురాణము సంహిత, వైదిక సంహితల కనుగుణ్యముగా నుండునట్టియు- లోమహర్షుఁడును ఆయన శిష్యత్రయమగు మైత్రేయుఁడు, శంసోపాయనుఁడు, అకృతవ్రణుఁడు రచించినట్టియు- పౌరాణికసంహితల సంగ్రహమేయని విల్సను పండితుఁ డభిప్రాయపడియున్నాఁడు.

పౌరాణికమతమునకును వైదికమతమునకును మిక్కిలి వ్యత్యాసము కలదు. వేదములలో బ్రహ్మ విష్ణు శివ వరుణేంద్రులు సామాన్యదేవతలుగ పరిగణింపఁబడిరి. అఖండమైన ఉత్కృష్టమైన ఏకేశ్వరోపాసన ఆర్యావర్తమున నెలకొల్పఁబడినది. గంగా సింధు యమునానదీతీరములయందు బ్రహ్మావర్తమంతయు వైదిక మహామునుల "ఏకంసద్విప్రాబహుధావదంతి" యను సూక్తులచే ప్రతిధ్వనించుచుండెను. పౌరాణిక కాలమునాఁటికిదంతయు మారెను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులుత్కృష్ట దైవములై త్రిమూర్తులుగా వెలసిరి. వారితో 33 క్రోట్ల దేవతలును ప్రసన్నులైరి. జ్ఞానులసంఖ్య తగ్గెను. పామరులసంఖ్య హెచ్చసాగెను. పామరుల జ్ఞానాభివృద్ధి సాధనము లాలోచింపబడవలసివచ్చెను. కొన్ని స్థలములు దివ్యస్థలములాయెను. పామరుల భక్తిప్రపత్తుల వృద్ధికొఱకు దేవాలయములు నిర్మింపఁ బడెను. ప్రతిమారాధన ప్రతిష్ఠింపఁబడెను. ఈ మార్పులన్నియును, హైందవమతభావమున నొక విప్లవమును గలిగించి ఆసేతుశీతనగమధ్యస్థితంబైన ఆర్యావర్తమునంతయు తాండవమాడించిన ద్వైతాద్వైత విశిష్టాద్వైతమత సిద్ధాంతముల యుత్పత్తిని సూచించెను.

ఇంక పురాణముల కావ్యనిబంధనను గుఱించి యొక్కమాట. వేదముల యనుష్టుప్వృత్తము పౌరాణికశ్లోకముగ పరిణమించెను. కావ్యాలంకారశాస్త్రములు కడు వృద్ధిని గాంచెను. పాణిని వ్యాకరణసూత్రములచే భాషను, భావమును బంధించెను. కావ్యరచన కట్టుదిట్టముతోనిండెను. భాషాస్వాతంత్ర్యము సన్నగిలెను. రసవంతమై జవముగల వైదికసులభశైలి దీర్ఘసమాసభూయిష్ఠంబై దుర్గ్రాహ్యంబైన శైలిగా మారెను. ఇట్టి పౌరాణికశైలియందు సహితము ప్రశంసనీయములైన విశేషములు లేకపోలేదు. "వ్యాకరణసూత్రములచే గాఢముగా బంధింపఁబడి దీర్ఘసమాసములచే నిండి విపరీతభావగర్భితమైనయీ కావ్యశైలి, నానావృక్షములచే నిబిడీకృతమైన వింధ్యాటవింబోలె మనోహరములై యొప్పారు కవితాగుచ్ఛముల నిచ్చును" అని మ్యాక్డోనలు పండితుఁడు తన సంస్కృతవాఙ్మయమను గ్రంథమున వ్రాయుచున్నాఁడు.

సంస్కృతవాఙ్మయమహావృక్షమునకు పురాణములు మహోన్నతములైన శాఖలై వెలయుచున్నవి. అవి ఆసేతుహిమాచలపర్యంతము హిందూదేశమును దట్టముగ నావరించినవి. వాటి ఛాయక్రిందనే హైందవ జాతీయభావము వృద్ధిని గాంచినది. ఏ హిందూగృహము రామాయణ భారత భాగవత గ్రంథకాలక్షేపముచే అనుదినమును పావనముగుచుండుటలేదు? ఏ హిందూ స్త్రీ యొక్క హృదయము రుక్మిణీదేవియొక్క సచ్చారిత్రముచే రంజింపఁబడదు? ఏ హైందవ భక్తుడు గజేంద్రుని విష్ణుస్తవముతోడను ప్రహ్లాదుని భక్తిగీతములతోడను గానమాడఁడు? కుచేలుని పవిత్రచారిత్ర మెన్ని బీదగృహములను తేజోవంతములు చేయుటలేదు? ఉత్కృష్టములై మహోన్నతములైన ఆదర్శములను ప్రతిహైందవుని జ్ఞానపథమునుంచి భక్తిసముద్రమునముంచివైచి ఎల్లప్పుడును సన్మార్గమునే సూచించుచు ఆర్యావర్తమునకు కర్మభూమియను నామమును సార్థకముచేసినది శ్రీభాగవతాది పురాణములే. ఇట్టి వాఙ్మయపరిచయమును చేసికొని జాతీయాదర్శములను బలపఱచుటకు ప్రతిదేశాభిమానియు సహకారి గావలెను.

—కొండపల్లి శ్రీరామచంద్రరావు,
బి.ఏ., బి.యల్.

# స్వాగత గీతము

౧౯౧౬ సం. అక్టోబరు నెల ౯ వ తేదిన రాయ్యూరు ఆంధ్రవిజ్ఞాన పుస్తక భాండాగార పక్షమున, ఆసంఘ వార్షికోత్సవసమయమున ఆనరబిల్ రావుబహద్దరు బి. యన్. శర్మగారికి రాయ్యూరు రామచంద్రప్రసాదరావు గారిచే నర్పింపబడినది:—

కమలభవురాణి కడుపార ♦ కన్నబిడ్డ
విమలచారిత్ర సుందర ♦ విగ్రహుండ
బయ్యా నరసింహ శర్మనా ♦ బరగుధీర
సరస గుణధన్య! గంభీర!! స్వాగతంబు.
భరతమాతకు కలిగిన ♦ భాగ్యమనగ
ఆంధ్రలక్ష్మికి నమరిన ♦ అధికుడనగ
భ్రాతృకోటి సుకృత తపః ♦ ఫలమనంగ
సంభవించిన మహనీయ ♦ స్వాగతంబు.
ఆంధ్రజాతికళాశాల ♦ కధికుడగుచు
దేశ సేవకుడైనట్టి ♦ దివ్యపుత్రు
దానమిచ్చిన కృష్ణరా♦ట్టిల్లజునకు *
స్వాగతంబులు దెల్పెద ♦ శక్తికొలది.
పట్టభద్రుండవైనట్టి ♦ జట్టివీవు
న్యాయశాస్త్రంబు తరచిన ♦ నారసింహ
రావు బహదరు బిరుదాంక ♦ రాజమాన్య
అందుకొనుమయ్యా సన్మాన ♦ మార్యవర్య.
మాతృరాష్ట్రింపు హైన్యము ♦ మదిదలంచి
పరగ బాపట్ల పురమున ♦ ప్రథమమందు
యభ్యుదయబీజ మనుసభ ♦ యంకురింప
మెలపుగా నాటి పెంచిన ♦ మేటివీవు.
మాతృభాషల వృద్ధియె ♦ మనదువృద్ధి
యన్నుచు దలపోసి పెంపొంద ♦ యాదరంబు
చూపుచుండిన సత్కీర్తి ♦ శోభితుండ
స్వాగతంబులు వేవేలు ♦ శర్మగారు.
దేశసేవను సనయంబు ♦ తేటరిల్ల
చేయవలెనన్న సంకల్ప ♦ సిద్ధిపరుడ;
సంఘులోపంబులన్నిటి ♦ సంస్కరింప
సంఘసంస్కర్తవైనట్టి ♦ సన్నుతాంగ
సకల కళ్యాణగుణధామ! స్వాగతంబు.
రాష్ట్రిసభలోన సభికుడై ♦ రమ్యముగను
నిర్భయంబుగ వాదనల్ ♦ నెరపి జరపి
ప్రజల నిక్కట్లు నిచ్చలు ♦ ప్రజ్ఞతోడ
బాప సమకట్టినట్టి స♦ద్భక్తిపరుడ
చతుర గంభీర! నరసింహ! స్వాగతంబు.
వేమరు విశాఖపట్టణ ♦ విభుడవగుచు
వన్నె దెచ్చిన పాలనం ♦ బెన్నతరమె?
సీమ దేశంబు, హైందవ ♦ స్థితులు దెలుప
నేగ, సల్పిన ఘనకార్య ♦ మెన్నగలమ?
సచివ! సామ్రాజ్యసభికుడ! స్వాగతంబు.
నీదు విత్తంబు విజ్ఞాన ♦ నియతినెల్ల
దేశపుత్రుల వృద్ధికై ♦ తెంపులేక
ఖర్చుచెయంగ రవ్వంత ♦ కలతలేదు
స్వార్థపరతది మిముబాసి ♦ చనియె నెటకొ.
గాకపోయిన మీకేల ♦ కష్టమనక?
రెండుచేతుల ద్రవ్యంబు ♦ నిండుకొనగ
పోగుచేయుటె వృత్తిగా ♦ పొసగదేల?
పరుల కుపకారములుచేయ ♦ ప్రబలితాను
వేటె యోజింప మాకది ♦ వెక్కిరినము.
పొంతికార్యంబులుంటచే ♦ నింతిదనుక
వచ్చియుండిన కతిమున ♦ హెచ్చుగాను
పరగ రాయ్యూరు పౌరుల ♦ భాగ్యమయ్యె
కాకతాళియముగ గాక ♦ కార్యపెత్తు
వెలయు మీరెడ మేమేడ ♦ కలియుటెడ?
నిండుతోషితమండలి ♦ నుండుటెడ?
పొలుపుమీరంగ దీవనల్ ♦ పుణ్యముగను
ఆంధ్రవిజ్ఞానభాండార ♦ మందుటెడ?.
మాకు హితబోధగావించి ♦ మసలుమయ్యా
బయ్యా నరసింహశర్మ స♦ద్వంద్య మీకు
ఆయురారోగ్యమైశ్వర్య♦మమరుగాక!
మిత్రమండలి విజయాన ♦ మెలగుగాత!!.
మనవి మతివిను నాయక ♦ మరువవలదు
ఆంధ్రరాష్ట్రింబు ప్రత్యేక ♦ మమరవలయు
విశ్వవిద్యాలయంబిక ♦ వెలయవలయు
శిల్ప కళలకు చేయూత ♦ గొల్పవలయు
గ్రామసంఘంబు లెల్లెడ ♦ గ్రాలవలయు
పుస్తకాలయములు కడు ♦ విస్తరిల్ల
వలయు; ధననిధిస్థాపనల్ ♦ కలుగవలయు
సేద్యమభివృద్ధినొందంగ ♦ జేయవలయు
విధిగ స్వారాజ్యమునుగాంచి ♦ వెలయవలయు.

* ఈ సభకు కోవల్లె కృష్ణారావు పంతులుగారుకూడ విచ్చేసిరి.

# Rare Books in Telugu.

## అపూర్వగ్రంథములు

| | | | |
|---|---|---|---|
| 1 సతీదేవి | వెల 0—8—0 | 4 భక్తియోగము | వెల 1—0—0 |
| 2 సావిత్రీదేవి | ,, 0—8—0 | 5 తుకారాంచరిత్ర | ,, 0—8—0 |
| 3 మల్లికాగుచ్ఛము | ,, 1—0—0 | 6 విదుషీమణులు | ,, 1—0—0 |

వలయువారిట్లు వ్రాయవలెను:—

మేనేజరు, సరస్వతీనిలయము, మచిలీపట్నము.

# The Telugu Romantic Poetry.

## గ్రంథాలయముల నలంకరింపవలసిన పంచరత్నములు

రాయప్రోలు సుబ్బారాయ కవీంద్రునిచే రచియింపబడినవి.

1 తృణకంకణము వెల 0—4—0

| | | | |
|---|---|---|---|
| 2 కష్టకమల | వెల 0—4—0 | 4 తెనుగుతోట | వెల 0—4—0 |
| 3 స్నేహలతాదేవి | ,, 0—4—0 | 5 స్వప్నకుమారము | ,, 0—4—0 |

వలయువారిట్లు వ్రాయవలెను:—

మేనేజరు అభినవకవితామండలి, బెజవాడ.

# శ్రీ రామవిలాసగ్రంథమాల

చిత్రాడ: పిఠాపురము.

ఇందు మనోహరములగు నవలలు, దేశాభివృద్ధికరములగు చరిత్రములు, విమర్శనములు, రాజనీతిగ్రంథములు, పద్యకావ్యములు (ఆధునికభావసంపూరిత గీతావళులు) ప్రకటింపబడును. ఇందు సర్వవిధముల వలసిన ధనసహాయమును మాసంపాదకులగు శ్రీ చెలికాని లచ్చారావుగారు (జమీందారు, ఎర్నగూడెము వగయిరా) చేయుచుండుటచే గ్రంథములు చౌకగ నీయబడుచున్నవి. ఇంతవరకు వెలువడిన గ్రంథములు:—

| | | | |
|---|---|---|---|
| 1 స్త్రీనీతి పద్యరత్నావళి | వెల 0-4-0 | 8 రోహిణి (నవల) | వెల 0-2-0 |
| 2 ప్రభాతము (ఆంధ్రదేశనవల) | ,, 0-12-0 | 9 రత్నపురి (వేశ్యాల నవల భీభత్స, కరుణము) | ,, 0-2-0 |
| 3 రాయల రాజనీతి | ,, 0-4-0 | 10 మాయ(అపరాధపరిశోధకనవల) | ,, 0-4-0 |
| 4 వినోదిని: రెండుభాగములు(నవల) | ,, 1-8-0 | 11 కురంగము (పద్యములు) | ,, |
| 5 కాంచనమాల (చిన్ననవల) | ,, 0-3-0 | 12 పాణిగ్రహణము (చిన్నకథ) | ,, 0-1-0 |
| 6 ఐరోపామహాసంగ్రామము | ,, 0-3-0 | | |
| .7 మల్లెమొగ్గ—ఉచితము | | | |

పై 13 గ్రంథములును మాచందాదారులకు టపాకూలి, ప్రవేశరుసుము, మేమే భరించి రు 2-14-0లకు వి. పి. గా బంపుదుము. చందాదారులకు "సహృదయ" యను 70 పుటలనవల ఉచితముగా నీయబడును. ఇతరులకు ఈగ్రంథములన్నియు పోష్టుఖర్చులతో రు 4-5-0 లు అగును. వలయువారిట్లు వ్రాయవలెను:

శ్రీరామవిలాస గ్రంథనిలయము, చిత్రాడ: పిఠాపురము.

RSVM01A105

అణా!] **ప్రౌఢపాఠకు పుఁబువ్వులు** [అణా!!

| | | |
|---|---|---|
| రావుబహదూరు<br>కం॥ వీరేశలింగంపంతులు<br>అధ్యక్షులు | శ్రీ ఓలేటి పార్వతీశము<br>సంపాదకుడు | శ్రీయుత కోపల్లె హనుమంతరావు<br>పంతులు (ఆంధ్ర జాతీయకళాశాల)<br>ఉపాధ్యక్షులు |

ఇంకను బలువురు విద్యాధికులు సభ్యులు, విలేఖకులుగా నున్నారు.

ఇదివఱకుఁ బ్రకటింపఁబడిన గ్రంథములు.

(నవలలు, చరిత్రలు, జీవితములు, గీతములు, పురాణపురుషులు, శాస్త్రములు!!!)

| | | |
|---|---|---|
| 1 జగన్నాథమూర్తి | 13 యమయాతన | 25 సరోజిని |
| 2 సుభాషిణి | 14 మహాలక్ష్మి | 26 దొంగమగఁడు |
| 3 మాళవిక | 15 శుభదృష్టి | 27 శ్రావణశుక్రవారము |
| 4 యతికిఁ బ్రతి | 16 వీరపత్ని | 28 అగ్ని |
| 5 మంజువాణి | 17 తంతివార్త | 29 విజయదశమి |
| 6 ఇందిర | 18 సుశీల | 30 పశ్చాత్తాపము |
| 7 జలజమాలిక | 19 దుర్నయాధికారి | 31 ఆశ |
| 8 బసివిరెడ్డి | 20 నీవేదాంగవు | 32 పీఠికాపురసంస్థానము |
| 9 పారిజాతము | 21 ప్రభావతి | 33 ప్రణయవిజయము |
| 10 చంద్రవదన | 22 అంతఃపురోపన్యాసము | 34 చోరమహాజనుడు |
| 11 భానుమతి | 23 ఖగోళశాస్త్రము | 35 రత్నావళి |
| 12 తిరుమల | 24 కఠపటికోరిక | 36 శారీరశాస్త్రపఠనము |
| (ఇవి యిప్పుడు దొరకవు) | (కొద్దిప్రతులున్నవి) | (ఇప్పుడే సిద్ధమైనవి) |

నాల్గవసంపుటమునకుఁ గ్రొత్తకవులు వ్రాసిరి. అచ్చగుచున్నవి.

ఈ పైగ్రంథములన్నియు 1కి రు0-1-0 మాత్రమే వెల. అన్ని పుస్తకములును అణా, అణా చొ॥ యీయఁబడును. ప్రజలయందు గ్రంథపఠనమునం దభిరుచి పుట్టించుటయే మాయుద్దేశము. పుస్తకములు 12 చొ॥ సంపుటముగాఁ గట్టించి చందాదారుల కంపుచుందుము. మాదిరిగ్రంథమును యితరవిషయములను తెలియఁగోరువారు మాకు వ్రాసినఁ బడయఁగలరు.

మేనేజరు సాహిత్యసమితి,

పిఠాపురం, గోదావరిజిల్లా.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 105 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 103 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | [illegible], 80 |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | sandhya, |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pagathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | good |